
ఆంధ్రసచిత్రవార

పత్రిక

ప్లట్‌ఫాట్ బ్రతుకులు



15-5-6

30 నయె పై



"దేశద్రోహులు" చిత్రంలో దేవిక

ముఖచిత్రం

1—5—64 ఆంధ్రపత్రిక సచిత్ర వార పత్రిక " వాసంతి " ముఖ చిత్రం ముద్దులొలికే టట్లుంది.

ఉసిరికల వెంకటరావు (శ్రీకాకుళం)

కథ

ఈ వారము ప్రచురించిన కథలలో సుశీలగారు రచించిన " కట్నం కోరని కామేశం " కథ చాలా బాగుంది. ఈ కథలోని సుజాత పాత్ర దీనికి వన్నె తెచ్చింది.

వి. యస్. జగన్నాధరావు (తిరువూరు)

సీరియల్ కథలు

మీ ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ప్రచురితమైన శ్రీ హరికిషన్ గారి " ఎండమావులు " దుఃఖాంతముతోను ఆనందరామం గారి " సంపెంగ పొదలు " సుఖాంతముతోను ముగించి పత్రిక ద్వారా మమ్ముల నానందపరచిరి. రచయితలకు నా హృదయపూర్వకమైన అభివందనములను తెలుప గోరుచున్నాను.

కుమారి కె. జి. హేమలత (విశాఖపట్నం)

* * *

" ఎండమావులు " ఈ వారం పూర్తికావడం నాల్ ఉత్సుకతను రేకెత్తించింది. కథనమంతా చాలా ఉదాత్తంగా నడిచింది. కాని ముగింపు అంత పటుత్వంగా లేదు. పాత్రల మరణాలు సమస్యా పరిష్కారణాలు కావడం చాలా పాత పద్ధతి.

ఏది ఏమైనా మంచి మంచి సీరియల్సు ప్రచు రించుతున్న మీకు నా ధన్యవాదాలు.

జి. సుబ్రమణ్యం (ఆదోని)

* * *

" ఎండమావులు "లో " స్వాతి "ని చివరన బ్రతికించి, తన వారితో కలిపితే ఇంకా బాగుండేది. " సంపెంగపొదలు "లో గిరి పాత్ర చాలా బాగుంది. ఐపోయిందేనని చాలా బాధ కలిగింది సుమండీ !

పి. శ్రీలక్ష్మి (కొవ్వూరు)

* * *

ప్రతివారం విడకుండా "ఎండమావులు" సీరియల్ చదివాను. వాస్తవికతను దగ్గరలో ఉండి, పాత్రలచేత గొప్పగా చెప్పించినారు రచయిత. రంగస్థలము మీద పాత్రలను చూచు నట్లు ఉన్నది. చివరకు కథకు దుఃఖాంతము చేయడం చాలా బాగున్నది. జోతి, స్వాతిల మరణం ఒక క్రొత్త వాతావరణము సృష్టించినది. ఇటువంటి కథను రచించిన హరికిషన్ గారికి, ప్రచురించిన మీకు నా ధన్యవాదములు

ఎం. ఎస్. ప్రసాద్ (నెల్లూరు)

* * *

" ఎండమావులు " కథ చాలా విషాదంగా ముగించవలసి వచ్చింది. " జ్యోతి, స్వాతిల అంతిమ ఘట్టాలు కరడు గట్టిన గుండెలలోని కెరడును బెరడుగా పెకలించి కన్నీటిధారలను కురిపించక మానవు. విడిన సోదర భాంధవ్యాన్ని ముడివేసి వాడి వీడి పోయిన " స్వాతి " మనోవ్యాధితో మరణించిన " జ్యోతి " "ఎండమావులకు " ఒయాసిస్సులని చెప్పొచ్చు.

జొన్నలగడ్డ సత్యనారాయణ (తాడేపల్లిగూడెం)

ఉత్తరాలు

సరాగమాల

సరాగమాల శీర్షిక అంతకంతకూ కేవలం ఏదో ఉత్తర ప్రత్యుత్తరాల శీర్షికలాగా అయిపోతోంది. కేవలం సంగీత విమర్శతో వ్రాసిన చాలా బాగుండును.

బి. వి. ఆర్. ప్రసాద్ (పాలకొల్లు)


ముఖాముఖి

శ్రీ నందమూరి తారక రామారావు కృష్ణార్జున భీష్మరావుగారి ఫోటోలు 16, వారితో ఇంటర్వ్యూ చాలా అద్భుతంగా వుంది. నందమూరికి నా మనః పూర్వ అభిమాన వందనాలు.


హరిరావు (పుత్తూరు)

వచ్చే వారమే!
వనితా లోకంలో
ప్రత్యేక
వ్యాసావళి
శీర్షిక
ప్రారంభం!

త్వరలో!
పుణ్యక్షేత్రం
'కాశీపట్నం'
సచిత్ర వ్యాసం!



త్వరితముగా సుఖప్రదమైన
అనవసరపు
కేశ నివారిణి
డెపిల్
సుగంధిత కేశ నివారిణి
D-2A
PEARLINE-PARIS PRIVATE LTD.
P O BOX 493, BOMBAY



ఏమిటోయ్ పిల్లాడేడుస్తూంటే ఏమీ చెయ్యకుండా అలా ఊరుకున్నావ్?
అయ్యో..
సినిమాహాల్లో కూర్చున్నంతసేపూ వీడి ఏడుపువలన మాటలు వినిపించటంలేదని హాల్లో వాళ్ళంతా వీణ్ణి తీసుకుని నన్ను బయటకి పొమ్మన్నారు
చంటిపిల్లలు అలా ఏడుస్తున్నప్పుడు కొంచెం ఇది పట్టి చూడు
అరే! ఆశ్చర్యంగా ఉందే! ఇంతకీ ఈ సీసాలోది ఏమిటి?
!!!
సత్యమూర్తి
ఇదే
ఇన్‌ఫెంటోన్
గ్రైప్‌వాటర్
అన్నికాలములలోనూ మీ పాపాయిలు నవ్వుతూ ఆరోగ్యంగా ఉండటానికి ఎంతో ఉపకరిస్తుంది
— తయారుచేయువారు —
హైదరాబాద్ కెమికల్ అండ్ ఫార్మస్యూటికల్ వర్క్సు లి హైదరాబాదు. ఆం.ప్ర.

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం 15—5—'64
క్రోధి నామ సం॥ వైశాఖ శుద్ధ చవితి
సంపుటము 56 సంచిక : 37

స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

ఒక సంవత్సరం చందా వివరాలు

ఇండియా రూ. 15.60. ఇతర దేశాలు సీమెయిల్ (Sea Mail) రూ. 28 60. విమానం ద్వారా (Air Mail) బ్రిటన్ జర్మనీ, ఇతర యూరోప్, ఆఫ్రికా దేశాలు: రూ 120 00. అమెరికా రూ. 176 80 ఆస్ట్రేలియా రూ 148.20

విడి ప్రతి 30 న.పై.
సంవత్సర చందా 15.60 న.పై.
6 మాసాల చందా 7.80 న.పై.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7. తంబుచెట్టి వీధి, మద్రాసు-1



"[illegible]రు మరీ జాగ్రత్తగా చూస్తున్నారు. కనుక మంత్రిగారికి లంచం యిస్తే ప్రమాదం. వారి అల్లుడిగారికి యిస్తే మంచిది."

మనలో మాట

శ్రీ ఎన్. టి. రామారావుగారి వ్యాసావళిలోని తొలి వ్యాసం యీ సంచిక 8 వ పేజీలో ప్రారంభించాము. గతవారం 'ముఖాముఖి' శీర్షిక తరువాయి భాగం 40 వ పేజీలో ప్రారంభం అవుతుంది వచ్చే సంచికలో శ్రీ రామారావు తమ రెండవ వ్యాసమైన 'పరిశ్రమ-తరలింపు'లో 'తెలుగు చిత్రపరిశ్రమను హైద్రాబాదుకు తరలించడం'లో గల సాధక బాధకాలను చర్చిస్తారు.

* * *

నలుగురు రచయితలు కలిసిరాసిన నాలుగు భాగాల గొలుసు డిటెక్టివ్ కథ 'అసురసంధ్య' యీ వారంతో ముగుస్తుంది. కొత్తగా ప్రారంభించబోయే సీరియల్ కథ వివరాలు పైవారం యిస్తాము.


* * *

'వారఫలం' శీర్షికలో (26వ పేజీ) యీ వారం ప్రత్యేకంగా ఏమి ఆకర్షణ వేశామో 'వారఫలాలు' చదువుకొనే వారంతా గ్రహించగలరనుకుంటాము! ఇకముందు యీ 'ప్రత్యేకత'ను యిలాగే కొనసాగించగలమనుకుంటున్నాము.

* * *

32 వ పేజీలో ప్రారంభమయిన 'ఫుట్ పాత్ బ్రతుకులు' వ్యాసంలో శ్రీ వాశిరాజు ప్రకాశం సాధ్యమైనన్ని వివరాలు యిచ్చినట్లు అనిపిస్తున్నది!

విషయానుక్రమణిక


కాందిశీకుల ఉధృతం
జయప్రకాశ్
వారికిదేం అగుపించదు
బాబోయ్! ఎంతమందో
భూతద్దం
వెళ్ళే ముస్లిం కాందిశీకులు
సి.పి.ఐ దక్షిణపక్షం
సి.పి.ఐ వామపక్షం
కాశ్మీర్ సమస్య పరిష్కారం చేద్దామని..
మీ ఇంట్లో అలికిడిగా వుందే? ఎవరొచ్చింది!
ఓ బొట్టెలు కాశ్మీర్‌లో చూడండి!
సెంటో
చైనా
ఏమార్పులవిప్రయత్నం

నెహ్రూను కలుసుకోనవచ్చిన షేక్ అబ్దుల్లా: కాశ్మీర్ సమస్య

స్వేచ్ఛాగాలులను పీలుస్తున్న షేక్ అబ్దుల్లా ప్రధాని శ్రీ నెహ్రూతో చర్చలకై ఢిల్లీ వచ్చారు. అందువల్లనే కాబోలు, ఢిల్లీ నగరమంతా కొత్తకొత్తగా కనుపిస్తున్నది.....అంతేకాదు, నెహ్రూ అబ్దుల్లా చర్చలు జరుగుతున్న పోయిన వారం భారత దేశపు చరిత్రలోనే క్లిష్టమైనదని చెప్పాలి. ఇందులో ఎన్నో సాధక బాధకాలున్నాయ్.

1947 నాటి మాట. తెల్లవారు వెళుతూ, వెళుతూ అప్పటి 'బ్రిటిష్ ఇండియా' ను 'పాకిస్థాన్, ఇండియా' అనే రెండు భాగాలుగా చేసి కాంగ్రెసుకు, ముస్లింలీగ్‌కూ అప్పగించిపోయారు. తెల్లవాళ్ళు వెళుతూ, వెళుతూ, ఇండియాలో స్వతంత్ర రాజ్యాలతో చేసికొన్న ఒప్పందాలను, షరతులను రద్దుచేశారు. అనాటి అన్ని హక్కులు స్వతంత్రరాజ్యాలవే. వారివారి ఇష్టానుసారం ప్రవర్తించవచ్చు .... అవసరమనుకొంటే ఇండియాతో గాని, పాకిస్థాన్‌తో కలుపవచ్చును. బ్రిటిష్‌వాళ్ళు వెళ్ళిపోవటం వల్లనే స్వతంత్ర రాజ్యాలకు ఈ అధికారాలు వచ్చాయి.

ఒలాంటి పరిస్థితిలో నెహ్రూజీ ఒక ప్రకటను చేశారు. స్వతంత్ర రాజ్యాలను పరిపాలించే ఏ రాజయినా, ఆ రాజ్యంలోని అధిక సంఖ్యాకులైన ప్రజల సంతానికే ఒండని .... ఆ దేశం పాకిస్థాన్‌తో గానీ, ఇండియాతోగాని కలిసిపోయే విషయాన్ని ఆ ప్రాంతపు ప్రజలే నిర్ణయించాలి శ్రీ నెహ్రూ నేటి ప్రకటన యొక్క సారాంశం. 1948, మార్చి 5 న కూడా "కాన్‌స్టిట్యుయంట్ అసెంబ్లీ" లో మాట్లాడుతూ, "ఈనాటి భారతదేశంలో మిగతా రాష్ట్రాల కంటె భిన్నంగా రెండు రాష్ట్రాలు మాత్రం ఉన్నాయి—అవి (1) హైదరాబాదు, (2) కాశ్మీరు." అన్నారాయన.

"నాకేమీ సందేహంలేదు. మిగతా చోట్లవలె కాశ్మీరులో కూడా అక్కడి ప్రజలే ఈ సమస్యను నిర్ణయించగలరు. కాశ్మీరు ప్రజలకు ఈ సమస్య విషయమై ఇతర ఒత్తిడులు ఉండకూడదు. వారికే పూర్తి స్వాతంత్ర్యం ఉండాలని మనమంతా కోరుకుంటున్నాం." అని కూడా శ్రీ నెహ్రూ అన్నారు. ఇది పాత చరిత్ర.

కాని, ఈనాటి ధోరణి వేరు. ప్రభుత్వ విధానంలో మార్పు వచ్చింది. గత మూడు జనరల్ ఎన్నికలలో కాశ్మీరు ప్రజలు 'ఇండియా' వైపే మొగ్గును చూపుతున్నారని ప్రభుత్వపు వాదన. ఈ వాదనను పాకిస్థాన్ 'ససేమిరా వాదం' టున్నది. అబ్దుల్లా సాహెబ్‌గారు సరేసరి ! విడుదలయి నప్పటినుంచి ఇండియా వాదనలతో కుస్తీలు పడుతూనే ఉన్నాడు.

ఉన్న సమస్యలు రెండు: కాశ్మీరు ప్రజలే ఆ రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయం చేయాలని షేక్ అబ్దుల్లా చేస్తున్న ఉపన్యాసాలకు, జయప్రకాశ్ నారాయణగారి అండదండలు లభించటంతో భద్రతాసంఘంలో ఎలుగెత్తి అరచిన శ్రీ చాగ్లా గారి వాదనల ధాటి తగ్గింది. మళ్లీ న్యూయార్కు వెళ్లి, అక్కడ భద్రతా సంఘంలో 'ఇండియా వాదన' ను ఉంచటానికి — శ్రీ చాగ్లా మూటా ముల్లె సర్దుకుంటున్నారు. శ్రీ చాగ్లా మునుపు వాదించినంత తీవ్రంగా ఈసారి వాదించగలరంటారా ?

కాశ్మీరు విధానంలో మార్పు ఉండదంటూ కృష్ణమీనన్‌గారు చేసే రణగర్జనలవల్ల ప్రయోజనం శూన్యం. ఈమధ్య శ్రీమతి ఇందిరాగాంధి అమెరికాలో చెప్పనే చెప్పింది—కృష్ణమీనన్‌కు ప్రయత్నాలూ చేయునవచ్చు. శ్రీ నెహ్రూ అందుకు ఒప్పుకొంటే ఇండియాలోని ప్రజలు సహిస్తారా ? అన్నది కూడా చర్చనీయాంశమే. అసలు కాశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చే 370 రాజ్యాంగ సూత్రాన్ని విస్మరించి, కాశ్మీరుకు కూడా మిగతా రాష్ట్రాలతో సమాన హోదాను ఇవ్వటమే భారత ప్రభుత్వ లక్ష్యం.

ఈలోగా షేక్ అబ్దుల్లా కాశ్మీరులోని ఒక వర్గపు మహమ్మదీయులను అప్పుడే రెచ్చగొట్టారు. ఈ వర్గంవారు కాశ్మీరుకు స్వాతంత్ర్యం గానీ, లేదా



షేక్ అబ్దుల్లా ప్రధాని మంత్రి శ్రీ నెహ్రూతో చర్చల కోసం ఏప్రిల్ 29న ఢిల్లీకి వచ్చారు.


ఇండియాలోగాని, తన తండ్రిమీద గాని, తన మీదగాని, ఎలాంటి హోదాలు, అధికారాలూ లేవని !

ఇక రెండో సమస్య : కాశ్మీరుకు స్వతంత్రం ఉండబోదంటూ శ్రీమతి ఇందిరాగాంధి కూడా స్పష్టం చేశారు..

ఇక, అబ్దుల్లా చేయగలిగిందొక్కటే. సిక్కింకు ఒకప్పుడు లభించిన అధికారాలే ఈనాడు తనకూ కావాలని అతను ఆందోళన చేయవచ్చు— పాకిస్థాన్‌తో విలీనీకరణం గాని కోరుతారు. అందువల్ల అబ్దుల్లాతో ఒప్పందం కుదరకపోతే, ఈనాడు ఇండియా చేయగలిగిందేమిటి ? కాశ్మీరులో ప్రజల ఆందోళన ఒకటి తలెత్తే అవకాశం కూడా లేకపోలేదు. అదే గనక వస్తే, ఆ ఆందోళనను ఇండియా ఎలా ప్రతిఘటిస్తుంది ? ఈ పరిస్థితిని ఇండియా ఎదుర్కొనలేక, భారీ ఎత్తున అరెస్టులను జరిపితే, పాకిస్థాన్‌కు మరీ 'అలుసు'

50 వ పేజీ చూడండి

ప్రత్యేక వ్యాసావళి ప్రారంభం!



- నటుడే పరిశ్రమ కాదు పరిశ్రమలో నటుడొకడు మాత్రమే!
- బ్రతుకుతెరువులో దేశభక్తి లేదు కాని వ్యక్తులందరూ దేశభక్తులే.
- చలన చిత్ర పరిశ్రమ ఒక సమిష్టి కుటుంబం. ఏ మంచి జరిగినా పరిశ్రమకు జరిగి అది అందరి అనుభవానికి అందుబాటులో ఉండవల్సిందే!

కళ పరమార్థ దృష్టితో కూడిన ఉపాసన. సర్వజన మనోరంజకము. సదాచార ప్రచారకము, సత్సంప్రదాయసంకలితము, సద్బోధనా సక్తము ఉత్కృష్టాభ్యుదయ భావపూరితము, ఉదాత్తము అయినది. మన జాతీయతకు సంస్కృతికి చిహ్నము. అసలు మన ప్రతిబింబమే మన కళ!

ఇటువంటి కళారంగంలో కళోపాసకుడైన నటుడు స్వతః ఆస్థానానికి తగ్గ అర్హత సంపాదించుకోవాలి. ఆత్మస్తుతి, పరనిందలకతీతుడై, కీర్తి వ్యామోహబద్ధుడు కాక అందరికీ ఆదర్శమూర్తిగా ఉండాలి. అప్పుడే ఆ నిర్మలమూర్తి నుండి వెలువడిన ఏనాదమైనా, ఆ పవిత్ర ముఖభావములలో ప్రస్ఫుటమైన ఏ నటన అయినా, ఆ నిండురూపంలో నింపుకున్న ఏ పాత్రఅయినా సజీవమై, సలక్షణమై రససిద్ధిపొంది, కళాప్రియులకు నయనానందకమై, మనోరంజకమై, అభిమాన పాత్రమౌతుంది. అప్పుడే కళాకారుని జీవితమూ ధన్యమౌతుంది.

స్వపర బేధాలు లేక, ప్రాంతీయ ద్వేషాలకు దూరమై సర్వమానవ కళ్యాణ సాధకమైనది కళ. ఈ దృష్టే కళకు, కళాకారులకు లేనినాడు ప్రపంచమే సంకుచితమై, వాతావరణమే కలుషితమై రాగద్వేషాలలో వరిగి సతమతమై ఉండేవాళ్లం! ఈనాడు కళాకారుని దృష్టి ఐక్యప్రపంచం, సహజీవనం, సంఘీభావం, సామరస్యం, సుహృద్భావ సంస్థాపనం. ఇటువంటి మహత్తర ఆశయ పూరితము, ప్రచారసాధకము అయిన కళాప్రగతిలో కలతలు రేగి, కుట్రలు సాగి; స్వార్థం, పరమార్థం కన్నుగప్పి పిచ్చి ఆవేశమే కళాకారులను ఆవరిస్తే ఆ సత్ సంప్రదాయానికి, ఆశయానికే ముప్పు రావచ్చు. దాని పురోగమనమే స్తంభించిపోనూ వచ్చు. ఈ సమిష్టి, సుహృద్భావ కళాకుటుంబంలో భేదభావాలు అంకురించిననాడు సంఘశ్రేయోభిలాషియైన నటుడే సంఘద్రోహిగా మారగల దుర్దినం రానూవచ్చు. ఇటువంటి సమయ సంఘర్షణలు తన

ఎన్. టి. రామారావు

కళ - పరమార్థము - కళాకారుడు

వర్తమాన తెలుగు చిత్రరంగంలో ప్రముఖ నటుడైన శ్రీ ఎన్. టి. రామారావు వ్రాసిన (1) కళ - పరమార్థము - కళాకారుడు (2) పరిశ్రమతరలింపు (3) ప్రభుత్వం - పరిశ్రమ (4) 'నేను' - అనే వ్యాసాలను ఈ సంచికనుంచీ వరుసగా ప్రచురిస్తున్నాము.

గమనంలో రాకుండా చూడడం ప్రతికళాకారుని ప్రథమకర్తవ్యం. తన్నభిమానించి, ఆదరించి కళాప్రపంచంలో తనకు స్థానం కల్పించిన కళా పోషకులకు, పూజ్యులైన ప్రజానీకానికీ యదార్థ వాదిగా వ్యవహరించడం ఆరోగ్యకరమైన విషయం!

తెలుగుదేశం

తెలుగు చిత్ర పరిశ్రమ :

"ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీజాతి నిండు గౌరవము"

ఇదే అనుక్షణం మా స్ఫురణకు వచ్చే పసిడి పలుకు రాష్ట్రేతరప్రాంతాలలో ఉన్నా తెలుగువాళ్ళంగానే బ్రతుకుతున్నాం. తెలుగువాళ్ళుగానే గౌరవించబడుతున్నాం. తెలుగు తనంతో తెలుగు గౌరవానికే పాటుపడుతున్నాం. తెలుగు కళామతల్లికే నీరాజనం పడుతున్నాం. నాడు తెలుగునాట పీల్చిన గాలి ఇంకా గుండెల్లో ఉంది. త్రాగిన నీరు ఇంకా నరాలకు ఇంకి ఉంది. తెలుగుదేశం పిలుపే మా ఎదపొంగి పరుగులెత్తించే ఆవేశపు ఉరుకు. సాటిసోదరుల బాధే మా నాలో రగిలే ఆవేదన. మా ఆంధ్రుల ఆనందమే మా లక్ష్యం. మా గమనం, గమ్యం, అనుక్షణం అందుకే --- అదే!

మన తెలుగు చలనచిత్ర పరిశ్రమ తెలుగునాట వెలిగే సుదినం, సౌభాగ్యం అందరం ఆశించేదే. దానికి తోడు ప్రభుత్వాదరం కూడా లభించిందంటే ఇక అడ్డేముంది.? మనకు కొదవేముంది ? కళామతల్లి కళకళలాడుతూ పరిపూర్ణ సౌభాగ్యసంపద్విలాసాలతో తన ఇంట తాను వెలసి సరస, సంగీత నాట్య చతురులైన తన బిడ్డలను చల్లని చూపుతో నిండు మనస్సుతో ఆశీర్వదిస్తూంటే ఆ ఆనందాన్ని, అనుభూతినీ తలచుకొని తన్మయుడు కాని కళాకారుడుండడనుకుంటాను. అదే రీతిగా తనను గుర్తించిన సంఘానికి, తనను పోషించే అశేషాంధ్ర ప్రజానీకానికి తనూ, తన కళాసామర్థ్యం ఏనాడు, ఎప్పుడు అవసరం వచ్చినా దీక్షతో ముందుకు దూకి కార్యసాధకుడుకాని కటికివాడు కళాకారులలో ఉండడనుకొంటాను. ఆనాడు రాయలసీమ క్షామనిధికి గాను వూరూరా ప్రదర్శనలిచ్చి, జోలికట్టుకు యాచించిన మా కళాకారుల ప్రయత్నమే ఇందుకు ఒక తార్కాణం. అప్పుడు గోదావరి వరదబాధితుల సహాయార్థం చలనచిత్ర పరిశ్రమంతా ఏకమై తమను ఆదరించే అభిమానులకు కలిగిన బాధే తమదిగా భావించి ఉద్వేగంతో రెండులక్షల పైచిలుకు విరాళం మదరాసులో సేకరించిన సందర్భం మరియొక నిదర్శనం. ఈనాడ లోగడ మన ముఖ్యమంత్రి గౌ. డా. సంజీవరెడ్డి గారు, కళాకారులు దేశరక్షణనిధికి సాయపడాలంటే ఈ పరిశ్రమలో ఉన్న చిన్నమొదలు పెద్దవరకూ నటీనట, సాంకేతిక, వ్యాపార బృందమంతా ఏక దీక్షతో ఒక త్రాటిమీద నిలబడి మూడు ప్రదర్శనలద్వారా పదిలక్షల పైచిలుకు ధనం సేకరించి ప్రభుత్వానికందజేసిన సంఘటన మరొక్క తార్కాణము. ఇది యేఒక్కరిసేవా కాదు — సమర్థతా కాదు. కళాకారుల సంఘటిత ప్రయత్నం. కళాప్రపంచం కలసి నిరూపించిన సేవానిరతి మా అభిమానులు ఆదరించిన మా ప్రయత్నం. అంతే ! ఆనాడు, ఈనాడు అంత ఉత్సాహంతో దేశం కోసం ఉరుకులెత్తిన కళాకారులలో దేశభక్తి వుందా, లేదా అన్న అనుమానం ఎవరికీ రాదని నా నమ్మకం. పైగా పరిశ్రమలోని వ్యక్తులు, వారి పేరు ప్రతిష్ఠలు, చాటున ఉన్నవి కావు. పదిమందికి తెలిసినవి, పదుగురూ గుర్తించినవి. ఇది ప్రజాయుగం ప్రజాప్రతినిధులే ప్రభుత్వాధినేతలైనప్పుడు, ప్రజామోదం పొంది, పొందుతున్న ప్రతి కళాకారునికీ, సాంకేతిక నిపుణునికీ, శ్రామికునికీ, ఈ పరిశ్రమాభివృద్ధిలో పాలుంది. స్థానం ఉంది. ఈ సత్యాన్ని గుర్తించడం ధర్మం దీనివల్ల మనమూ మనం గౌరవించుకోవడ మౌతుంది. ఇదియేమాత్రం జరగకపోయినా ఈ కళా ప్రపంచం యేకొద్దిమంది అవకాశవాదులో గుత్తకు పుచ్చుకున్న వ్యాపార మౌతుంది. పరమార్థం లోపించడం, ఫలితం లేకపోవడమే గాక ద్వేష మాత్సర్యాలు, ఈర్ష్యాసూయలు పెరిగి కళారంగానికి సంబంధించిన ఏ ప్రయత్నమైనా అపహాస్యాల పాలౌతుంది.

నటుడే పరిశ్రమకాదు, పరిశ్రమలో నటుడొకడు మాత్రమే

పరిశ్రమ భవిష్యత్తు నటుని మీదలేదు. నటుని బ్రతుకు తెరువు, పరమార్థం పరిశ్రమలో ఉంది. నటుడే గనుక పరిశ్రమ పురోగమనాన్నీ భవిష్యత్తునూ శాసించగల నిర్ణేత అయితే ప్రతి నటుడు రాలిపోయిన తర్వాత కొంత కాలమైనా ఈ పరిశ్రమ స్తంభించి ఉండవలసింది. కాని మన అనుభవం అది కాదు. కాలంతో ఈదలేక, కళాభిమానులను తృప్తిపరచలేక నిన్నటి నటులే నేడు మరుగున పడిపోయారు. ఇక నేటి వారు రేపుంటారన్న నమ్మకమూ లేదు. కనుక పరిశ్రమ, కళ శాశ్వతం. నటుడు అశాశ్వతం— క్షణికం. ఏ మార్పయినా సుస్థిరంగా, నిర్దుష్టంగా రావాలంటే— అది పరిశ్రమలో రావాలి. పరిశ్రమ దృష్టి మరలాలి. పరిశ్రమకు సంబంధించిన ప్రతివారికి ప్రతిపత్తి ఉండి పరిశ్రమ భాగ్య నగరుకు తరలాలి. కాని యే ఒక్కరి వల్లా ఇది సాధ్యం కాదు— అయ్యేదీ కాదు

బ్రతుకుతెరువులో దేశభక్తిలేదు కాని వ్యక్తులందరూ దేశభక్తులే

చిత్ర పరిశ్రమ వ్యాపార మిళితమైన కళ. పెట్టుబడితో ప్రారంభమై, దానికి వడ్డీలు వగైరాలు కట్టబడి, శ్రామికులకు, సాంకేతిక నిపుణులకు, నటీనటులకు వారివారి విలువల మేరకు ప్రతిఫలం చెల్లించబడి, ప్రభుత్వ రుసుములెన్నో చేర్చబడి, టిక్కెట్టు కొన్నవారికే ఆ చిత్రం వినోదానికి ప్రదర్శించ బడుతున్నప్పుడు అది వ్యాపార మనడంలో సందేహం ఉండదనుకుంటాను. ఎవరికి వారు కరువూ కాలానికి తలవంచి ఈ పరిశ్రమలో బ్రతుకు తెరువు కల్పించుకున్నప్పుడు ఈ వృత్తికీ, దేశభక్తి ముడిపెట్టడం భావ్యం కాదనుకుంటాను. అంత మాత్రం చేత వ్యక్తులలో ఉన్న దేశ భక్తిని శంకించడం ఉచితం కాదేమో ! దేశమన్నది ప్రతివాందీ, తన మాతృభూమి మీద

వదంతులను వినకండి
వదంతులను ప్రచారం చేయకండి



కళాకారుని లక్ష్యం రససిద్ధి ఆశయం మానవ సౌభాగ్యం
సంఘ శ్రేయస్సు అతనిది ఏ తాకిడికి తట్టుకోలేని మెత్తని మనస్సు!

తన ప్రజానీకం పట్ల అభిమానం, భక్తి, గౌరవం అందరిలోనూ ఉంటాయి. శ్రామికుడైనా, వ్యాపారి యైనా, కళాకారుడైనా, ఉద్యోగియైనా, ఎవరైనా ఒక్కటే.

"జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి"

అని గర్వంగా అనుకోని మనిషే ఉండడు. దేశభక్తి అన్నది ఏ ఒక్కరి సొత్తు కాదు— గుత్తా కాదు. ఒకరు ప్రశ్నించవలసిన అవసరమే లేదు. మన దేశానికి వచ్చిన వారే, మన దేశంలో ఉన్నవారే మనవారనుకోవడం తొందరపాటు, పొరపాటు కావచ్చు. ఆంధ్ర దేశంలో పుట్టి ఇతర రాష్ట్రాలలో ఆంధ్ర ప్రతిభ చాటిన మహనీయులు, మహోద్దండులు అనేకులున్నారు. నాడు తంజావూరు తరలి వెళ్లి తెలుగు జయపతాకను ఆ గడ్డ మీద సుస్థిరంగా ప్రతిష్ఠించి తెలుగు తల్లికి నివాళి పట్టిన నాయక రాజులు, ఈ నాటి రాష్ట్రపతి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు, నేడు కోయంబత్తూరులో వాణిజ్యంలో ప్రసిద్ధి పొందిన, లక్ష్మీ ప్రసన్నులుగా ఉన్న తెలుగునాటి నాయుడమ్మలు, సంయుక్త మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఓమండూరి రామస్వామి రెడ్డిగారు, మదరాసు వాస్తవ్యులైన దిగ్దిగంత విశ్రాంత కీర్తి వంతులైన కీ. శే. శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు మొదలైన మహామహులు ప్రజ్ఞా దురంధరులు తెలుగు వారు కారా? వారికి ఆంధ్రాభిమానం లేదా? కడుపు నిండని ఆశతో చవకబారు పలుకుబడికోసం పరాయి రాష్ట్రంలో ఉన్నవారు మా వారు కారనుకోవడం ఆత్మనాశన సదృశం. ఈనాడైతే ఏదొకటి ఉందనుకుంటున్నాము కాని అది ఏదీ లేనినాడే మదరాసులో, చలన చిత్ర రంగంలో మాకూ సమర్థత ఉంది— మా తెలుగు వారికీ వ్యాపార దక్షత ఉంది అని తెలుగు వారికి పరిశ్రమలో స్థానం కల్గించి, ఆంధ్రులందరికీ తలమానికంగా, తెలుగు వారందరికీ గర్వకారణంగా "మోషన్ పిక్చర్సు కంబైన్" (ఈనాటి జెమినీ స్టూడియో) పేరిట స్టూడియో నిర్వహించిన దర్శక, నిర్మాత కీ. శే. శ్రీ గూడవల్లి రామబ్రహ్మంగారు, భాషా భేదాలకు అతీతులై, కొందరు తమిళ మిత్రులను కూడ గట్టుకొని, దూర దృష్టితో "వేల్ పిక్చర్సు" స్టూడియో నిర్మించిన నిర్మాత, దర్శకుడు కీ. శే. శ్రీ పి. వి. దాస్‌గారు, ఈ నాడు చిత్ర పరిశ్రమకే పట్టుకొమ్మలైన వాహిని, విజయా, భరణీ, ప్రకాష్, వీనస్ స్టూడియోల యజమానులైన శ్రీ నాగిరెడ్డి, శ్రీ చక్రపాణి, శ్రీ రామకృష్ణ, శ్రీ ప్రకాశరావు శ్రీ మీర్జాపూరు రాజాసాహెబ్ ప్రభృతులు తెలుగు చలన చిత్ర పరిశ్రమ పురోభివృద్ధికి పునాదులు వేసిన పెద్దలు కారా?

విజ్ఞాన దృష్టితో, కళాభిరుచితో, ఉపాసనా దీక్షతో కళామ తల్లికి నీరాజనా లిచ్చి తెలుగు చిత్రాలు తమిళ సీమలో సైతం రజతోత్సవాలు జరుపుకునే స్థాయిలో నిర్మించి తెలుగు కళనే ఉద్ధరించిన దర్శక శ్రేష్ఠులు కీ. శే. శ్రీ హెచ్. యం. రెడ్డిగారు, ఉగ్గుపాలతో దేశభక్తిని పుణికి పుచ్చుకొని, ఉప్పు సత్యాగ్రహంలో నడుం కట్టిన కళాప్రియులు శ్రీ బి. ఎన్. రెడ్డిగారు, నూటికి నూరుపాళ్లు తెలుగు దనం మాటలో, తీరులో ప్రస్ఫుటింపచేసే ప్రజ్ఞా ధురీణుడు శ్రీ కె. వి. రెడ్డిగారు, జీవితమే చిత్రరంగాని కంకితం చేసిన కర్మిష్ఠి శ్రీ పి. పుల్లయ్యగారు ఆదిగాగల రసజ్ఞులు, కళా ప్రష్టలు తెలుగువారు కారా??

నేడు ఉత్తరాదిని విజయశంఖం పూరిస్తూ, తెలుగువారి కళా కౌశల్యం చాటుతూన్న దర్శక మాణిక్యం శ్రీ యల్. వి. ప్రసాద్‌గారు ఆంధ్రులు కారా??


1947—48వ. సంవత్సర ప్రాంతంలోనే సంగీత కళానిధీ, నటవాధురీణుడై తెలుగు కళామ తల్లి పసిడి పతాకను దక్షిణ భారతంలో ఎగురవేసి ఆంధ్రరాష్ట్ర అవతరణోద్యమానికి వేనకువేలు విరాళమిచ్చిన కళా తపస్వి శ్రీ చిత్తూరు నాగయ్యగారు దేశభక్తులు కారా?

ఆంధ్రరాష్ట్ర అవతరణతోనే ఆంధ్ర రాజధానిలో ఆంధ్రుల స్టూడియో ఉండాలని శ్రీ సారధీ స్టూడియో నిర్మించిన శ్రీ రామకృష్ణ ప్రసాద్ గారు, "రోజులు మారాయి" చిత్ర విజయంతో మదరాసులో నాడు వచ్చిన కాంట్రాక్టులన్నీ కాలదన్ని "నేను సారథీ వారి సారధిని" అని ఎంతో త్యాగ దీక్షతో హైదరాబాదు తరలి వెళ్లిన శ్రీ తాపీ చాణక్యగారూ, ఆయన సహచర సాంకేతిక బృందం, హైదరాబాద్ మూవీస్ పేరిట తెలుగు దేశంలో తొలి తెలుగు చిత్రం నిర్మించిన శ్రీ గంగాధరరావుగారు, ఆ తొలి చిత్రం, "మా ఇంటి మహాలక్ష్మి" తన ప్రథమ ప్రయత్నమైనా ప్రభుత్వ బహుమతి నందుకో గలిగిన స్థాయిలో రూపకల్పన చేసిన శ్రీ రామినీడుగారు, చదివిన చదువు, సంతరించుకున్న సంస్కారం, అలవరచుకున్న అభిరుచి, పెల్లుబికే ఆవేశంతో, భారత స్వాతంత్ర్య సమర గాధను తెలుగు గడ్డ మీదనే నిర్మించాలన్న దీక్షతో "పదండి ముందుకు" నిర్మించిన మా సోదరుడు శ్రీ జగ్గయ్య దాని దర్శక భారం వహించి నిర్వహించిన శ్రీ మధుసూదనరావుగారు, నాడు హైదరాబాదు వెళ్లి సారధీవారి చిత్రాలలో నటించిన నటీ నటులు ప్రదర్శించింది మా దేశం అన్న అభిమానం కాదా? మా పరిశ్రమ అన్న ఆదరణ కాదా? మరి ఈ నాడు అందరిలో ఉన్న దేశభక్తిని శంకించ వలసిన అవసరం ఏం వచ్చింది? ఈ నాడు హైదరాబాదు ఏ ఒక్కరూ "మేము రాము" అని అనడం లేద! వసతులు కల్పించి, ప్రోత్సాహం లభించి, జీవనోపాధి ఏర్పాట్లు నమ్మకంగా ఏర్పడిన నాడు అందరూ తరలి రాగలరు. అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకోనూ గలరు.

పరిశ్రమ అభివృద్ధి

చలనచిత్ర పరిశ్రమ ఒక సమిష్టి కుటుంబం.

64 ఎ పేజీ చూడండి



రాష్ట్రపతి డా॥ రాధాకృష్ణ ఎన్. టి. రామారావుకు సావనీర్ నందిస్తున్న దృశ్యం.

40, 41, 43 పేజీలు కూడా చూడండి.

రాజధానిలో పెరిగిపోతున్న మురికివాడలు!

రాను రాను హైదరాబాద్ పట్నం పెరిగిపోతోంది. ఇప్పుడు ఖాళీస్థలాలు ఆట్టే కనిపించటంలేదు. ఎక్కడ చూసినా ఇళ్లకట్టడాలే! ఎన్నో కాలనీలు వెలిసినాయి, అప్పటికీ 'ఇళ్లసమస్య' అట్లాగే ఉండిపోతోంది. అందువలనే 'హౌసింగ్‌బోర్డు' నగరానికి పదిమైళ్ల దూరంలో ఉన్న కూకటపల్లి దగ్గర ఇళ్లు కట్టటానికి, కొత్త నగరాన్ని నిర్మించటానికి పూనుకుంది. భూమిని కొనటానికే సుమారు నలభై లక్షల రూపాయలదాకా అవుతుందిట. అంటే దానికి సంబంధించిన మిగతా పనులన్నింటితో కలిపి. ఇదిగాక ముకరంజాహి రోడ్డు దగ్గర, పెద్ద భవనాన్ని నిర్మించాలనికూడా నిర్ణయించింది. ఇంకా యితర ప్రాంతాల్లోకూడా, తక్కువ ధరలో యిళ్లను నిర్మించాలనికూడా సంకల్పించింది. వీటన్నింటికి కావలసిన డబ్బుకోసం జీవితబీమా కార్పొరేషన్ దగ్గర అప్పు తీసుకుంటారు. ఇదంతా, యిప్పుడున్న 'రద్దీ' ని తగ్గించటానికి చేసే ప్రయత్నం.

అయితే యిప్పుడు నగరంలో మురికివాడలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వీటివలన కలుగుతున్న దుష్ఫలితాలను అరికట్టటానికి ఎవ్వరూకూడా పూనుకొన్నట్లు కనబడలేదు. పైగా మంత్రిగారు, ప్రజలలో సహకారంలేకపోవటంవలనే యిలాంటివి పెరుగుతున్నాయని అంటున్నారు. ఎలాంటి సహకారం కావాలో నిర్దుష్టంగా చెప్పితే బాగా ఉంటుంది. నగరంనిండా అట్టమీద మూడు భాషలలోనూ వ్రాసి, పైన జాగ్రత్త అని హెచ్చరికతో, అట్టలు వ్రేలాడుతూ ఉన్నాయి, ఏమిటది! జాగ్రత్త, యీ స్థలము గుడిసెలవారిది, ఎవ్వరూ కొనకూడదు. కొంటే వారిదే బాధ్యత! నిజంగా ఆ స్థలం గుడిసెల వారిదే అయితే, యిలాంటి హెచ్చరికలు శుద్ధ అనవసరం. కొనేవారు అమ్మేవారుకూడా తగు జాగ్రత్తలతోనే లావాదేవీలు పూర్తిచేసుకుంటారు. ఇలాంటి మురికివాడలు నగరంలోని ముఖ్యమైన వీధులలో కనిపిస్తూ ఉంటాయి. ఆరోగ్యం చెడిపోతూందన్నా వినిపించుకునేవారులేరు, నగరం యొక్క అందచందాలు మాసిపోతున్నాయన్నా పట్టించుకునేవారు.

మునిసిపల్ ఎలెక్షన్లు జూన్‌నెలలో జరుగుతాయి. ప్రారంభమయినాయి రాజకీయాలు, కాంగ్రెసువారు కటాక్షించి టిక్కెట్లు యిస్తే చాలు అని చాలామంది ప్రాధేయపడుతున్నారు. గుమాస్తాల సంఘాలవారు తమకు తగిన ప్రాతినిధ్యం యివ్వాలని నగరంలో మూడువేల దాకా ఉన్న యీ వర్గానికి కూడా కొన్ని సీట్లు కేటాయించాలని వారంతా కూడా కాంగ్రెసు సంస్థకు పెట్టని కోటలాగ నిలబడతామని విజ్ఞప్తి చేస్తున్నారు. కాంగ్రెసు సంస్థలో రకరకాల ముఠాలుండటం వలన అభ్యర్థుల నియామకంలో తప్పనిసరిగా కావలసినంత జాతర జరిగి తీరుతుందని అనుకుంటున్నారు. ఈ ఎన్నికల నిమిత్తమై లక్షరూపాయలు వసూలు చెయ్యాలని సంకల్పం. ఇతర పార్టీలు కూడా కావలసినంత హడావిడి చేస్తున్నాయి. ఇక మునిసిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న సమావేశాల తిరుతెన్నులు చెప్పనక్కర్లేదు. ఉద్రేకాలు, తాపాలు, కోపాలు యివే కనబడతాయి. మాజీ మేయరుగారి మీద ఒక కేసుకూడా కోర్టులో ఉంది.

వీళ్లందరికికూడా కౌన్సిలర్ అవాలనే తాపత్రయమేగాని, అయినతర్వాత, నగరానికి సంబంధించి వైనందిన సమస్యలపట్ల, తమకు ఆసక్తి ఉన్నట్లే కనబడరు. పార్టీ రాజకీయాలు కట్టిపెట్టి, కేవలం నగరం ఆరోగ్యకరంగాను, సుందరంగాను ఉండేటట్లు కృషిచెయ్యటానికి పూనుకున్నవారినే కౌన్సిలర్లుగా పంపిస్తే, అలాంటివాటికే నగరవాసులు యెక్కువ ప్రాముఖ్యాన్నిస్తే బాగుంటుంది. ఇటు యింటింటికి ఓట్లకోసం తిరగటం మొదలుపెట్టటానికి టైముందికాబట్టి, ఆ వేళ్లకి నిర్మొహమాటంగా, అభ్యర్థులను అడిగే అవకాశం ఉంది. వాగ్దానాలకేం చేస్తారు, వాటిని నిలబెట్టుకున్నప్పటి మాటకదా అంటే సరేసరి!

ఇంకా నగరంలోనూ చుట్టుపట్లాకూడా ద్రాక్ష తోటలు విరివిగా వేస్తున్నారు. ఏటికి వితానమైన స్థలం కావాలి. ఆదాయం ఎక్కువగా ఉండటంవలన ప్రతివాళ్లూ ద్రాక్షతోటలమీద మనస్సులు మరలుస్తున్నారు. హైదరాబాద్‌నుంచి రోజుకు అయిదు బస్సుల ద్రాక్షపళ్లు యితర ప్రాంతాలకు పంపుతూంటారు. హైదరాబాద్ చుట్టుప్రక్కలే మొత్తం మూడువేల ఎకరాలదాకా ద్రాక్ష తోటలున్నాయని అంచనా, ద్రాక్షపళ్లతో సారా వగైరా చెయ్యటానికి అనుమతివ్వమంటూ అనేకమంది మన రాష్ట్రప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టుకున్నారు. ఇది ప్రభుత్వానికి ఒక పెద్ద సమస్యే! మద్యపాన నిషేధానికి సంబంధించిన సమస్యలకు, యీ దరఖాస్తులను ఆమోదించటానికి అవినాభావ సంబంధం ఉండటం వలన ప్రభుత్వంవారు యిదమిద్ధంగా యేదీ తేల్చి చెప్పటంలేదు. ఏమైనప్పటికీ, ఆంధ్రప్రదేశ్ మాత్రం ద్రాక్షపళ్లను పండించటంలో ప్రపంచ ఖ్యాతిని తెచ్చుకుంది.

శ్రోతల సమస్య

రేడియో శ్రోతల సంఘం మొట్టమొదట అయిదేళ్ల క్రిందట పదిమందితో ప్రారంభమయి యీనాటికి రాష్ట్ర ముఖ్యమంత్రిగారి దృష్టికి కూడా వచ్చేటంత, నిర్మాణాత్మక కృషిచేసింది. 50 కె.డబ్ల్యు మిడియమ్ వేవ్ ట్రాన్స్‌మీటర్ హైదరాబాదు రేడియో స్టేషన్‌లో పెట్టినప్పటికి కూడా, నగరవాసులకు, యిప్పుడున్న 5 కె.డబ్ల్యు మిడియమ్ వేవ్ ట్రాన్స్‌మీటర్‌కూడా ఉండితీరాలన్న శ్రోతల సంఘంవారి సలహాను, ముఖ్యమంత్రిగారు మెచ్చుకున్నారు. దీనికి తగిన ఏర్పాట్లకోసం కేంద్ర ప్రభుత్వానికికూడా వ్రాస్తామని హామీ యిచ్చారు. పర్వతనేని వీరయ్య చౌదరిగారు, డాక్టరు దివాకర్ల వెంకటావధానిగారు ఈ సభలో

ఇంటింటి పజ్యాలు

ఆరుద్ర

చిన్నబాలశిక్ష

వెల్లవేసిన మర్నాడే పిచ్చిగీతలు
చల్లగా గీస్తాయి గోడపై చిట్టిచేతులు
కొన్న మరుగంటలోనే వారపత్రిక
కుట్లూడి పట్టబడుతుంది కొద్ది చిత్రిక
రిపేరు చేయించిన రెండో రోజున వాచీ-కీ
తపీమని సిద్ధపడుతుంది రిపేర్లో పేచీకి
కొనగానే ఉడుకులాన్ కళ్లాపులు జల్లి
క్యూటెకూరా ముగ్గులు పెడుతుంది బుల్లి
అల్లరి చేయగానే డాడీ
ఒళ్ళెందు కెక్కాలి వేడీ
కొంటె పిల్లకాయల్లేని కన్నతండ్రి
గోదావరి పొంగుల్లేని రాజమండ్రి! ★

మాట్లాడుతూ, సంగీత,సాహిత్యాల్లో సాంప్రదాయకమైన వాటికి ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలని అన్నారు. హరికథలకు రేడియోలో స్థానంలేకుండా పోతోందని, ఒకవేళ హైదరాబాద్ స్టేషనుంచి హరికథలు ప్రసారంచేసే సావకాశం ఇక్కడ లేకపోతే కనీసం, విజయవాడ రేడియో స్టేషన్ నుంచైనా ప్రసారంచేసే ఏర్పాట్లయినా చెయ్యాలన్నారు.

కనకదుర్గ—విశ్వదాత


ఆ రోజుల్లో, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి చలవ చేతుల్లో, ఆంధ్రావని చల్లగా ఉన్నరోజుల్లో, విజయవాడ వెళ్లంగానే, ఆ కొండమీద కనకదుర్గ సాక్షాత్కరించి నట్లే, దుర్గా విలాస్‌లో విశ్వదాత, ధవళచ్ఛాయలతో దర్శనమిచ్చేవారు. అదొక పురాతన పాంథశాల, అందరికీ ఆహ్వానాలున్నాయి. హెచ్చు తగ్గులేవు. ఎవరైనా పంతులుగారి ఆదరాభిమానాలకు అర్హులే. సమానత్వం మూర్తీభవించిన ఆ సాత్విక మూర్తిలో సద్గుణము ఎప్పుడూ ప్రకాశిస్తూ ఉండేది. ఆయన రాజకీయాల్లో ఆరితేరిన వ్యక్తి; సాహిత్య సేవలో విశిష్టమైన స్థానం సంపాదించుకున్నవారు. జాతిని చైతన్యవంతం చెయ్యటంలో ఆయన సృష్టించిన సాధనలు రకరకాలు, కేవలం అడిగిన వానికి లేదనకుండా దానం చెయ్యటమే కాకుండా, అడగని వాని మనస్సులో మెలరేగుతున్న ఆరాటాల్ని అర్థం చేసుకోగల శక్తి కూడా ఆయనకుంది. హరిజనోద్యమం ప్రారంభకులుగా, ఆయన పొందిన కీర్తి ప్రతిష్టలే దీనికి తార్కాణం.

ఆంధ్ర సారస్వత పరిషత్ ఆవరణలో కళాప్రపూర్ణుని, ఇరవై ఆరవ వర్ధంతి ఉత్సవాలు జరుపుకున్నప్పుడు, ప్రముఖ రాజకీయ నేత్త శ్రీ తెన్నేటి విశ్వనాథం గారు పంతులుగార్ని గొప్ప రాజకీయవేత్తగానూ, డాక్టరు దివాకర్ల వెంకటావధానిగారు దేశోద్ధారకుని, గొప్ప సాహిత్య సృష్టని అభివర్ణించారు. పంతులుగారితో సన్నిహిత సంబంధాలున్న వ్యక్తులు, చిన్న నాటి ముచ్చట్లు చెపుతుంటే వింటానికి ఎంతో ఆనందంగా ఉంటుంది. కవిసామ్రాట విశ్వనాథ సత్యనారాయణగారు మాట్లాడుతూ, ఆము ప్రథమ నవల ఏకవీరను పంతులుగారే ఆదరించి భారతిలో ప్రచురింపచేసి, ఏభై రూపాయి లిచ్చారని అన్నారు. మహాత్మా గాంధీజీ అంతటివార్తే, విశ్వదాత, దాతృత్వాన్ని పొగడుతూ వ్రాసిన వ్యాసాన్ని, ముఖ్యమంత్రి గారు చదివారు. దేశోద్ధారకుడు చేసిన సత్కార్యములను ఏటేటా సంస్మరించుకోవటం వలన, మన మంతా కర్తవ్యోన్ముఖులవటం, సత్కార్యాల పట్ల ఆసక్తి కలగటం, ఇట ఐహికం, ఇక ఆముష్మికం ఏమిటంటే, స్వర్గనివాసం ఏర్పరచుకున్న పంతులుగారు సదా శాశ్వతంగా స్వర్గ నివాసిగానే ఉండి పోవటం అని సత్యనారాయణగారన్నారు.

వి. ఎల్. ఎన్. ★

పోస్టు కాని ఉత్తరం

గోవిందరాజు శ్రీనివాసమూర్తి



ఆక్షన్‌లో కొన్న టేబిల్‌ను కూలీలచేత మోయించుకొచ్చి గదిలో మూలగా పెట్టించాడు శేఖరం. కూలీలకు డబ్బులిచ్చి పంపేసి క్రితం రోజు కొన్న ఎరుపురంగు టేబిల్‌క్లాత్‌ను టేబిల్ మీద పరచి అలమారులో ఎంతకాలంగానో పడున్న ఫ్లవర్‌వాజ్‌ను అందు మీద పెట్టాడు. దూరంగా వెళ్ళి ఓ మాటు టేబిల్‌ను పరిశీలించాడు. చాలా అందంగా కనుపించింది. ఇప్పుడు గదికి నిండుతనమే వచ్చింది. నిండుతనమే గాక గది చాలా అందంగా ఉంది. కుర్చీ టేబిల్ వద్దకు జరిపాడు. సరీగ్గా తాను, అనుకున్నట్టే ఈ కుర్చీకి ఆ టేబిల్ మాచ్ అయింది. ఆ కుర్చీ కలకాలంగా తమ ఇంట్లో పడున్నది. ఎప్పటిదో ముత్తాతల కాలం వాటిది. చేతులకూ కాళ్ళకూ నగిషీ చెక్కబడి హుందాగా కనిపించే కుర్చీ అది. హైదరాబాద్ ఉద్యోగం అయినప్పుడు గది మరీ బోసిగా ఉంటుందని ఆ కుర్చీని కూడా తెచ్చుకున్నాడు శేఖరం.

ఏదన్నా రాసుకోవాలంటే చాలా కష్టంగా ఉండేది శేఖరానికి. చాప వేసుకుని కూచుని రాసుకోవడం అతడికి చాత కాలేదు. ఎలాగైనా టేబిల్ కొనాలని అతడికి మనసులో నాటుకుంది. ఒక నెల రోజుల క్రిందట. ఆ నెల ఏవో బట్టలు అవీ కుట్టించడంతో వీలు పడలేదు. ఈ మాటు ఏమైనా సరే కొనాలన్న పట్టుదలతో జీతం తీసుకున్న తక్షణం నేరుగా ఒక ఆక్షన్ షాపుకు దారి తీశాడు శేఖరం. ఒక పాతిక రూపాయల్లో కొందామనుకున్నాడు గాని అక్కడి టేబిల్స్ చూసేటప్పటికి చప్పబడిపోయాడు. ముప్పై రూపాయలు పెట్టినా మంచి టేకుచెక్క టేబిల్ దొరకలేదు. ఇలా టేబిల్స్ పరిక్ష చేసే సమయంలో షాపులో మూలగా ఒక నల్లటి టేబిల్ అతణ్ణి ఆకర్షించింది. దగ్గరకెళ్ళి పరీక్ష చేశాడు — గట్టిచెక్క, రోజ్ ఉడ్‌ది. కుడిపక్క మూడు సొరుగులూ, కాళ్ళకు నగిషీ పని — చాలా పురాతనపు టేబిల్ అది. సాధారణంగా నవాబుల ఇళ్ళలో కనుపిస్తుయ్యే అటువంటిది. సరిగ్గా తన గదిలోఉన్న కుర్చీకి మాచ్ అవుతుంది. వెంటనే దాని మీద మోజుపడి పోయాడు.

షాపువాణ్ణి ధర అడిగితే ఎనభై అన్నాడు.

"పాతది కదా ?"

"అందుకే ఎనభై — కొత్తదైతే మూడొందలు."

ఎనభై రూపాయలు పెట్టి కొనడమా, మానడమా — సమస్యై కూర్చుందతనికి. ఒక పది

నిముషాలు బుర్రబద్దలు కొట్టుకుని ఎనిమిదైరూపా యలూ చెల్లించి కూలీల చేత మోయించుకొచ్చాడు ఆ నల్లటి టేబిల్‌ను.

*   *   *

గదంతా అందంగా అమర్చింతర్వాత కిటికీలు బూజు దులిపి పెట్టెలో నాలుగు నెలలుగా పడున్న విండో కర్టెన్ కూడా తీసి కిటికీకి అమర్చి, టాయ్ లెట్ అయి ఫ్లవర్ వాజ్ లో వేసేందుకు పూల కోసం బజారుకు బయలుదేరాడు శేఖరం.

యథాప్రకారం హోటలు వద్ద తారసిల్లాడు గోపాలం.

"ఏరోయ్, ఎటు ?"

"పూలకు."

"ఛా"

"ఛా"

"కాఫీ తాగి"

"పద"

కాఫీ తాగింతర్వాత కాగితంపూలుకొని గోపాలంతో సహా రూమ్‌కు బయలుదేరాడు శేఖరం.

రోజూ గోపాలం శేఖరం రూమ్‌కు వస్తాడు కాలక్షేపానికి చీట్లాడుకుంటారు. ఇవాళ చీట్లాట విషయంలో ఒక విశిష్టత ఉంది. ఏమంటే టేబిల్ మీద ఆడుకోవచ్చు. శేఖరం వద్దే మరో జాజిచెక్క ఫోల్డింగ్ చైర్ ఉన్నది. ఈనాటికి దాని ఉపయోగం కనుపించింది. టేబిల్‌కు చెరో వేపునాచేరి చీట్లాట ప్రారంభించారు ఇద్దరూ. ఫ్లవర్ వాజులోని పూలు అవో తమాషాగా మెరుస్తున్నాయ్. ఆట మీద ఆట వెళ్ళిపోతున్నది — తొమ్మిదయింది.

"వస్తారా" అంటూ లేచాడు గోపాలం.

"కూచోరా" — కొత్త బిచ్చగాడు పొద్దెరగడు. ఆ టేబిల్ మీద ఇంకా చీట్లాడాలనే ఉన్నది శేఖరానికి

కాని ఆత్మారాముడు ఆలపించడంతో ఉండలేక బయలుదేరాడు గోపాలం.

గోపాలం వెళ్ళింతర్వాత హోటలుకెళ్ళి భోంచేసి వచ్చి కొత్త టేబిల్ ముందు కుర్చీలో కూర్చుని పొద్దుట తండ్రివద్ద నుంచి వచ్చిన ఉత్తరాన్ని మళ్ళీ చదవటం మొదలెట్టాడు శేఖరం.

"ప్రియమైన శంకుకి,

నీ తండ్రి ఆశీర్వదించి వ్రాయునది. కులాసాగా ఉన్నావని తలుస్తాను. నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమని మీ అమ్మ రాయమంటున్నది. వేళ పట్టున భోజనం చెయ్యి.

ఒక ముఖ్యమైన సంగతి. వారంరోజుల క్రితం మీ సీతారాం మామయ్య వచ్చాడు. వచ్చే నెలలో ముహూర్తం ఉన్నదనీ, లగ్నం పెట్టిస్తె బాగుంటుం దనీ అన్నాడు. జానకి నా మేనకోడలు. చిన్నప్పటి నుంచీ అనుకున్నదే గాబట్టి సరేనన్నాను నువ్వొ ఒప్పుకుంటావన్న ధీమాతో. సుగుణాలరాసి జానకి. అంతో కొంతో చదువుకున్నది. నీకు తగ్గది. పైగా నా మేనకోడలు. ఇవన్నీ జాగ్రత్తగా ఆలోచించే సరే నన్నాను. నీకు వీలైతే ఒక నెలరోజులు సెలవుపెట్టి రావలిసింది.

ఇట్లు,
మీ నాన్న."

జానకి గుర్తొచ్చింది శేఖరానికి. ఎన్నాళ్ళయిందో దాన్ని చూసి ! గౌన్లు తొడుక్కుని చింతచెట్టు, చిటారు కొమ్మను కూచుని చింతకాయలు ఉప్పు అద్దుకు తినటం, చెట్టెక్కేందుకు భయం వేసి తను కిందనే నిలబడి నోరూరుతూ "నాకో కాయ పడేయవూ." అని ప్రాధేయ పడటం — ఈ దృశ్యం గుర్తుకు వచ్చి సన్నగా నవ్వుకున్నాడు. ఆ గౌన్ల అమ్మాయి ఇప్పుడు తనకు కాబోయే భార్యా ? — ఆడవాళ్లకు ఇట్టే వయస్సు వస్తుంది — జానకి ఇప్పుడు ఏపుగా ఎదిగి పోయి ఉంటుంది. — ఆ క్షణాన్నే ఆమెను చూడాలనిపించింది.

తండ్రి రాసిన ఉత్తరాన్ని మడిచి కవర్లో పెట్టి డ్రాయర్‌లో పెట్టేందుకు మొదటి సొరుగు లాగాడు. గట్టిగా పట్టుకుందల్లే ఉంది, రాలేదు. రెండో సొరుగును లాగాడు. అది సగందాకా వచ్చి భీష్మించుకుంది. విసుగుతో ఒక తాపుతన్ని గట్టిగా లాగాడు. ఇవతల వూడి పడ్డది సొరుగు !

అప్పుడప్పుడే పడుతున్న చెదలూ, నాలుగైదు బొద్దింకలూ చెల్లా చెదరుగా పరుగెట్టినై. సొరుగుల వెనకాల చాలా చెత్త ఉంది. మూడో మూడో సొరుగును కూడా ఇవతలకు లాగి లోపల ఉన్న చెత్త యావత్తూ బయటకు తీశాడు. అన్నీ ఏనాటివో కాగితాలు — కొన్ని కాగితాల్ని చెదలు పూర్తిగా తినేసినయ్. ఈ చెత్తనంతా పోగుచేసే సమయంలో అందులోనే ఒక కవరు కనుపించిందతడికి. ఇవతలకు తీశాడు. ఒక పక్క చెదలు కొరికేసినయ్. కవరు అంటించే ఉన్నది. స్టాంపులు కూడా అంటించి ఉన్నయ్. పైన అడ్రసు "ఏ. సుధాకరరావు, కింగ్స్‌వే, సికిందరాబాదు." అని రాసి ఉన్నది. కవరు చించి ఉత్తరాన్ని పైకి లాగాడు.

అతని ఆశ్చర్యానికి అంతులేదు — అది ముప్ఫై ఏళ్ళనాడు రాసిన ఉత్తరం !!

29 — 12 — 1934 తారీఖు వేసి ఇంగ్లీషు లో రాసి ఉన్నది.

చదవటం ప్రారంభించాడు శేఖరం.

"ప్రియమైన సుధాకరానికి,

ఈ ఉత్తరం ఇప్పుడు రాయవలసి వచ్చి రాస్తున్నాను. అన్నయ్యకు విశాఖపట్నం బదిలీ అయింది. ఎంతో సంతోషపడి పోతున్నాడు. నాన్నగారు విశాఖ పట్నంలో ఉన్న సంగతి నీకు తెలును — అందరూ కలిసి ఉండవచ్చు — సంతోషం కాక మరేమిటి !

కాని అన్నయ్య సంతోష హృదయానికి వెనగ్గా ఓ అబల హృదయం రెపరెపలాడి పోతున్నదని నువ్వూహించలేవు. ఏదీ నేననుకున్న విధంగా జరగటం లేదు — అదృష్టహీనురాల్ని.

అసలు నేనెందుకు ప్రేమించానా అని నాలో నేను తర్కించుకుంటాను. వయస్సు నేర్పిన విద్య అది. దాన్ని ఆలంబనంగా చేసుకుని గాలిమేడలు కట్టు కున్నాను. ఆ మేడలో నీవూ నేనూ లోకాతీతులమై స్వేచ్ఛగా విహరిస్తున్నట్టు కలలు కన్నాను.

జీవితంలో స్త్రీ ఒక్క పొరపాటు చేస్తే అది జీవితాంతం ఎలా వెంటాడుతుందో అనుభవం మీద తెలుసుకుంటున్నాను. మీరు మగవారు. ఎటువంటి భయంకర పరిస్థితి అయినా నవ్వుకుంటూ తొక్కేసి దాటేయ గలరు. స్త్రీలో అంత కాఠిన్యం లేదు — తెగింపూ లేదు. ఇందుకు భగవంతుణ్ణి నిందించాలి.

ప్రతిరోజూ కలలోకి వచ్చే నీవు నెలరోజుల క్రితం ఒకమారు రాకపోయే సరికి కలవరపడిపోయాను. ఆనాటి నుంచి నిన్ను గూర్చి కల కనలేదు. నా దర్శ నంతోనే పరవశించి పోతావని, నా నడకల వయ్యారం నీ హృదయం మీద మెత్తగా నాట్యం చేస్తుందనీ, నా కళ్ళలోని కాంతులు వెన్నెల చిలుకుతాయనీ, నీ చిన్నమాటలు నీటి మూటలవుతాయని నేనేనాడూ వూహించలేదు. నేను అన్నయ్యతో వెళ్ళిపోతే మళ్ళీ నిన్ను ఈ జీవితంలో చూడలేనేమో ! — కాని వెళ్ళక తప్పదు. నీవు అభయం ఇచ్చిననాడు నేను వెళ్ళకుండా ఉండిపోగలుగుదునేమో ! ఇప్పుడు నన్నేం చేయమంటావో నీవే చెప్పాలి. నేను వెళ్ళి పోయింతర్వాత నీ ఉత్తరం కన్నా నోచుకుంటానో లేదోనన్న బాధ.

ఇట్లు
నీ సరోజ."

నా అడ్రసు :
కేరాఫ్. కె. ఆర్. రావు.
డాబా గార్డెన్స్,
విశాఖపట్నం.

వళ్ళు గగుర్పొడిచింది శేఖరానికి. ఈ ఉత్తరం ఎందుకు పోస్టు కాలేదో అర్థం కాలేదు. ఒకవేళ పోస్టు చేశాననుకొని డ్రాయర్లో పెట్టి మరిచి పోయివున్నా ఉండాలి. అయితే ఈ ముప్ఫై ఏళ్ళూ ఈ డ్రాయర్‌లో నిద్రిస్తున్నా ఈ ఉత్తరం !

డ్రాయరుకేసి చూశాడు శేఖరం. నల్లని నిగనిగలాడి పోతున్నది. తనకేదో కథ చెప్పబోతు న్నట్టూ, ధీమాగా నవ్వుతున్నట్లూ తోచింది. ముప్ఫై ఏళ్ళుగా తనలో దాచుకున్న ఈ ఉత్తరం కథను తనకు చెప్పేందుకు ఈ రొయ్యకే వూబుకు వస్తే !

ఎంత తన్నుకున్నా ఈ ఉత్తరం ఎందుకు పోస్టు కాలేదో అర్థం కాలేదతడికి. విశాఖపట్నం వెళ్ళిపోతూ ఫర్నిచర్ అమ్మేస్తే ఈ షాపు వాడు కొన్నాడా ? ఇన్నేళ్ళ నుంచీ ఈ టేబిల్ అతడి వద్దే ఉన్నదా ? లేక మరి కొన్ని చేతులు మారిందా? మారినా ఈ టేబిల్‌ను వదిలేందుకు ఇష్టంలేక అంటి పెట్టుకునే ఉన్నదా ఉత్తరం !

మరోమారు ఉత్తరాన్ని చదువుకున్నాడు. ఉత్తరంలోని సారాంశంకన్నా చివర రాయబడిన పేరు ఆకర్షించిందతణ్ణి.

'సరోజ'— ఎంత తియ్యటి పేరు !

కిటికీలోంచి బయటకు చూశాడు వెన్నెల విరగబోస్తున్నది. అర్థరాత్రివేళ ఒక అవివాహిత యువకుడు ఏవో మధురమైన భావాలను చిత్రించు కుంటే తమాషాగానే ఉంటుంది.

సరిగ్గా ముప్ఫై ఏళ్ళ క్రితం— ఒక వెన్నెల రాత్రి— సంపెంగలూ, సన్నజాజులూ సౌరభాలు వెదజల్లి మత్తెక్కిస్తూంటే, చల్లటి గాలి సుతారంగా దేహాన్ని కొరికేస్తూంటే— ఒక అందమైన యువతి— తెల్లటి చీరగట్టి, నుదుట కుంకుమ మెరిసిపోతూ,— ఈ టేబిల్ వద్దే కూర్చుని తన ప్రియుడికి ప్రేమలేఖరాసే దృశ్యం వూహించు కోగానే అతడి వళ్ళు అదోలా అయిపోయింది.

మెల్లిగా వెళ్ళి టేబిల్ ముందు కూర్చున్నాడు. ఇదే విధంగా, ఈ టేబిల్ ముందే కూర్చున్నవతో జను 'నీ ప్రేమలేఖ మొదలెట్టు' అని ఈ టేబిల్ హెచ్చరించిందేమో !

ఇప్పుడు సరోజ ఏమై ఉంటుంది ? విశాఖ పట్నం వెళ్ళిందా ! లేక సుధాకరాన్ని పెళ్ళి చేసు కుందా ?— ఎటూ నిర్ణయించుకోలేక పోయాడు.

సరోజ వివాహం చేసుకుందని మాత్రం వూహించుకోలేక పోతున్నాడు. ఎందుకంటే ఆ లేఖలోని ప్రేమ కథకు ఆ పర్యవసానాన్ని వూహించడం కష్టంగా ఉందతడికి. ఆమె విశాఖపట్నమ్ వెళ్ళి పోయుండాలి— సుధాకరం ఇక్కడే ఉండి ఉంటాడు— అయితే సరోజ మరొకర్ని వివాహం చేసుకుందా ?— ఏమో, పరిస్థితుల వత్తిడివల్ల అలా జరిగి ఉండవచ్చు. మళ్ళీ ఏనాడన్నా సుధాకరానికి ఉత్తరం రాసిందా ?— వివాహం అయిన పక్షంలో రాసి ఉండదు. కాని పక్షంలోనూ రాసి ఉండదు వివాహం కాని పక్షంలో తనను తృణీకరించిన సుధాకరానికి ఏ మొహం పెట్టుకుని రాస్తుంది.

పోస్టుకాని ఉత్తరం

మరి సుధాకరం ఏ నాడన్నా ఆమెకు ఉత్తరం రాశాడా తన పరిస్థితి వివరిస్తూ— తృణీకరించాడు కాబట్టి రాసి ఉండక పోవచ్చు. లేక ఈ ఉత్తరం అతనికి అందలేదు కాబట్టి ఆమె ఎటు వెళ్ళిందో తెలియక సతమత మయ్యాడా ?— ఏవో ఆలోచనలు ఉక్కిరి బిక్కిరి చేసినై శేఖరాన్ని.

టేబిల్ వంక చూశాడు శేఖరం. అది విస్పతంగా నవ్వుతున్నట్టు అనిపించింది.

"పిచ్చివాడా— సరోజ సుధాకరాన్ని వివాహం చేసుకుందని ఎలా అపోహ పడ్డావు. అలా జరిగిన పక్షంలో ప్రేమ కథకు మాధుర్యం ఏముంది— ఆ ఉత్తరం పోస్టు చేశాననుకుని నాలో పెట్టి మరిచి పోయింది సరోజ. ఎన్నాళ్ళకూ సుధాకరం నుంచి జవాబు రాలేదు— సుధాకరం వంచకుడు. కాని ఈ నాడు— ముప్పై ఏళ్ళ అనంతరం అతడిలో పశ్చాత్తాపం ఎగిసి ఒక అమాయిక హృదయాన్ని చేతులారా దహించివేసినట్లు బాధ పడుతున్నాడనుకో— అప్పుడతను చేస్తాడు ?— సరోజలో మళ్ళీ ఆశలు రేపుతాడు. మళ్ళీ ఉత్తరం రాస్తాడు....."

నిజంగా ఈ టేబిలే తనకేకద చెప్పిందా !

అనుకోకుండా కలం చేతులోకి తీసుకున్నాడు శేఖరం.

"ప్రియమైన సరోజకు".— ఈ వాక్యం రాయగానే అతని దేహం కంపించి పోయింది — వణుకుతూన్న కలం సాగిపోయింది.

"నీ ఉత్తరానికి ముప్పై ఏళ్ళ అనంతర జవాబు రాస్తున్నందుకు ఆశ్చర్యం వేస్తున్నది కదూ ? నన్ను మృగం కన్నా హీనంగా జమకట్టి ఉంటావు. నిజంగా మృగాన్నే ఇన్నాళ్ళూ. కాని ఇవాళ మానవుడిగా నా హృదయాన్ని నీకు విప్పి చెబుతున్నాను.

ప్రతి మనిషిలోనూ ఏవో లోపాలు ఉంటై. అవి లేని మానవుడు దైవ సమానుడు. తనతో సమానంగా మానవుణ్ని మోపలేక అతడిలో ఈ మృగ లక్షణాలను ప్రవేశ పెట్టాడు దేముడు ! నాలో మరికొంత ఎక్కువగా పెట్టాడేమో.

అప్పుడు నాలో పని చేస్తూన్న మృగ లక్షణమే నీ ఉత్తరానికి జవాబు రాయక పోవడానికి కారణం. అందని దానిని ఆసించడం మానవ లక్షణం. అదే విధంగా అందిన వస్తువును కాలదన్నటం— నీవు నన్ను ప్రేమించావు— నాకు అందావు కాబట్టి కాలదన్నాను. దాని ఫలితం ఈ నాడు అనుభవిస్తున్నాను. జీవితం అంతా తరచితరచి చూచి కాటికి కాళ్ళు జాపుకున్న ఈ తరుణంలో ప్రేమ అంటే ఏమిటో తెలుసుకున్నాను. అది నీ నుంచి పొందలేని ఈ జీవితం వ్యర్థం అనిపిస్తున్నది. ఈ ముప్పై ఏళ్ళ జీవిత వివరాలూ నే నిప్పుడు రాయలేదు. రేపో మాపో రాలిపోయేవాణ్ణి. నేను రాలిపోయే ముందు నా గురించి ఒక్క రాత్రి కలగన్నానని నీవు రాస్తే నిశ్చింతగా కళ్ళు మూస్తాను. రాస్తావు గదూ— అన్నట్టు నీ భర్తకు నా నమస్కారములు చెప్పు. పిల్లలెంత మంది ?

ఇట్లు,
సుధాకరం."

ఉత్తరం ముగించే సరికి ముచ్చెమటలు పోసినై శేఖరానికి. చివర తన అడ్రసుకూడా రాశాడు.

ఉత్తరాన్ని మడిచి కవర్లో పెట్టి అంటించి పైన ఆమె ఇచ్చిన అడ్రసు రాసి అప్పటి కప్పుడే తన గదికి ఎదురుగా ఉన్న పోస్టు బాక్సులో పడేశాడు— కేవలం తమాషాకే చేసుంటాడు ఆ పని.

పడుకున్నాడన్న మాటే గాని నిద్ర పట్టలేదు.

"ఒక వేళ సరోజకు వివాహం అయిందేమో. అయితే ఆమె భర్తవద్ద ఉండదా ?— అప్పుడు ఈ ఉత్తరం ఏమవుతుంది ?— మరొకరి చేతిలో పడితేనో !— ఆమె అన్నో, మరెవరో నేరుగా తన

58 వ పేజీ చూడండి

ఉత్తరాదిలో ఆంధ్రులు!

రత్నా మహీధర్

'స్త్రీ పేరంటమ్మాయ్' అన్నాను పక్కనే కూర్చుని ముద్దుగా, అందంగా ఉన్న అమ్మాయిని.

ఆ పిల్ల జవాబు చెప్పకుండా తల్లి వేపు చూసింది. "మా అమ్మాయికి తెలుగు రాదండీ హిందీయే వచ్చును." అంటూ అదేదో గొప్పలా "నామ్ బోలో బేబీ" అంది. శకీమని ఏదో పేరు చెప్పిందా పిల్ల. కానీ వినే పరిస్థితిలో లేను నేను. వాళ్లు ఉత్తరాది వచ్చి సంవత్సరం కూడా కాలేదని అప్పుడే చెప్పింది నా మిత్రురాలు. ఇంత త్వరలో ఆ పిల్ల తెలుగెలా మర్చిపోయిందో, ఒక వేళ మర్చిపోయినా ఆ తల్లి దండ్రులెలా మర్చిపోనిచ్చారో నా కర్థం కాలేదు.

అలాగే ఆ నాటి పేరంటంలో మా మిత్రురాలి పిల్లలు, వాళ్ల స్కూలు పిల్లలతో, వచ్చిన తెలుగమ్మాయిలతో హిందీయే మాట్లాడ్డం మరీ విడ్డూరమనిపించింది. అలాగే ఇంకోసారి ఒక కాలేజి అమ్మాయితో మాట్లాడుతుంటే నవలలు చదవటం ప్రసక్తి వచ్చింది. "అబ్బే తెలుగు నవలలు నా కిష్టం లేదండీ. అయినా తెలుగులో ఉన్న మంచి నవలలేమిటి గనుక. హిందీలో అయితేనా" అంటూ మొదలెట్టేసరికి

'హయ్యో తెలుగుభాష నీ కెన్ని పాట్లొచ్చాయి" అనిపించింది. ఏ దేశం వెళ్లినా ఆదేశంలో గల మంచి ఆచారాలను, భాషను నేర్చుకోవలసిందే. ఓపిక ఉంటే ఆ సాహిత్యంతో పరిచయం చేసుకోవలసిందే కానీ అక్కడికి కెళ్ళి మాతృ భాషను మర్చిపోయినట్లు నటించటం (మర్చిపోవటం అసంభవం కనుక) కించ పరచి మాట్లాట్టం ఒక గొప్పగా భావిస్తున్నారు.

మేము ఉత్తరాది ఈ మధ్యనే వచ్చాము. వచ్చిందగ్గర నుంచీ తెలుగు భాష వినపట్టం తక్కువయిపోయింది.

ఎంతయినా మాతృ భాషాభిమానం నాలో పాలు ఎక్కువ ఉంటంచేత (సొంత డబ్బాకు క్షమించాలి) ఎవరేనా తెలుగు వాళ్ళు కనపడే సరికి ఆప్యాయంగా మాట్లాడాలనిపించటం సహజం కదా ! అయితే రాజభాషా ద్వేషం మాత్రం నా కిష్టం లేదు.

ఇక మన తెలుగు వాళ్ళు బజార్లలో గాని ఎక్కడేనా కనపడేసరికి, పలుకరించేది హిందీలోనో ఇంగ్లీషులోనో అయి తీరుతుంది. అంచేత సాధారణంగా కొత్తగా వచ్చిన వారికి ఎవరు తెలుగు వారో ఎవరు కారో బోధపడదు. అదే మా బెంగాలీ ఫ్రెండు కానీ, తమిళ, మిత్రులుగానీ నాతో బజారు వస్తే, వాళ్ళ వాళ్ళు కనపడే సరికి ఝామ్మని వాళ్ళ భాషలో మాట్లాడేవారు. అందుకే కాబోలు, మన వాళ్ళని పోల్చటం అతి సులువు అంటారు మావారు.

ఇంత గడుసుతనంగా పరభాష మాట్లాడే మనవాళ్ళు మళ్ళా ఒక్కొప్పుడు ఎంత అమాయకంగా ఉంటారో తెల్సా ? ఓసారి నేను ఏవో కొందామని బజారు వెళ్ళాను. ఎవరో ఇద్దరు తెలుగువాళ్ళు 'ఒరేయ్ ఆ రింగు అమ్మాయిని చూడరా" అంటూ ఒకతను. 'ఎలా చూస్తుందో' అని ఇంకోతను నా ముందే నన్ను గురించి, నేను తెలుగుదాన్ని కాననుకొని మాట్లాడ సాగారు. ఇంతలో మావారు ఏదో తెలుగులో అడిగేసరికి చల్లగా జారుకున్నారు వాళ్ళు. ఇలాంటి పొరపాట్లు ఎన్నో చోట్ల చూశాను. ఒకసారి ఒక దంపతులు తెలుగులో, బస్సులో కూర్చుని దెబ్బ లాడుకుంటున్నారు తెలుగెవ్వరికీ రాదు కదా అని వాళ్ళ ధైర్యం, ఇది ఎంత అమాయకత్వమో ఆలోచించండి !


అసలు అన్నిటి కన్నా వింతగా కనిపించేదేమిటంటే "ప్రవాసాంధ్రులంకదా ఇక్కడకూడా ఆఫీసర్ల భార్యలు గుమస్తాల భార్యలతో మాట్లాడ్డం కలిసి తిరగటం తప్పు అని భావించటం ఎందుకులే" అని ఎవ్వరూ అనుకోరు. మొన్నటి దాకా ఒక్క గదిలో ఉంటూ నానా అవస్థలూ పడి అందరి సహాయాన్నీ పొందిన ఓ ఛోటా ఆఫీసరు భార్య ఈ నాడు క్వార్టరు ఎలాటయేసరికి మనని పోల్చుకునే స్థితిలో కూడా ఉండదు. వాళ్ళకే ప్రత్యేకతా లేక పోయినా భర్తగారి ఆఫీసరు గిరీ (ఆయనకంటే) వీళ్ళే వెలగపెడతారు మనస్త్రీలు. ఉన్న మాటకి ఉలుకెందుకులెండి.

సరే స్త్రీల సంగతి ఇలా ఉంటే పురుషులు ఇందుకేం తీసిపోలేదు. ఆ మధ్య ఏదో సమితి ఆధ్వర్యాన నాటకం వేస్తున్నాం టిక్కట్లు కొనండంటూ ఒక పెద్ద మనిషి వచ్చారు. కొత్తగా వచ్చిన వాళ్ళం కావటంచేత విషయాలు తెలుసుకోవాలని "మన ఆంధ్రా సమితి ఆధ్వర్యానాండీ" అన్నాను నేను. "ఇక్కడ అలా ఆంధ్రా సమితంటూ ఏమీ లేదండీ. మనిషి కొక్క సమితి ఉంది కావలిస్తే. మళ్ళీ అందులో రెడ్లువేరు, బ్రాహ్మలు వేరు, కమ్మలు వేరు" పురాణం వినలేక "ఆపండి బాబోయ్" అన్నాను.

"చివరకీ కులతత్వాల పట్టింపు ఇక్కడికి కూడా వ్యాపించిందన్న మాట" అంటే "ఇక్కడే పుట్టింది" అన్నారాయన. మరి తక్కిన భాషల వారి మాటేమిటనకున్నారు. వాళ్ళందరికీ ఒక్కటే సమితి ఉంటుంది. ఎవరేనా వాళ్ళవాళ్ళు వస్తే ఆ సమితి ఎంతో ఘనంగా పని చేస్తుంది.

మరి మనలో ఈ ఐకమత్యం ఎందుచేత లోపించింది ? ఇది ప్రతివారు తమ ఆత్మ పరిశీలన చేసి తెలుసుకోవలసిందే అయితే అసలు సంఘీభావం లేనే లేదని కాదు నా భావన. చాలా తక్కువ మందిలో ఉంది. మన దేశంలో మన రాష్ట్రంలో మనం ఎలా ఉన్నా బాధ లేదు. కాని పరరాష్ట్రంలో ఉంటూ కూడా మనలోపాలను సరిదిద్దుకో లేకుండా ఎందుచేత వదిలేస్తున్నాము ?

"అబ్బ బెంగాలీలకుండే "యూనిటీ" ఇంకెవ్వలోనే లేదండీ" అంటుంది మా పంజాబీ ఫ్రెండు. కానీ మనం ఈ నాటికీ, వేరే రాష్ట్రం ఏర్పడినా మద్రాసీలకిందే జమవుతున్నాం. అంతే కాదు మనకు ఉత్తర దేశంలో పేరే లేదు. ఒక సమిష్టి సంఘం లేదు. కారణం తరచి చూస్తే ఎవ్వరూ చెప్పలేకుండా ఉన్నారు. పై వాటికి పరిష్కారం చెయ్యమన్న విన్నపమే ఈ వ్యాసం ఉద్దేశ్యం. అంతే కాని ఎవ్వరినీ వ్యక్తిగతంగా దుయ్యబట్టటం కాదు. ★



'అడిగిన ప్రతివాడికి టైము చెప్పలేక చస్తున్నానన్నుకో...అందుకే ఈ పద్ధతి మొదలెట్టా'

వనితా వాణి

కాగితంపూలు

1-5-64 సంచికలో ప్రచురించిన కాగితం పూలు వ్యాసం సంచికలో మణిపూసలాంటిది. కాగితాల పూలను ప్రతిరోజూ చూస్తూనే ఉంటాము. మనలో చాలా మంది వాటిని డబ్బిచ్చి బజార్లో కొంటు ఉంటారు. కాని, ఈ వ్యాసం చదివిన తరువాత అంత అవసరం లేక పోయింది.

బాగా అర్థమయ్యే విధంగా, కాగితం పూల తయారీని గురించి చెప్పారు. వ్యాసంలో ముఖ్యమైన ఆకర్షణ ఫోటోలు. పూల తయారీ ప్రతి దశలోనూ ఒక్కో ఫోటోను ప్రచురించటం వల్ల పని తేలిక అవుతున్నది.

ఇంత చక్కని వ్యాసాన్ని వ్రాసిన శ్రీమతి ఎన్. నాగరత్నం గారికి నా ధన్యవాదములు.

ఇక ముందు కూడా వనితాలోకం శీర్షికలో ఇలాంటి ఉపయోగకరమైన వ్యాసాలు ప్రచురించెదరని ఆశిస్తాను.

వి. లలితారావు (హైద్రాబాదు)

*   *   *

కాగితం పూల వ్యాసం చాలా బాగుంది. వ్యాసం చదువుతుంటేనే, కాగితం పూలను తయారు చేసినంత ఆనందాన్ని పొందాము. నామటుకు నాకు కాగితంతో పూలను ఎలా తయారు చెయ్యాలో ఇంత వరకు తెలియదు. అందువల్ల నేను మిమ్మల్ని అభినందించకుండా ఉండలేను.

ఇంతవరకు, కాగితం పూలను తయారు చేయలేదు గనుక (తీరిక లేనందున), ఇంతకు మించి ఇంకేమీ వ్రాయలేకున్నాను.

ఏమైనా, ఇక ముందు కూడా ఇలాంటి వ్యాసాలను ఎక్కువగా వేస్తే, స్త్రీలకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని మనవి.

పి. హేమ (కైలాసనాథపురం)

స్క్వేర్ నెక్ చోళీ

వనితాలోకం శీర్షికలో ఆంధ్ర సచిత్ర వారపత్రిక ప్రచురిస్తున్న వ్యాసాలు ఎంతో ఉపయోకరంగా ఉంటున్నాయి. ముఖ్యంగా పోయిన వారం చెప్పిన "స్క్వేర్ నెక్ చోళీ" రచన చాలా బాగుంది. రచయిత్రి "ఎమ్మెస్సార్" గారికి వారపత్రిక ద్వారా నా ధన్యవాదాలు అందజేయ గోరుతున్నాను.

కె. విజయలక్ష్మి (హైద్రాబాదు)

ఊరగాయలు

మీరు వనితాలోకం శీర్షికలో తక్కువ వ్యాసాలు ప్రచురిస్తున్నప్పటికీ, ఆ ప్రచురించిన వ్యాసాలన్నీ ఎంతో ప్రయోజనకరంగా ఉంటున్నాయి. ప్రతివారం మాకు 'వనితాలోకం' శీర్షికలో 'వెరైటీ' కనుపిస్తున్నది.

పోయినవారం బి. పద్మావతి గారు చెప్పిన "వూసిరిగ కాయ వూరగాయలు, వడియాలు" సోదరీమణులకు చాలా ఉపయోగకరం.

సి. కామాక్షి (ఖర్గపూర్) ★



హవిస్

రాజారావుకి ముచ్చెమటలు పోశాయి.

శరీరం అంతా స్వాధీనం తప్పిపోయినట్లు, కళ్లకి బైర్లు కమ్మినట్లు, నెత్తిమీద ఎవరో బలంగా కొట్టినట్లు అనుభూతి చెందాడు. అతి కష్టంమీద మనసుని అదుపులోకి తెచ్చుకున్నాడతను. భూమికి బిగించినట్టుగా ఐపోయిన అడుగుల్ని స్వాధీనం చేసుకుంటూ, తడబడుతున్న అడుగులతో, సాధ్యమైనంత వేగంగా అతను ఆలయ ప్రాంగణం దాటాడు.

ఎంత మోసం ?

రాజారావు రుమాలుతో నుదురు తుడుచుకుంటూ, నడవసాగాడు. ఈ రామదాసు, మునపటు షరీకన్న మాట ! ఆ సంగతి కొంత తను ముందుగానే పసిగట్టాడు గాని, అందులో ఇంతటి గూడు పుఠాణీ ఉన్నదనుకోలేదు. బంతి పూల కోసం తను తిరిగి రాకపోతే ఇది ఇప్పటికైనా బైట పడేదా ?

ఇక తను తొందరపడాలి. కనీసం అత్తయ్యనూ, వరలక్ష్మినీ అన్నా దక్కించుకోవాలి.

ఇంటి గుమ్మంలో పాలేరుతో ఏదో చెబుతూ నిలబడిఉన్న సుభద్రమ్మగారు మేనల్లుడి వాలకం అతను చెరచెరా తనను నెట్టుకుంటూ లోపలికి వెళ్లటం, చూసి తెల్లబోయింది. పాలేరుతో చెప్పవలసింది చెప్పి పంపేశాక ఇంట్లోకి వచ్చింది. వంట ఇంట్లో, కుంపటి మీంచి కూరగిన్నె దింపుతూ, వీధివైపు చూస్తోంది వరలక్ష్మి. బావవాలకం ఆమెకి ఆశ్చర్యాన్నే కలిగించింది. ఏం జరిగిందో ?

సుభద్రమ్మగారు అల్లుడిగది గుమ్మం దగ్గిరికి వచ్చింది. కళ్లు మూసుకుని, మంచం మీద పడుకుని ఉన్నాడు రాజారావు. మనిషి కొంచెం రొప్పుతున్నాడు.

“నాయనా” అన్నది సుభద్రమ్మగారు.

రాజారావులో చలనం కలగలేదు.

సుభద్రమ్మగారు ఒక క్షణం వూరుకుని “రాజా” అన్నది.

రాజారావు కళ్లు తెరిచి అత్తయ్యని చూసి లేచి కూచున్నాడు. నుదురు రాసుకుంటూ అలాగ కొంచెంసేపు కూచుండి పోయాడు.

"ఏం జరిగింది నాయనా ? ఎవరితో నన్నా పోట్లాడావా ?" అన్నదామె.

రాజారావు ఆమె వంక అయోమయంగా చూసి "వూఁ ?" అన్నాడు.

సుభద్రమ్మగారీసారి కొన్త కంగారు పడింది. దగ్గిరగా వెళ్ళి నుదుటి మీద చెయ్యివేసి "ఒంట్లో బాగోలేదా ?" అన్నది.

రాజారావు తల విదిలించాడు. జేబులో నుంచి సిగరెట్ పెట్టె తియ్యబోయి ఆగి గుమ్మం దగ్గిరకి వచ్చి నిలబడిన వరలక్ష్మిని చూసి "కాసిని మంచినీళ్ళు తెచ్చిపెట్టు వరలక్ష్మీ" అన్నాడు.

వరలక్ష్మి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది.

రాజారావు అవితాగి గ్లాసు కిందపెట్టి "వీధి తలుపు వేసే ఉందా ?" అన్నాడు.

వరలక్ష్మి వెనుదిరిగి చూసి "ఆ" అన్నది. ఆ పిల్లకి ఇదంతా చూస్తుంటే ఏదో గుబులు రేగసాగింది మనసులో.

రాజారావు మంచం మీద ఓ పక్కన జరిగి "మీతో ఓ సంగతి మాట్లాడాలి. కూచో అత్తయ్యా" అన్నాడు.

సుభద్రమ్మగారు గుమ్మం వారగా కూలబడింది. వరలక్ష్మి గదికి లోపలగా గుమ్మం మీద కూచుంది.

"రామదాసు మీకు ఎన్నాళ్ళనుంచి తెలుసు ?" అన్నాడతను.

సుభద్రమ్మగారికి అతనెవరో తలపుకి రాలేదు. "రామదాసెవరు ?" అన్నదామె.

"గుళ్ళో ఉంటున్న తాత కాబోలు ఏం ?" అన్నది వరలక్ష్మి.

"అతనే ! అతనిదేవూరు ?"

"మాకేం తెలుసయ్యా ? ఒకటి రెండుసార్లు మునసబుగారితో కలిసి మన ఇంటికి వచ్చాడు. దేవాలయం, తోట, కాపలా లేక పాడైపోతున్నాయని అతన్ని అక్కడ ఉండటానికి ఏర్పాట్లు చేసినట్లు ఆయనే చెప్పాడు. ముసలివాడుట. వా అన్నవాళ్ళెవరూ లేరుట. ఏం ? అతను నిన్నేమన్నా అన్నాడా ?"

"నన్నెందుకంటాడు ?"

సుభద్రమ్మగారు నవ్వి "పల్లెటూళ్ళ సంగతి

అసుర సంధ్య

నీకు తెలీదు నాయనా ? లోకంలో ఎక్కడా ఉండనంత విచ్చలవిడి తనమూ ఇక్కడే ఉంది. ఘోషా ఇక్కడే ఉంది. ఆయన ముసిలాడు గదా? వరలక్ష్మి, నువ్వు గుడికి వెళ్ళటం నచ్చక ఏదన్నా అన్నాడేమోనని" అన్నది.

"అతను ముసలివాడు కాదత్తయ్యా !" అన్నాడు రాజారావు.

తల్లీ కూతుళ్ళిద్దరూ ఉలిక్కిపడ్డారు. సుభద్రమ్మకి రామదాసు ఒక్కసారి మనస్సులో మెదిలాడు. నెరిసీ నెరియని గడ్డమూ, ముగ్గు బుట్టలాంటి తలా, నెమ్మదిగా మాట్లాడే అతనిగొంతూ గుర్తుకొచ్చాయి. అతను ముసిలాడు కాదా ?

"అదేమిటి బావా ?" అన్నది వరలక్ష్మి తెల్లమొహం వేసి.

"ఇందాక నువ్వు బంతిపూలు మర్చిపోయి వచ్చావు కదూ ? అవి తెద్దామని మళ్ళి ఆలయంలోకి వెళ్ళాను. మడపంలో కనిపించలేదు. అతడేమన్నా తిశాడేమోనని పాక దగ్గరికి వెళ్ళాను. అతను నెత్తిమీద పెట్టుకున్న విగ్గూ, అతికించుకున్న గడ్డమూ తీసేస్తున్నాడు. . . . అతనికి ముప్ఫై సంవత్సరాలుంటాయేమో ?"

కొంచెం సేపటికి దాకా ఎవరూ మాట్లాడలేదు. సుభద్రమ్మకి మతి పోయినంత పనైంది. నిన్న రాజారావు చెప్పిన మాటలు గుర్తొచ్చాయామెకి. మునసబు, రామదాసుని ఎందుకు తీసుకొచ్చాడో ఆమెకి ఆ క్షణాన అర్థమైందనిపించింది. కోపం, దుఃఖం పెల్లుబికి వచ్చాయి. ఆ సమయాన మునసబు కనిపించి ఉంటే ఆమె ఏం చేసినా చేసి ఉండేది.

వరలక్ష్మి మాత్రం నిబ్బరం తెచ్చుకుంటూ "ఎందుకు వేసుకున్నాడావేషం ?" అన్నది.

"ఆ సంగతి వేరే చెప్పాలా ?" అన్నాడు రాజారావు.

"మరి. . .వెంటనే అరెస్టు చెయ్యక పోయావా?"

సుభద్రమ్మకి ఆ మాటలేమీ వినిపించలేదు. ఆపుకోలేని దుఃఖం ముంచుకు వస్తున్నది. మరణించిన భర్త కనుల ముందు నిలిచినట్లవసాగింది. ఆ దుఃఖమే ఆమెలో కోపాన్ని వృద్ధి చెయ్యసాగింది.

"అంతేనంటావా రాజా ?" అన్నదామె.

"ఇలాంటిదేదో వస్తుందనే నేను చెవినిల్లు కట్టుకుని వాగాను మీతోటి. వినిపించుకున్నారు కాదు. లోకంలో అంతా మనలాంటి వాళ్ళే ఉండరత్తయ్యా" అన్నాడతను సగం నిష్ఠూరంగా, సగం మందలింపుగా.

వరలక్ష్మికి ఇందులో తిరకాసమేమిటో అర్థంకాలేదు. "అంత కంగారెందుకు బావా ? పాలేరు మళ్ళీ వస్తాడు. వెళ్ళి కట్టి పడెయ్యి" అన్నది.

సుభద్రమ్మ దడదడ కొట్టుకుంటున్న గుండెలతో "వద్దు నాయనా ! ఆ పని మాత్రం చెయ్యకు. వాళ్ళు కిరాతకులు. నీకు తెలీదు" అన్నది.

"చూస్తూ వూరుకోమంటావా ?" అన్నది వరలక్ష్మి ఉద్రేకంగా.

"వెర్రిమాటలాడకు వరలక్ష్మీ ! వూరుకోవటానికా నేనున్నది ? ఈ సంగతి బైట పడకుండా ఒక్కరోజు చూస్తే ఆ తర్వాత వాడిపాట్లు కుక్కలు కూడా పడవు" అన్నాడు రాజారావు.

"అంటే ?" అన్నది వరలక్ష్మి.

"పోలీసులు రారూ ?"

వరలక్ష్మి బావ వంక ఎగాదిగా చూసి వూరుకుంది.

సుభద్రమ్మగారికి ఏం చెయ్యాలో పాలుబోలేదు. మనసులోని భయాన్ని, అందోళనని బైట పెట్టుకునే స్థితి దాటి పోయిందామె. ఒక రకమైన నిర్లిప్తతా, స్తబ్ధతా ఆవరించాయామెను. కాని అంతకు మించి ఆమె కర్తవ్యం కూడా ఆమెను వెన్నుతట్టి పిలుస్తున్నది. ఇక ముందు జరగవలసింది చాలా ఉంది. తనకోసం కాదు. తన జీవితం ఆయనతోటే సమాప్తి ఐపోయింది. అభమూ, శుభమూ ఎరగని ఈ పసివాళ్ళ కోసం తను ఏద్దైనా చెయ్యాలి.

"ఏం చేద్దామయ్యా ?" అన్నది చివరికి.

రాజారావు సంతోషంగా పాలిగాడ్ని పిలిచి బండి కట్టించత్తయ్యా ! తెల్లారేలోపల ఈ వూరు విడిచి పోదాం" అన్నాడు.


సుభద్రమ్మగారు కూతురి వంక చూసి "ఏమే ?" అన్నది "నీ సలహా ఏమిటన్న"ట్లు.

వరలక్ష్మి "నీ ఇష్టం, బావ ఇష్టం." అన్నది. ఒక క్షణం పోయాక "అంత పారిపోవలసిన అగత్యం ఏమిటో ?" అన్నది నెమ్మదిగా.

రాజారావు తెల్లబోయాడు. మరదల్ని గురించి తాను అంతవరకూ తప్పుగా అంచనా వేశానా అనుకున్నాడతను. వరలక్ష్మిలో ఇది వరకు కనిచని దుర్మార్గం ఇప్పుడు కనిపించిందని కాదు; ఆ అమ్మాయికి తననుకున్న దాని కన్నా ఎక్కువే తెలుసునేమోనని !

"ఐతే ఏమిటంటావు ?" అన్నాడు రాజారావు.

"నేననేదేమిటి బావా ? మునసబు గారూ, ఆ రామదాసూ ఎంతటి దేవాంతకులైనా మనుషులే గదా ? వూళ్ళో ఇంత మంది జనం ఉన్నారు. నాన్న పేరు చెబితే గోతిలో దూకమన్నా దూకేవారు



న్నారు. వాళ్లతో ఈ సంగతి మాట మాత్రం అంటే ఆ ఇద్దర్నీ కట్టి వడెయ్యరూ ?"

"నన్ను చెప్పమంటావా ?" అన్నాడు రాజారావు ఆశ్చర్యంగా.

"ఏం చెబితే ?"

"నమ్ముతారా ?"

"ఎందుకు నమ్మరు బావా ? నీ దగ్గిర సాక్ష్యం ఉండె. కావాలంటే నేనూ చూశానని బుకాయిస్తాను. పరీక్షకి నిలబడక తప్పదుగదా ? రంగు బైట పడ్డాక ఎవరు నోరెత్తుతారు ? ఎలా ఎత్తుతారు?"

కూతురు మాటలు సమంజసంగానే కనిపించాయి సుభద్రమ్మకి. ఆ విధంగా చేస్తే కోర్టు సంగతీ, పోలీసుల సంగతీ దేవుడెరుగును గాని, ఆ నికృష్టుడి మీద పగ తీర్చుకున్నట్టన్నా అవుతుంది. నలుగురూ చుట్టూ చేరి ముఖాన ఉమ్మేస్తుంటే ఏమైపోతాడో చూడాలి ఆ మునసబు.

"నువ్వు చెప్పింది బాగానే ఉంది గాని వరలక్ష్మీ, ఒక్క సంగతి మర్చిపోయావు. ఆ రామదాసు తన గుట్టు బైటపడిందని తెలిస్తే ఒక్క క్షణం ఇక్కడ ఉంటాడా? అన్నాడు రాజారావు.

"ఎట్లా తెలుస్తుంది?" అన్నది వరలక్ష్మి.

"నువ్వు చెబుతున్నావుగా ? నలుగురికీ చెబుదామని. ఈ వూళ్లో ఎవరు మనవాళ్లో, ఎవరు పరాయివాళ్లో ? ఆ వార్త అతనికి చేరటానికి ఎంతసేపు కావాలి ?"

"ఏం సిఐడివి బావా ?" అన్నది వరలక్ష్మి.

సుభద్రమ్మగారు ఉలిక్కిపడింది. రాజారావు సిఐడీయా ? ఆశ్చర్యంతో అతని వంక చూసి "నిజమేనా నాయనా ?" అన్నది.

"నిజమే అత్తయ్యా."

సుభద్రమ్మగారు ఒక్కక్షణం ఆలోచించి "ఐతే. . . ?" అన్నది సందేహంగా.

"చెప్పు"

"రామదాసుని అరెస్టు చెయ్యవచ్చునుగా ?"

వరలక్ష్మి ఆసక్తిగా బావవంక చూసింది. ఆమె కూడా కొద్ది సేపటి క్రితం అదే అడిగింది. జవాబు రాలేదు.

"అదంత తేలిక కాదత్తయ్యా ! దానికి చాలా తతంగం ఉంది."

"మరి మనం ఈ వూరు విడిచి వెళ్ళిపోతే ఎలా అరెస్టు చేస్తావు ?" అన్నది వరలక్ష్మి.

"మళ్ళీ వస్తాను."

"అప్పుడు మాత్రం పారిపోడా ?"

"అందుకే ఆడబుద్ర అన్నారు ! మనం అందరం వెళ్ళిపోతే వాళ్ళు పీడ విరగడైందని హాయిగా ఉంటారు. నేను పట్నంలో అడుగు పెడుతూనే వారంటు పుట్టించి తిరిగొస్తాను. అంతే"

"ఏమో బావా ? అంతకన్నా నా ఉపాయమే బావుంది."

సుభద్రమ్మగారు కూడా అదే అనటంతో రాజారావు వూరుకున్నాడు. అతని మనసులో ఇందాకటి దృశ్యమే సుళ్ళు తిరుగుతోంది. అతనికి ఈ వూరు మీద అసహ్యం కలగసాగింది. ఈ వూళ్లో మనుషులంతా మొండితనం మూర్తీభవించిన వాళ్ళు. పల్లెటూళ్ళంటే తనకి అంతకు మునుపు ఉన్న సదభిప్రాయం సడలి పోయింది. బహుశా ఆ రామదాను (?) తనని చూసి ఉంటాడు. అతన్ని గురించి తన మనసులో ఉన్న అనుమానం నిజమే ఐతే చాలా గొడవ జరుగుతుంది.

"భోజనానికి లేనాయనా ! పొద్దు పోయింది" అన్నది సుభద్రమ్మగారు లేస్తూ.

భోజనం చేసాక వచ్చి తన గదిలో కూచున్నాడు రాజారావు. అతనికేం చెయ్యాలో పాలుపోవటు

50 వ పేజీ చూడండి


ది గర్ల్ విత్ స్టేరింగ్ లుక్స్
కె. రామచంద్రరావు

కాఫీ తీసుకోండి' అంది శారద.

'అక్కడ పెట్టి వెళ్లు'

'తీసుకోండి. చల్లారి పోతుంది. తరవాత రాసుకోవచ్చు. మీకు రాతలో పడితే ఒళ్లు తెలియదు'

సత్యమూర్తి మాట్లాడలేదు. అతనికా రోజు చాలా చిరాగ్గా ఉంది. కారణం తెలియదు.

కాసేపుండి సిగరెట్టు వెలిగించాడు. రెండు రింగులు వదిలాడు. శారద రింగులకేసి చిత్రంగా చూసింది. ఎప్పుడూ అలాగే చూస్తుంది. ఆమెకి అవి చాలా వింతగా ఉంటాయి.

తన చూపులు బల్లమీదికి తిప్పుకుని 'ఏమిటి రాస్తున్నారు ?' అంది.

'ఒక కథకి థీమ్ తట్టింది. ఆ సంఘటనలు అల్లడం కోసం చూస్తున్నాను ?'

'అయితే మీరు కాఫీ తప్పకుండా తాగాలి. బ్రెయిన్ వేవ్స్ వస్తాయి' అందామె.

సత్యమూర్తి ఆమె కళ్లల్లోకి చూశాడు. చదువుకున్నదీ, అనుకూలవతీ అయిన భార్య, అందమైనది కూడా. తనని ప్రాణంలా చూసుకుంటుంది. కానీ. . . . తనల్లా చూడలేడు ఆమెని. తను హృదయం ఇవ్వలేడు. ఇవ్వడానికి తన దగ్గర లేదది. తన దగ్గరున్నది రాధ హృదయం. తన హృదయం రాధ దగ్గరుంది.

రాధ గుర్తుకువస్తే మనస్సు ఉరకలు వేస్తోంది. శరీరం ఒక చోట నిలవటం లేదు. లేచి డాన్స్ చెయ్యాలనిపిస్తోంది. రాధతో కలిసి ఆకాశంలోకి ఎగిరి పోవాలనిపిస్తోంది.

కాఫీ కప్పు అందుకున్నాడు. అందులో రాధ కనిపించింది. ఆత్రంగా నోట్లో పోసుకోబోయాడు కాఫీని.

'ఏమిటా తొందర— నోరు కాలుతుంది' అంది శారద. సత్యమూర్తి ఒక్కసారిగా చప్పబడి పోయాడు. మధుర స్వప్నం ఒక్కసారిగా కరిగి పోయినట్లనిపించింది.

'నెమ్మదిగానే తాగుతాలే. నువ్వెళ్లు.' అన్నాడు విసుగ్గా.

'కప్పు కడగాలి.'

అతను తొందరగా తాగి కప్పు ఇచ్చేశాడు. ఆమె వెళ్ళి పోయింది.

అతను వెంటనే పర్సు తీసి, లోపల నుంచి ఒక ఫోటో తీశాడు. అందులో ఒక పద్దెనిమిదేళ్ల అమ్మాయి బొమ్మ ఉంది అపురూప సౌందర్యవతి ఆమె. చక్రాల్లాంటి కళ్లు, చందమామ లాంటి ముఖం, తీర్చి దిద్దినట్లున్న కనుబొమలు, ముద్దొచ్చే చిన్ని నోరు, మెరుపు తీగలాంటి శరీరం.

రాధ ఇప్పుడు ఏం చేస్తోందో అనుకున్నాడు.

సమాధానం వెంటనే తోచింది. తను ఆమె ఫోటోని చూస్తున్నట్లే బహుశా ఆమె కూడా తన ఫోటోని తదేక దీక్షగా చూస్తూ ఉంటుంది. భర్త వస్తే చటుక్కున దాచేస్తుంది. ఏమిటని అడుగుతాడు— ఏం లేదని ఏదో సర్ది చెబుతుంది. ఆడవాళ్లు అబద్ధమాడితే గోడకట్టినట్లు ఉంటుంది.

తనకలా అబద్ధం చెప్పవలసిన అవసరంలేదు. భార్య చూసినా తను భయపడడు. అంతగా అడిగితే 'నాతో కాలేజీలో చదువుకుంది. నా కథ లంటే ఇష్టం ఆ అమ్మాయికి' అని చెబుతాడు. ఇంక అడగదు. అర్థం చేసుకుంటుంది. అయినా పెళ్లయేదాకా మగాడు ఏ ఆడదానితోటీ మాట్లాడకుండా మడిగట్టుకొని కూర్చుంటాడని అనుకుంటుందా ?

అయినా తను అంతవరకూ రానివ్వడు. అసలు ఫోటో ఆమె కంట ఎందుకు పడాలి ?

మళ్లీ ఆ ఫోటోకేసి చూశాడు. ఆ కళ్లు చిత్రంగా ఉంటాయి— పలకరిస్తున్నట్లుగా, నవ్వుతున్నట్లుగా.

'ది గర్ల్ విత్ స్పేరింగ్ లుక్స్' అనే వారు ఆ అమ్మాయిని తన కాలేజీలో.

తన కథ పడినప్పుడు తనకి కంగ్రాచ్యులేషన్స్ చెప్పింది చాలా బావుందనీ, ఇంకా చాలా రాయమనీ అంది.

ఆ రోజు డైరీలో నోట్ చేసుకున్నాడు.

పాత డైరీకేసి ఆ పేజీ తిప్పాడు.

'ఇవాళ రాధతో మొదటిసారిగా మాట్లాడాను. నా కథ పడినందుకు కంగ్రాచ్యులేషన్స్ చెప్పింది. కథ తనకి చాలా నచ్చినట్లు చెప్పింది. క్లాసులో రెండుసార్లు నాకేసి చూసి నవ్వింది. ఎందుకో చాలా సరదాగా ఉంది. చల్లటి గాలి వీస్తున్నట్లు అనిపిస్తోంది. ఇలాంటి అనుభవం ఇంతకు ముందు లేదు !'

అలాగే పేజీలు తిప్పుతూ చదువుతున్నాడు.

'ఇవాళ రాధతో కలిసి బీచికి వెళ్లాను. సముద్ర తీరాన రాధతో సరదాగా గడిచింది. సినిమాకి వెడదామని ప్రపోజ్ చేశాను. తరువాత ఎప్పుడైనా వస్తానంది.

రూముకి వచ్చాక సుబ్బారావు షేక్ హాండు ఇచ్చాడు. దేనికని అడిగితే 'ఆ అమ్మాయి'తో బీచికి వెళ్లినందుకుట. వాడికదే గొప్పగా ఉంది. ఆ అమ్మాయితో సింహాచలం వెళ్లినట్లు వాడికి తెలీదు.'

'కథ రాద్దామనుకుంటుంటే మూడ్ కుదరటం లేదు. రాధ మీదికి మనసు పోతోంది. 'హాయి రాధమీదే కథ రాస్తే' అని ఆలోచన వచ్చింది. వెంటనే ఆ వూహని దూరం చేశాను. రాధ నాదిగానే ఉండి పోవాలి. నలుగురికీ తెలియ కూడదు. ఆమె అందం నా ఒక్కడిదే కావాలి ?

'నాలో ఏం చూసి నన్ను ఇంత....' అని ఆగి పోయాను.

'ఇంత .... ?' అని ప్రశ్నించింది. ఏమనాలో నాకు తోచలేదు. ఏం చూసి ఇంత ప్రేమిస్తున్నావు ? అనాలని నా ఉద్దేశం. నన్ను నిజంగా ప్రేమిస్తోందా ? ప్రేమించక పోతే నాతో ఎందుకంత చనువుగా ఉంటుంది ? నేనంటే నీ కెందుకింత ఇష్టం ? అని అడిగాను. అర్థం కానట్లు చూసింది. ఆడవాళ్లు ఒక పట్టాన తేలరు.' నాలో ఏముందని నన్నింత లైక్ చేస్తున్నావని అడిగాను. 'మిమ్మల్ని చూసి' అంది. చాలా మాటకారి.''

'వాళ్ల నాన్నగారు పెద్ద ఆఫీసరని మొదటిసారిగా తెలిసింది. అందంతో పాటు డబ్బు కూడా ఉందన్న మాట. చదువుకూడా ఉంటే చాలా బాగుండును. ఇప్పటిదాకా ఏమీ చదువుతున్నట్లు రాలేదు. మొన్నటి పరీక్షల్లో మార్కులు బాగా రాలేదు. అసలు చదివినా అర్థం కాదుట. ఈ ఏటితో మానేస్తుందట.'

" 'నిన్ను చూడందే ఒక్క క్షణం ఉండలేను' అన్నాను 'నేనూ అంతే అంది' నవ్వుతూ"

"ఇవాళ తన ఫోటో నాకిచ్చింది. నా ఫోటో ఒకటి ఇమ్మంది. మూడు రకాల ఫోటోలు తీయించుకుని బాగా వచ్చినది ఇచ్చాను. ఆమె ఫోటో డైరీలోనే పెట్టాను. రాధ నా డైరీలోనూ, నా హృదయంలోనూ, నా ఇంట్లోనూ శాశ్వతంగా ఉండాలి.''

అలా డైరీ తిరగేస్తూ ఒక చోట ఆగి పోయాడు. ఆ పేజీ తనకి గుర్తు. ఆ పేజీకి ముందు 15 పేజీలు కాళీగా ఉంటాయి. ఆ పేజీ తిప్పిన తర్వాత మరో పేజీ వస్తుంది. దాంట్లో......

సత్యమూర్తి డైరీ టేబులు మీద పడేశాడు. వంట్లో నీరసం వచ్చేసింది. కొద్దిగా తలకాయ నొప్పి వచ్చింది. తల చేతో పట్టుకున్నాడు.

కిటికీలోంచి వచ్చిన గాలికి డైరీలో పేజీ తిరిగింది. అది డిసెంబరు 30వ తేదీ పేజీ.

'ఈ రోజు రాధ పెళ్లి' అని ఉంది అందులో.

డైరీ మూసేసి లోపల పెట్టేసి బయటికి వెళ్లి పోయాడు సత్యమూర్తి.

*   *   *

ఎక్కడికి వెళ్లాలనే ప్రశ్న ఇంటి దగ్గర రాదు. హోటలు దగ్గర వస్తుంది.

సత్యమూర్తికి హోటలు దగ్గర కూడా రాలేదు. హోటల్లో రవి కనిపించాడు. రవి అతనితో హైస్కూల్లో చదివాడు. కాలేజీ చదువు విజయనగరం కాలేజీలో చదివాడు. ఇంకా ఉద్యోగం లేదు. ప్రస్తుతం ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెడుతున్నాడు. రెండింటికి బస్సులో వచ్చాడు. సాయంత్రం అయిదున్నరకి బండి.

స్నేహితులిద్దరూ చాలా సేపు కబుర్లు చెప్పుకుంటూ వూరంతా తిరిగేశారు. వసంతమహల్లో టిఫిన్ తీసుకుని కాసేపు డైమండ్ పార్కులో కూర్చుని రైలుకి బయలు దేరాడు. రైలు పోబోతుండగా చెప్పాడు రవి.

'అన్నట్టు ఆ అమ్మాయి.... స్పేరింగ్ లుక్స్.... ఎక్కడుందో తెలుసా ?'

'తెలీదు. నీకు తెలుసా ?'

'నాకు విశాఖపట్టణంలో కనపడింది'

'నీతో మాట్లాడిందా ? నా గురించేమైనా అడిగిందా ? ఎడ్రసేమిటి ?' అడిగాడు సత్యమూర్తి ఆతృతగా.

రైలు కూత వేసింది.

'ఇదిగో సరిగ్గా ఇలాగే కలుసుకున్నాం. సరిగ్గా రైలు బయలు దేరడానికి రెండు నిమిషాలుండవగా ఆమెని గుర్తు పట్టాను స్టేషన్లో. పక్కన భర్త ఉన్నాడు. ముందు పలకరిద్దామా వద్దా అని సందేహించాను. గార్డు పచ్చజెండా వూపేసరికి ధైర్యం వచ్చి పలకరించాను. ఏమి మాట్లాడటానికి వీలులేక పోయింది. భర్తని ఇంట్రడ్యూస్ చేస్తోంటే రైలు కదిలింది. ఆదరా బాదరాగా ఎడ్రసు రాసిచ్చింది. నా నోట్‌బుక్‌లో. ఇదిగో' అని కాగితం చించి ఇచ్చాడు రవి.

రైలు కదిలి వెళ్ళిపోతుంది. దూరం నించి

చెయ్యి వూపాడు రవి. మూర్తి కూడా చెయ్యి వూపాడు.

*   *   *

రోజులు బరువుగా గడుస్తున్నాయి. సత్యమూర్తికి రాధ ఎక్కడుందో తెలిసింది. కాని వెళ్ళలేక పోతున్నాడు. రెండు వందల మైళ్ళ దూరం. వెళ్ళి రావాలంటే కనీసం మూడు రోజులు సెలవు కావాలి. తనకి సెలవు దొరకదు. అయినా ఏం పని మీద వెడతాడు ? వివాహితురాలైన స్నేహితురాల్ని చూడటానికి రెండు వందలమైళ్ళ దూరం వెడతాడా ?

శారదకి భర్త ప్రవర్తన అంతు పట్టటం లేదు. తనకేసి చూస్తుంటే అతని మనస్సు ఎటో పోతున్నట్లు ఆమె గ్రహించింది. కారణం తెలియదు. ఈ మధ్య ఆయన అదోరకంగా ఉంటున్నారు. చేద్దామనుకున్న పనిని చేయులేక పోతున్నట్లూ పొందవలసిన దాన్ని పొందలేక పోతున్నట్లూ, ఉంటుంది ఆయన ముఖం చూస్తే. తనని గురించి ఆసక్తి చూపించడు— తన పట్ల సుముఖత లేక పోయినా 'ఇంటరెస్టు' లేదు. అప్పుడప్పుడు చిరాకు పడుతుంటాడు.

ఆయన్ని ఇంకెవరైనా ఆకర్షించారా? అన్న అనుమానం ఆమెకు కలగక పోలేదు. అతని డైరీ చూద్దామని ఆమెకి అప్పుడప్పుడు అనిపించేది కూడా. కాని సభ్యత అడ్డు వస్తోంది. కాని ఆయన మనస్సులోని చింత తెలుసుకోవాలంటే చూడక తప్పదు. కేవలం తమ సంసార సౌఖ్యం కోసం అతన్ని సుఖ పెట్టడం కోసం చూడక తప్పదు.

అతన్ని సుఖ పెట్టడమే ఆమె ధ్యేయం.

ఏదో అనుమానం వచ్చినట్లు ఆమె అద్దంలో చూసుకుంది.

అద్దంలో కనిపించిన బొమ్మ అందమైనది నిండైన విగ్రహం. మగవాళ్ళని వెర్రెత్తించే అందంకాదు ఆ బొమ్మది. ఆమెను చూస్తే గౌరవం, ప్రేమ, వాత్సల్యం కలుగుతాయి. అమాయకత, వివేకం, నైర్మల్యం, ప్రశాంతత ఆమె ముఖంలో కనిపిస్తాయి.

తనంటే భర్తకి ఇష్టంలేక పోవడానికి కారణం ఆమెకి కనిపించలేదు. భర్త చికాకుకి కారణం తనంటే విముఖత అయివుండదు. మరేదో ఉండి ఉండాలి. డైరీ చూడాలి.

శారద డ్రాయింగు రూములోని టేబులు దగ్గరకి వెళ్ళింది. డైరీ లాంటి దేదో టేబులు లోపల ఉంది. దాన్ని చేతుల్లోకి తీసుకుంది.

'పోస్టు' అని వినిపించింది. గబుక్కున అది టేబులు లోపల పడేసి బయటికి పరిగెత్తింది.

పోస్టుమేన్ కోసం చిన్నా, పెద్దా, ఆడా, మగా అంతా నిరీక్షిస్తారు. అతనిరాక ఎందుకో ఆనందంగా ఉంటుంది.

పోస్టుమేన్ పక్కింట్లో ఉత్తరం ఇస్తున్నాడు.

'మాకేమన్నా ఉన్నాయా' అని అడిగింది. 'ఏమీ లేవమ్మా' అనేసి ముందుకు వెళ్ళి మళ్ళీ వెనక్కి తిరిగి 'మీరు సత్యమూర్తిగారు కదూ. ఉన్నాయి. బుక్‌పోస్టు, ఉత్తరం' అన్నాడు. 'నేను సత్యమూర్తి గారిని కాను' అంది నవ్వుతూ చెయ్యి జాపి. ఆ కవర్లు ఇస్తూ పోస్టుమాన్ కూడా నవ్వాడు.

ఉత్తరం బావగారు రాసినది.

ది గర్ల్ విత్ స్ప్రింగ్

బుక్ పోస్టులో వచ్చింది శుభ లేఖ.

*   *   *

'ఇవాళ మీకు వంట్లో బాగా లేనట్టుంది. నీరసంగా ఉన్నారు. కొన్ని హార్లిక్స్ తీసుకోండి' అంది శారద.

'కాదు. కాఫీ ఇయ్యి' అన్నాడు సత్యమూర్తి.

'హార్లిక్స్ తాగండి. నీరసం తగ్గుతుంది.'

'నాకు నీరసం లేదు. కాఫీ ఇస్తావా ? ఇవ్వవా ?' అతని బెదిరింపులని ఆమె లెక్కపెట్టలేదు.

'మీకు కాఫీ కావాలా ? హార్లిక్సా, మీకొచ్చిన ఉత్తరం కావాలా ?'

గబుక్కున మంచం మీద లేచి కూర్చున్నాడు.

'ఏదీ ఉత్తరం ?'

'హార్లిక్స్ తీసుకోండి.'

తెగించి హార్లిక్స్ తాగేశాడు సత్యమూర్తి.

'ఇప్పుడియ్యి' అన్నాడు

'ఏమిటి ఇచ్చేది ?'

'ఉత్తరం వచ్చిందని చెప్పలేదూ నువ్వు ?'

'అలా చెప్పకపోతే మీరు హార్లిక్స్ తాగే వారా?' అందామె.

రాము : ఏరా! మూర్తీ ! ఆ హోటల్‌లో భోజనం బాగుండదంటూ అక్కడే భోంచేస్తున్నావేం !

మూర్తి: భోజనం బాగుండక పోయినా అప్పు పెడ్తాడు గదా ! మరో చోటైతే ఈ సౌకర్యం ఉండదు బ్రదర్ !

ఎం. మాధవ్‌రావు (తెనాలి)

నీరసంగా మంచం మీద వాలాడు అతను.

'పోనీ సిగరెట్టు, అగ్గిపెట్టె తీసుకురా' అన్నాడు.

'బల్లమీదే ఉన్నాయి. తీసుకోండి !'

వాటికోసం వెతుకుతుంటే రెండు కాయితాలు కూడా చేతికి తగిలాయి. తీసిచూస్తే ఉత్తరాలు. అతని ముఖం వికసించింది 'మరి రాలేదని చెప్పావేం ?' అన్నాడు.

శారద నవ్వింది.

తర్వాత ఆశ్చర్యపడటం ఆమె వంతైంది. తమ్ముడికి ఉద్యోగం అయినట్లుగా బావగారు రాసిన ఉత్తరం మామూలుగా చదివాడు అతను. ఎవరో దూరపు బంధువుల పెళ్ళి శుభలేఖ ఆశక్తితో చూశాడు. పిల్ల తండ్రి ఆయన వేలువిడిచిన మేనమామకి ఏదో అవుతాడు. పెళ్ళి కూతురు అన్నకీ, ఆయనకీ కొద్దిగా పరిచయం.

శుభలేక చూశాక అతని ఉత్సాహానికి పట్టపగ్గాలు లేకుండా పోయింది. కారణం ఆమెకి బోధ పడలేదు. శుభలేఖ మళ్ళీ చదివింది. '..గారి కనిష్ట పుత్రికి. చి. సౌ. మహాలక్ష్మిని. . . .గారి ద్వితీయ పుత్రుడు బి. భాస్కరరావునకు ఇచ్చి మా స్వగృహమైన విశాఖపట్నం డాబా గార్డెన్స్‌లోని నెం. . . ఇంటిలో వివాహము జరిపించుటకు పెద్దలు నిశ్చయించిరి గావున. . . .' ఇలాగే ఉంది శుభలేఖ. ప్రత్యేకత ఏమీలేదు.

*   *   *

కలకత్తా మెయిల్ ఎక్కాడు సత్యమూర్తి రైలు వేగంగా పరిగెడుతోంది. అంతకంటె వేగంగా పరిగెడుతోంది అతని మనస్సు. డాబా గార్డెన్స్‌లో ఒక ఇంట్లో ఒక ఫోటోకేసి దీక్షగా చూసి నిట్టూరుస్తున్న ఒక అమ్మాయి అతని దృష్టిలో మెదులుతోంది. ఆ అమ్మాయి ఆ ఫోటోని ముద్దు పెట్టుకుంటోంది. అతనితో పాటు ఏదో లోకంలో విహరిస్తున్నట్లు కలలు కంటోంది. మనస్సు పాటలు పాడుతోంది. చక్కని కాటుక కళ్ళు, ఒంటి ఒంపులు ఆమెవి.

సిగరెట్లూ, పత్రికలూ అమ్మేవాళ్ల కేకలు, జనం సందడీ వినిపించగానే 'తుని స్టేషన్ గాబోలు' అనుకున్నాడు. కాదు. అది తాడేపల్లి గూడెం. అతను నవ్వుకున్నాడు.

చటుక్కున అతనికి డిశంబరు 14వ తేదీ గుర్తుకి వచ్చింది. ఒక్కసారిగా నీరసపడి పోయాడు.

అతనికి ఎప్పుడూ అంతే. సంతోషం అనుభవించేటప్పుడు హఠాత్తుగా విచారకరమైన విషయాలు గుర్తుకు వస్తుంటాయి.

ఆ రోజు....

'నీ కెలా చెప్పాలో తెలియటం లేదు' అంది రాధ.

'మామూలుగా నోటితో భాష ద్వారా చెప్పు'

'హాస్యం కాదు. సీరియస్‌గానే చెబుతున్నాను'

'చెప్పు.'

'మనం విడి పోబోతున్నాం' అంది.

మొదట్లో తనకి అర్థం కాలేదు.

'ఏమిటి' అన్నాడు.

'మా నాన్న నాకు సంబంధం చూశారు' అంది. ఆమె ముఖంలో ఏ భావం లేదు. ప్రశాంతంగా ఉంది. విచార పడటంలేదు. సంతోష పడటంలేదు.

'నా కిష్టం లేదని చెప్పు' అన్నాడు తను.

ఆమె ఆశ్చర్యంగా చూసింది. 'ఎందుకు ?' అంది.

'మనిద్దరం పెళ్ళి చేసుకుందాం'

ఆమె తల విదిలించింది 'ఆ మాట ముందు మనం అనుకోలేదుగా'

'ఇప్పుడనుకుందాం'

'లాభం లేదు. మా నాన్న ఒప్పుకోరు'

'నేను అడగనా ?'


'శ్రమ పడకు. మా నాన్న సంగతి నీకు తెలీదు. ఒకటి నిశ్చయించాక ఇక దానికి తిరుగు ఉండదు.'

ఆ రోజు సంభాషణ అంతటితో ఆగి పోయింది.

'రాధ ఉద్దేశం అర్థం కావటం లేదు' అని మాత్రం రాసుకున్నాడు డైరీలో ఆ రోజు. తర్వాత మళ్ళీ రాయలేదు. మళ్ళీ డిశంబరు 30వ ఒక ముక్క రాశాడు.

తర్వాత రాధ గురించి కొన్నాళ్ళు ఆలోచించలేదు. కాలక్రమాన సర్ది చెప్పుకున్నాడు. వివాహం నిశ్చయించినప్పుడు రాధకి తండ్రికి ఎదురు చెప్పే ధైర్యం ఉండి ఉండదు. ఆడవాళ్లెప్పుడూ అంతే— తమ చేతిలో ఉన్న విషయాలనూ విధికి వదలివేస్తారు. తన మనసువిప్పి చెప్పి ఉంటే

39 వ పేజీ చూడండి



మీరూ అంగీకరిస్తారు



టాటా-ఫిన్లే

టీ

సాటిలేని టీ!

తాజా టీ

తాజాగా వుంచుటకు టాటా-ఫిన్లే టీని ప్రత్యేకమైన ప్యాకింగ్‌లో సురక్షితముగా భద్రపరచుతారు.


పరిమళమైన టీ

అతి సున్నితమైన పరిమళమిచ్చుటకు కావలసిన కోమలమైన ఆకులను మొగ్గలనే టాటా-ఫిన్లే టీలో ఉపయోగిస్తారు.

ఉత్తమ టీ

టాటా-ఫిన్లే టీ మిశ్రణ (బ్లెండింగ్) అతి నిపుణతతో చేస్తారు. కనుకనే ఈ టీ చిక్కగా రుచికరంగా వుంటుంది.

టాటా-ఫిన్లే టీ త్రాగండి;
ఆనందము అందుకోండి!



ఈ క్రింది రకాలలోను, ప్యాకింగ్స్‌లోను టాటా-ఫిన్లే టీ దొరుకుతుంది:-
ప్రెస్టిజ్ డార్జిలింగ్—సుందరమైన టిన్
లలిత్—బంగారు రంగు ప్యాకెట్
మిలాప్—వెండి రంగు ప్యాకెట్
షాన్—నీలి రంగు ప్యాకెట్



BI-TFN-S-TEL

15-5-1964 శుక్రవారము మొదలు 21-5-1964 గురువారము వరకు

మేషం :

(అశ్వని, భరణి, కృత్తిక 1 పా.)

ఈవారం గతవారం కంటే బాగా ఉన్నా రాబోయే సహాయాన్నిగాని, డబ్బునుగాని నమ్మి భారీ ప్రయత్నాలు చేయడం మంచిదికాదు. వృత్తివ్యాపారాల్లో ప్రయోజనంలేని శ్రమపొందవలసి వస్తుంది. నష్టం రాకపోవడమే మేలుగా పరిగణించవలసిన పరిస్థితి యేర్పడవచ్చును. ఉద్యోగంలో మార్పులు ఉండవు. స్థిరాస్థి వ్యవహారాల్లో కొంచెం అనుకూలత ఉంటుంది. డబ్బుకు సంబంధించిన వాగ్దానాలు చేయడం మంచిదికాదు. వృత్తిరీత్యా పెద్దవారితో పరిచయం కల్గుతుంది. గత కొద్ది వారాలుగా ఉన్న మానసికాందోళన తగ్గుతుంది. రాజకీయాల్లో కొత్త ఉద్యమాలను గురించి ఆలోచిస్తారు. పుణ్యకార్యాలు నెరవేరుతాయి.

స్త్రీలకు — ఆరోగ్యం బాగా ఉంటుంది. కుటుంబ కార్యక్రమాలు పెరగడంవలన తీరిక లభించదు. బంధుసమావేశాల్లో పాల్గొంటారు.

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగ 1, 2పా.)

మీకు సహాయం చేసేవారికి కొన్ని చిక్కులు కలగడంవలన మీకుకూడా తాత్కాలికంగా కొంత ఇబ్బంది కలుగుతుంది. వృత్తివ్యాపారాల్లో పెద్ద మార్పులు ఉండవు కాని ముఖ్యందు ప్రయోజనం గల విషయాలను గురించి ఒక నిర్ణయానికి వస్తారు. భాగస్వాములతో కలిసిచేసే వ్యాపారాలు ప్రారంభించడానికి యింకా కొంతకాలంపాటు ఆగడం మంచిది. ఉద్యోగంలో అధికారుల ఆదరణ లభిస్తుంది. మీరు వూహించని ఖర్చులు చేయవలసి రావడం వలన ఆర్థికంగా ఒత్తిడి రావచ్చును. మీ సొంతవే కాకుండా మిత్రుల వ్యవహారాల్ని కూడా చక్కబెట్టవలసివస్తుంది. విద్యా వైజ్ఞానికరంగాల్లో మీ బుద్ధి చురుకుగా పనిచేస్తుంది. బంధువులవలన అనవసరంగా నిష్ఠూరం రావచ్చును.

స్త్రీలకు — ఆరోగ్యం బాగా ఉన్నా బలహీనత ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు అనుకున్నట్లుగా జరుగుతాయి. విలాస వస్తువులను కొంటారు.

మిథునం :

(మృగశిర 3, 4 పా, ఆరుద్ర పునర్వసు 1, 2, 3 పా.)

ఈవారం మీకు అన్నివిధాలా అనుకూలంగా ఉంటుంది. వృత్తివ్యాపారాల్లో వూహించని అనుకూలత లభిస్తుంది. వ్యాపార విస్తరణకై చేసే ప్రయత్నాలు భాగస్వాములతో కలిసిచేసే వ్యాపారాలు లాభిస్తాయి. ఇంతకుముందు రాదనుకొన్న డబ్బుకూడా చేతికి వస్తుంది. ఉద్యోగంలో మీరు అనవసరమైన వ్యయంకూడా చేయవలసి వస్తుంది. ఉద్యోగంలో మీరు యిప్పుడు చేసే నిర్ణయాలవల్ల ముందుముందు బాగా ప్రయోజనం ఉంటుంది. వృత్తిలో యింతవరకు వ్యతిరేకంగా ఉన్నవారుకూడా మిమ్మల్ని గౌరవిస్తారు. మిమ్మల్ని పొగడుతూ తిరిగే వారు కొంతమంది తమ స్వలాభంకోసం మీకు వ్యతిరేకంగా మారవచ్చును. కాని దానివల్ల నష్టంకలగక పోవచ్చును. ఆత్మస్థైర్యం పెరగడానికి అవకాశాలున్నాయి.

మీ	మే	వృ	మి
	కు బు గు	ర	చం శు రా
శ	వారఫలం		
కే			

మహేష్

స్త్రీలకు — ఆరోగ్యం బాగా ఉంటుంది. వార ప్రారంభంలో కుటుంబ వ్యవహారాల్లో చిన్న చిన్న మార్పులు రావచ్చును. సాంఘిక వ్యవహారాల్లో పలుకుబడి లభిస్తుంది.

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష.)

ప్రపంచ దృష్టిలో యిది మీకు యోగవంతమైన సమయమే కాని, మీకు అంతగా మేలు కన్పించకపోవచ్చును. వృత్తివ్యాపారాల్లో ఆదాయమూ, వ్యయమూ రెండుకూడా పెరుగుతాయి. మీకు సంబంధించని వ్యవహారాల్లో చిక్కుకొనిపోవడం వలన మీ స్వంత వ్యవహారాల్లో తగినంత శ్రద్ధ చూపలేని పరిస్థితి యేర్పడుతుంది. వ్యాపారంలో యెవరినీ విశేషంగా నమ్మడానికి వీలులేదు. ఇదివరకు మీరు తల పెట్టిన కార్యక్రమాల్లో కొన్ని మార్పులు రావచ్చును. వృత్తిలో బాధ్యత పెరుగుతుంది. కాని దానివల్ల మీకు అంత ప్రయోజనం ఉండదు. రాజకీయాల్లో హోదా పెరుగుతుంది. మీ అభిప్రాయాలను అందరూ గౌరవిస్తారు. వారాంతంలో ప్రయాణాలోచనలు రావచ్చును.

స్త్రీలకు — వార ప్రారంభంలో కొంచెం అనారోగ్యం చేయవచ్చును. ఎంత మంచిగా ప్రవర్తించినా బంధువులవల్ల నిష్ఠూరం వస్తుంది. అనవసరంగా మానసికాందోళన పొందుతారు.

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

అన్ని వ్యవహారాల్లోను అనుకూలత ఉంటుంది. వృత్తివ్యాపారాల్లో అన్ని కార్యక్రమాలు సంతృప్తికరంగా ఉంటాయి. వ్యాపారాల్లో ప్రయోజనం గల పనులను సాధిస్తారు. వృత్తిలో పూర్తిగా అనుకూల వాతావరణం యేర్పడుతుంది. ఉద్యోగస్థులు ముఖ్యమైన నిర్ణయాలను యీ వారమే చేయడం మంచిది. లోగడ చేసిన డబ్బుకు సంబంధించిన వాగ్దానాలను యిప్పుడు అమలు జరుపవలసిరావడంవలన కొంత ఒత్తిడి రావచ్చును. కోర్టు వ్యవహారాల్లో ప్రతిపక్షం బలహీనపడడం వలన మీపరిస్థితి మెరుగు అవుతుంది. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. మీ వాకచక్యం వలన శుభకార్యాల విషయంలో స్వల్పాభివృద్ధిని సాధిస్తారు.

స్త్రీలకు — సంతానానికి స్వల్ప అనారోగ్యం

ఈ వారము ధరలు

ధాన్యం ధరలో పెద్దమార్పులు ఉండవు. అపరాల ధరలు కొంచెం పెరగవచ్చును. బెల్లం ధరకూడా కొంచెం పెరుగుటకు అవకాశం ఉన్నది. నూనె, నువ్వుల ధరలు కొంచెం తగ్గవచ్చును. మిర్చి ధర నిలకడగా ఉంటుంది. అలంకార వస్తువుల ధరలు తగ్గవచ్చును.

చేయవచ్చును. సాంఘిక కార్యక్రమాలు నిరాటంకముగా నెరవేరతాయి. పుణ్యకార్యక్రమాల్లో పాల్గొంటారు.

కన్య :

(ఉత్తర 2, 3 4 పా, హస్త చిత్త 1, 2 పా.)

గత కొద్ది వారాలుగా అన్ని వ్యవహారాల్లోను యేర్పడిన చిక్కులు క్రమంగా తగ్గుముఖం పడతాయి కాని నిర్లక్ష్యం చేయడానికి వీలులేదు. వ్యాపారంలో నూతన వ్యవహారాలు ప్రారంభించడానికి ఇది సమయంకాదు. వృత్తిలో యింతవరకు అనుకూలంగా ఉన్న వ్యవహారాలుకూడా మరల వ్యతిరేకంకాగల సూచనలు ఉన్నాయి కాని మీ జాగ్రత్తవల్ల, మిత్రుల సహకారంవల్ల అటువంటి పరిస్థితి యేర్పడదు. వ్యాపారంలో మీరు ఎక్కువగా జోక్యంజేసుకొనడంకంటే భాగస్థుల నిర్ణయాలను అమలుపరచడం మంచిది. ఉద్యోగంలో శ్రమ పెరుగుతుంది. గాని, ప్రయోజనం ఉండదు. వారం మధ్యలో తక్కువస్థాయి వారితో కలహ ప్రసంగం రావచ్చును.

స్త్రీలకు — ఆరోగ్యం బాగా ఉండకపోవచ్చును. కుటుంబ వ్యవహారాల్లో అనవసర వ్యయంచేయవలసి వస్తుంది. సాంఘికకార్యక్రమాలు వాయిదా వేయడం మంచిది.

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ, 1, 2, 3 పాదాలు)

జరిగిపోయిన వారంకంటే యీవారం కొంచెం బాగా ఉంటుంది. వృత్తివ్యాపారాల్లో మీరు ప్రయత్నంచేసిన పనులన్ని నెరవేరుతున్నా వాటి నిమిత్తం మీరు విశేషంగా శ్రమపొందవలసి వస్తుంది. భారీవ్యవహారాల్లో పట్టుదల చూపవలసిన సమయం. భాగస్వాములతో స్వల్ప భేదాభిప్రాయాలు వచ్చినా అన్ని కార్యక్రమాలు నెరవేరతాయి. ఆర్థికంగా యింతవరకు ఉన్న ఒత్తిడికూడా తగ్గుతుంది. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాల్లో ఉన్న చిక్కులు వారం మధ్యనుంచి తగ్గుతాయి. కొంతమంది వ్యక్తులు నమ్మించి మోసంచేయడానికి ప్రయత్నిస్తారు. ప్రేమ వ్యవహారాల్లో కొంత అభివృద్ధి ఉంటుంది. 18, 19 తేదీల్లో గౌరవం ధనలాభం.

స్త్రీలకు — ఆరోగ్యం బాగానేఉంటుంది. నూతన విషయాలను తెల్సుకుంటారు. వివాహ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

వృశ్చికం :

(విశాఖ 4-వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

ఈ వారంలో మీరు చేసే ప్రయత్నాలకు వెంటనే ఫలితం కనిపించకపోయినా వాటివల్ల భవిష్యత్తులో చాలా మేలు కలుగుతుంది. వృత్తి వ్యాపారాల్లో

పెద్దగా ప్రోత్సాహం ఉండదు. సాహసముతో కూడిన వ్యాపారాల్లో నష్టం రావచ్చును. వృత్తిలో కొత్తవారితో పోటీ ఏర్పడుతుంది. ఉద్యోగస్థులు అపోహలకు గురి కావచ్చును. శ్రమకు తగిన ప్రతిఫలం లభించదు. బంధువుల వ్యవహారాల్లో ఏర్పడిన చికాకులను మీరు పరిష్కారం చేయవలసి వస్తుంది. అందరినీ సంతృప్తి పర్చుదామనే ప్రయత్నంవలన మీకు శ్రమ పెరుగుతుంది. దైవ కార్యాలు నిరాటంకంగా నెరవేరతాయి. వారాంతంలో సంతోష వార్తలు ప్రయాణాలోచనలు రావచ్చును. స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. కుటుంబంలో కార్యభారం పెరుగుతుంది. సాంఘిక కార్యక్రమాల్లో అభివృద్ధి ఉండదు.

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

ఈ వారం చిత్రంగా ఉంటుంది. మీరు ప్రయత్నం చేసిన పనులకు ఆటంకాలు రావడం వలన నిరాశ చెందిన తర్వాత గాని మీరు కార్యసిద్ధిని పొందలేరు. వృత్తి వ్యాపారాల్లో అకస్మాత్తుగా చికాకులు రావచ్చును. సాధ్యమైనంతవరకు అన్ని వ్యవహారాల్లోను తప్పించుకొని తిరగడం మంచిది. వృత్తిలో కొంతమంది మీకు వ్యతిరేకంగా వదంతులను ప్రచారం చేస్తారు. ఉద్యోగస్థులకు ఈ వారం అంత బాగా ఉండదు. స్వల్ప విషయాలకు కూడా పొరబాట్లు రావచ్చును. మీ వ్యవహారాలు ఎలాగ ఉన్నా ఆర్థికంగా నష్టం రావలసిన పరిస్థితి ఏర్పడదు. వారం మధ్యలో ఆందోళన కలిగించే వార్తలు రావచ్చును. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. స్నేహితులతో భేదాభిప్రాయాలు రావచ్చును.

స్త్రీలకు-ఆరోగ్యం బాగానే ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు మామూలుగా ఉంటాయి. సంతానానికి సౌఖ్యం, సంతోషం లభిస్తాయి.

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా,

ఈ వారం శుభాశుభ మిశ్రమంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో అనిశ్చిత పరిస్థితి ఏర్పడుతుంది. సులభంగా జరిగిపోవలసిన పనులకు కూడా ఆటంకాలు రావడం వలన మీరు పొందవలసిన ఫలితం కూడా పొందలేరు. వృత్తిలో పోటీదార్లందరూ ఏకంగా రావడంవలన మీరు కొంత కాలం ఒదిగి ఉండవలసి వస్తుంది. ఉద్యోగంలో ఎవరినీ నమ్మి వ్యవహరించడానికి వీలులేని సమయం. ముఖ్యమైన కాగితాలు కాని, వస్తువులు కాని పోయే ప్రమాదం ఉన్నది. ఏ వ్యవహారంలోను తొందరపాటు తగదు. బంధువుల కార్యక్రమాల్లో మీరు జోక్యం చేసుకొనడంవల్లన శ్రమపడినా నిష్ఫారం రావచ్చును. వార ప్రారంభంలో ప్రేమ వ్యవహారాల్లో కొన్ని సమస్యలు రావచ్చును.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉన్నా మానసికాందోళన తప్పదు. కుటుంబ వ్యవహారాల్లో మీకు అనుకూలంగా చిన్నచిన్న మార్పులు రావచ్చును.

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం,
పూ. భాద్ర 1,2,3 పా.)

ఈ వారం సామాన్యంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో విశేషమైన ప్రయోజనం లేకపోయినా గడచిన రెండు మూడు వారాల కంటే అనుకూలంగా ఉంటుంది. అధికారులవలన జరుగవలసిన పనులు నెరవేరి లాభం కలుగుతుంది. వ్యాపారంలో మున్ముందు ప్రయోజనం గల వ్యవహారాలను గురించి ఆలోచిస్తారు. వృత్తిలో పరిస్థితి మెరుగుపడుతుంది. కాని, కార్యభారం పెరుగుతుంది. ఉద్యోగంలో మీకు అనుకూలంగా చిన్న చిన్న మార్పులు రావచ్చును గాని మీకు వ్యతిరేకంగా ఒక ఉద్యమం వంటిది రాగల సూచనలు ఉన్నాయి. కోర్టు వ్యవహారాల్లో కొంచెం అనుకూలత కలుగవచ్చును. ప్రయాణం వలన కార్యసాధన జరగగల సూచనలు ఉన్నాయి.

స్త్రీలకు—వారాంతంలో అనారోగ్యం చేయవచ్చును. శుభకార్యాల విషయంలో అభివృద్ధి ఉంటుంది. అనవసర వ్యయం చేస్తారు.

మీనం :

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి.)
శ్రవణం, ధనిష్ఠ 1,2 పాదాలు.

ఈ వారం కూడా గత వారం వలెనే ఉంటుంది. ఏ వ్యవహారమూ సాహసించి చేయడానికి వీలుకాని సమయం. వృత్తి వ్యాపారాల్లో ఏర్పడిన చిక్కులు క్రమంగా తగ్గవచ్చును. మీ సన్నిహితులే వ్యాపారంలో మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నం చేస్తారు. అన్ని విధానాలా జాగ్రత్తగా ఉండవలసిన సమయం. ఉద్యోగంలో ముఖ్య కార్యక్రమాలను వాయిదా వేయడం మంచిది. వృత్తిలో పెద్దవారితో పరిచయం, గౌరవం లభిస్తాయి. కాని ఆర్థికంగా అంత ప్రయోజనం ఉండదు. మీ ఆలోచనలు మీ వ్యవహారాల్లో కంటె ఇతరుల విషయాల్లో బాగా పనిచేస్తాయి. రాజకీయాల్లో బాధ్యత పెరుగుతుంది. ఆర్థికంగా ఇబ్బంది ఉండదు.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధువులకు మీరు సహాయం చేయవలసి వస్తుంది. 17, 18 తేదీల్లో సంతోషం, ప్రయాణాలోచనలు.

జన్మదినఫలం

మే-15

అప్పుడప్పుడు కొన్ని చికాకులు కల్గినా, మొత్తం మీద ఈ సంవత్సరం యోగదాయకంగా ఉంటుంది. వృత్తివ్యాపారాల్లో అన్ని విధాలా మీకు మిత్రుల ఆలోచనా, సహకారం లభిస్తాయి. వ్యాపార విస్తరణకై చేసే ప్రయత్నాలు వెంటనే విశేషమైన ఫలితాన్ని ఇవ్వకపోయినా నిరుత్సాహాన్ని కల్గించవు. వృత్తిలో కొన్ని మార్పులురాగల సూచనలు ఉన్నాయి. ఉద్యోగం ఒడుదుడుకు లేకుండా జరిగిపోతుంది. అధికారులతో కొన్ని భేదాభిప్రాయాలు రాగలవు కాని, క్రమంగా మీ అభిప్రాయాలే సరియైనవని రుజువు అవుతాయి. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు బాగా ఉన్నా చెప్పుకోతగ్గ అభివృద్ధి ఉండదు. రాజకీయాల్లో కొద్ది ప్రతిఘటన తరువాత విజయం లభిస్తుంది. విద్యార్థులు సామాన్యంగా కృతార్థులు కాగలరు. కళాకారులకు, వస్త్రవ్యాపారులకు మంచి సమయం.

మే-16

గత కొద్ది సంవత్సరాల కంటే ఈ సంవత్సరం బాగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వ్యాపారంలో గత సంవత్సరం నుంచి ప్రయత్నం చేసిన వ్యవహారాలు ఈ సంవత్సరం పూర్తిగా నెరవేరి ఫలితం చేతికి వస్తుంది. వృత్తిలో నూతన మార్గాలు కనుగొంటారు. ఉద్యోగస్థులకు ఉన్నత స్థానములభించ గల సూచనలు ఉన్నాయి. కాని పోటీవారితో పోటీ రావడం వలన మానసికంగా కొంత అశాంతి కలుగుతుంది. స్థిరాస్థికి సంబంధించిన వ్యవహారాల్లో మీ ఆలోచనలకు తగిన అవకాశం లభిస్తుంది. ఆరోగ్యం బాగానే ఉంటుంది గాని వ్యవహారాల ఒత్తిడి వలన బడలిక కలగవచ్చును. కుటుంబ వ్యవహారాల్లో మీ మాటకు ఆటంకం ఉండదు. శుభకార్యాల విషయంలో అభివృద్ధి ఉంటుంది. ప్రేమ వ్యవహారాల్లో యెదురు చూడని అనుకూలత లభిస్తుంది. విద్యార్థులు మంచి మార్కులతో కృతార్థులు కాగలరు.

మే-17

ఈ సంవత్సరం వ్యవహారాలు అన్నింటిలోను నష్టం కలగదు గాని చెప్పుకోతగిన అభివృద్ధి కూడా ఉండదు. సంవత్సరంలో మొదటి సగం కంటే రెండవ సగం బాగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో స్వల్పమైన అభివృద్ధిని శ్రమమీద సాధిస్తారు. వ్యాపారంలో ఎన్నో అవకాశాలు ఇంద్రధనస్సువలె కన్పిస్తాయి గాని, వాటిని సాధించడానికి ప్రయత్నించడం వలన శ్రమయే కాని ఫలితం ఆట్టే ఉండదు. ఉద్యోగస్థులు అననుకూలమైన స్థానములకు మార్చబడగల సూచనలు ఉన్నాయి. యెంత మంచిగా ప్రవర్తించినా అది పై అధికారులకు విపరీతంగా కన్పిస్తుంది. ఆరోగ్యం తృప్తికరంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాల్లో కొన్ని ఒడుదుడుకులు రావచ్చును. గాని కార్యక్రమాలు ఆటంకం లేకుండా సాగిపోతాయి. పుణ్యకార్యాలు చేస్తారు. రాజకీయాలో ప్రతిపక్షాలు బలహీన పడడం వలన మీకు అనుకూలత ఉంటుంది. విద్యార్థులకు మార్చి పరీక్షలు బాగా ఉంటాయి.

మే-18

ఈ సంవత్సరం మీ జీవితంలో ముఖ్యమైన సంవత్సరాల్లో ఒకటిగా లెఖ్కలోనికి రావచ్చును. వృత్తి వ్యాపారాల్లో ప్రోత్సాహం లభిస్తుంది. భాగస్థులతో చేసే వ్యాపారాలు రాణిస్తాయి. అధికారుల వలన జరగవలసిన పనులు, సులభంగా జరుగుతాయి. ఉద్యోగస్థులకు అనుకూలంగా మార్పులు రావచ్చును. స్థిరాస్థి వ్యవహారాల్ని అనుకూలంగా పరిష్కారం అవుతాయి. ఆదాయం పెరుగుతుంది కాని మీరు భారీ ప్రయాణాలకు పూనుకొనడం వలన అప్పుడప్పుడు డబ్బుకు ఒత్తిడి వస్తుంది. ఆరోగ్యం బాగా ఉంటుంది. కుటుంబ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. శుభ కార్యాల విషయంలో బంధువులతోడ్పాటు లభిస్తుంది. సత్పురుషుల సహవాసం తన్మూలంగా భవిష్యత్తులో ప్రయోజనం కలుగుతాయి. కుటుంబంలో పెద్దలకు అనారోగ్యం వలన ఆందో

ఆన కలిగ వచ్చును. విద్యార్థులు మంచి మార్కు లతో కృతార్థులు కాగలరు.

మే-19


ఈ సంవత్సరం ప్రారంభంలో బాగా ఉన్నా ఆఖరులో కొన్ని చికాకులు కలుగవచ్చును. వృత్తి వ్యాపారాలు ప్రస్తుతం బాగా ఉన్నా చేసేవ్యవహారాల లోను తొందరపాటు తగదు. ఇంతవరకు మీకు సన్నిహితంగా ఉన్న వారు కూడా, మీ అభివృద్ధిని సహించలేక వ్యతిరేకంగా ప్రవర్తిస్తారు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వ్యాపారంలో భారీ ప్రయత్నాల విషయంలో కొంత కాలం ఆగడం మంచిది. కోర్టు వ్యవహారాల్లో ఉన్న ప్రతి కూలత తొలగగల అవకాశం లేదు. రక్త సంబంధ మైన అనారోగ్యం చేయగల సూచనలు ఉన్నాయి. కుటుంబ వ్యవహారాల్లో హడావుడి, అనవసర వ్యయం ఉన్నా అన్ని వ్యవహారాలూ సక్రమంగా జరుగుతాయి. సంతానానికి కూడా కొంచెం అనా రోగ్యం చేయ వచ్చును. సాంఘిక వ్యవహారాల్లో ప్రయాస మీ వంతు, ప్రయోజనం మరొకరి వంతు అయ్యే పరిస్థితి యేర్పడ వచ్చును. విద్యా ర్థులు సాధారణంగా కృతార్థులు కాగలరు.

మే-20

ఈ సంవత్సరం మీరు ప్రయత్నం చేసిన పనులన్నీ నెరవేరుతున్నా మీరు మాత్రం చాలా శ్రమా, ఆందోళనా పొందవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాల్లో గల అవకాశాలు ప్రారంభంలో సులభంగా కన్పించినా ప్రయత్నించిన కొద్దీ కష్టం అవుతాయి. కాని చివరకు మీరు సాధిస్తారు. వ్యాపారస్థులకు ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. భాగస్థులతో స్వల్ప భేధాభిప్రాయాలు రావచ్చును. ఉద్యోగస్థులకు స్థాన చలనమునకు అవకాశం ఉన్నది కాని మారబోయే స్థలం ఇప్పటి దాని కంటే అనుకూలంగా ఉంటుంది. వృత్తిలో అనుకూల వాతావరణం యేర్పడుతుంది. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. కుటుంబంలో శుభ కార్యాలకు కొన్ని ఆటంకాలు రావచ్చును. బాగా దగ్గర బంధువులు నిష్కారణంగా వ్యతిరేకించినా మిగిలినవారు మీ తరఫున నిలబడతారు. రాజ కీయాల్లో ప్రోత్సాహం లభిస్తుంది. విద్యార్థులు శ్రమమీద కృతార్థులు కాగలరు.

మే-21

ఈ సంవత్సరం మొత్తం మీద బాగా ఉన్నా ప్రారంభంలో కొన్ని వూహించని చికాకులను యెదుర్కోవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాల్లో క్రమంగా అభివృద్ధిని సాధిస్తారు. సంవత్సర ప్రారంభంలో వ్యాపారంలో యేర్పడిన చికాకుల వల్ల ధన నష్టం కలుగవచ్చును. సాహసముతో కూడిన వ్యాపారాలు మంచివి కావు. తక్కువ స్థాయి వారివల్ల లాభం కలుగవచ్చును. వృత్తి రీత్యా కొత్త వారిని కల్సుకొంటారు. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. జీర్ణ సంబంధమైన అనారోగ్యం చేయగల సూచనలు ఉన్నాయి. కుటుంబ వ్యవహారాలు మామూలుగా ఉంటాయి. సంతానానికి సౌఖ్యం సంతోషం లభిస్తాయి. సాహిత్య వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు. సాంఘిక వ్యవహారాల్లో మీ హోదా పెరుగుతుంది. ప్రేమ వ్యవహారాల్లో స్వల్ప అభివృద్ధి ఉంటుంది. విద్యార్థులు శ్రమపడి చదువ వలసి ఉంటుంది. ★



కూలిన గోడలు

ముప్పాళ రంగనాయకమ్మ

2

తెల్లవారకోడి కూసే వేళకే నిండుగా సామానుతో గూడుబండి తయారయింది. తల్లితోపాటు లేచి పోయిన మధు తను తొడుక్కున్న కొత్త చొక్కా చూపించేందుకు తండ్రి మంచం దగ్గరికి పరి గెత్తాడు. "నాన్నోయ్! నాన్నా! తాతయ్యగారి వూరు వెళ్ళిపోతున్నాం. నేను కొత్త చొక్కా తొడు క్కున్నాను." అంటూ ఆయన చెవిలో అరిచాడు.

"చా! వెధవా! వెళ్ళేవాడివి వెళ్ళక నా నిద్ర పాడుచేస్తావ్!" కసిరి కొట్టారాయన. మధు తన పనికాస్తా అయిపోయినట్టు మంచం మీద బండికేసి పరుగెత్తాడు. కల్యాణి అన్నీ బండిలో సర్దటం పూర్తిచేసి భర్త దగ్గరికి వచ్చింది.

నెమ్మదిగా ఆయన కప్పుకున్న దుప్పటి తీస్తూ— "తర్వాత కావలసినంత నిద్రపోదురుగాని కాస్త అలా గారి బయటికి రాకూడదూ? అన్నీ సర్దించే శాను. వెంకన్న బండి కట్టేస్తున్నాడు." అంది.

"చస్! నీ కొడుకూ, నువ్వూ నన్ను నిద్రపోనిచ్చేలా లేరు. ఏదో శాస్త్రం చెప్పినట్టు నువ్వు పుట్టింటికి దయచేస్తోంటే నేను నిద్ర పాడుచేసుకుని, నీ వెనకాల తిరగనా? చాలుగాని వెళ్ళు వెళ్ళు." కోపం నటిస్తూ నిండా ముసుగు బిగించారాయన. కల్యాణి నవ్వుకొంది. "సరే! నేను వెళ్ళిపోతున్నాను. ఎన్నిరోజులు పడు కుంటారో పడుకోండి."

గదిలోంచి బయటికి వచ్చి పనిమనిషికి చెప్ప వలసిన జాగ్రత్తలన్నీ చెప్పి మరోసారి హెచ్చరించి బండి దగ్గరికి నడిచింది. మధు, సూర్యంతో దెబ్బలాడి ముందు తొట్టిలో కూర్చున్నాడు. కల్యాణి సూర్యాన్ని వోదార్చి తన దగ్గర కూర్చోబెట్టుకొంది.

బండి పదిబారలు సాగేసరికే కిర్రుచెప్పులు చప్పుడు చేసుకొంటూ జగన్నాధంగారు వచ్చి కలిసారు.

"నిద్దేమైందేమిటి?" నవ్వింది కల్యాణి.

"నువ్వూ తాతగారింటికి వస్తావా నాన్నా?" అరిచాడు సంతోషంగా మధు.

"లేదునాన్నా! నేను రాను. పడిపోతావ్. జాగ్ర త్తగా కూర్చో." కొడుకుని హెచ్చరించారు జగ న్నాధంగారు.

"ఇంత మాత్రానికి మీరెందుకొచ్చారు?"

"నిన్ను చూద్దామని."

కల్యాణి సిగ్గుపడింది. మధూ తనకేసి చూస్తోంటే — "అల్లరి వెధవా! అన్నీ నీకే కావాలి. అలా వెనక్కి తిరక్కు. సరిగా కూర్చో." అంటూ మందలించింది కొడుకుని.

భార్యను కసిరికొట్టి దుప్పటి బిగించుకున్నా, తీరా బండి కదిలిపోతుంటే వాళ్ళని కొంతదూరం సాగనంపి వద్దామనీ, ఒక్కసారి భార్యను చూద్దామనీ జగన్నాధం గారికి నిజంగానే బుద్ధి పుట్టింది. వెంటనే లేచి చెప్పులు తొడుక్కుని నాలుగంగల్లో వచ్చి కలిశారు. ఆయన బండి వెనకే నడుస్తూ భార్యను చూశారు. కల్యాణి నిండునెలలతో బండిలో కూర్చుని వెళ్తోంటే ఆయన హృదయం ఏదో శంకించింది. బండిని వెనక్కి మళ్ళించి వేద్దామా అన్నంత ఆరాటం కలిగింది. ఏమైనా ఈ ప్రయాణం మాన్పించి వుంటేనే బావుండేదనిపించింది. కాని ..... ఏమీ చెయ్యలేనట్టు అలాగే నడుస్తూ — "రెండు రోజుల్లో బయల్దేరి వచ్చేయ్యాలి సుమా! అసలు నిన్ను పంపించటం నాకు ఇష్టమే లేదు. చెప్తే విన కుండా పెంకితనంగా బయల్దేరావు." గొణుక్కుంటూ వ్వట్టే అన్నారు. కల్యాణి కొంచెం నవ్వి అంది — "బావుంది మీ ధోరణి. ఎల్లుండి ఈపాటికి రానా? ఎందుకలా కంగారు పడిపోతారు?" ఆ అనురాగమే కల్యాణిని భర్తలోని లోపాలు ఎంచనివ్వకుండా చేస్తుంది. భర్త ఎన్నివిధాల జబ్బాలు సాగించినా తనను ప్రాణాలకన్న మిన్నగా చూసుకుంటాడన్న భావన చాలు కల్యాణి ఆత్మశాంతికి.

"పోనీ బండైనా తేలిగ్గా నడవకుండా నిండా సామాను ఒకటి వేయించావు. అసలే దారి మంచిది కాదు." కల్యాణి మాట్లాడలేదు. జగన్నాధంగారు బండితోపాటు చాలాదూరం నడిచారు. ఆయనకు వెనక్కి మళ్ళాలన్న ధ్యాస వున్నట్టు లేదు.

"బావుంది. గారు వచ్చేస్తారా ఏమిటి? పోనీ నడకేం ఖర్మ? బండైనా ఎక్కండి." అంది నవ్వి కల్యాణి. అప్పటికి జగన్నాధంగారు తేరుకుని పాలేరుని హెచ్చరించారు. "దారి సరిగ్గా లేదు వెంకన్నా జాగ్రత్త సుమా! బాగాలేనిచోట క్రిందికి దిగుతూ వుండు. ఇక నేను వెళ్తాను. వెళ్తాన్రా సూర్యం! మధూ! తొందరగా వచ్చేయండి." బండి ముందుకు సాగిపోతోంటే ఆగి నిలబడ్డారు. ఎన్నిసార్లు భార్యని పుట్టింటికి పంపించ లేదు? ఎప్పుడూ ఇలా అర్ధంలేని తపన కలిగింది? ఏ శాస్త్రమూ చెప్పలేని జోస్యాన్ని మనస్సే చెప్తుందని కాబోలు! ఛా! అపశకునంలా ఉత్త చాదస్తం కాదూ? బండి కనుచూపుమేర దాటేవరకూ చూస్తూ నిలబడి సూర్యోదయపు లేతవెలుగుతో వెనక్కి తిరిగారాయన వూరుకేసి.

ఓ రెనికల గుడ్డుకు మించి ఏమీ ఆశించని కల్యాణి పుట్టింటివారికి మాత్రం కల్పతరువు లాంటిదే!

తను పొలంలో ఏ పంట పండినా అది విధిగా అన్నల ఇంట వుండాలి. తాము ఏ సంతోషం పొందినా అది అన్నలకు కూడా అంది తీరాలి. కూతురి సంసారం కలిగిందే అయినా వెర్రిఅభిమానంతో పప్పులోపప్పూ, వుప్పులోవుప్పూ పుట్టింటికి నడవడం తల్లి సుందరమ్మ గారికి ఏమంత సమంజసంగా తోచదు — "అభిమానాలకైనా ఆదరణాలకైనా సమయమూ సందర్భమూ వుండాలి. అన్నిటికీ దానుకు తిరిగితే తేలికౌతుంది." అంటుందావిడ.

కల్యాణి తండ్రి — రాజయ్యగారు ఇంటా బయటా పేరు ప్రతిష్ఠలు గల వ్యక్తి. స్వకులస్థులైన జమీందారుల సంస్థానంలో వుద్యోగం చేస్తూ మంచి పలుకుబడి సంపాదించుకున్నారు. రాజుల్ని మించిన రాజసం. జమీందారులను మించిన ఆత్మాభి మానం ఆయనకు పుట్టుకతోనే సిద్ధించాయి. వారి కుటుంబం మహాసంపన్నమైంది కాకపోయినా తిండికీ బట్టకూ సర్వసామాన్యమైన సుఖాలకూ లోటు కలిగింది మాత్రం కాదు. పెద్దకొడుక్కి సంతతి లేదనే చింత రాజయ్యగార్ని బాధించినా కోడళ్ళిద్దరూ అక్కచెల్లెళ్ళలా కలిసిమెలిసి తిరగటం చిన్నకొడుకు బిడ్డనే అందరూ కన్నకొడుకులా ప్రేమించడం — కుటుంబాన్ని వేర్పు చెయ్యాల్సిన దుస్థితి సంభ వించక పోవటం — ఆయనకు చాలా వరకు సంతృప్తి కలిగించాయి. పెద్దకొడుకైన విశ్వనాధానికి ఆయన ఆశించినట్టు పెద్ద చదువులేమీ అబ్బలేదు. అయినా విశ్వాసం బ్రతక నేర్చినవాడు. తండ్రి సంస్థానానికి వెళ్ళిపోయి నప్పుడు ఇంటి పెత్తనం స్వంత వ్యవసాయం బాధ్యతగానే చేయగలడు. గాధి పెద్దలతో ఒకసుగా బెళామణి అయ్యే విశ్వనాధయ్య వ్యవహారాల పుటి. దృఢమైన అవయవ పౌష్టవంతో తెల్లని పంచెకట్టుతో — హుందాగా కన్పిస్తాడు విశ్వనాధయ్య.

ఇక రాజయ్యగారి చిన్నకొడుకు సీతాపతి అన్న గారికి భిన్నమైనవాడు. చదువుసంధ్యల మీద

ధ్యాసతో ఇంటి విషయాలు పట్టించుకునే అలవాటు లేనివాడు. వేళపట్టుకు తిండీ — బస్తీలో వుద్యోగం అలిసిపోయి నప్పుడు నిద్రా తప్పితే మరే బాధ్యతలూ పట్టనివాడు ! తండ్రి తర్వాత తండ్రివంటి అన్నగారి మాటమీద పెద్దరికం మీదా భయభక్తులు కల వాడు. మిన్ను విరిగి మీదపడ్డా నిశ్చింతగా నిర్భయంగా వుండగలవాడు. ఖద్దరు పైజమాలతో ఎగదువ్విన క్రాఫింగుతో బుద్ధిమంతుడైన విద్యార్థిలా వుండే సీతాపతి తామరాకు మీద నీటిబొట్టు.

కూలినగోడలు

పెద్దకోడలు పార్వతి సన్నగా పొడుగ్గా తెల్లగా సోగ అనేలా చాలా అందంగా ఉంటుంది. అందుకు తగ్గట్టు నిగనిగలాడే నొక్కుల జుట్టు కూడాను— త్రాచులా బారెడు జడ అల్లుకొంటుంది. పౌడర్లూ, స్నోలూ, సెంటులూ ఎప్పటి కప్పుడు నిలవ ఉంచుకొంటుంది. తాను వాడటమే గాక భర్త విశ్వనాధానికి కూడా సరదాగా ముస్తాబు చేస్తుంది. ఎప్పుడూ నాజూగ్గా వాయిల్ చీరల వంటి మెత్తని బట్ట కడుతుంది. భార్యంటే విశ్వనాధానికి మితిమీరిన అనురాగం.

చిన్న కోడలు సావిత్రి— చామన చాయగా కొంచెం పొట్టిగా బొద్దుగా నిండుమనిషిలా కన్పిస్తుంది. రోజుకోసారి తల దువ్వుకోటానికి కూడా బద్ధకిస్తుంది. మెత్తని గుడ్డలు ముచ్చటగా మూడు రోజులైనా మన్ననివి నేతచీరలే కడుతుంది. అయినా కళగల మొహంతో ఆకర్షణీయంగా కన్పిస్తుంది.

ఆ కుటుంబ వ్యక్తుల సంతోషాన్ని అప్పుడప్పుడూ మటుమాయం చేసేది అందరికన్నా, చిన్నదైన జానకి విషయం. జానకి కల్యాణికన్నా ఏడెనిమిది దేళ్లు చిన్నది. కడసారి కూతురిని అపురూపంగా పెంచి ఎక్కడెక్కడి వరులనూ ఎంచి పెళ్లి చేస్తే జానకి కాపురం నరకం కన్నా నికృష్టమై పోయింది. హద్దులు మీరిన కోడరికం అనురాగమే లేని దాంపత్యం భరించలేని జానకి ఆత్మహత్యకు తలపడి అందునా భంగపడిపోయింది. ఆ ఘోర వార్త విన్న తల్లిదండ్రులు పట్టరాని కోపంతో దుఃఖావేశంతో కంపించి పోయారు. పర్యవసానం జానకి పుట్టింటికి చేరింది. అది విశ్వనాధానికి నచ్చక పోయినా తండ్రికి ఎదురు చెప్పగల ధైర్యం లేక వూరుకున్నాడు. సుందరమ్మగారు భారమంతా భగవంతుడి మీద వేసి కూతుర్ని కడుపులో దాచుకొంది.

జానకి నిండుకుండ. కల్యాణిలా భోళా మనిషి కాదు. పుట్టింట అన్నా వదినెల మధ్య తగిన విధంగా మసలగల తెలివి తేటలు కలది. తల్లిదండ్రుల అభిమానమే జానకి నిలకడకు ప్రత్యేక కారణం—జానకి కల్యాణి కన్నా అందమైందికూడా.

* * *

అనుకోని విధంగా కల్యాణి రాక పుట్టింట అందరికీ సంతోషం కలిగించింది. అయినా తల్లి మనస్సు ఉండబట్టలేక— "ఈ స్థితిలో నువ్వెందుకు వచ్చావమ్మా ? వదిన స్నానం కాగానే నేనే రావాలనుకొంటున్నాను." అంది సుందరమ్మ గారు.

"నిజమే వదినా ! మీరు ప్రయాసపడి రావటం ఏమిటి ? అన్నగారైనా మందలించలేదూ?"

పెద్ద కోడలు పార్వతి అత్తగార్ని సమర్థించింది.

"కోడల్ని చూసుకోవాలని ఆయనతో దెబ్బలాడి మరీవస్తే మీరేమిటర్రా మధ్య ?" అంటూ బండిదిగి లోపలికి నడిచింది కల్యాణి.

బంగారు బొమ్మ వంటి చిన్నారి పాపను చూసిన క్షణం కల్యాణి హృదయం ఏదో సంతృప్తితో నిండిపోయింది. తన కలలన్నీ ఫలించి ప్రత్యక్షమైనట్టు అనుభూతి చెందుతూ తనను తను మరిచి చిరునవ్వుతో పురిటి మంచం దగ్గరే నిలబడి పోయింది.

"పిల్లకు దృష్టి తగిలితే వూరుకోనుసుమీ"

బాలెంతరాలు సావిత్రి ఆడబిడ్డతో హాస్యమాడింది. కల్యాణి కోడలి ధ్యాస నుంచి కొంచెం మళ్లి— "ఏమిటంటావు ? నీ కూతురికి దిష్టి తగులుతుందా ? పోనీ నా దిష్టే తగిలితే ఓ గొలుసు గిరగిరా తిప్పి నీకిచ్చేస్తాలే." అంది గర్వంగా.

పార్వతి నవ్వింది— "ఉత్త కబుర్లాడితే గొప్ప ఏమిటి వదినా ?"

"కల్యాణి అంటే ఏమిటనుకున్నావు వదినా ? మాటలు ఒకటీ చేతలు ఒకటీనా ? మీ హాస్యాలు మరెవరి దగ్గరైనా ఒలక బోయండి. నా కోడలికి ఓ గొలుసు ఇచ్చుకోవటానికే వెనకాడుతా ననుకున్నారా ?"

అప్పుడే గదిలోకి వస్తూ సుందరమ్మ గారు కూతురి మాటలు విని సంగతంతా గ్రహించుకో గలిగినా తన అయిష్టత మొహంలో కన్పించ నీయకుండా అంది సామాన్యంగా— "తర్వాత మాట్లాడుకోవచ్చు కల్యాణీ ! మిట్ట మధ్యాన్నం దాటింది భోజనాలకు రారాదే !"

"నా మతి మండినట్టే ఉంది. అన్నాలకు పదమని చెప్దామనుకొంటూనే మాటల్లో పడ్డాను" పదవమ్మా వదినా ! ఉత్త మనిషివి కూడా కావు అంటూ తొందర చేసింది పార్వతి.

"పిల్లలిద్దరూ తినేశారా ?"

"ఆఁ తింటున్నారు జానకి పెడుతోంది. నువ్వు లేచిరా !" అనేసి సుందరమ్మగారు వెళ్లిపోయింది.

భోజనాల తర్వాత ఆడవాళ్లంతా పురిటి గదిలో చేరారు. సూర్యం వీధిలోకి పోతే మధూ తల్లి నంటి పెట్టుకొని కూర్చున్నాడు. అసలు వాడి చేత కబుర్లు చెప్పించాలని కల్యాణే వాణ్ణి దగ్గిర పెట్టుకు కూర్చుంది.

"పాపాయిని చూశావా మధూ ? చక్కగా బావుంది కదూ ?" అంటూ కల్యాణి కొడుకు మొహంలోకి చూసింది.

"బావుంది" అనేశాడు చటుక్కున పాపాయి వైపే చూస్తూన్న మధూ.

"అహా ! అంత బావుందీ ? నీకేం నోరూరు తోందా ?" అంది పార్వతి నవ్వుతూ.

"మరి మా పాపని పెళ్లి చేసుకుంటావటోయ్ ?" సావిత్రి మధుకేసి చూసింది.

మధూ అంగీకరిస్తూన్నట్టు తల వూపుతూ— "నేనూ మా అన్నయ్యా కూడా చేసుకుంటాం."

అంతా ఫక్కుమన్నారు.

"అస్తమానమూ వాడితో దెబ్బలాడుతూనే ఉంటాడు: మళ్లా వాణ్ణి మరిచి ఒక్కక్షణం వూరుకోడు." అంది కల్యాణి. పార్వతి మధుకేసి చూస్తూ "మా పాప జాతి బొమ్మలా ఉంది. నువ్వూ మీ అన్నయ్యా మట్టిముద్దల్లా ఉన్నారు. అసలు పాప మిమ్మల్ని పెళ్లి చేసుకోదుగా మరి." అంటూ నవ్వింది. జానకి కలగజేసుకొంది "అలా బింకాలు పోకు వదినా, నిజంగా వాళ్లు వద్దనేస్తే మీబొమ్మని బొమ్మలాగే ఉంచుకుంటావు."

"ఇదేం చోద్యమమ్మా ? మీరే మగపిల్లల్ని కన్నట్టు నా కూతురికి మొగుడే రానట్టు మాట్లాడుతున్నారే !" సావిత్రి అందుకొంది.

"నీ కూతురికి మొగుడెందుకు రాడుగానీ ఎవడు వచ్చినా వాడు మేనత్త కొడుకు మాత్రం కాడు." సుందరమ్మగారు కూడా ఓ విసురు విసిరింది.

"అయినా వదినా ! ఈడైన ఉన్న మేనత్త కొడుకులే కాదన్నప్పుడు నీ కూతుర్ని కట్టుకోటానికి మరెవడు ముందుకొస్తాడు చెప్పు ?"

ఆ మాట మీద వదినా మరదళ్లు మరో కాస్సేపు వాదులాడుకున్నారు.

అంతలో మధూకి ఏదో కోరిక పుట్టుకొచ్చింది. అది కాస్త తల్లి చెవిలో వెల్లడించాడు. కల్యాణి నవ్వుతూ— "ఛ ! అప్పుడే ఎత్తుకు మోస్తా నంటే వాళ్లకి లోకువకాదుట్రా ? మానం ఎంత బింకంగా ఉండాలని !" అంది.

మధు మొహం ముడుచుకున్నాడు.

"మంచి అల్లుడివే బాబూ ! దానికాలో చెయ్యో విరిగిందంటే నువ్వుకూడా తప్పించుకు , మరీ వెక్కిరిస్తావు." చిన్నత్త !

"ఆగవయ్యా ! నీకూ పెళ్లాయి పుడుతుంది. ఎత్తుకు తిప్పుదువు గాని." పెద్దత్త !


"అయినా పెళ్లాన్ని ఎత్తుకుంటారుట్రా ?" పిన్ని !

అందరూ ఏకగ్రీవంగా తన కోరికను వెక్కిరించటంతో మధూ సిగ్గుపడి పరిగెత్తుకు వెళ్లిపోయాడు.

ఉన్నట్లుండి పార్వతి అంది— "పాపని మేము పెంచుకుందా మనుకుంటున్నాం కల్యాణీ ! మీ అన్నయ్య అలాగే అంటున్నారు."

"ఇకనేం ? అందరి ముచ్చటా తీరుతుంది. ఐతే పిల్లనిమ్మని ఎవర్ని అడగాలంటావు ?"

36 వ పేజీ చూడండి



పెద్ద మేడల నీడలో వీళ్ల పసితనం
వీళ్ల ముసలితనం కూడా దొర్లిపోతాయి

ఫుట్ పాత్ బ్రతుకులు!



వ్యాసం
వాశిరాజు ప్రకాశం
ఫొటోలు
ప్రభాకర్

సూర్యభగవానుడు ప్రసరించే తీక్షణ వీక్షణాల ధాటిని ఎదురిస్తూ, వానదేవుడు కురిపించే ధారా ప్రవాహాలను సహిస్తూ, ఈ రెంటినీ చూచి పరిహసిస్తూ, మద్రాసు మహానగరంలో దాదాపు ఎనభై వేలమంది పేదప్రజానీకం, నడివీధుల్లో నివసిస్తూ, ఆచ్ఛాదన లేని జీవితాలను గడుపుతున్నారనటంలో అత్యుక్తికి తావు లేదు.

ఏ వీధిన వెళ్లినా ఆదే దృశ్యం, రోడ్ల ప్రక్కనే పెద్దపెద్ద భవంతులముందు, దుకాణాల ముందు "బాటసారుల" కోసం కేటాయించ బడిన కాస్త జాగాలోనే, పెద్ద పెద్ద కాపురాలు కనుపిస్తాయి. మూడే మూడు రాళ్లతో ఏర్పాటు చేసికొన్న పొయ్యి మీద ఆ వేళకు కాసిని గంజి కాచుకుని జీవయాత్ర చేస్తున్న ఈ ప్రజానీకం, మన దేశంలోని పేదరికానికి ప్రాతినిధ్యం వహిస్తున్నది... పగలల్లా కూలీ, నాలీ చేసుకుని, చీకటి పడేసరికల్లా 'ఆచ్ఛాదన' అయినా లేని, తమతమ గూళ్లకు చేరుకొని.... ఆ ఉన్న గంజో, నీళ్లో తాగి కాలక్షేపం చేస్తుంటారు. వీళ్లలో ఆడ, మగ వ్యత్యాసం లేకుండా 'శక్తి' ఉన్న వాళ్లందరూ కష్టం చేసుకొని జీవిస్తున్నవాళ్లే. ముసలీ, ముతకా, పిల్లా, పాపలు మాత్రం ఇంటి వద్దనే ఉండిపోతారు.

ఇటీవలనే, వీరి కష్ట నిష్ఠూరాలు వినే నదవకాశం లభించింది. వీరి అభిరుచులు, అభిప్రాయాలు, అభిమతాలు సేకరించేందుకు మద్రాసు నగరంలో దాదాపు చాలా ప్రాంతాలు 'సంచారం' చేయవలసి వచ్చింది.

వీరంతా దక్షిణాదివారే

నేనూ, ఫొటోగ్రాఫరు ప్రభాకర్ వెళ్ళి, వాళ్లను పలకరించేసరికి వాళ్లెంతో సంతోషించారు.... విచిత్రం అది కాదు.... తింటానికి తిండీ, కట్టుకోటానికి బట్టలూ, ఉండటానికి ఇల్లూ లేక పోయినప్పటికీ, వాళ్లు ఏ చీకూ, చింతాలేకుండా జీవిస్తున్నారు. పైగా, వాళ్లలో కొందరు తమ పేదరికాన్ని అంగీకరించలేదు.

మద్రాసులో ఉన్నంత మాత్రాన వీళ్లంతా తమిళులుకారు ... వీరిలో అన్ని దక్షిణాది రాష్ట్రాల వారూ ఉన్నారు. తెలుగువారూ కొందరు లేకపోలేదు. కన్నడం కూడా అక్కడక్కడ వినిపించింది. మరి కొందరు కేరళ వాసులు కూడా యీవిధంగా మద్రాసునుఆక్రమించుకొన్నారు. మొత్తం మీద, తమిళులే అధిక సంఖ్యాకులు. దక్షిణదేశమంతా కూడగట్టుకొని వున్నట్లున్నది; కాని, ఉత్తరాది కంఠాలు ఎక్కడా వినుపించలేదు.

'మేం పేదవాళ్లం కాము'

వీళ్ల దృష్టిలో 'పేదరికం' అంటే అసలు "గంజి"కి కూడా డబ్బు లేని స్థితి. "మీరు పేదవాళ్లు కారా ?" అన్న ప్రశ్నకు చాలా మంది "కానే కాదు" అని సమాధానం చెప్పారు, కొందరు మాత్రం "వేన్నీళ్లకు చన్నీళ్లు, చన్నీళ్లకు వేన్నీళ్లు, తోడు చేసి జీవిస్తున్నాం" అన్నారు. ఎక్కడో ఒకరిద్దరు మాత్రం.... తమ దైన్య స్థితిని బాగా గుర్తించిన వారవటం చేత.... 'పేదరికం' యొక్క వికృత రూపాన్ని మా విలేఖరికి ప్రత్యక్షంగా చూపారు. మా ప్రశ్నలన్నింటికీ మరి కొందరి కన్నీరే సమాధానాల నిచ్చాయి.

"పేదవాళ్లం కానేకాదు" అని చెప్పుకొంటూ, నడి వీధుల్లో ఎందుకుంటారన్న సందేహం కలుగవచ్చును. పెద్దపెద్ద భవనాల్లో కంటే, ఇక్కడే ఎంతో 'ఆనందం' లభిస్తున్నదని ఒకతను పేర్కొన్నాడు. "వచ్చిన డబ్బు ఖర్చుకు సరిపోతుంది. గనుక, మేం పేదవాళ్లం కాదు" అని మరో నడివయస్కుడు చెప్పాడు.... ఇలానే.... పేదరికానికి ఎన్నో ఎన్నో రకాల నిర్వచనాల్ని చెప్పారు, వీళ్లు.

వీళ్లందరికి చిన్నచిన్న ఇళ్లైనా లేకపోవచ్చు.. కాని పెద్ద, పెద్ద సంసారాలున్నాయి.

దీనమైన దృశ్యాలు

"పేవ్‌మెంటు" మీదనే కాస్త జాగాలో నిలువెత్తున చిన్న పందిరివేసికొని, అటూ, ఇటూ, పైనా 'గోతాలు' కప్పుకొని, ఇండ్లను ఏర్పరచుకొన్నారు. ఆ ప్రక్కనే రాళ్లపొయ్యి, కుండలు మూకుళ్లు, చినిగిపోయిన చాప, పాతగుడ్డలు,.... చింపిరితలలతో, చినిగిన గుడ్డలతో మట్టిలో పొర్లాడే పిల్లలు,.... ఇలాంటివి అక్కడ కనుపించే దీనమైన దృశ్యాలు.

పైనే చెప్పాను— కాస్త, జబ్బ సత్తువ ఉన్న వాళ్లు కూలీ, నాలీ చేసి, నాలుగు రాళ్లు సంపాదిస్తుంటారు. వీళ్లలో కొందరు రోడ్డు పని చేస్తుంటారు. పెద్దపెద్ద ఫ్యాక్టరీలలో కొందరున్నారు. రైల్వేలో కొందరు జీవితయాత్ర సాగిస్తున్నారు. ఇలాంటి ఉద్యోగాలేవి దొరకనందున 'చోర వృత్తి'ని స్వీకరించిన వారెందరో !

కూలీ పనికి వెళ్లేవారు వెళ్లగా, మిగిలిన వాళ్లంతా ఏదో ఒక పని చేస్తూ ఉంటారు. కొందరు "సాగరాలు" అల్లి అమ్ముతున్నారు, కొందరు మేదరి పని చేస్తుంటారు. ఇలాగే ఎన్నో ఎన్నో వృత్తులు.

అంతేగాదు, మిట్ట మధ్యాహ్నపు నీడలో ఇరుగింటమ్మతోను, పొరుగింటమ్మతోను కబుర్లు చెప్పి, కాలక్షేపమూ, కాలాయాపన చేస్తున్న వాళ్లు కూడా లేక పోలేదు.

ఊపులు—వూహాలు

మేముఒక చోటికి వెళ్లేసరికి,అక్కడ ఇద్దరుస్త్రీలు గవ్వలాడుకొంటున్నదృశ్యం గోచరించింది. మరో చోట, చెట్టుకు 'ఉయ్యాల' గట్టుకొని కొందరు వూగుతున్నారు. అయినా, ఆ వూపులలో ఎన్నెన్ని వూహలు దాగివున్నాయో !

వాళ్లకూ ఎన్నెన్నో అభిరుచులు, వేర్వేరు అభిమతాలు ఉండటం 'స్వభావోక్తి'కి దూరంకాదు. పగలంతా రెక్కలు విరుచుకున్న వీరికి, సినిమా అంటే ఎంతో సరదా. నాకూ, ప్రభాకర్‌కూ

మద్రాసు నగరంలో ముఖ్యవీధులన్నిటిలో కొత్తవారిని ఆకర్షించే దృశ్యాలు!

ఎన్నో సినిమా కబుర్లు చెప్పారు. శివాజీ గణేశన్ 'నడిగవేల్' (ఉత్తమ నటుడు) అన్నాడొకతను కొందరికి 'స్టంటు' సినిమాలంటే చాలా ఇష్టమట. మొత్తం మీద సినిమాలంటే అందరికీ మక్కువ ఎక్కువే. వీళ్ళు సరాసరిన నెలకు 12 నుంచి 20 వరకు సినిమాలు చూస్తారు. కొందరు నాటకాలకు కూడా వెళతారట. వాళ్ల అభిప్రాయం ప్రకారం, మనం చూచే 'క్లాస్' నాటకాలంటే, వాళ్ల ఊర్లో (పల్లెటూళ్లో) ఆటలాడే, గెంతులేసే "వీధి బాగవతులే" బాగుంటారట !

లక్ష్యమూ, గమ్యమూ...

వీళ్లు ఇలా, నీడలేని జీవితాలను ఎంత కాలం గడుపుతారు ? వీళ్ల జీవితాలకు లక్ష్యమూ, గమ్యమూ లేవా ?

ఇదే ప్రశ్న వాళ్లనూ అడిగాను. వాళ్లకు మొదట్లో అర్థం కాలేదేమో.... జీవితాలకు లక్ష్యమూ, గమ్యమూ కూడా ఉంటాయా ? అని కొందరు తిరిగి నన్నే అడిగారు.

ఒకతను చెప్పాడు— వాళ్ల తండ్రి,తాత కూడా ఇలానే 'పేవ్‌మెంట్స్' మీదనే జీవితాలను వెళ్ల బుచ్చుకొని పోయారట. తనూ అంతేనట.

ఎక్కడైనా 'మురికివాడ'లో కాస్త జాగా దొరికే వరకూ 'పేవ్‌మెంట్ల' మీదనే ఉంటున్న వారు కొందరు, "రేపో, మాపో" పూరి కొంప ఒకదాన్ని ఏర్పరచుకొని, కాలం వెళ్లబుచ్చు కొంటారట, వీళ్లు.

పిల్లలను చదివించి "పెద్దవాళ్ల"ను చేయాలని వాళ్లంతా అనుకోటం లేదు. తమలాగే తమ పిల్లల్ని కూడా కూలీలుగానో, కార్మికులుగానో చేయాలనే చాలా మంది భావం. చదివించటానికి డబ్బులేదట !

వీళ్లల్లో ఒకరిద్దరు ఆశావాదులు కూడా లేక పోలేదు "గాలిలో దీపం పెట్టి, దేవుడా నీదయ" అనే కోవకు చెందిన వాళ్లు, వీళ్లు. తాము ఏమీ చేయలేక పోయినా, తమ పిల్లలు గొప్పవాళ్లవుతారని వాళ్ల భ్రమ ! పైగా, కాంగ్రెసు అధ్యక్షుడు కామరాజ్ నాడార్ ఉదాహరణను ప్రస్తావించాడొకఘనుడు.

వారివారి తాహతుకు తగినట్లుగా కొందరికి ఆశలు లేకపోలేదు. వాళ్లబ్బాయి కూలీల మీద 'మేస్త్రీ'కావాలని ఒకతను అన్నాడు. అతని 'ఆశ'లో 'ఆశ' అన్నది కొంతవున్నా, అది హద్దుల్లోనే వున్నదనిపించింది.

ఎవడితిప్పలు వాడివి....

రోడ్డు ప్రక్కన పేవ్‌మెంట్లమీద ఇలా కాపురాలు చేయటం వల్ల ఇతరులకు ఇబ్బంది కలుగుతుందని వీళ్లకు తెలుసు. ఆ వీధుల్లోని ఆఫీసుల వాళ్లకు, 'పేవ్‌మెంట్ల' మీద నడిచే వాళ్లకు చికాకు కలిగిస్తుంటారు ఒక్కోసారి ఆమార్గాన నడవసే బుద్దేయ్యదు.


"ఇతరులకు ఎందుకిలా ఇబ్బందిని కలిగిస్తారని" అడిగేసరికి "ఎవడి తిప్పలు వాడివి" అని సమాధానం చెప్పారు కొందరు. పెద్ద పెద్ద భవంతుల్లో ఉండే దొరలకు మా బాధలేం తెలుస్తాయని అడిగారు కొందరు. అదీ నిజమేననిపించింది.

వీళ్లూ పౌరులే

వీధులపక్కన కాపురాలు చేస్తున్నంత మాత్రాన వీళ్లను పౌరులు కాదని ఎవరంటారు? వీళ్లకూ వోటు హక్కు ఉన్నది ఎన్నికలలో పోటీ చేసేవాళ్లు వీళ్ల చుట్టూ తిరగక తప్పదు.

కాని, వీళ్లు ఎవరికి వోట్లు వేస్తారు ? అభ్యర్థుల శక్తి సామర్థ్యాలను తూచటం వీరికి సాధ్యమా ?....

అలాంటిదేమీ కన్పించదు. వోటు ఎందుకో, దాని ప్రయోజన మేమిటో వీళ్లలో చాలా మందికి తెలియదు. ఎన్నికలు రావటమంటే, ఓ పెద్ద 'సంబరం' వీళ్లకు. ఒకతను ఒప్పేసుకున్నాడు కూడా.... ఎన్నికల రోజంతా



ఇలాంటి దృశ్యాలు మద్రాస్‌లో మీకు తరుచుగా కనపిస్తాయి!

ఫుట్ పాత్ బ్రతుకులు !



బుట్టలల్లటం లాంటి చిన్న చేతి పనులు వీళ్ళ వ్యాపకాలలో కొన్ని.

డబ్బులు నిండుగా ఉంటాయని. ఈ 'డబ్బులు' మాటవిన్న తరువాత, అభ్యర్థుల ప్రతిభా విశేషాలను వీళ్ళు ఎలా నిర్ణయిస్తారో తెలిసికోవాలనే కుతూహలం నాలో పడలిపోయింది.

దేశమూ, ప్రజలూ

వాళ్ళుండేది ఒక స్వతంత్ర దేశంలోనే. వాళ్ళూ ప్రజలే కాని వాళ్ళకు ఇవేమి పట్టవు. వాళ్ళ నడిధివేరు, వాళ్ళ దృక్పథం వేరు బహుశా కారణం ఒకటి కావచ్చు.. వాళ్ళ ఆలోచనా శక్తికి మించిన అంశాలలోనూ, రంగాలలోనూ, తల దూర్చటానికి వీళ్ళకు సమయం లేక పోవటమే.

"దేశమంటే ఏమిటి ?" ఒకతన్ని ప్రశ్నించాను. ఈ ప్రశ్నతో అతను నా మీద విరుచుకు పడ్డాడు.. 'దేశమంటే దేశమే' నన్నాడు దీనిని బట్టి అతనికి 'దేశమంటే' ఏమిటో మరో నిర్వచనం తెలియలేదని తేలిపోయింది. అయినా, అతనేమీ 'గురజాడ' కాదుగా, దేశమంటే మనుషులని తక్కున చెప్పటానికి.

ఈ 'పేవ్‌మెంట్ డ్వెల్లర్స్'కు ప్రభుత్వాలంటే ఏమిటో 'తెలియదు' కాని మంత్రులంటే తెలుసుట ? వాళ్ళ దృష్టిలో మంత్రులంటే "పెద్దోల్లు". పెద్ద పెద్ద కార్లలో, 'కద్దరు బురఖా''లలో తెల్ల టోపీలతో వచ్చి ఉపన్యాసాలు చేసేవాళ్ళు.

చుట్టూ ప్రపంచం

ఈ నిరాశ్రయులకు తమ చుట్టూ ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలుసో, తెలియదో, అసలు తెలిసికొనే అవకాశాలున్నాయో లేవో కూడా పరిశీలించదగ్గ విషయమే.


విశేషమేమంటే, వార్తలను తెలిసికోవాలనే,

వీళ్ల సంసారాలు చాలా పెద్దవి 'ఫుట్ పాత్ లు' వెడల్పుగా వుంటే అక్కడ వీళ్లుకూడా జాస్తీగా వుంటారు!



ఆసక్తి వీళ్లలో ఏ మాత్రమూ లేదు. అందువల్ల వాళ్లకు అసలు ముఖ్యమైన కబుర్లేవీ అందవు.

వార్తాపత్రిక, రేడియో మొదలైన వార్తా ప్రచారక సాధనాలున్నాయ్ ! ఈ సాధనాల్లో వీళ్లకు ఏ మాత్రమూ శ్రద్ధ లేదు పైగా, వార్తా పత్రికలు చదవటం చాలా మందికి తెలీదు. అలా తెలిసిన ఒక రిద్దరు కూడా సినిమా తారల బొమ్మలే చూస్తూ, రాగిణి పెళ్లెప్పుడో, సావిత్రి ఎక్కడుందో—తెలిసికొంటూ ఉంటారు. ఇక, రేడియో సరేసరి! పది నయాపైసల వార్తాపత్రికకే అంతదూరమయిన వాళ్లు రేడియోకు ఎలా సన్నిహితులవుతారు ? పొరపాటునా ఎక్కడన్నా (అంటే—టీ షాపుల్లోను, కిళ్లీ బంకుల్లోనూ) రేడియో వినే అవకాశం ఉన్నా, వార్తలెందుకు వింటారు ? దృష్టంతా 'గ్లామర్' అనే సినిమాల వైపుకే మళ్ళుతుంది.



అందువల్లనే వాళ్ళకు నెహ్రూ అంటే ఎవరో తెలియదు. ఒకతని దృష్టిలో "నెహ్రూ" ఒక పెద్ద దొర. మరొకతను నెహ్రూగారిని ఒక 'పెద్ద రాజు'గా అభివర్ణించాడు. కామరాజనాడార్ పేరు చాలా మంది విన్నా, ఆయన ఈ రోజున ఏం చేస్తున్నారో, ఎక్కడున్నారో, ఎవ్వరూ విపులీకరించలేకపోయారు.

ఈవిధంగా గడిచింది మా సంభాషణ. ఆరోజంతా చర్చించాం. వీళ్లకు సంబంధించిన ఎన్నెన్నో అభిప్రాయాలు సేకరించే అవకాశం లభించింది. వీళ్ల జీవితాలను ఇంత నిశితంగా పరిశీలించి, తరువాత, ఈ అమాయకపు హృదయాలతో ఇంత సన్నిహితంగా మాట్లాడిన తరువాత మనకి మనం సాధించుకొన్న ప్రగతిని గురించి ఎన్నో ప్రశ్నలు వేసికోవలసి వస్తుంది!

ఈ నిరాశ్రయుల ఫోటోలు తీసికోవటానికి విదేశాల వారు ప్రతిరోజూ కోకొల్లలుగా వస్తున్నారట. ఎందుకు? వాళ్ళమీద ఆపేక్షతోనా, కాదు... తద్వారా 'ఇండియా'ను ప్రపంచపు 'చౌరాస్తా'లో పెట్టటానికి !

మనం ఇప్పటికైనా మేలుకోకూడదూ ! ★

ఇది వంటిల్లు కాదు, మద్రాస్ నగరంలో చాలా 'బిజీ'గా వుండే వీధుల్లో ఒకటి.

"ఇద్దరినీనా."

"బావుంది. అందరికీ ఒక్క అత్తగారు గాని వా కొడుక్కి ఇద్దరా ఏమిటి ?"

మాటల సందట్లో పాపపేరు విషయం కూడా దొర్లింది. అంతా కలిసి అత్తగారిదే పెత్తన మన్నారు. ల్యాణి నవ్వింది— "నేను ఆలోచించుకునే ఉన్నాను లెండి. మధూ సూద నుకి పెళ్ళాం సుధారాణి అయితే పేర్లు కలిసి అందంగా ఉంటుంది కదూ ?"

'సుధారాణి ! సుధ,' అందరికీ నచ్చినట్టే అనిపించింది. కల్యాణి మనస్సు దూది పింజెకన్నా తేలిక పడింది. భర్త మందలిస్తున్నా రావటం కోడళ్ని చూడటం— తనకు నచ్చిన పేరు పెట్ట టం అంతా చాలా ఆనందంగా ఉంది.

కల్యాణి వచ్చిన మూడో రోజు సావిత్రి పురిటి స్నానం అయింది. కల్యాణి చిన్నారి సుధని ఒడిలో పడుకోబెట్టుకొని తన మెడలోంచి ఎరుపురాళ్ళ జిగినీ గొలుసు తీసి కోడలి మెడలో వేసింది— "చూడు వదినా ! నేనేదో ఉత్త కబుర్లు చెప్పటమే అనుకున్నారు కదూ ! ఇది పుట్టిందని తెలిసినప్పుడే అనుకున్నాను ఈ గొలుసు దీనిదేనని— అమ్మో ! నా కోడలు మెరిసి పోతోందమ్మా !" అంటూ పాప బుగ్గల మీద ముద్దులాడింది.

పార్వతి సావిత్రీ, విస్తుపోయారు.

"అయ్యో ! ఇప్పుడు గొలుసులివి ఎందుకు కల్యాణీ ? పెట్టుకునే కాలం లేదా ?" అంది కృతజ్ఞతా భావంతో సావిత్రి కల్యాణి నవ్వి వూరు కొంది. పార్వతి తేరుకొని— "ఏ సంబరాలకేం గాని మా పిల్ల ఆ పెరు మొయ్యలేదమ్మా ! తీసి దాచండి." అంది.

"నీ కూతురు ఎంత సుకుమారి అయితే మాత్రం బంగారాన్ని బరువనుకొనే ఆడది ఉంటుందమ్మా ?" కల్యాణి అనురాగానికి సావిత్రి కళ్ళు చెమర్చినట్టే అయ్యాయి— "నీ వంటి అత్తగారు ఉంటే నా కూతురుకన్న తల్లినే మర్చి పోతుంది. కల్యాణీ !"

కూతురు చేసిన పని సుందరమ్మ గారికి ఎంత మాత్రం రుచించలేదు. సమయం కోసం కాచుకు కూర్చున్నట్టు కనుచీకట్లో జామచెట్టు కింద కోడళ్లెవరూ చూడకుండా కూతుర్ని సన్నసన్నగా చివాట్లు పెట్టింది— "కోడలైతే అయినప్పుడు చూసుకోవాలి గానీ అంత తొందరపాటేమిటే ? మహారాణీ విసిరేసినట్టు మెడలో గొలుసు తీసి ఇచ్చేస్తావా ? రేపు నీకు ఆడ పిల్ల పుట్టకూడదూ?

కూలిన గోడలు

31 వ పేజీ తరువాయి

లక్షణంగా దానికది ఉంచుకోవూ ? నీకు లోక జ్ఞానం ఎప్పుడు తెలుస్తుందే !"

"పోని అమ్మా ! ఇవ్వాళ మధర పడటం ఏమిటి ? పాప పుట్టాకే గాని గొలుసే చేయించుకో లేక పోతామంటావా ?"

"అయ్యో ! ఎంత పిచ్చిదానివే !" సుంద రమ్మ గారు మరేమీ అనలేక పోయింది. ఒక్క కడుపున పుట్టిన బిడ్డలు అన్యోన్యంగా కలిసి ఉంటా మంటే ఏ తల్లి సంతోష పడదు ? కొంచెం సేపు వూరుకొని అంది ఆవిడ— "కల్యాణి ! నేను అసూ యగా చెప్పలేదమ్మా ! చీమలు తింటే కొండలైనా తరుగుతాయంటారు. ఎంత కలిగిన సంసార మైతే మాత్రం కావలసిన వాళ్ళకి బాధ్యత లేక పోతే కష్టం కదమ్మా ! అల్లుడుగారి సంగతి అంద రికీ తెలిసిందే కదా ? ఆయన ఖర్చు లేమిటో నరదా లేమిటో తప్ప ఓ అర్ధని రూపాయి చేసుకు పెంచు కుందామనే ధ్యాస లేదు. పోనీ ఇంటి ఇల్లాలివి నువ్వ యినా తెలివిగా మసులుకొంటావేమో అనుకుంటే నీ దాన ధర్మాలు నీవి— చేతికి ఎముకే లేనట్టు ధారపోస్తావు. నీకు తెల్లనివన్నీ పాలూ— నల్లని వన్నీ నీళ్లూనూ— అప్పుడే ముగ్గురు బిడల తల్లివి. ఇంకా కనాలి. పెంచాలి. ఎంత సంపద ఉంటే మాత్రం చేసొతుందా ఏమిటే ?"

వింటూన్న కొద్దీ తల్లి మాటలు కల్యాణికి సమంజసంగానే తోచాయి.

"ఏమిటమ్మా అంటున్నావు ?" అంటూ జానకి వస్తే తమ మధ్య జరిగిన సంభాషణ ఏమంత చెప్పదగ్గది కాదన్నట్టు నవ్వేస్తూ అంది కల్యాణి— "మీ బావ రెండు రోజుల్లో రమ్మంటే నాలుగు రోజులు కూర్చున్నాను. ఆయనకు కోపం వస్తుందో ఏమో ! రేపు తెల్లారగట్ల బయల్దేరుదామంటే దానిమీదేదో చెప్తోంది అమ్మ."

"నిజమే వెళ్తేనే మంచిది ఇంకా ఆలశ్యం దేనికి ?" అంది జానకి.

"అమ్మా ! అమ్మా !" అని అరుస్తూ పరి గెత్తుకు వచ్చాడు మధు. ఏదో గొడవ తెచ్చా డని వాడికంగారే చెప్తోంది.

"అమ్మా !"

"ఏవి(టా ?"

"నీ గొలుసు వాళ్ల పాప వేసుకుందేం ?"

కల్యాణి, జానకీ నవ్వారు. జానకి అంది— "వాళ్ల పాప ఏమిటి ? నీ పెళ్లామేగా ?"

"ఊఁ చెప్పమ్మా ! నువ్వు ఇచ్చేశావా ?"

"పాప మరి మన చుట్టాలే కదమ్మా ! పాపం చిన్న పాప కదూ ? నేనే ఇచ్చాను. పాప వేసుకుంటే ఎంతో బావుంది కదూ ? నీకు నచ్చలేదా ?"

"నాకేం నచ్చలేదు !" మధూ కోపంతో విస్మయంగా అడిగాడు— "మరి నీకు గొలుసేది?"

"నాకు ఇంకో గొలుసు ఉంది కదూ ?"

"మరి పాప గొలుసెక్కడ దాచుకొంటుంది ?"

"వాళ్లమ్మ దగ్గర దాచుకొంటుంది ?"

"వాళ్లమ్మ కూడా వేసుకొంటుందా గొలుసు ?"

"వూహూ! పాప ఒక్కతే వేసుకొంటుంది."

సందేహాన్ని తీర్చుకొని మరీ వెళ్లాడు మధు.

"ఎంత గడుసువాడు !" అంది జానకి ప్రేమగా. కల్యాణి ఆయాసంగా లేచి గదిలోకి నడిచింది.

* * *

విధిలీల వూహాతీత మైనది !

ఆయాసంగా వెళ్లి పడుకున్న కల్యాణికి నొప్పులు రావటం. పురుడు కష్టమై ప్రాణాపాయం సంభవించటం చూస్తూండగానే జరిగిపోయింది. మొదట ఎరకలసాని మరేమీ భయ్యాలేదని ఖచ్చి తంగా చెప్పింది. గంటలు గడుస్తూన్నకొద్దీ— "అమ్మాయిగార్ని ఆసుపత్రికి తీసుకుపోతేనే బాగుంటాదమ్మా !" అంటూ నసిగింది.

"అయ్యయ్యో ! ప్రాణం మీదకు తెచ్చి ఇప్పుడు చెప్తావా ? నీకేం బుద్ధి ఉందా లేదా ?" అంటూ ఇంటిల్లిపాదీ దానిమీద విరుచుకు పడినా గత్యం తరం లేక కల్యాణిని ఆస్పత్రికి తీసుకు పోయే ప్రయత్నాలు చేస్తూ హడావుడి పడ్డారు.


అనుకోని విధంగా వచ్చి పడిన పిడుగుపాటుకు ఇంట్లో అందరి మనస్సులూ కలవర పడిపోయాయి.

తెలివితప్పి పడి ఉన్న కల్యాణి అస్పష్టంగా అలవరించింది— "బాబూ. . . సూర్యం. . . పెద్దాడిని. తమ్ముడూ. . . . నాన్న !"

సుందరమ్మగారు కూతురి దగ్గర కూర్చొని తల నిమురుతూ ధైర్యం చెప్పింది— "మరేమీ భయ్యాలేదమ్మా ! బండి కడుతున్నారు. నిన్ను బస్తు ఆస్పత్రికి తీసుకు వెళ్తారు. డాక్టరు గారు జాగ్ర త్తగా చూస్తారు. నువ్వు ఇలా అధైర్య పడకూడ దమ్మా !"

కల్యాణికి పూర్తిగా తెలివి ఉన్నట్టు లేదు. తల్లి మాటలు విన్నట్టు కూడా లేదు. ఆ అయోమయ పరిస్థితులలోనే కల్యాణి హృదయం ఏదో భయాన్ని శంకించ సాగింది. భర్త మందలిస్తూన్నా వినకుండా తను ప్రయాణం కావటం— తనెక్కడికో శాశ్వతంగా పంపివేస్తున్నట్టు ఆయన బాధపడటం— విడివి వెళ్లలేక బండి వెనకే నడిచి రావటం— తీరా ఆగిపోయినప్పుడు తెలిని దిగులు కలగటం— అన్నీ కల్యాణికి మహోకసారి అనుభవ మయ్యాయి. భయంతో కంపించిపోతూ కళ్ళు తెరిచింది. ఎదురుగా తల్లి కళ్ళు తుడుచుకోవటం కన్పించింది— "ఎందుకమ్మా ఏడుస్తున్నావు ?" తన పరిస్థితి నిస్సహాయంగా ఉందేమోనన్న అను మానం పొడసూపింది కల్యాణిలో.

మంచం దగ్గిరే నిలబడి ఉన్న పార్వతి కలగ



జేసుకొని అంది— "మీకేం భయం లేదు వదినా ! ఒక్క గంటలో ఆస్పత్రికి వెళ్ళిపోవచ్చు."

కల్యాణి నీరసంగా అంది— "మీకు. . .తెలీదు వదినా ! ఈ సారి. . . నా పరిస్థితి మునుపటిలా లేదు. . . .ఏమో. . . . నేను. . . ." మాటలు పూర్తి కాకుండానే చెంపల వెంట కన్నీళ్ళు జారి పోయాయి.

బండి సిద్ధమైంది — కదల బోతోంటే హఠాత్తుగా అడిగింది కల్యాణి— "పిల్లలేరమ్మా"

"నిద్రపోతున్నారు, వాళ్ళెందుకమ్మా ?"

"ఫర్వాలేదు. లేపి బండి ఎక్కించండి. వస్తారు."

"అదేమిటి కల్యాణి? ఆస్పత్రికి వాళ్ళెందుకు?"

"వాళ్ళు నా దగ్గరే వుండాలమ్మా ! తీసుకు రండి." ఎవరెన్ని విధాల చెప్పినా — చివరికి తండ్రి మందలించినా వినలేదు కల్యాణి. చేసేదిలేక సూర్యాన్నీ మధునీ నిద్రలు లేపి బండి ఎక్కించారు.

తల్లి బాధగా మూలుగుతూ పడివుండటం — అమ్మమ్మ మాటిమాటికీ కళ్ళు తుడుచుకోవటం — అకస్మాత్తుగా బండిలో ఎక్కడికో బయల్దేరటం — అంతా అయోమయమై పోయింది పిల్లలకి. సూర్యం భయంగా తల్లికేసి చూస్తుంటే మధు బిక్కమొహం వేసుకుని అన్నని గట్టిగా కావిలించేసుకున్నాడు. కల్యాణి కళ్ళు తెరచి పిల్లలిద్దర్ని చూసింది. సూర్యం వెక్కి వెక్కి ఏడవటం ప్రారంభించాడు. కొడుకు చేయి పట్టుకొని ఏడవవద్దన్నట్లు వారించింది కల్యాణి. మధు బిత్తర చూపులు చూస్తూ అడిగాడు — "మనం నాన్న దగ్గరికి వెళ్తున్నామా అమ్మా?" — కల్యాణి కళ్ళలో నీరు నిండింది. సుందరమ్మగారు మందలిస్తున్నట్లుగా అంది. — "పిల్లలు భయ పడుతున్నారమ్మా ! వాళ్ళని తీసుకు వచ్చేవరకూ వూరుకున్నావు కావు. బొత్తిగా చిన్నపిల్లలా ఇలా అధైర్యపడితే ఎలాగమ్మా ?" కల్యాణికి ఏమీ వినిపించ లేదు. మరే ధ్యాసా కలగలేదు. మనస్సంతా భర్త మీదకి మళ్ళిపోయింది. ఆయన్ని తను ఇక చూడలేదేమో ! అందుకే ఆయన నోటివెంట ఆ మాటలు వచ్చాయి.

"నిన్ను చూద్దామని వచ్చాను." అన్నారు. బండి దగ్గరకు వస్తూ. అదే ఆఖరి చూపుకాదు గదా ?

కల్యాణి గుండెలు దడదడ లాడాయి. శరీరమంతా చెమటలు పోశాయి.

"కొంచెం మంచినీళ్ళు."

ప్రాణాపాయస్థితిలో ఫలితాన్ని విధి నిర్ణయానికి వదిలేసి డాక్టర్ కల్యాణికి పెద్ద ఆపరేషన్ చేసి బిడ్డని తీశాడు. మత్తు మందుతో స్పృహతప్పి పడివున్న తల్లిని చూసి భయంగా ఏడవటం ప్రారంభించాడు. తెలివి వచ్చినా కల్యాణి స్థితి ఆశాజనకంగా మారలేదు. విపరీతమైన దాహంతో మంచినీళ్ళ కోసం సైగ చేసిన కల్యాణికి ఇంజక్షన్ చేశాడు డాక్టర్.

కల్యాణి హృదయంలో మూగగా రోదించింది. కొడుకులకు ఏదో చెప్పాలని ఆరాటపడింది. భర్తని ఒక్కసారి చూసుకోవాలని తపించి పోయింది — పూర్తిగా అధైర్యపడి పోయిన కల్యాణికి ఇక తాను జీవించటం మీద నమ్మకం లేదు. అంతిమదశలో కల్యాణిని సంతోషపెట్టింది కూతురి పుట్టుక — "పాప....... పాప పుట్టింది. పాప ...."

అంటూ అస్పష్టంగా ఉచ్చరించుకొంది. డాక్టర్ మరేదో ఇంజక్షన్ ఇవ్వటానికి సిద్ధపడుతుంటే ఇక ఆ అవసరం లేకపోయింది. కల్యాణి అశాంతిగా కళ్ళు మూసింది — శాశ్వతంగా ....

(సశేషం)

ఆ ప్రకారమే చేసేవారు వాళ్ళ నాన్నగారు. తండ్రి తన మనసు కనుక్కుని, తను ప్రేమించిన వాడిని బతిమాలి, అతడి కోరికలు తీర్చి, అల్లుడుగా తెచ్చుకుంటాడని అనుకుందా ?

ఆ ఆలోచన రాగానే అతనికి మళ్ళీ ఉత్సాహం వచ్చింది. అవును. మనసు తన మీద, పెళ్లి ఇంకొకరితో. పాపం ఏం అవస్థ పడుతోందో ? మనో సంఘర్షణ భరించడం కష్టం.

తన మీద ఆమెకి ఎనలేని ప్రేమ. తనతో ఎంత చనువుగా ఉండేది !

హఠాత్తుగా అతనికి ఆమె భర్త గుర్తుకు వచ్చాడు. 'పూర్ ఫెలో' అనుకున్నాడు. భార్య మనస్సు అన్యథా ఉందని అతనికి తెలిసి ఉంటుందా ?

ఆ తర్వాత అతడి వూహ మరికొంత దూరం పోయింది.

ఇప్పుడామె తన కథలు పిచ్చి వ్యామోహంతో చదువుతూ ఉంటుంది. పుస్తకాల బీరువాలో ఒక అర తన నవలల కోసం ప్రత్యేకించి ఉంచుతుంది. దీపావళి కథల పోటీలో తనకి మొదటి బహుమతి వచ్చినందుకు అభినందిస్తుంది. ఈ మధ్య తను రాసిన కథలన్నిటి గురించి ఒక్కసారి అభిప్రాయం ఇవ్వలేక 'అన్నీ బాగున్నాయి' అంటుంది. తన కథలంటే ఆమెకెంతో ఇష్టం. సత్యమూర్తి ఉక్కిరి బిక్కిరయి పోయాడు.

స్టేషను వచ్చేసరికి పెట్టె పుచ్చుకుని దిగబోయాడు. 'మీరు వాల్తేరులో దిగాలని చెప్పారు గదా.' అన్నాడు ప్రక్కతను. అర్థం కానట్లు చూశాడు సత్యమూర్తి. 'ఇది సామర్లకోట' అన్నాడు ఆయన. గడియారం, చూసిన తర్వాత కాని నమ్మలేదు సత్యమూర్తి.

తర్వాత కొన్ని సంవత్సరాలకి విశాఖపట్నం చేరుకుంది బండి. బండి దిగటం భోజనం చెయ్యటం, పెళ్లి వారింటికి వెళ్ళటం, స్నానం చేసి కొద్దిగా టిఫిన్ చెయ్యటం ఇవన్నీ రాధ గురించి ఆలోచించకుండా గబగబా చేశాడు. వెంటనే బయలుదేరాడు.

*　　*　　*

మూసి ఉన్న తలుపు దగ్గరికి వచ్చాక అతనికి సందేహం పట్టుకుంది. రాధని పిలవాలా, ఆమె భర్త పేరు పిలవాలా ? జేబులోంచి కాగితం తీసి చూశాడు. 'మోహనరావు' అని ఉంది మోహన రావుగారూ అని పిలవటానికి సగ్గేసింది. అతనెవరో తనకి పరిచయం లేదు. ఇంటి గృహిణే తనకి తెలుసు. ఎలా పిలవాలి ?

కాసేపు ఆలోచించి అతను తలుపు తట్టాడు ఎవరూ పలకలేదు. రెండవసారి తలుపు తట్టినప్పుడు 'ఎవరూ ?' అని వినపడింది. కాని తలుపులు తెరుచుకోలేదు. సత్యమూర్తి మళ్ళీ తలుపు తట్టాడు. ఈ మాటు కూడా 'ఎవరూ' అని వినపడింది. కొంచెం సేపయ్యాక తలుపు తెరుచుకుంది. ఒక చిన్న పిల్ల గుమ్మంలో నుంచుని 'నాన్నగారు లేరు' అంది.

సత్యమూర్తికి అప్పటికే సిగ్గుతో చచ్చిపోతున్నట్లు అనిపించింది. 'మీ అమ్మ గారు లేరా' అని అడిగాడు.

'అమ్మా నువ్వు కావాలిట' అంటూ లోపలికి పరిగెత్తింది ఆ అమ్మాయి. అతనికి తల తీసేసి నట్లయింది.

ది గ్లర్ విత్ స్నేరింగ్

24 వ పేజీ తరువాయి

ఇంతలో ఒకామె వచ్చింది అక్కడికి. 'ఆయన లేరు' అని లోపలికి పోబోయి ఆగింది. సత్యమూర్తి కూడా పరీక్షగా చూశాడు ఆమెని. సందేహంలేదు ఆమె రాధ.

.... కాని చాలా మారిపోయింది. నిండు చీర, ఒంటి నిండా కప్పుకుంది. ఒక్క జడ వేసుకుంది. మామూలు బొట్టు పెట్టుకుంది. చెవలకిదుద్దులూ కాళ్ళకి మట్టెలూ, మెళ్లో మంగళ సూత్రం, నల్ల పూసలూ, ఆ కళ్ళు మారలేదు గాని వాటిలో చిలిపితనమూ, పలకరింపూ లేవు. ఒంటిలో ఎక్కువ సత్తువ ఉన్నట్లు లేదు. తానెరిగిన రాధ కాదు ఈ రాధమ్మ.

'మీరు....' అని నీళ్ళు నమిలి 'రాధగారు కదూ' అన్నాడు.

'సత్యమూర్తిగారు' అంది ఆమె ఆశ్చర్యంగా. ఆ సంబోధనలు అతనికే ఆశ్చర్యం కలిగించాయి. 'మూర్తి' అని ఆమె. 'రాధా' అని తనూ పిలుచుకునే వారు.

ఆమె ముఖం చూస్తేనే తెలుస్తోంది. లోపలికి పిలవాలా, వద్దా అని తటపటాయిస్తోంది. సత్యమూర్తికి వెనక్కి వెళ్లిపోవాలనిపించింది. కాని ఎలా వెడతాడు ? వెళ్ళే మాటైతే ఎందుకు వచ్చినట్లు ?

'ఆయన గదిలో కూర్చుందురుగాని రండి.'

ఆ గదిలో కూర్చున్నాడు, ముళ్లమీద కూర్చున్నట్లుగా కాఫీ పంపించింది పిల్లచేత. 'ఇప్పుడేం తాగను వద్దు' అన్నాడు. 'పరవాలేదు తాగండి' అందామె గది అవతల నుంచుని---- తరవాత ఆ పిల్లని చూపి 'మా పెద్దమ్మాయి' అంది. ఏ మనాలో తెలియలేదు సత్యమూర్తికి 'ఒక్కర్తేనా' అన్నాడు సిగ్గుపడుతూ. 'లేదు. తర్వాత వాడు ఆడుకోవటానికి వెళ్ళాడు.' అంది.

తర్వాత సంభాషణ కొంతసేపు సాగలేదు.

'ఇంకా కథలు రాస్తున్నారా' అని అడిగింది.

ఏదో జ్ఞాపకం వచ్చినట్లు చుట్టూ చూశాడు. పుస్తకాల బీరువా ఉందిగాని దాన్నిండా 'లా' పుస్తకాలు.

'అప్పుడప్పుడు' అన్నాడు.

మళ్ళీ నిశ్శబ్దం. రాధ రెండో కొడుకు వచ్చినట్లున్నాడు. 'మావయ్య ఉన్నాడు ఆ గదిలో' అని చెబుతోంది ఆ మొదటి అమ్మాయి. తర్వాత వాళ్ళిద్దరూ గదిలోకి వచ్చి కొంత సేపుండి వెళ్లిపోయారు.

'బిస్కట్ల పొట్లం తెచ్చినా బాగుండేది. వాళ్ళకి ఇద్దును' అనుకున్నాడు.

సత్యమూర్తికి ఇంక ఉండ బుద్ధికావటం లేదు. కాని అతన్ని చూడకుండా వెడితే బాగుంటుందా ? ఎప్పుడు వస్తాడో ? ఎలా తెలుస్తుంది? ఏమని అడగాలి ?

'ఆయనెప్పుడు వస్తారు ? అనాలా' ? 'బావగారు ఎప్పుడు వస్తారు అనాలా ? కాకపోతే 'మోహనరావుగారు ఎప్పుడు వస్తారు ?' అనాలా?

అంతకంతకీ 'అనీజీనెస్' ఎక్కువయి పోతోంది. అతనికి. 'నే వస్తాను. పనుంది. చూసిపోదామని వచ్చాను' అన్నాడు.

'అదేమిటి ఆయన వచ్చేదాకా ఉండరా ?'

'ఎప్పుడొస్తారు ?'

'వచ్చే వేళయింది.'

మరో పది నిమిషాలు చూశాడు.

'నాకు పనుంది. నేను వెళ్లిపోవాలి' అని 'ఆయనతో చెప్పండి నేను వచ్చినట్లు' అన్నాడు.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

గుమ్మం దాటుతుండగానే అతనెవరో ఎదురు వచ్చాడు 'రాణీ' అని పిలుస్తూ. అప్పుడు గుర్తు వచ్చింది సత్యమూర్తికి ఆమె పూర్తి పేరు రాధారాణి అని. ఇప్పుడు ఆమె రాధ కాదు రాణి.

'ఈయన సత్యమూర్తిగారు. నాతో కాలేజీలో చదువుకున్నారు' అంది.

'గ్లాడ్ టు మీట్ యూ'

'సేమ్ విత్ మీ'

'లోపలికి రండి' అన్నాడు.

'లేదు పనుంది వెళ్లిపోవాలి. చాలా సేపయింది నేను వచ్చి.'

'పరవాలేదు. ఎక్కడ దిగారు ?'

'మా బంధువులింట్లో'

'నేను కబురు పంపుతాలెండి. ఈ రాత్రి ఇక్కడ ఉండిపోండి'

'కాదు. వాళ్లింట్లో పెళ్లి. ఇంకో గంటలో లగ్నం.'

'అలా అయితే ఉండ మనటం భావ్యం కాదు. రేపు రండి. ప్రొద్దున నేను కోర్టుకు వెళ్ళటంలేదు.' అన్నాడు.

అని భార్యకేసి తిరిగి కాఫీ ఇచ్చావా అన్నాడు. ఆమె తల వూపింది. 'మర్చిపోకండి' అన్నాడు సత్యమూర్తి నుద్దేశించి.

'అలాగే' అని బయటపడ్డాడు సత్యమూర్తి.

స్వేచ్ఛగా వూపిరి పీల్చుకున్నాడు.

'బిడియస్తుడా' అని అతను అడగటం, 'ఉష్. గట్టిగా అనకండి. అతను వింటాడు' అని ఆమె అనటం లీలగా వినపడ్డాయి.

*　　*　　*

'అబ్బ ఏదో మాడు వాసన కొడుతోంది ! ఏమిటి తగల బెడుతున్నారు ?' అంటూ వచ్చింది శారద.

'ఏవో పాత కాగితాలు' అన్నాడు.

'అరే ఏదో పుస్తకం, డైరీలాగుంది. అంది అది తియ్యబోతూ. అతడు ఆమెని వారించాడు. 'అది అలా ఉండనీ. డైరీకాదులే అది. పాత నోట్ బుక్. ఆ అట్టవేశాను అని ఇంకో అగ్గిపుల్ల వేసి అది పూర్తిగా కాలాక బూడిద తీసి బయట పారబోసి, చేతులు కడుక్కుని, 'తొందరగా తయారవు, సినిమాకి వెడదాం' అన్నాడు సత్యమూర్తి. ★

ఇంటాయన, గడుసుభార్యతో

"ఇదుగో, రెండు రోజులు సెలవు ఇప్పించవ్ ! అలా పుట్టింటికి వెళ్లొస్తాను."

రవిబాబు (విజయవాడ)

ఎన్. టి. ఆర్. తో
ముఖాముఖి

వీరాజీ



(గతసంచిక తరువాయి)

ఇంటినిండా రామాయణ గ్రంథాలే?

రామ రావణులలో ఎవరు? ఎవరు? అనిపించేటంత దక్షతతో విశిష్టంగా ఈ రెండు పాత్రలను పోషించిన శ్రీ రామారావు ఒక చరిత్రాత్మకం కాగల చిత్ర నిర్మాణానికి పూనుకోనున్నారు. రావణుని పాత్రను హుందాగా, దర్పంగా, సృష్టించి రాక్షసత్వాన్ని, రసికతను, అహంకారాన్ని భక్తి తత్పరతను ఆత్మ విశ్వాసాన్ని, శత్రు ద్వేషాన్ని మేళవించి, ఒక వినూత్న పాత్ర కల్పనకు పూనుకుని శ్రీ ఎన్.టి ఆర్ సంపాదించిన పేరు ప్రఖ్యాతి— అదే రామారావు నిగ్రహామూర్తి, ఏకపత్నీవ్రతుడు, ప్రజాభిరాముడు అయిన రఘురాముని పాత్రను అంత నిగ్రహంతోను పోషించి — ఆ కీర్తిని మరింత ఇనుమడింప జేసుకున్నారు.

ఇక ముందు ఎన్. ఏ. టి వారి రామ పట్టాభిషేకంలో రామ రావణ పాత్రలను రెండూ ఒకేసారి ధరించ నున్నారు కూడా.

ఒకే నటునికి ఇది అసాధ్యంగా అగుపిస్తుంది కాని రామారావుకిది ఏకాగ్రత, తదేకధ్యానము, రాముని, రావణుని, వివిధ గ్రంథములనుంచి సంతరించుకొని తనలో నిలుపుకుని ప్రదర్శించగల దీక్ష చేత సాధ్యపడ్తాయని మనందరికీ నమ్మకముంది

నిజానికి పాత్రను క్షుణ్ణంగా తెలుసుకోడం ముఖ్యంగా పురాణ పురుషుల వేషాలు ధరిస్తున్నప్పుడు— 'పాత్ర' శీలాన్ని, తత్వాన్ని ఆయా గ్రంధాల నుంచి— శ్రద్ధగా పట్టుదలతో సంతరించుకుని కళా సరస్వతి ఎదుట శిష్యునిలా దానిని వినయంగా తలదాల్చి నిర్వహించడమే ఈ "తెరవేలుపు" విజయం లోని అసలు కిటుకు.

వాళ్ళ ఇంట్లో లైబ్రరీలో ఉన్న పుస్తకాలన్నీ ఒక ఎత్తు రకరకాల రామాయణ గ్రంధాలన్నీ అంత కన్నా ఎత్తు!

మెళకువలు

○ మీరు ధరించనున్న పాత్రల విషయంలో మీరు ఎటువంటి మెళుకువలు తీసుకుంటారు? గ్లామర్ లేని పాత్రలు వేయడం మీకు ఇష్టమేనా?

"సాంఘికాలలో అంత స్టడీకి వీలు లేదు గాని పురాణ పురుషుల పాత్రల విషయమైతేను చరిత్రాత్మకమైతేను పాత్ర తత్వాన్ని చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించి అనాలిసిస్ చేసుకుని తదనుగుణమైన తర్ఫీదును మానసికంగా శారీరకంగా పొంది దానికి జీవం పోస్తాను"అన్నాడాయన.

ముఖ్యంగా కృష్ణదేవరాయల వేషం తెనాలి రామకృష్ణలో చుశాం— అలాగే భూకైలాస్‌లో రావణున్ని చూశాం— ఆ తర్వాత రావణున్ని, కృష్ణదేవరాయల్నికూడా శ్రీ రామారావు ఎట్టి మెళకువతో శ్రద్ధతో రూపొందించారో దానికి తార్కాణ గా, సీతారామ కళ్యాణం, తిమ్మరుసులు రెండూ ఉండనే ఉన్నాయి.

'శ్రీనివాసుని' గా తెర మీద నిలిచిన శ్రీ రామారావుకి ఇష్టదైవం ఏడుకొండలవాడే! శనివారం నాడు పాన్పుమీద పడుకోవడం నీచు తినడం అశ్లీల పదజాలం అనడం లాంటి పనులేమి చేయనన్నారు. అతని భక్తి ఆత్మ విశ్వాస పూరితంగా ఉన్నది!


"పురాణ పురుషుల వేషం వేస్తున్నప్పుడు నడక, చూపు, మాట, ఉచ్చారణ, మొదలైనవన్నీ మారి పోతాయి. మరొక అలౌకికమైన అనుభూతికి, వాతావరణానికి దగ్గరగా వెళితేనే గాని అది సాధ్యం కాదు. మహా పురుషుల పాత్రకు రూప కల్పననిస్తున్నప్పుడు అందుకనే నేను మామూలుకన్నా నియమం, నిష్ఠ పాటిస్తాను. మరింత నిర్మల హృదయంతో వీటిని స్వీకరించి నిర్వహిస్తాను." అంటాడాయన.

పాత్ర పోషణలో తొలి దశలో ఎంతటి రిస్క్ అయినా తీసుకోగల శ్రీ రామారావుకి తొలిచిత్రమూ, తొలి శతదినోత్సవ చిత్రమూ అయిన పల్లెటూరి పిల్ల లోనే ఎద్దుతో పోరాడుతున్నప్పుడు చేతికి దెబ్బ తగిలింది! అలాగే మరో సారి విశేషించి ప్రజా ప్రజాదరణ పొందిన చిత్రం చిరంజీవులులో గ్రుడ్డివానిగా నటిస్తున్నప్పుడు శ్రీ రామారావు, "కళ్లకు" ప్లాస్టిక్ గంతలు పెట్టుకొని నటించారట! అప్పుడు షూటింగ్ అయ్యాక మూడ్రోజులు, ఈ నటునికి ప్రపంచం అగుపించడం మానేసింది ఇంతకు మించి ఈ నటుని సుదీర్ఘమైన విజయవంతమైన కెరీర్‌లో, నిర్మాతలకు చిత్రాలకు వాటి పురోగతికి ఆటంకంకాగల "హెన్ బ్రేక్‌డౌన్" లేం రాలేదు!

లక్షలాది వ్యాపారం, చిత్ర పరిశ్రమ ఈ నటుని మీద ఇవాళ ఆధారపడి ఉన్నది. గనుక సాధ్యమైనంతవరకు ప్రస్తుతం రిస్క్ తీసుకోవడం లేదు కాని పెంపుడు కూతురులో కుస్తీ సీనులలో శ్రీ రామారావునే నేరుగా చూశారు ప్రేక్షకులు. సాధారణంగా ఈ తెనుగు మాటని ఐడల్ స్టంట్ చిత్రాలన్ని హిట్లే!

చిన్నప్పుడు జాన్‌కేవాస్ నాడియా చిత్రాలు చూసి కేక లేసేవాళ్లం. అలాగే అగ్గి రాముడు, రేచుక్క పగటిచుక్క 'బందిపోటు' చిత్రాలు టీన్ ఏజర్స్ ఈలల్నీ ఆనందాన్ని విపరీతంగా దోచుకున్నాయి

వెయ్యిరూపాయలకు [కొత్త తక్కువ] వెల పెట్టి తాను సరదాపడి కొనుక్కున్న కుర్చీలో రామారావు... ఈ బొమ్మ చూస్తే అతని అభిరుచి కూడా కొంత తెలియకపోదు.



ఇంట్లో పుంజే తన అభిమానులను ముకుళితహస్తుడై...

సర్టిఫికేట్‌లు !

శ్రీ రామారావులోని గ్లామర్ చాలావరకు భగవంతుడిచ్చిందే. అందగాడని అందరూ అనుకునే ఈ నటుడు "పిచ్చిపుల్లయ్య" లోను "కలిసి ఉంటే కలదు సుఖం" "దాసి" చిత్రాలలో వేసిన పాత్రలు గాని 'రాజు—పేద' వేసిన పాత్రగాని సంకోచం లేకుండా వేసి శభాష్ అనిపించుకున్నాడు. ఈ పాత్రలు ఇతని స్థాయిని పతాకస్థాయికి అందించాయి. 'మల్లీశ్వరి' "దాసి" పాతాళభైరవి" "వాల్మీకి" "భట్టివిక్రమార్క" "భీష్మ" "ఇంటిగుట్టు" "కలసివుంటే కలదు సుఖం" లాంటి జంట చిత్రాలను జ్ఞాపకం తెచ్చుకోండి, శ్రీ రామారావు ఎంతటి విభిన్న తత్వాలు గల పాత్రలకు ఎంతటి సమర్థతతో జీవం పోసి శోభనిపించుకున్నాడో సుళువుగా తెలుస్తుంది!

'మీరు చలన చిత్ర రంగంలో అడుగెట్టినప్పటికంటే ఇవాళ కొత్త టాలెంట్‌కి అవసరం ఉందంటారా ?' అని అడిగితే

"కొత్త టాలెంట్‌కి అవసరం యెప్పుడూ ఉంది. అది యెప్పుడూ ఉంటుంది" అన్నాడాయన.

ఎన్. ఏ. టి. సంస్థ వహీదా రహ్మాన్, బి. సరోజా దేవి లాంటి వాళ్లను వెలుగులోనికి తెచ్చిన సంగతి ఇక్కడ పేర్కొంటే అప్రస్తుతం కాదేమో.


మీకు కొత్తలో అదివరకటి వారిని అనుకరించే అవసరాలు కలిగాయా ?

"లేదు. నాకు మంచి అభ్యాసం తర్ఫీదు లభ్యమయ్యాయి. రాత్రి పగలూ అదే పనిగా మొదటి చిత్రాలు మల్లీశ్వరి, పాతాళభైరవి లాంటి వాటిలో అధ్యయనం అభ్యాసం దొరికాయి"

శ్రీ రామారావు నాటకంలోని నటనకూ సినిమాలోని టెంతటిక్ టెక్నిక్‌కూ గల వ్యత్యాసాన్ని అంగీకరిస్తారు. నాటకం సినిమాకు నేరుగా తీసుకొని రాగల సోపానం కాదేమో కాని ఆ అనుభవం మంచిదే !

"వస్తువుకి ట్రీట్‌మెంట్ ఎక్కువ దోహదిస్తుంది. చిత్ర నిర్మాణ దశకి ముందు పకడ్బందీగా అన్నీ తయారు చేసి ఉంచుకుంటే మేలు."


ఇంత అగ్రస్థాయికి వచ్చినప్పుడు కూడా సాధారణంగా పెద్ద నటులకు ఉండే దురలవాట్లు యితనిలో చాలా లేవని తోస్తోంది.



చిత్రయాత్రలో మైలురాళ్లయిన కొన్ని పాత్రలు, వాటిని ధరించిన నటునికి హస్తకళలపై లలిత వస్తువులపై గల మక్కువ రెండూ యీ చిత్రంలో చూడవచ్చును.



('54 లో) 'రేచుక్క'లో



('64)దీర్ఘాలోచనా నిమగ్నుడైన యన్. టి. రామారావు.

'ఆంధ్రసచిత్ర వారపత్రిక'లో ప్రచురణకు ఇండియన్ ఇంక్‌తో వేసిన కార్టూనులు మాత్రమే పంపాలి. సాధారణంగా 4" × 2", 4" × 4" చిత్రాలు పత్రికలో పడుతూ ఉంటాయి.

ముఖాముఖి

"ప్రజాభిమాన మున్నంతకాలం అన్నిరకాల వేషాలువేస్తూ ప్రజారంజన చేస్తూనే ఉంటాను"

దర్శకుని విలువ

"ఆయన సెట్లకు ఆలస్యంగా వెళ్లడం అసంభవాలలో ఒకటి." ఈ మాట చాలా మంది నోట విన్నాను నేను పైగా 'మీరు దర్శకులకు సలహాలు ఇవ్వడం, మీ వద్దకు వచ్చే నిర్మాతలపై ఆంక్షలను విధించడం చేస్తారా ?" అని అడిగితే శ్రీ రామారావు నవ్వుతూ "నిర్మాతలలో పూర్తిగా సహకరిస్తానని ఆ సహకారాన్ని సద్వినియోగం చేసుకోమనీ" ఆకాంక్ష విధిస్తాననిఅన్నారు. "దర్శకుడు తానై కోరితే తప్ప, నేను సలహా లివ్వను." అన్నప్పుడు నేనాశ్చర్యపోయాను. సాధారణంగా అగ్రస్థాయి నటులు పబ్లిసిటీ మొదలు కాస్ట్యూమ్ వరకూ తమ ఇష్టానిష్టాలు నెరవేర్చుకోవాలనుకుంటారని ప్రతిదానిలోను వేలు పెట్టాలని చూస్తారని వింటాము కదా! కాని శ్రీ రామారావు తనకి క్షుణ్ణంగా ఈ పరిశ్రమ— కళ రెండూ క్షుణ్ణంగా తెలిసి ఉండీ దర్శకునికి ఆ స్థానానికి నిర్మాతకి అతని బాధ్యతకి ఇంత విలువ ఇస్తారంటే ఎంతేనా మెచ్చుకోవాల్సి ఉంది.

శ్రీ రామారావు నిండైన విగ్రహం— అతనిది ఆరోగ్య దాయకమైన విగ్రహం— దురభ్యాసాలు, లేని అతనిలో 'కళ' ఉట్టి పడుతూ ఉంటుంది.

○ మీరు ఇన్ని చిత్రాల్లో నటిస్తున్నారు. ఇది కాస్త యెక్కువ బరువేమో ? పోతే మీరు 'హీరో' గానే విరమిస్తారా ? (నేను మీరు ఎవర్ గ్రీన్ హీరోగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను.)

"నిజమే, పరిశ్రమ పురోగతి దృష్ట్యా నేను నిర్మాతలతో సహకరించడానికి ఇంత 'పని' చేస్తున్నాను. ప్రజాభిమానము నిర్మాతల భరోసా ఈ రెండూ నాకు నిజమైన ప్రోత్సాహాలు — నేను గ్లామర్ లేని పాత్రలు వేయడానికి ఎంత ఇష్టపడతానో అందరికీ తెల్సిందే. . . . నేను కళారంగం మంచి చిత్రసీమ నుంచి కళాకారుని గానే ప్రజాభిమాన మున్నంత కాలం అన్ని రకాల వేషాలను వేస్తు ప్రజారంజన చేస్తూ విరమించక ఉంటాను.

○ రాజకీయాలు ?

అతనికి—వాటిజోలి అక్కర్లేదు. ప్రజాసేవకి అవసరమైతే తన శక్తివంచన లేకుండా తోడ్పడడం అనే మంచి అలవాటుంది. వెనుక రాయలసీమ క్షామ నిధికై ఆయన చేసిన కృషి మనం మరిచి పోలేదు కదా ! ప్రపంచ పర్యటన, ఇతర వ్యాపారాలు మొదలైన వాటి విషయంలో ఇప్పుడే ఆలోచనలు లేవు.

పిల్లల విషయంలో...

శ్రీ రామారావు పిల్లల భవిష్యత్తు విషయంలో తాను తీసుకోగల జాగ్రత్త అంతా ఒక్క మాటలో చెప్పారు. "సాధ్యమైనంత ఎక్కువగా చదువు చెప్పిస్తాను" అని.

"పెద్దమ్మాయికి పియానో అంటే యిష్టం. నేర్పిస్తున్నాను"— పియానో చూపి వేడుకగాను.



టీ తాగుతున్న యీ ఎన్.టీ. రామారావు యీ చిత్రం మరీ ప్రత్యేకం!

పై వాక్యం ఆయన సమాధానం. పిల్లలకి తాను ఔట్‌డోర్ షూటింగ్‌కి వెళ్లినప్పుడు బొమ్మలు తెచ్చే సరదా శ్రద్ధా ఉన్నా— సాధ్యమైనంతవరకూ "వాళ్లను దూరంగా ఉంచడం" చేస్తానంటారు శ్రీ రామారావు.

"బెంగళూర్‌లో చదువుకుంటున్న పెద్దవాడి పేరుచి జయకృష్ణ. ముగ్గురాడ పిల్లల పేర్లు "ఈశ్వరి" అనే ద్వితీయ నామధేయంలో పూర్తవుతాయి. అబ్బాయిలారుగురు పేర్లలోను "కృష్ణ" ఉన్నది. పిల్లలంతా చిన్న పిల్లలు. ఆఖరి చిరంజీవి రామకృష్ణ వాళ్ల అమ్మమ్మ దగ్గర ఆడుకుంటున్నాడు. శ్రీ రామారావుకి తల్లిదండ్రులమీద ఎనలేని భక్తి, పిల్లలమీద ప్రేమ ఉన్నాయి. అన్నదమ్ములు రామారావు, త్రివిక్రమరావు లిద్దరూ పాదపూజ చేసి "అమ్మకీ నాన్నగారికీ" తమ సీతారామకళ్యాణాన్ని అంకితం చేయడం అందరికీ తెలిసిందే.

"రేసులాడతారా?" నవ్వుతూ అడిగాను.


"సిగరెట్‌లు కాల్చడం అలవాటు లేదు" నవ్వుతూ అన్నాడాయన. అసలు దేనికైనా తీరిక ఎక్కడ?

శ్రీ రామారావు యివాళ ఒప్పుకుంటున్న, ఒప్పుకున్న చాలా చిత్రాలలో సాంఘికాలు చాలా ఉన్నాయి.

వీటి ప్రసక్తి వచ్చినప్పుడు నేను చాలా ప్రశ్నలు నిర్మొహమాటంగా అడిగాను. సాంఘిక చిత్రాలు కానివ్వండి, మరొకటి అవనీండి— తనకు పూర్తి అవగాహనకి "స్టడీ"కి వీలులేని పద్ధతిలో, చాలా చాలా చిత్రాల 'పథక రచన' నిర్మాణ క్రమం ఉండటం వల్ల ఒకటీఅరా చిత్రాలలో యిటీవల శ్రీ రామారావు నటన మిగిలిన చిత్రాలంతగా రాణించక పోవడానికి కారణంగా తోస్తోంది.

'నటనయే నా వృత్తి'

"మంత్రి అవ్వాలనుందా?" ఇద్దరం నవ్వుతూన్నాము. తటస్థవడ్డ శ్రీ బి. యన్. కూడా నవ్వు డైరెక్టు చేయడం కాదు— నవ్వేస్తున్నారు.



ప్రభుత్వ ప్రశంస '63 సంవత్సరంలో రామారావుకి, లవకుశ, నర్తనశాల, కర్ణన్ చిత్రాలద్వారా లభ్యమైంది!

"నాకీ వృత్తి, యీ పరిశ్రమ యీ కళ తృప్తినిస్తున్నాయి. మంత్రి నవ్వాలనుకోడం లేదు.

ప్రస్తుతం నటిస్తున్న పాత్రలలో హరిశ్చంద్రుడూ— దుష్యంతుడూ కూడా ఉన్నాయి. ఎన్.ఏ.టి వారి 'కృష్ణపాండవీయం' లో మళ్ళా శ్రీ రామారావుని కృష్ణునిగానే గాక కార్యదక్షునిగా కూడా చూడవచ్చును అనుకుంటాను.

సెట్స్‌మీద, ఇంట్లో, యితర సభలుసమావేశాలు (సన్మానాలంటే అతనికి గిట్టదు.)మొదలైన వాటిలో ఎక్కడైనా సరే శ్రీ రామారావులో— చూసేవారికి, అతనిలోని ధారణశక్తి, తన బాధ్యతపై గల మక్కువ, మిగిలిన గుణాలకన్నా ఎక్కువగా ఉన్నాయన్నది తెలుస్తుంది.

శ్రీ రామారావు యిప్పుడున్న "ఫార్మ్" చూస్తే "డబుల్ సెంచరీ" చాలా తొందరగా పూర్తిచేస్తారనిపిస్తోంది" అన్న మాటలో అతియో శక్తిలేదు.

ఎవర్‌గ్రీన్ హీరోగా ఉండి, శ్రీ రామారావు "డబుల్ సెంచరీ నాట్ ఔట్"గా ప్రేక్షకులను రంజింపచేస్తూ ముందుతరం నటులకు ఆదర్శ నటుడుగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను.

ఇష్టగోష్టి అయ్యాక "థాంక్యూ" అన్నాను రామారావుగారితో. మీతోను అలాగే అంటాను. "థాంక్యూ వెరీమచ్."—

[ఈ శీర్షికలోని ప్రత్యేక ఛాయాచిత్రాలు తీసినది శ్రీ ప్రభాకర్] ★

బాబూ! మధుసూదనం!

మమకారమనేది బాంధవ్యాలకన్నా, స్నేహాలకన్నా అతీతమైనది. దాన్ని పెకలించే సాహసం వ్యక్తులకుగానీ సంఘానికి గానీ లేదు. అలాంటి మమకారం నీకు గౌరికి మధ్య పెంపొందింది. దాని ఫలితమేమిటో తెలిసికూడా, నేను చూస్తూ వూరుకున్నాను. నా చిట్టితల్లి అభిమతానికి అడ్డురావడం నా కిష్టం లేదని నీకు తెలుసు. గౌరి వయసులో చిన్నదైనా ఆలోచనలో ఏ పెద్దలకు తీసిపోదు. అందుకే నాకు గౌరిమీద అంత నమ్మకం. ఏ పని చేసినా ముందుగానే ఆలోచించి చేస్తుందని నా ఉద్దేశ్యం.



బాబూ! ఇప్పటికే వ్యర్థప్రసంగంచేసి నిన్ను విసుగెత్తించాను. అసలు విషయం రాస్తాను. నీవు పోయిన రెండురోజులు గౌరి నిన్ను అడిగింది. వూరికి పోయావని మళ్ళీ వస్తావని సర్ది చెప్పాను. కాని బాగా ఏడ్చి ఏడ్చి నిద్రపోయేది. కానీ మూడు రోజుల నుంచీ జ్వరం రావడం మొదలుపెట్టింది. ఏదో మామూలు జ్వరమని నిర్లక్ష్యంగా ఉన్నాను. కానీ నిన్నటి నుండి జ్వరం తీవ్రత ఎక్కువైంది. కలవరింపులు కూడా వస్తున్నాయి. నిన్ను ఎక్కువగా కలవరిస్తున్నది. ధైర్యం చాలక నీకు వ్రాస్తున్నాను. నీకు తీరిక ఉంటే ఒక్కసారి ఈ ముసలివాని కోరికను మన్నించి వస్తావా బాబూ! నా జీవన జ్యోతి నా ఇంటిలో మళ్ళా వెలిగేటట్లు చేయి బాబూ.

ఇట్లు
దీవెనలతో సుబ్బయ్య."

ఉత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకున్నాడు మధు. ఇప్పుడు ఏమిటి తనకూ పాపకు గల బాంధవ్యం. ఏమీలేదు. పున్నమి చంద్రుని కాంతి రేఖలు సముద్రపుటలల మీద పడి ఎంత ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. అవి బాంధవ్య రేఖలా? చ, చ, కాదు. అవి మమకారరేఖలు. బాంధవ్యరేఖలు: మిట్టమధ్యాహ్నపు రేఖలు, సృష్టిలో కొన్నివస్తువులు, కొన్ని వస్తువులను మాత్రమే ప్రత్యేకంగా ఆకర్షిస్తాయి. మిగిలిన వాటిని ఎందుకు ఆకర్షించవు. "అదే సృష్టి బంధం, మమకారబంధం" అని గొణుక్కున్నాడు మధు.

* * *

కారు పల్లెలో ప్రవేశించింది. గతుకుల రోడ్డులో నెమ్మదిగా పోగి, పెద్ద పావిడి ముందు నిలిచింది. కారు శబ్దం విని సుబ్బయ్యగారు బయటికి వచ్చారు. "వచ్చావా బాబూ! నాకు తెలుసు నువ్వు వస్తావని. రాబాబూ పాపను చూద్దువుగాని. వెంకన్నా పెట్టె కారులోనుండి దించరా!" అంటూ ముందుకు గబగబా నడిచారు. మధు నెమ్మదిగా ఆయన వెనకనే నడిచాడు.

పాప పడుకుని వుంది. మధు నుదురుమీద చెయ్యివేశాడు. ఒళ్ళు కాలిపోతుంది.

"పాపా!" నెమ్మదిగా సుబ్బయ్యగారు పిల్చారు. "చూడమ్మా మధు బాబాయి వచ్చాడు."

"పాపా!" నెమ్మదిగా పిలిచాడు. నెమ్మదిగా పాప కన్నులు తెరచుకున్నాయి. మధు ఆ కళ్ల కిరణాలలో పడ్డాడు. పాప కళ్ళు కాంతితో ఆనందంతో మెరిశాయి. మధు చేతితో పాప చెంపను తాకాడు. పాప తలను ఆ చేతి మీదనే వాల్చింది. నెమ్మదిగా కళ్ళు మూసుకుంది. ఆ అరచేతిలో స్వర్గంలో ఆత్మీయత పాపకు కనిపించింది.

కొంచెంసేపు ఉన్న తరువాత మధు నెమ్మదిగా బయటికి వచ్చాడు. సుబ్బయ్యగారు అనుసరించారు. "సుబ్బయ్యగారు, నేను మరో పదిరోజులు ఇక్కడే ఉంటాను" అన్నాడు మధు నెమ్మదిగా నిట్టూర్పు విడుస్తూ.

"అంతకంటేనా! బాబూ!" అంటూ సుబ్బయ్యగారు ఆనంద బాష్పాలు రాల్చారు.

* * *

పదిహేనురోజుల తరువాత పాప మళ్లీ మామూలు

స్థితికి వచ్చింది. కానీ పాప మధును వదిలిపెట్ట లేదు. తనూ వస్తానంటూ మారాం మొదలుపెట్టింది. పాపకు నచ్చచెప్పేసరికి మధుకు తాతలు తిరిగి వచ్చినంత పనయింది. మళ్ళీ రెండు మూడు రోజుల్లో వస్తానని చెప్పి మధు వెళ్ళిపోయాడు.

మధు రెండురోజులుకొకసారి పాపకు ఉత్తరం వ్రాసేవాడు. వెంటనే పాపకు దగ్గరనుండి జవాబు వచ్చేది. మధును ప్రతి ఉత్తరంలోను రమ్మని వ్రాసేది. "మధు బాబాయ్! మధు బాబాయ్! ఎన్నిసార్లు రమ్మని వ్రాసినా రావేం బాబాయ్? ఈ సారి నీతో మాట్లాడనుపో! నీకునాకు కాయ్!" అని ఇందు మించు ప్రతి ఉత్తరంలోనూ వ్రాసేది. మధు ఆ ముద్దులు కురిపించే వ్రాతను చూచి చిన్నగా నవ్వుకునేవాడు.

ఈ మధ్యకాలంలో మధు పరీక్ష పాసవడం, హైద్రాబాద్ ట్రాన్స్‌ఫర్ అవడం, లలితతో వివాహమవడం ఇంచుమించు ఒకేకాలంలో జరిగాయి.. పాప దగ్గర నుండి వచ్చే ఉత్తరాల ఉరవడి తగ్గింది. నెలకో రెండు నెలలకో ఒక ఉత్తరం వచ్చేది.

* * *

కాలచక్రంలో పదమూడు ఆకులు వెనక్కు తిరిగిపోయాయి.

"ఏమండీ ఎవరిదో మీకు ఉత్తరం వచ్చింది" అంటూ మధు చేతికి ఒక కవరు ఇచ్చింది లలిత. మొదట ఒక పెండ్లి కార్డు, దానివెనుక ఒక తెల్ల కాగితంలో వ్రాసిన ఉత్తరం, బయటికి వచ్చాయి. మధు కవరు విప్పగానే, మధు పెండ్లికార్డు మొదట చదివి ఉత్తరం విప్పాడు. మధు మోహంలో రంగులు మారాయి.

"ఎవరిదండీ పెండ్లిపిలుపు" భర్త మోహంలో మారుతున్న కళను చూచి అడిగింది లలిత.

"పాపది"

"పాప ఎవరండీ"

"నా జీవిత బాటలో ఒక నందనవనము, అమృత సరోవరము"

"కవిత్వం చాలించి అసలు విషయం చెప్పండి. కవి కావలసినవారు పొరపాటున డాక్టరయ్యారు" అంది లలిత నవ్వుతూ.

"అవును లలితా. నా జీవితంలో సామాన్యంగా కవులకు ఎదురయ్యే కొన్ని సంఘటనలు ఎదురయ్యాయి. వాటిలో పాప సమస్య ఒకటి. పాపను గురించి చెప్తాను. వింటావా? ఓపిక ఉందా?" మధు మోహం గంభీరంగా మారింది.

"చెప్పండి," అంది లలిత కుతూహలంగా.

నేను మెడిసిన్ చదివే రోజుల్లో, పల్లెటూళ్ళలో పనిచేసి, వారియొక్క అమాయక జీవితంలోని లోతులను తెలుసుకోవాలని ఉండేది. అందుచేతనే చదువు పూర్తి అవగానే "నంది చెరువు" అనే పల్లెటూరికి వేయించుకున్నాను. ఒక రోజు ఆసుపత్రిలో కూచుని పేషెంట్లను చూస్తున్నాను. వరుసలో ఒక చిన్నపాప; దాదాపు అయిదు, ఆరు సంవత్సరాలుంటాయి. నిలుచుండి చూడ్డానికి చాలా ముచ్చటగా ఉంది. నెమ్మదిగా భయం భయంగా నాదగ్గరకు వచ్చింది.. అప్పటికి చాలామంది పేషెంట్లు వెళ్ళిపోయారు. ఒక అయిదుగురు మాత్రం నిలబడి ఉన్నారు.

"ఏమ్మా పాపా! ఏం కావాలి" అని అడిగాను భుజంమీద చెయ్యివేసి. బదులు చెప్పకుండా నా ముఖంలోకి చూస్తూ నిలబడ్డది.

"చెప్పమ్మా ఏంకావాలి" అని బుజ్జగిస్తూ అడిగాను. మాట్లాడకుండా చేత్తో బయటికి చూపి చూపించింది. అటు చూచాను. కారు తప్ప మరేం కనపడలేదు.

"అది కారు పాపా!" అన్నాను పాపను ఒడిలో తీసుకుంటూ.

"మరేం, మరేం నాకది కావాలి" అంది.

మిగిలిన పేషెంట్లంతా మమ్మల్ని ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఎవరో ఆ కారు నాదని చెప్పి ఉంటారు. అందుకే ఆ పాప నన్ను అడుగుతుందని అనుకున్నాను.

"ఇస్తాను. కూచో పాపా" అన్నాను. మౌనంగా నా పక్కన స్టూలుమీద కూచుంది.

పేషెంట్లంతా వెళ్ళిపోయాక, చెయ్యాల్సిన పనంతా కాంపౌండరుకు, నర్సులకు అప్పజెప్పి పాపను తీసుకుని కారు దగ్గరికి వెళ్ళాను. ముందు సీట్లో పాపను నిలబెట్టి, నెమ్మదిగా రోడ్డుమీద తీసికెళ్ళాను. పాప ముఖంలో ఉత్సాహం స్పష్టంగా కన్పిస్తుంది. పాప ధోరణి చూచి ఆశ్చర్యపోయాను. సామాన్యంగా చిన్నపిల్లలు, ఎక్కువగా మాట్లాడుతారు. అల్లరిచేస్తారు. తమ వయసుకు మించిన తమ మాటల్లో తమకు తెలికుండానే వ్యక్తపరచ చడానికి ప్రయత్నిస్తారు. కానీ ఈ పాప అందుకు భిన్నంగా నాకు కన్పించింది. మౌనంగా సీట్లో నిలుచుని కొంచెంసేపు నేను కారును నడిపే విధానాన్ని, మరి కొంచెంసేపు బయిటి చూడం చేస్తోంది. నేను బాగా మాట్లాడించి ఉత్సాహపరచాలని ప్రయత్నించాను. కానీ నేను మాట్లాడిన మాటకు మాత్రం జవాబు చెప్పేది. కారులోని కొన్ని మీటర్లను చూపించి అవేంటివని అడిగింది. ఇంత చిన్న వయస్సులోనే ఇంతగా గాంభీర్యాన్ని, మౌనాన్ని తన ముఖంలో దాచుకున్న పాప నన్నాశ్చర్యపరచింది. చాలాసేపు రోడ్డుమీద తిరిగాం. చీకటి పడవస్తున్నది.

"ఇకపోదాం పాపా!" అన్నాను.

"ఊఁ" అంటూ తల వూపింది.

కారు వూర్లోకి వచ్చిన తరువాత పాపే దారి చూపించింది. పెద్ద చావిడి ముందు కారు ఆపించింది. చావిడి ముందు ఒకాయన నిలబడి ఉన్నాడు. ఆయన ముఖంలో ఆందోళన స్పష్టంగా కనపడుతూ ఉంది. గంభీరమైన ముఖంలో యవ్వనానికి వార్ధక్యానికి మధ్య జరిగే సంఘర్షణ వలన ఏర్పడే స్పష్టమైన ముడతలు స్పష్టంగా కనపడుతున్నాయి. ముఖంలో దైన్యత గోచరిస్తుంది. ఆజానుబాహుడైన ఆయన కారు తన ఇంటిముందు ఆగగానే దిగివచ్చారు.

"గౌరీ!" అన్నాడాయన రుద్ధపూరితమైన కంఠంతో.

"నాన్నా!" అంటూ పాప ఒక్క గెంతుగెంతి ఆయన ఒళ్ళో చేరింది.

"నన్నొదిలి ఇంతసేపు ఎక్కడికి పోయావమ్మా?" ఆయన కంఠంలో బాధ ధ్వనిస్తోంది.

పాప చేతులు ముద్దుగా తిప్పుతూ "మరేం, మరేం, ఆయన కారులో ఎల్లాను" అంది. ఆయన తల ఎత్తి చూచారు. నన్నుగుర్తుపట్టారు.

"ఓ! డాక్టరుగారా! మా గౌరి చాలా శ్రమ ఇచ్చిందనుకుంటాను" అన్నారు. పాప కిలకిలనవ్వుతూ.

"అబ్బే అదేం లేదండీ" అన్నాను.

ఆయన నన్ను లోపలికాహ్వానించి కూర్చోబెట్టి లోకాభి రామాయణం మొదలు పెట్టారు. మేము మాట్లాడుతున్నంత సేపు పాప పెద్ద మనిషిలా కూర్చుని విన్నది. మాటల సందర్భంలో గౌరి తల్లిలేని పిల్లని, సుబ్బయ్యగారికి పుట్టిన ఆణిముత్యమని తెలుసుకున్నాను.

అది మొదలు పాప రోజూ నాదగ్గరికొచ్చేది. పాప చాలామటుకు మౌనంగానే ఉండేదీ. ఆ కళ్ళలో ఏవో అద్వితీయమైన కాంతి కనిపించేది. కానీ ఆ కళ్ళల్లో అమాయకత్వం మినహా మరే భావం కనిపించేదికాదు. నేను పేషెంట్లను చూచేటప్పుడు మౌనంగా నా పక్కన స్టూలుమీద కూర్చొని చూస్తుండేది. సుబ్బయ్యగారు డబ్బున్న భూస్వామి అవడం వలన గౌరికి ఇంట్లోనే ట్యూషను పెట్టించాడు. ఆ కొద్దిసేపు మినహా మిగిలిన సమయాల్లో నాతోనే ఉండేది. నాతోనే భోంచేసేది. నా దగ్గరే ఒక్కోసారి పడుకునేది. సుబ్బయ్యగారు మాత్రం పాపను అడ్డుపెట్టలేదు. అప్పుడప్పుడు మాత్రం తనే వచ్చి కాసేపుండి పోయేవారు.

అలాగ ఏర్పడిన పరిచయం పాపను, నన్ను తీవ్రంగా బంధించింది. పాప నన్ను వదిలి ఒక్క క్షణం ఉండేది కాదు. అందరూ గౌరీ అని పిలిచేవారు. కానీ నేను మాత్రం పాపా అనిపిలిచే వాడిని. "పాపా!" అని నా కంఠం వినపడగానే పాప నా ప్రక్కన ప్రత్యక్షం అయ్యేది. పాప ఒక్క గంట కన్పించకపోతే నా మనసులో ఒక విధమైన బాధకలిగేది. రెండు సంవత్సరాల తరువాత నేను ఎం.ఎస్. చదవడానికని వచ్చేశాను. పాపను వదిలి రావడానికి నేను నా మనసును చాలా అదుపులో పెట్టవలసి వచ్చింది. ఆనాడు పాప కళ్ళలో కనబడిన బాధను, కన్నీటిని నేను నా జీవితంలో మరిచిపోలేను. లలితా!

మధు సోఫాలో వెనక్కు వాలి నెమ్మదిగా కళ్ళు మూసుకున్నాడు.

"పెండ్లి ఎక్కడ జరుగుతుందండీ" కాఫీ కప్పు తీసుకుంటూ లలిత ప్రశ్నించింది.

"తిరుపతిలో. మనంకూడా పోదాం లలితా!" అన్నాడు మధు లలిత మోహంలోకి చూస్తూ.

"తప్పకుండాను" అని లలిత కాఫీ కప్పు తీసుకొని వెళ్ళిపోయింది.

* * *

"అమ్మా గౌరీ! ఎవరొచ్చారో చూడమ్మా!" అంటూ సుబ్బయ్యగారు సంతోషం పట్టలేక అరిచారు. వార్ధక్యాన్ని ఎదుర్కొంటున్న సుబ్బయ్య గారి మోహంలో సంతోషం తాండవించింది.

గౌరి గబ గబా బయటికొచ్చింది. ఒక్క క్షణం గౌరిని చూచి "పాపేనా!" అని మధు ఆశ్చర్యపోయాడు. గౌరికూడా మధును చూచి కాసేపు గుర్తుపట్టలేకపోయింది. అక్కడక్కడ తలమీద తెల్ల బడిన వెంట్రుకలతో ఉన్న మధును గుర్తించడానికి గౌరికి కొంచెంసేపు పట్టింది.

"మధు బాబాయ్! మధు బాబాయ్!" అంటూ పరిగెత్తుకుంటూ వచ్చి వక్షంలో తలదాచుకుంది.

చివరి మలుపు

"పాపా!" అంటూ తలనిమురుతూంటే మధు కళ్లలో నీళ్లు తిరిగాయి.

"ఇన్ని రోజులకు నేను——————" అంటూ మాటను మధ్యలోనే ఆపేసి పక్క నిలబడ్డ లలిత ను ప్రశ్నార్థకంగా చూచింది.

"మీ పిన్ని పాపా!" అంటూ చిరునవ్వుతో పాప చూపుకు జవాబు చెప్పాడు.

"అదన్న మాట సంగతి" అంటూ లలితవైపు చూచి "నమస్కారం పిన్నీ" అంది చేతులు జోడిస్తూ. లలిత పాపచేతిని చిరునవ్వుతో తను చేతిలోకి తీసుకుని మధు వైపు చూచింది.

"రాబాబాయి! రా పిన్నీ!" అంటూ లలిత చేయిపట్టుకుని దారితీసింది.

"ఎప్పటికీ పాప నాపాపే" అంటూ మధు వారిని అనుసరించాడు. మధు అన్న మాటలను వెనక్కు తిరిగి చూసి నిండుగా నవ్వింది గౌరి. "మీరు అదృష్టవంతులండీ !" అంది లలిత మధుతో విడిదివారింట్లో. పెళ్లిలో పాపవల్ల మధు వహించిన ప్రాముఖ్యాన్ని చూచి లలిత ఆ మాట అంది. మధు చిరునవ్వుతో లలిత మొహంలోకి చూచాడు. ఆ నవ్వులో ఆత్మ సంతృప్తి, ఆత్మీయత, వీడని మమకారం లలితకు కనిపించాయి.

"చూడు లలితా !" మధు కంఠం గంభీరంగా వినపడింది లలితకు.

"నేను జీవితంలో పొందిన మధురానుభూతు లన్నింటిలోకల్లా పాప పరిచయం మహత్తరమైనది. దైవం నిర్ణయించిన మార్గంలో ప్రయాణించేటప్పుడు, ఎన్నో మహత్తర విషయాలను తెలుసుకొంటాం. కొంతమందితో ఆత్మీయత ఏర్పడుతుంది. మరికొంతమందితో బద్ధ వైరం ఏర్పడుతుంది. అవి రెండూ మహత్తర మైనవే. ఆత్మీయతను కానీ, వైరాన్ని కానీ మనం జీవితాంతం మరచిపోలేము. నాకు పాపతో ఏర్పడిన ఆత్మీయత కూడా అలాంటిదే. ఈ జీవితబాట అంతం ఎప్పుడు ? ఇది ఎలాగు ముగుస్తుంది ? ఎప్పుడు ముగుస్తుంది ? అనే ప్రశ్నలు మానవుణ్ణి నిత్యం వేధిస్తూనే ఉన్నాయి. వర్తమానంలో ఉన్న మానవుడు భవిష్యత్తులో ఉన్న ఈ ప్రశ్నలను గురించి ఆలోచించవలసిన అగత్య మేమిటో. వర్తమానాన్ని సుఖతరం చేసుకొనటం వరకే మానవుని ధ్యేయమైతే ఇన్నికష్టా లనుభవించవలసిన అవసరం లేకపోవచ్చును. భవిష్యత్తు, వర్తమానంగా మారుతున్నప్పుడు మనలోని ఆతృత వర్ణనాతీతం. మనం వూహించినది నిజ మవచ్చును. లేదా అబద్ధ మవవచ్చును. అలాగే నేనూ పాప భవిష్యత్తును ఉజ్వలంగా వూహించాను. నేను వూహించినది నిజమైతే నా జీవిత మధురానుభూతి శాశ్వతమైనంత. మరి నేను వూహించినది భవిష్యత్తులో వక్రిస్తే ...." మరి మధు మాట్లాడలేకపోయాడు. కంఠం రుద్ధమైంది.

"వూరుకోండి. అనవసరమైన వాటిని వూహించుకుని బాధపడడం ఎందుకు. తను ప్రేమించిన వ్యక్తిని పెళ్లిచేసుకున్న పాప భవిష్యత్తు ఉజ్వలం కాక మరేం అవుతుంది."

మధు మరి మాట్లాడలేదు. నిశ్శబ్దంగా నిద్రపోవడానికి ప్రయత్నించడం మొదలుపెట్టాడు. బయటి భాజాభాజంత్రీల గొడవ చాలా ఎక్కువగా ఉంది.

కాలపురుషుడు రెండు సంవత్సరాలని వెనక్కునెట్టి ముందుకు సాగిపోయాడు. ఈమధ్య కాలంలో మధుకు పాపదగ్గరనుండి రెండు మూడు ఉత్తరాలు వచ్చాయి. వాటిలో మధుకేమీ ప్రత్యేకత ఏమీ కన్పించలేదు. ఈ రెండు మూడు ఉత్తరాలు పాప భర్త పనిచేస్తున్న చోటునుంచి వచ్చినవే. కాని చివరి ఉత్తరం మాత్రం "నందిచెరువు" నుంచి. పాప వ్రాసింది సుబ్బయ్యగారికి తీవ్రంగా ఉందని. వెంటనే రమ్మని.

మధు ఒక్కడే బయలుదేరి వెళ్ళాడు. మధుని చూడగానే పాప కండ్లనుండి కన్నీరు కాల్వలు కట్టింది. "పాపా!" అని హృదయానికి హత్తుకున్నాడు. "ఏందమ్మా !" అంటూ ఇంట్లో నడిచాడు. సుబ్బయ్య మంచం చుట్టూ ఒకరిద్దరు నిలబడియున్నారు. ఎవరో ఒకావిడ నెత్తిమీద ఐస్ సంచి పెట్టుతున్నది. వంటిమీద స్పృహ లేకుండా సుబ్బయ్యగారు పడుకుని ఉన్నారు. ముఖంలోని గాంభీర్యం మాత్రం ఏమాత్రం తొలగలేదు. కొంచెం సేపటికి డాక్టరు వచ్చారు. మధును చూడగానే పలకరించాడు. పరీక్షించడం అయిపోయిం తరువాత మధును పక్కకు పిలిచాడు." "సారీ ముదలియార్ నాశక్తికొద్దీ ప్రయత్నించాను. ఇది బ్రెయిన్ ఫీవర్. దాని సంగతి మీకు నేను వేరే చెప్పనక్కరలేదు." అన్నాడు. డాక్టర్ వెళ్లిపోయిన తరువాత మధు సుబ్బయ్యగారి మంచం దగ్గరకెళ్ళాడు. పాప తండ్రికాళ్ల మీద పడి ఏడుస్తున్నది. నెమ్మదిగా బయటకెళ్ళాడు. రాత్రికి అందరూ వెళ్ళిపోయారు. మధు అక్కడే ఈజీ చైర్‌లో పడుకున్నాడు. తెల్లవారు జామున ఎందుకో మెలకువ వచ్చి లేచి చూచాడు. పాప అలాగే మంచంమీద తల క్రింద పెట్టి పడుకుని ఉంది. మధుకు అనుమానమేసింది. లేచి వెళ్లి "పల్స్" చూచాడు. చెయ్యి చల్లగా తగిలింది. మధు లేచి నిలబడ్డాడు. అప్రయత్నంగా మధు కళ్ల నుండి రెండు కన్నీటి చుక్కలు రాలిపడ్డాయి. పాప నిద్రపోతున్నాకూడా కన్నీటిచారలు ఇంకా కన్పిస్తున్నాయి. ఒక రోజున పాప తనతో అతి చనువుగా ఉండటం చూచి సుబ్బయ్యగారు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. "బాబూ గౌరిని అందరూ దాని ఆస్తిని చూచి ప్రేమించేవారే తప్ప, దాని హృదయాన్ని ప్రేమించేవారు కనపడలేదు నా బంధువుల్లో. అందుకే గౌరికి మీరంటే అంత ఆత్మీయత".

నెమ్మదిగా మధు తేరుకుని పాపను లేపాడు. తండ్రి శరీరం చల్లగా తగలటం చూచి పాప ఒక్కక్షణం స్తంభించి పోయింది. నెమ్మదిగా పాపను బయటికి తీసుకువెళ్ళాడు. బయటకు వెళ్ళిన తరువాత పాప పూర్వపు స్థితికి వచ్చింది. భోరున మధు హృదయంలో తలదాచుకుని ఏడ్చింది. జరుగవలసిన విధులన్నీ తెల్లవారి జరిగాయి.

పాప పెండ్లినాటికి ఇప్పటికి చాలా మారిందనిపించింది మధుకు. బాగా చిక్కిపోయింది. కళ్ళు గుంటలు పడ్డాయి. నల్లటి చారలు కళ్ల క్రింద

ఏర్పడ్డాయి. మొహం పాలిపోయింది. సుబ్బయ్య గారు మరణించినదానికే పాప ఇలా తయారైందంటే మధు నమ్మలేకపోయాడు., మనస్సులోని ప్రశ్ననే బయటపెట్టాడు. పాప చిరునవ్వు నవ్వడం తప్పఏమీ మాట్లాడలేదు. ఆ చిరునవ్వులో విషాదం తాండ వించింది.

సుబ్బయ్యగారు చనిపోయిన తరువాత గౌరి భర్త శేఖర్ లీవుమీద వచ్చాడు. శేఖర్ పాపలాగ వకౌనమూర్తి కాదు. చాలా కలుపుగోలు మనిషి. నిష్కల్మష హృదయుడు. పాపను గురించి చాలా ప్రేమగా మాట్లాడాడు. మరి పాప క్షీణించడానికి కారణమేమిటో మధుకు బోధపడలేదు.

సుబ్బయ్యగారు తన యావదాస్తిని గౌరి పేర సర్వహక్కులతో వ్రాశాడు. మరి రెండు రోజులుండి మధు బయలుదేరాడు. బయలుదేరే టప్పుడు గౌరికి ధైర్యం చెప్పాడు.

మధ్యకాలంలో పాప దగ్గరినుండి ఒకటి రెండు ఉత్తరాలు వచ్చాయి. తను గర్భంతో ఉన్నట్టు ఒకదాంట్లో వ్రాసింది. మధు ఆ ఉత్తరాన్ని లలి తకు చూపించాడు. లలిత పోదామంది. కానీ మధు ఇష్టపడలేదు. ఒకటేసారి ప్రసవించిన తరువాత పోయి చూస్తే బాగుంటుంటుందన్నాడు.

ఒక రోజు మధుకు శేఖర్ వ్రాసిన ఉత్తరం వచ్చింది. గౌరికి మధును చూడాలని ఉందని అంటుందని రమ్మని ప్రార్థిస్తూ వ్రాశాడు. ఉత్తరం అందిన రెండు రోజులకు మధు, లలితతో సహా బయలుదేరాడు. పాప ఎదురొచ్చింది. చాలా బల హీనంగా ఉంది. నడవడానికికూడా శక్తిలేనట్టు కన్పిస్తూ ఉంది. బలహీనత పాపను కృంగదీసింది. మధును లలితను చూడడంతో సంతోషంగా ఆహ్వానించింది. పాప ముఖంలో మాతృత్వ కళ ప్రకాశిస్తుంది. ఒకప్పుడు తనతో చిన్న ఫ్రాకు వేసికుని తిరిగిన పాప మధుకు గుర్తుకు వచ్చింది. తను పాపను బాల్యదశలో, యువ్వనదశలలో చూచాడు. వీటి రెండిటికన్నా ఉత్తమమైన మాతృత్వ దశలో తను పాపను చూడ బోతున్నాడు. మధుకు చెప్ప లేని ఆనందం కలిగింది.

అంత బలహీనంగా ఉన్న పాపను హాస్పిటల్లో ఎందుకు చేర్పించలేదని శేఖర్‌ను మందలించాడు. శేఖర్ మాట్లాడలేదు. అతని మొహంలో ఏదో అశక్తత గూడుకట్టు కున్నట్టు కన్పించింది. ఆ ఇంట్లో తనకు ఎవ్వరూ ఎదురవ్వలేదు. ఒక్క పని మనుషులు, పాప, శేఖర్ మినహా. మరి అత్తా, వదినె అన్నట్టు పాప వ్రాసిందే —అనుకున్నాడు మధు. కొన్ని జతల కళ్ళు తన్ను చూస్తున్నట్టు మధు గమనించాడు. కానీ పాపను హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళడంలో అవేమీ గమనించలేదు. శేఖర్ లీవుకు అప్లై చేశాడు. గౌరిని వదలి ఒక్క క్షణం ఉండడం లేదు. పాప మధుతో ఏదో చెప్పాలని ప్రయత్నించింది. కానీ శేఖర్ ఉండడంవలనో, లేక మరో కారణంవలనో ఏం మాట్లాడలేదు.

* * *

హాస్పిటల్‌కు వచ్చిన మరునాటి రోజు గౌరికి నొప్పులు ప్రారంభమయ్యాయి. పాప బాధ వర్ణనా తీతంగా ఉంది. మధు తనకు తెలిసిన డాక్టరు మిత్రులతో సంప్రదించాడు. శేఖర్ కళ్ళలో నీళ్ళు తిరగడం, అతనేదో తెలియని బాధపడడం మధు గమనించాడు.

గౌరిని లోపలికి తీసుకెళ్ళారు. మధు, శేఖర్, లలిత బయట కూర్చున్నారు. ఎవ్వరూ మాట్లా డలేదు. అందరి హృదయాల్లోనూ విషాదం, ఆతృత గూడుకట్టుకున్నాయి. కొంచెంసేపటికి నర్సు బయ టికి వచ్చింది. "ఆపరేషన్ కేస్ ప్లీన్" అని చెప్పి ఎలా వచ్చిందో అలా మాయమైంది. సాయంత్రానికి గౌరి ప్రసవించింది. తల్లి, పిల్ల క్షేమంగా ఉన్నారని తెలిసింది. మధు, శేఖర్ లోపలికెళ్ళారు. బిడ్డను చూసి, "పాపకు ప్రతిబింబం అనుకున్నాడు మధు. శేఖర్ ఆనందం వర్ణనాతీతం. గౌరి మధు మొహంలోకి చూసింది. ఆ చూపులో మధుకు, ఎన్నో ఆనంద భావాలు కన్పించాయి. తరువాత బిడ్డను ముద్దుపెట్టుకుంటున్న శేఖర్ వైపు చూచి మనస్సు తృప్తిగా చిరునవ్వు నవ్వింది. మధుతో ఏదో చెప్పాలని ప్రయత్నించింది.

"తరువాత మాట్లాడదాంలే పాపా!" అని గౌరిని వారించాడు.

భర్త: రాధా! నిన్ను ఈ ప్రపంచంలో అన్నింటికంటే ఎక్కువగా ప్రేమిస్తున్నాను. నీ కోసం దేనైనా తృణ ప్రాయంగా త్యజించటానికి సిద్ధంగా ఉన్నాను.

భార్య: అలాగైతే ఈ నెల జీతంతో నాకు ఒక నెక్లెస్ కొని పెట్టండి. అది చాలు ప్రస్తుతానికి.

రాజారావు (తెనాలి)

ఆ రాత్రికి లలిత గౌరి దగ్గర పడుకోవటానికి, మధు, శేఖర్ ఇంటికిపోయి పడుకోవటానికి నిశ్చ యించుకున్నారు.

* * *

నడిరాత్రిలో శేఖర్ గబ గబా మధును తట్టి లేపాడు. మనిషి అపాదమస్తకం ఒణికిపోతున్నాడు. "ఏం జరిగింది శేఖర్" అన్నాడు మధు కంగారుగా. "గౌరికి ఫిట్సు— — — — — ఫోను వచ్చింది" శేఖర్ మాటలు తడబడ్డాయి.

మధు కారు షెడ్డువైపు నైట్‌డ్రెస్‌తోనే పరిగెత్తాడు. శేఖర్ మధును అనుసరించాడు. తడ బడే అడుగులతో.

గౌరిచుట్టూ ఇద్దరు డాక్టర్లు, నర్సులు ఉన్నారు. లలిత కంగారుగా కాళ్ళవైపు నిలబడి చూస్తూ ఉంది. బిడ్డను వేరేచోట పడుకోబెట్టారు.

మధు, శేఖర్ వచ్చేటప్పటికి గౌరి కళ్ళు తేలి పోయి ఉన్నాయి. కాళ్ళుచేతులు బిగుసుకు పోయాయి.

ఆ రాత్రంతా మధు, డాక్టర్లు ఎన్నో విధాల ఫిట్స్ తగ్గించాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు. తెల్లవారు జామున ఫిట్స్ నెమ్మదిగా తగ్గాయి. కళ్ళలోని కాంతి తగ్గిపోతూ గాజుకళ్ళ ఆకృతిని ఏర్పరుచు కుంటున్నాయి. కాళ్ళుచేతుల బిగువు తగ్గింది. అంటే అర్థమేమిటో మధుకు వెంటనే బోధ పడింది.

అతని హృదయంలో బడబాగ్ని ప్రజ్వరిల్లింది. తనతో కారులో తిరిగిన పాప, మారాంచేసి తన పక్కన నిద్రపోయిన పాప, జ్ఞానిలా తన్ను వింత ప్రశ్నలతో వేధించిన పాప, ఈ నాడు నిస్సహాయంగా ఎవ్వరు తోడులేకుండా అనంత దూర ప్రయాణా నికి, తన అంతిమ యాత్రకు బయలుదేరింది. మధు నెమ్మదిగా బయటికి వచ్చాడు. టేబులో మీద తలపెట్టి పడుకున్నాడు. హృదయంలోని బడబాగ్ని వేడికన్నీరుగా ప్రవహించటం మొదలు పెట్టింది.

లోపల శేఖర్ ఏడుస్తున్న గొంతు వినపడింది. నెమ్మదిగా లలిత బయటికి వచ్చింది. మధు లలిత బయటికి వచ్చింది. మధు తలమీద చెయ్యి వేసి "లేవండి పోదాం" అంది.

"పాప పోయింది లలితా, నిర్దాక్షిణ్యంగా నన్ను వదలి పోయింది" అన్నాడు పూడుకుపోయినగొంతుతో.

"పాప జీవితంలో ఒక నందనవనమని మీరేగా అనేవారు. అది మీ జీవితంలో ఒక వెలుగు రేఖ మాత్రమే. క్షణకాలం మీ హృదయాన్ని అమృత సరోవరంలో విహరింప జేసిన అమృత మూర్తి. లేవండి. పోదాం".

మధు లలిత ముఖంలోకి చూచాడు. హృదయం అనంతమైన బాధ ప్రతిధ్వనిస్తున్నా ముఖంలో సంతోషాన్ని కన్పరచడానికి ప్రయత్నిస్తున్న స్త్రీ మూర్తి ధన్యురాలు అనుకున్నాడు. లలిత భుజాన్ని ఆధారంచేసుకుని నెమ్మదిగా బయటికి నడిచాడు. తనను బంధించిన మమకార బంధంలో నాటితో తెగి పోయింది. సుబ్బయ్యగారు వ్రాసినట్టు, దాన్ని వ్యక్తులుగానీ, సంఘం కానీ తెంపలేకపోయింది. కానీ దైవం దాన్ని సాధించగలదనే విషయాన్ని ఆయన విస్మరించాడు అనుకున్నాడు.

* * *

మధు ఒక వారం రోజులు సెలవు పెట్టాడు. మనశ్శాంతి కోసరమై ఒక వారం రోజులు ఎక్కడి కైనా పోదామని నిశ్చయించు కున్నాడు. సరిగ్గా బయలుదేరే సమయానికి ఒక కవరు పోస్టులో వచ్చింది. చింపాడు. మొదట ఒక ఉత్తరం బయ టికి వచ్చింది. దాన్లోని దస్తూరిని ఎక్కడో చూచినట్టు గుర్తు. క్రింద సంతకం చూచాడు శేఖరం. పాప భర్త.

....

ఫిబ్రవరి, 1961

మధుబాబూ!

గౌరి మరణంతో బాటుగా ఆమె పెట్టెలో మీకు వ్రాసిన ఉత్తరం చదివిన వెంటనే నా హృద యం దహించుకుపోయింది. మంచితనానికి విలువ లేని ఈ కుటుంబాన్ని చూస్తుంటే నాకు అసహ్యం కలుగుతూ ఉంది. రాక్షసులు ఎక్కడో వికృత రూపాలలో ఉంటారని వింటుండేవాడిని. కానీ మానవరూపంలో ఉన్న రాక్షసులను నేను ప్రత్య క్షంగా చూస్తున్నా నిప్పుడు. జీవితంమీద నాకున్న గౌరవం, ఆసక్తి పోయాయి. జీవితం అంటే నిర్లక్ష్యం మాత్రమే మిగిలింది.

గౌరి ఉత్తరాన్ని చదివే ముందు నా జీవితాన్ని

గురించి కొంచెం తెలుసుకుంటే, నాలోని దౌర్బల్యాన్ని గుర్తిస్తారు. నా కన్న తల్లిదండ్రులెవరో నాకు తెలియదు. ప్రస్తుతం ఉన్నవారు నన్ను పెంచినవారు మాత్రమే. నా కన్న తల్లిదండ్రుల వలన నాకు కొంత స్థిరాస్థి సంక్రమించింది. నా పెంపుడు తల్లితండ్రులకు ఒక కూతురు ఉండేది. ఆమె భర్త మిలిటరీలో చేరాడనని వారంటారు. ఆమెకు ఒక కూతురుంది. ఆమెను నా కిచ్చి పెళ్లి చేయాలని చిన్నప్పటి నుంచి అంటుండేవారు. కానీ నాకే ఇష్టం ఉండేది కాదు. ఆమె నామీద అధికార మున్నట్లు ప్రవర్తించేది. అంతేకానీ నామీద నిజమైన ప్రేమ ఆదరణ కనబరిచేవారు కాదు. కానీ నాకు కావలసినది నామీద అధికారం చెలాయించే వారు కాదు, నామీద నిజమైన ప్రేమ ఆదరణ కనబరిచేవారు కావాలి. నన్ను ప్రేమించేవారు కావాలి. నా పెంపుడు తల్లితండ్రులు కూడా నేను వారి సొంత ఆస్తి అయినట్లు ప్రవర్తించే వారు. ఈ బంధనాల నుండి తప్పించుకోవాలంటే నన్ను ప్రేమించే స్త్రీని నేను వివాహం చేసుకోవాలి. చదువు పూర్తి అయ్యేవరకు వివాహ ప్రసక్తి లేదని పెళ్లి వాయిదా వేశాను. ఉద్యోగంలో చేరాను. పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేశారు. ఎలానో తప్పించుకునేవాడిని. ఒకసారి ఏదో పనిమీద "నంది చెరువు" వెళ్లాను. అక్కడ గౌరితో పరిచయమైంది. ఇద్దరం పెళ్లి చేసుకోవాలనుకున్నాము. సుబ్బయ్యగారిని వెంటనే అడిగాను. గౌరికి ఎట్టి పరిస్థితిలోను అడ్డుచెప్పని సుబ్బయ్యగారు వెంటనే అంగీకరించారు.

ఈ విషయం మా తల్లిదండ్రులకు తెలిసింది. అగ్గిమీద గుగ్గిలం వేసినట్లు మండిపడ్డారు. ఆస్తిలో చిల్లిగవ్వ రాకుండా చేస్తామన్నారు. ఈ పరిస్థితులను ఎదుర్కోవటానికి నేను ఎప్పుడో సిద్ధంగా ఉన్నాను. నాకు ఆస్తి అక్కరలేదన్నాను. పరిస్థితులు విషమించాయని మా పెళ్లికి అంగీకరించారు.

గౌరి కాపరానికి వచ్చిన తరువాత ఎన్నో

చివరి మలుపు

బాధలు పెట్టేవారు. కానీ నా మనసు కష్టపడుతుందని గౌరి నాతో చెప్పేదికాదు. చూచాయగా గమనించిన నేను వారిని మందలించబోతే గౌరి నన్నడ్డగించేది. వార్ధక్యంలో ఉన్నవారిని బాధ పెట్టడం సమంజసం కాదనేది. ఇవి భరించలేక నేను ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను. కానీ, తల్లి, అక్క అనే భూతాలు వెంబడించాయి. వారి ఆశయాలు రెండు. మొదటిది గౌరిని తరిమివేయడం, రెండవది మా అక్క కూతురుతో నా పెళ్లి చేయడం. మొదటిది గౌరి మరణం వలన నెగ్గించుకున్నారు. కానీ రెండవది నెగ్గడం అసాధ్యం.

నేను మనశ్శాంతి కోసరమై వెళ్లిపోతున్నాను. ఎక్కడికో నాకే తెలియదు. నా గమ్యం ఏమిటో తెలియదు. నేను పుట్టగానే నన్ను అనాధను చేసి నా తల్లిదండ్రులు వెళ్లిపోయారు. ఇప్పుడు కూడా నేను అనాధగానే వెళ్లిపోతున్నాను. ఆత్మహత్య చేసుకోలేని దౌర్బల్యహృదయం నాది. నాలాగే నా బిడ్డను కూడా అనాధను చేసి నేను వెళ్లిపోతే నా గౌరి ఆత్మకు శాంతి లేదు. అందుకే చివరకు ఆలోచించి ఈ నిర్ణయానికి వచ్చాను. నా బిడ్డకు మీరు ఆశ్రయ మివ్వగలరనే ధైర్యాన్ని నా గౌరి నాకు ప్రసాదించింది.

మీరు వచ్చేటప్పటికి నేను నా హృదయానికి శాంతి అన్వేషణలో ఉంటాను. గౌరి ఆస్తి అంతా పాపకు చెందేటట్లు వ్రాశాను. దానికి సంబంధించిన పత్రాలు మీకు పోస్టులో వస్తాయి. మా తల్లిదండ్రులు మిమ్మలను అడ్డగించ రనుకుంటాను. వారికి కావలసిన నా ఆస్థిని వారికి వచ్చేటట్లు వ్రాశాను. అది పాపిష్టి అస్థి. అది నా బిడ్డకు వద్దు. ఒకవేళ వారు మిమ్మలను అడ్డగించితే వారిని ఆదారినుండి తొలగించే మార్గం మీకు తెలును.

ఇట్లు,
శేఖరం.'

మధు నిట్టూర్పు విడిచి రెండవ ఉత్తరం విప్పాడు. తనకు బాగా పరిచయమున్న సీత దస్తూరి.

. . . . . .

డిసెంబర్, 1962.

మధు బాబాయి !

జీవితంలో ఒక్కొక్కసారి మనం నిర్మించుకున్న వూహాసౌధాలు బలవంతంగా కూల్చివేయబడతాయి. వాటిని నిలవడం వ్యర్ధమని మనకు తెలుసు. కానీ మనం ప్రయత్నిస్తూనే ఉంటాము. అది మానవుని ఆశాజీవితంలో ఒక మెట్టు.

ప్రేమించి చేసుకున్న పెళ్లి నా జీవితంలో జ్యోతులను వెలిగిస్తుందని ఆశించాను. అలాగే ఆ జ్యోతులను వూహించుకుంటూ ప్రయాణంచేశాను.

శేఖర్ పెళ్లి నాతో జరగడానికి వారి తల్లిదండ్రులకు ఇష్టంలేదని, నాకు తరువాత తెలిసింది. ముందుగానే తెలిసినా నేను వారినే పెళ్లిచేసుకుని ఉందును. జీవిత ప్రవాహానికి భయపడి విధి నిర్ణయించిన గమ్యాన్నిచేరి సంతృప్తిపడేకంటే, గమ్యాన్ని ముందుగానే నిర్ణయించుకొని జీవిత ప్రవాహానికి ఎదురీదటం, ఉత్తమమని, నువ్వు చెప్పిన మాటలని నేను జీవితంలో మరచిపోలేను బాబాయి. కష్టాలకు భయపడి ప్రేమించిన వ్యక్తిని దూరం చేసుకోవటం మూర్ఖత్వం కాదంటావా బాబాయి?

అత్త, వదినె నన్ను కష్టపెట్టారనేకంటే, హింసించారని చెప్పడం సబబుగా ఉంటుందేమో. అయినా నేను నా భర్తకోసం అవన్నీ భరించాను. నాభర్త చూపించే ప్రేమలో అవన్నీ మరచిపోగలిగాను. చిన్నప్పటి నుండి శాంతికి దూరమై వ్యథతో పెరిగిన నాభర్తకు ఇప్పుడుకూడా ఇవన్నీ చెప్పి వారికి శాంతిని దూరం చేయడం ఇష్టంలేక వాటిని మరుగుపరిచాను.

ఒకసారి మా అత్త నాకు మరెవరికో సంబంధం మున్నట్లు వారితో చెప్పబోతే ఆయన ఏమన్నారో తెలుసా బాబాయి. "అమ్మా! నా జీవితంలో మనస్ఫూర్తిగా ఎవరినైనా నమ్ముతానంటే అది ఒక్క గౌరిని మాత్రమే. గౌరి మీద నాకు సంపూర్ణ విశ్వాసముంది. నాకుతప్ప మరెవ్వరికీ గౌరి హృదయంలో చోటులేదు. నా గౌరి దేవత. నిష్కల్మషమైన హృదయం గల దానిమీద లేని అభాండాలను వేసి ముసలితనంలోకూడా పాపాన్ని మూట గట్టుకోకు."

అలాంటి వారికి ఈ చిన్న విషయాలన్ని చెప్పి బాధపెట్టడం భావ్యమంటావా బాబాయి. నామీద వారికి విరక్తి కల్గించలేమని గమనించి, వారి ఎదురుగా నన్ను ఎంతో ప్రేమతో చూస్తున్నట్లు నటించడం, వారు లేనప్పుడు సూటిపోటి మాటలని బాధపెట్టటం మొదలుపెట్టారు. ఆ విషయాలన్ని మీకుజెప్పి బాధపెట్టడం ఇష్టంలేకనే, మీరడిగినా, మౌనం వహించాను. నాన్న మరణించినా, నాన్నను మించిన మధు బాబాయి ఉన్నాడనే ధైర్యంతో ఉన్నాను.

నేను గర్భంతో ఉన్నానని తెలియగానే, ఇంట్లో కలవరం బయలుదేరింది. నాభర్త ఆనందసాగరంలో తేలిపోయారు. వేరే కాపురం పెడతానన్నారు. కానీ చిన్నప్పటినుంచి పెంచినవారిని వార్ధక్యంలో నిరాధారంగా వదలడం ధర్మమనిపించ లేదు. ఆ మాటే వారితో అన్నాను. ఒక రోజు మా వదినె



"తమరి క్రాఫుచెయ్యాలంటె ఇరవైరూపాయలవుతుంది సార్!... చేయమంటారా?"

ఎక్కడలేని ఆప్యాయత కనబరుస్తూ పాలు తెచ్చి యిచ్చింది. గర్భిణి స్త్రీలు బలంగా ఉండాలన్నది. సందేహంలేకుండా తాగాను. రెండు మూడూ రోజుల తరువాత నా గర్భంలో విపరీతమైన బాధ బయలు దేరింది. ఒక రోజు వాళ్ళు రహస్యంగా మాట్లాడు కొంటూవుంటే విన్నాను. నా గర్భస్రావానికి ఏదో నాటు మందు ఇచ్చారని. అత్తా వదినె గర్భస్రావానికి మందిచ్చారని వారితో ఎలా చెప్పేది బాబాయి? ఒకవేళ తెగించి చెప్పినా కలిగే పరిణామ మేమిటో నాకు తెలుసు. అందుకే మీకే ఉత్తరం వ్రాయడం. డాక్టర్లు తగ్గిస్తారనుకున్నాను. కానీ బాధ అంతకంతకూ ఎక్కువ అవుతుంది ఉందే కాని తగ్గడం లేదు.

ఈ ఉత్తరాన్ని ఎలా పోస్టు చేయడం ? వారి కిస్తే అసలు విషయం బయట పడుతుందేమో ? ఇంట్లో పని వారి కిస్తే అత్తగారికి చేరుతుంది. నేను ఎక్కువ దూరం నడిచే స్థితిలో లేను. అయినా ఈ ఉత్తరం నా మధు బాబాయికి చేరు తుంది. మరి ఇది చేరగానే వస్తావుగదా బాబాయి !

ఇట్లు, ప్రేమతో,
మీ పాప.'

"ఏమిటండీ అది ?" అంది మధు లలిత మధు కళ్లనుండి జారిపడుతున్న కన్నీటిని చూచి.

"పాపం చివరి ఉత్తరం" అన్నాడు మధు లేచి నిలబడుతూ.

లలిత ఉత్తరాన్ని తీసికొని చదివింది.

"మానవరూప రాక్షసులు" అంది అప్ర యత్నంగా లలిత.

"పాప ఏ విషయాన్నీ ఇతరులతో చెప్పే స్వభావం కలది కాదు లలితా! ఎన్ని బాధలనైనా తన హృదయంలో ఇముడ్చుకునేది. తనవల్ల ఇతరులు బాధపడటం ఇష్టంలేదనేది. ఆ స్వభావమే పాపను ఈ లోకంలో తన పాత్రను విరమించేటట్లు చేసింది."

మధు నెమ్మదిగా బయటికి నడిచాడు ఉత్త రాన్ని లలిత చేతినుండి తీసి జేబులో పెట్టు కుంటూ.

"ఎక్కడికండీ ?" అంది లలిత ఆతృతగా.

కారు తలుపు తీసి డ్రైవింగ్ సీటులో కూర్చుంటూ "నా పాప ప్రతిబింబం అయిన పాప బిడ్డను తీసుకురావడానికి లలితా ! శేఖర్ అస మర్థుడై తన గౌరిని పోగొట్టుకున్నాడు. నాకు తెలియక పాపను పోగొట్టుకున్నాను. తన బిడ్డలో తన గౌరిని చూడలేక శేఖర్, అనంతవిశ్వంలోకి వెళ్లిపోయాడు. కానీ నేను నా పాపను, పాప ప్రతి బింబంలో చూచి తృప్తిపడగలను లలితా ! ఇది నా జీవితానికి, పాప జీవితానికి కూడా చివరి మలుపు." అని కారు స్టార్టు చేశాడు.

"ఒక్క క్షణం ఆగండి" అంటూ లలిత వచ్చి మధు పక్కన కూర్చొని "పదండి" అన్నది దృఢనిశ్చయంతో.

లలిత మొహంలోకి ఒక్క క్షణం చూసి మధు క్లచ్ వదలిపెట్టాడు.

దృఢనిశ్చయంతో ముందుకు సాగిపోతున్న ఆ కారును చూచి గౌరి ఆత్మ ఆనందంతో నిట్టూర్చింది. ★

లేదు. ఆడవాళ్ళిద్దరూ తన మాట వినేటట్టు లేరు. మరో మార్గం, అందరికీ మంచి చేసే మార్గం ఆలోచించాలి. అతను మంచం మీద వెనక్కి వాలాడు.

ఒక అరగంట సేపు ఆలోచించాడేమో ? అత నికి ఏమీ తట్టలేదు. అతనికి తెలియకుండానే నిద్రముంచుకు వచ్చింది. వరలక్ష్మి గదిలోకి వచ్చి "పిచ్చి బావా !" అనుకుని వెళ్ళి పోవటం అతనికి తెలియదు.

* * *

తెలతెలవారుతుండగా ఉలిక్కిపడి మేలుకు న్నాడు రాజారావు. గడియారం చూసుకుంటే ఆరుగంటలైనట్టు తెలిసింది. తనని తాను తిట్టు కున్నాడు. ఈ దిక్కుమాలిన వూరు తాను ఎందుకు వచ్చాడో ఆ కర్తవ్యం మర్చిపోయి నిద్ర పోయాడు తాను. కాని ఏం చెయ్యాలి ? ఏదో చెయ్యాలని ఉండి, ఏమీ చెయ్య లేనప్పుడు మనిషికి కలిగే బక్క కోపం అతన్ని ముంచెత్తింది. మనసంతా చిక్కగా ఐపోయింది. కాసేపటికి తమాయించుకుని లేచి బైటికి వచ్చాడు. పెరట్లో పాలేరు చెబుతున్నదేదో ఆసక్తిగా వింటూ నిలబడి ఉన్నారు వరలక్ష్మి, సుభద్రమ్మగారూను, రాజారావు రావటం చూసి "విన్నావా బావా ?" అన్నది వరలక్ష్మి.

"ఏం జరిగింది ?" అన్నాడు రాజారావు.

"రామదాసు కనిపించటంలేదుట."

అసుర సంధ్య

21 వ పేజీ తరువాయి

అంగుళం దూరంలో బాంబుపేలినట్లైంది రాజారావుకి. మతిపోయింది. రామదాసు కనిపిం చటం లేదా ? అంటే ?

"మునసబు గారు పిలుచుకు రమ్మని పంపిన మనిషి తిరిగొచ్చి చెప్పాట్ట. వూరంతా వెతికించా రట. ఎక్కడా లేడు. ఆ పాకలో అతని బట్టలూ, సామానూ కూడా లేవుట." అన్నది వరలక్ష్మి.

పాలేరు వంత పాడుతున్నట్టుగా "మాయలంగా ఉంది బాబూ ! ఈ వూరికేదో చేటొచ్చింది." అన్నాడు.

రాజారావు నెమ్మది మీద నిలదొక్కుకున్నాడు. 'నే చెప్పానా ?' అన్నట్టు చూస్తున్న వరలక్ష్మి వంక చూడలేక తల దించుకుని అక్కడ్నించి కదిలి పోయాడు. సుభద్రమ్మగారు అతని వెనకాలే ఇంట్లోకి వచ్చింది. వరలక్ష్మి నూతి దగ్గరకి వెళ్ళింది.

ఒక గంట గడిచింది.

బైట నుంచి ఎవరో కేకవెయ్యటం వినిపిం చింది. వరలక్ష్మి వెళ్ళి వీధితలుపు తీసింది. బైట నిలబడి ఉన్న మునసబును చూడంగానే ఆమెకి వళ్ళు మండిపోయింది. ఆయన వెంట ఎవరో యువకుడున్నాడు. అతనున్నాడన్న లక్ష్యం కూడా ఆమెకు లేక పోయింది. కోపంతో నిలువెల్లా వణికి పోతూ "ఇంకా ఏం మొహం పెట్టుకు వచ్చా రిక్క డికి ? సిగ్గు లేదూ ?" అన్నది. ఆ తర్వాత ములుకు ల్లాంటి మాటలతో తన ఎదలోని బాధను వెళ్ళ గక్కేసింది. చివర్న ధడాలున తలుపు మూసి ఇవతలికి వచ్చేసింది.

రెండడుగులు వేసి ఆగిపోయింది.

వెనకనించి అసలే భీకరంగా ఉండే మునసబు గారి గొంతు మరింత భీకరంగా వినిపించింది. కోపోద్రేకంలో గడియ వెయ్యటం మర్చిపోయింది వరలక్ష్మి. మునసబుగారు ఆ యువకుడితో లోపలికి అడుగుపెట్టి "ఆ బాబుకి తగ్గ కూతు రివి ! తెలిసి తేటా రమ్మంటే ఎక్కడన్నించి వస్తాయి ?" అన్నాడు. వరలక్ష్మి ముఖం కంద గడ్డలా ఐపోయింది. క్రోధం నిలువంతా కంపించి వేస్తుంటే 'ఛీ !' అని ఇంటిలోకి వెళ్ళి పోయింది చరచరా.

మునసబూ ఆ యువకుడూ వసారాలోకి వచ్చారు. అక్కడ వాల్చి ఉన్న మంచం మీద కూచున్నాక "అమ్మాయ్ !" అని కేక పెట్టాడు మునసబు. వరలక్ష్మి ద్వారా మునసబు రాక విన్న సుభద్రమ్మగారు శోకభారంతో క్రుంగి పోతూ లోపలనే కూచుండి పోయింది. ఆమెకి జవాబు ఇవ్వాలనిపించలేదు. వూళ్ళో పని చూసుకుని తిరిగి వచ్చిన పాలేరు మునసబు గార్ని చూసి "దండా లయ్యా" అన్నాడు.

"చిన్నయ్యగారేరా ?" అన్నాడు మునసబు.

"పిలుస్తానుండండి" అని వాడు లోపలికి వెళ్ళి రాజారావును పిలుచుకొచ్చాడు. రాజారావు, బైటికి వచ్చి మునసబుకీ, ఆయన పక్కన నున్న యువ కుడ్నీ చూసి నమస్కారం చేశాడు.

"రామదాసు పారిపోయాడు. తెలిసిందా ?" అన్నాడు మునసబు.

"తెలిసింది" అన్నాడు రాజారావు.

మునసబు ఒక్కక్షణం ఆగి "మొత్తం మీద మంచి టోపీ వేశాడు" అన్నాడు.

రాజారావు అర్థంగాక "ఎవరికి" ? అన్నాడు.

"అందరికీను. . . . తెలివైనవాడు" అన్నాడు మునసబు. ఒక క్షణం పోయాక "అన్నట్టు ఇతను మాధవరావని మా అబ్బాయి స్నేహితుడు. నిన్ననే వచ్చాడు. పల్లెటూరుకదాని, ఏమీ తోచదేమోనని మీ దగ్గరకు తీసుకొచ్చాను" అన్నాడు.

రాజారావు కరచాలనం చేశాడు.

"మీ రెక్కడ పని చేస్తున్నారు ?" అన్నాడతను.

రాజారావు తటపటాయించి "నా ఉద్యోగం సంగతి ఎందుకులెండి ? మీరు తెలుసుకోవాలిసినంత పెద్ద ఉద్యోగం ఏం కాదు ! !" అన్నాడు.

అతను జేబులో నుంచి సిగరెట్ పెట్టే అగ్గిపెట్టె తీసి "మునసబుగారు కూకలేసినా ఈ అలవాటు మానలేకుండా ఉన్నాను. . . . సిగరెట్ తీసుకోండి" అన్నాడు.

రాజారావు ఒకటి తీసుకున్నాడు.

మాధవరావు జేబులోంచి అగ్గిపెట్టె తీశాడు.

"అది కాదయ్యా రాజా ? సి. ఐ. డి.గా పని చేస్తూ ఆ సంగతి చెప్పుకోవటానికి సిగ్గు పడతావేం ?" అన్నాడు మునసబు.

రాజారావు ఉలిక్కిపడలేదు. మాధవరావు చేతిలో ఉన్న అగ్గిపెట్టె మీద అతని దృష్టి పడింది. దాని మీద ట్రేడ్‌మార్క్ కాయితం లేదు. మునసబుగారి వంకా, అతనివంకా చూసి తల దించుకున్నాడు.

"చెప్పండి" అన్నాడు మాధవరావు.

"చెబుతాను" అన్నాడు రాజారావు.

గుమ్మం వారగా వినయంగా నిలుచుని ఉన్న పాలేరు కనిపించాడు రాజారావుకి, సిగరెట్ వెలిగించుకుని ఒక దమ్ము లాగాడు. "చెప్పండి" అన్నాడు మాధవరావు తిరిగి.

*　　　*　　　*

బస్సు ఒక్క కుదుపుతో ఆగింది.

అతను బస్సు దిగాడు అందరితో బాటు. వాచీ చూసుకున్నాడు. ఎనిమిదిన్నర కావస్తోంది. గుడ్డిగా కాస్తున్న వెన్నెట్లో మెలికలు తిరిగి ఉన్న రోడ్డూ, దాని కిరువేపులా పెరిగి ఉన్న చెట్లూ, తుప్పలూ చూడంగానే అతనికి ప్రాణం పోయి నట్లైంది. కనుచూపు మేరలో ఎక్కడా వూరు లేదు. డ్రైవరూ కండక్టరూ కిందికి దిగి "ఏం చేద్దాం ?" అంటే "ఏం చేద్దాం ?" అనుకో సాగారు.

ప్రయాణీకులు ఉస్సురుమన్నారు. బస్సు చెడిపోయిందిట. ఎప్పటికి కదులుతుందో ?

అతనికో సంగతి ముందే అర్థమైంది. లేక పోతే అడవి లాంటి ఈ ప్రదేశంలో అర్థాంతరంగా బస్సు ఆగదు. ఏ నాడూ చెయ్యని పల్లెటూరి

అపర సంధ్య

ప్రయాణం. దానికో విఘ్నం. సిగరెట్ వెలిగించుకుని కండక్టర్ దగ్గరకి పోయాడు.

"ఆ వూరా ! అదుగో ! ఆ దుబ్బులు దాటితే మరో రోడ్డు తగులుతుంది. దాని వెంటే ముక్కుకు సూటిగా వెళితే మీ వూరు వస్తుంది."

"రోడ్డు ఎంత దూరం ?"

"ఎంతోనా సార్ ! అరమైలు" .

కాళ్ల పడ్డ పాము, కరవక మానుతుందా ! అనుకుంటూ సంచితో ముందుకు కదిలాడు అతను. ఎవరో కవి రాసిన ప్రశ్నార్థకాల పద్యం గుర్తొచ్చిందతనికి. ఆ రైలు ఆరున్నరికి రావటం ఏమిటి? వచ్చిందిపో? రాత్రికి ఉండిపోకుండా తను బస్సెక్కటం ఏమిటి ? ఎక్కాడుపో ? ఈ అవాంతర ఏమిటి ?

ఏమైనా తాను వెళ్లితీరాలి.

హుషారుగా ఈలవేసుకుంటూ తను నడవసాగాడు పైకి హుషారుగా ఈలవేస్తున్నా అతనికి మనసులో బెరుగ్గానే ఉంది. పాతిక సంవత్సరాల తర్వాత ఈ కథ కదలబోతున్నది. తాను ముక్కూ మొఖం ఎరగని వాళ్లతో వ్యవహరించబోతున్నాడు. అంతేకాదు తనకి అసహ్యం, కోపం ఉన్న వ్యక్తి కూడా ఉన్నాడందులో, అతనితో నెయ్యానికి తను వెడుతున్నాడు. అది సాధించటం తన కర్తవ్యం

అమ్మ ఇచ్చిన ఆనతి అది.


అతనికి తన గతం అంతా ఒక్కసారి తలపుకు వచ్చింది. అతను గొప్పగా చదువుకోలేదు. చదువుకునేందుకు తగిన పరిస్థితులూ లేవు. తన తండ్రి శ్రీమంతుడు కాదు. చాకిరి చేసి పోషించగల తెగింపు కలది కాదు తన తల్లి. కొందరు మనుషులు మరొకరి కింద పని చెయ్యటం నామోషీ అనుకుంటారు. తన తల్లీ అంతే. తను చదువుకున్న కొద్ది పాటి చదువూ డింకీలు వల్లికలతోనే సాగింది ఉద్యోగాల్లో చేరటానికి కావలసిన కనీసార్హత సంపాదించుకోగానే ఉద్యోగంలో చేరాడు.

అతనికి ఎన్నో ఆశలుండేవి. అతని తల్లికీ ఉండేవి. మాట పట్టింపులో, పిచ్చి నమ్మకాల్తో విడిపోయి జీవితాంతం నరక వేదన అనుభవించే కుటుంబాల జాబితాలో తమ కుటుంబం కూడా చేరకూడదు. తప్పు చేయటం మానవసహజం. కాని ఏది తప్పో ఏది ఒప్పో చెప్పగల వారెవరు ? మనసులోనే కోరికల్ని కుళ్ల బెట్టుకుని, పైకి మేడిపళ్లలా మనుషులు తిరగాలన్న బుద్ధి తక్కువ శాసనం ఈ లోకంలో ఎవరు చేశారో ? అది తప్పని ఎన్నివేల సంఘటనలు గొంతెత్తి ఘోషించినా తిరిగి ఆ తప్పు జరుగుతూనే ఉంది. అది సరి దిద్దటానికి తనూ ప్రయత్నించాలి. ఆ ప్రయత్నంలో తనకు ఆసక్తి ఉన్నా, తన తల్లికి జరిగిన అపకారం, తన తల్లిని పెట్టిన క్షోభ తనని వెనక్కి లాగింది. కాని ఆమె అలా అనుకోలేదు. తనను వెళ్లమన్నది. తను ఇప్పుడు అందుకే బయలుదేరాడు.

ఈ కార్యం సాధించాలి అమ్మకోసం ! మంచి కోసం !

సిగరెట్ తర్వాత సిగరెట్ వెలిగించుకుంటూ వడివడిగా అతను నడవసాగాడు. దారికిరు వైపులా చెట్లు మందమందంగా వస్తున్న గాలికి మెల్లిగా తలలూపుతున్నాయి. ఆ చెట్ల వెనకాల ఏముందో? దూరం నుంచి చూస్తే ఆకాశాన్ని మూసెయ్యటానికి ఏదో నల్లటి తెర అక్కడ కట్టినట్టు ఉంది. దుమ్ముతో అతని పాదాలు నిండిపోసాగాయి. వేధవ పల్లెటూరి రోడ్లు తారన్నా చేసి ఉండదు సరి కదా మోకాల్లోతున ఎర్రమన్ను.

దాదాపు మైలు మైలున్నర నడిచాడతను. ఈ రాత్రికి ఎలానైనా ఆ వూరు చేరాలన్న సంకల్పంతో అతను మొండిగా ముందుకు నడవసాగాడు



'మీ మేనేజరుగార్ని చూడడానికి ఇంకా ఎంత టైం తీసుకుంటుందబ్బా!?...'

అసుర సంధ్య

అలా కొంత దూరం నడిచాక 'ఓహోయ్' అన్న కేక వినిపించి అతను ఆగిపోయాడు. బాటకి కాస్తంత దూరాన ఉన్న చెట్ల మధ్య ఏదో మానవాకారం కనిపించింది. అతను ఆగటం చూసి "ఏ వూరు మనది ?" అన్నాడు అవతల మనిషి.

"పట్నం" అన్నాడతను.

"ఏ వూరు పోవాలి ?"

అతను చెప్పాడు.

"ఎక్కడిట్లా ? ఇలారండి" అన్నాడతను.

పిలుపుకి పీడకల వేట వినిపించినా అతగాడికి వూరు పోయే దగ్గర తోవ ఏదన్నా తెలుస్తుందేమో నన్న ఆశతో అటు కదిలాడు తాను. అవతలి మనిషి ఇతను దగ్గర దాకా వచ్చాక "ఎవరింటికి వెళ్లాలేం ?" అన్నాడు. "మీది ఆ వూరేనా ?" అని అడిగాడు తను. "ఆ వూరే!... నేనడిగింది చెప్పరేం ?" అన్నాడతగాడు. అతను సమాధానం చెప్పేసరికి అతగాడిలో చిత్రమైన మార్పు వచ్చింది. అతగాడికి నలభై అయిదు సంవత్సరాలుంటాయి. అతనేమో యువకుడు. వయసు ఇచ్చిన ధరవాసా వల్లనో, లేక అతను చెప్పింది ఇచ్చిన ధరవాసా వల్లనో పల్లెటూరి ఆసామీ బహువచనం మానేసి "అట్లాగా ? అక్కడ నీకేం పని ?" అన్నాడు.

అతను అంతా చెప్పాడు.

ఆ తర్వాత ఏం జరిగింది ? పల్లెటూరి ఆసామీ యువకుణ్ని చూసి చీదరించుకున్నాడు. విసుక్కున్నాడు. తన తల్లి వైద్యాన్ని, అతని వైద్యాన్ని కడిగి పోశాడు. తెగిపోయిన సంబంధం తిరిగి పెట్టుకోవటానికి కూడా పూర్వ జన్మ సుకృతం ఉండాలన్నాడు. ఇంటి పరువు ప్రతిష్ఠలతో నిమిత్తం లేక పోయినప్పుడు ఇంటితో సంబంధం ఎందుకు ? ఈ నాడు తను నాలుగు డబ్బులు కలిగి ఉన్నాడు గనుక ఈ ప్రేమ పుట్టుకొచ్చింది. పాతికేళ్ల తర్వాత వచ్చి సాధిస్తోంది ఆ 'భడవాముండ.'

అతనికి ఆవేశం హెచ్చిపోయింది. తను వచ్చిన కర్తవ్యం మరచి పోయాడు. తన మనసులో ఉన్న అక్కసునంతా మాటల రూపంలో వెళ్ల కక్కసాగాడు. దాంతో ముసలి అతను కూడా రెచ్చిపోయాడు. చేతిలో ఉన్న కొడవలి ఝళిపిస్తూ "ఆ తప్పుడు ముండ కొడుకువి కాదూ నువ్వు ? ఎక్కడికి పోతే...." అని ఇంకా ఏదో అనబోయాడు తారస్థాయిలో.

అంతే !

యువకుడిలో యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం నశించి పోయింది. దారిద్ర్యంతో, కడుపు మంటతో తానూ తన తల్లి బతికితే బతికామో ? కాని ఒకర్ని మోసం చెయ్యాలన్న తలంపు ఆమెకు గాని, తనకు గాని కలలో కూడా లేదు. ఆ తల్లి ఈ ఛండాలుడి కుటుంబాన్ని గురించి ముఖ్యంగా అతడి కూతుర్ని గురించి అంతగా చెప్పి ఉండక పోతే ఈ ఛాయలకూడా వచ్చి ఉండేవాడు కాదు తాను. క్రోధం నిలువెల్లా దహించి వేస్తుండగా అవతలి వ్యక్తినించి కొడవలి లాక్కున్నాడతను. ఆ ఆసామీ కూడా ఊరుకోలేదు. కొడవలి లాక్కున్నాడన్న కోపంతో బలంగా యువకుడి దవడ మీద కొట్టాడు.

మరుక్షణాన పదునుగా ఉన్న కొడవలి ఆ ముసలాడి మెడపై సర్రున గీసుకు పోయింది. చావుకేక పెడుతూ అతను నేల కూలిపోయాడు. ఇతను పక్కనున్న చెట్టుకు చేరగిల బడి పోయాడు.

నేల మీద పడిన ఆసామీ విలవిలా తన్నుకున్నాడు. చేతిలో ఉన్న పచ్చటి రెమ్మలు పిడికిట్లో బిగుసుకు పోయాయి. కొద్ది నిముషాల్లో అతను చూస్తూ ఉండగానే ఆసామీలోంచి హంస లేచి పోయింది.

అతను హత్య చేశాడు !

చాలా సేపటి దాకా అతనికి మనసంతా మొద్దుబారినట్లై పోయింది. జరిగిన పని ఘోరమైనది. ఎవరికోసం తాను ఇంత దూరం వచ్చాడో ఆ మనిషిని తన చేతుల్తో తానే హత్యచేశాడు. తన ఒళ్లు తాను మర్చిపోయాడు. అతను తనని తాను తిట్టుకున్నాడు. భరించరాని వేదనతో కుతకుత లాడి పోయాడు. యాంత్రికంగా జేబులో నుంచి తీసిన అగ్గి పెట్టెనూ, సిగరెట్ పెట్టెనూ కసిగా అవతలికి విసిరివేశాడు.

అక్కడ అట్లాగే ఎంత సేపు కూచున్నాడో ?

చివరికి మెల్లిగా సర్వాయువాలూ కూడ దీసుకుని అక్కడి నించి లేచాడు. తను మేనమామ పోలిక అని అంటూండేది అమ్మ. అది నిజమని ఈ క్షణాన బుజువైంది. తనెంత మూర్ఖుడో

వెంకట్రావ్ : ఏ మోయ్ సుబ్బారావ్ ! ఆ డబ్బా కెమేరా ఎందుకు కొన్నట్టు ?

సుబ్బారావ్ : మా ఆవిడకు తాను అందగత్తెననే అహంకారం ఆవరించిందోయ్. దీన్తో ఫోటోతీసి చూపించి దాన్ని వదిలిద్దామని!

మాధవ్ (తెనాలి)

చనిపోయిన ఆ పెద్ద మనిషి కూడా అంత మూర్ఖుడు. బిగుసుకు పోయిన ఆ కట్టెకు, జరగకూడని ఈ కథకు మూలమైన ఆ కట్టెలో ఒక నాడు నివాసం చేసిన జీవుణ్ని తల్చుకుంటూ, నమస్కారం చేసి మెల్లిగా అక్కడినించి కదిలి పోయాడు.

ఆ తర్వాత చాలా రోజులు గడిచి పోయాయి. అనుక్షణమూ అదే దృశ్యం మనసులో మెదల సాగింది. అతనిది పశ్చాత్తాపమా ? పూర్తిగా అదే కాదేమో ? చని పోయిన మనిషి మీద అతనికి ఏ నాడూ సదభిప్రాయం లేదు. పైగా పల్లమాలిన కసి మాత్రం ఉంది. కాని అతని చావు ఇలా జరగటం, ఏ పాపమూ ఎరగని అమాయకులు అనాధులై పోవటం దారుణం. అది అలా జరగటానికి వీల్లేదు. తన తల్లి కోరిక తీరాలి. ఈ కుటుంబం బాగుపడాలి. అందుకు మార్గం ఒకటే కనిపించింది.

* * *

మాధవరావు ఏమీ మాట్లాడలేదు. మునసబుగారు కళ్లు మూసుకుని మంచం మీద అలాగే ఉండి పోయారు. గోడ కానుకుని నిలబడ్డ పాలేరు కంటికీ, మంటికీ ఏకధారగా కారుతున్న కన్నీళ్లను తుడుచుకోలేక అవస్థ పడ్డాడు.

పెరటి గుమ్మంలోకి అంతక్రితమే వచ్చిన వరలక్ష్మి, సుభద్రమ్మా స్థాణువులైన ఉండి పోయారు. చాలా సేపటికి దాకా అక్కడ భయంకరమైన నిశ్శబ్దం రాజ్యం చేసింది.

మాధవరావు గొంతు సవరించుకుంటూ "ఒక్కొక్కసారి అనిపిస్తుంది. మనకన్నా బలీయమైన శక్తి ఏదో మనల్ని ఆడిస్తున్నదని. అది ఏదో తెలుసుకో గలిగితే...." అన్నాడు.

రాజారావు జవాబు చెప్పలేదు.

"వెళ్దామా ?" అన్నాడు మాధవరావు.

రాజారావు తలవూపాడు.

"పదండి మునసబు గారూ"

మునసబు గారు కళ్లు తెరిచి "మీరు పదండి. వస్తాను" అన్నారు.

మాధవరావు లేచి నిలబడ్డాడు. రాజారావు లేచి అత్తయ్య, వరలక్ష్మి కూచున్న దిక్కేసి చూశాడు. వరలక్ష్మి నీళ్ళు నిండిన కళ్లతో బేలగా చూసిందతని వైపు. ఆ ఒక్క చూపు సహస్ర కంఠాలతో ఆ అమాయకురాలి క్షోభ అతనికి చెప్పినట్లైంది. అతను గబాలున అత్తయ్య పాదాల మీద వాలిపోయి ఘోరున పసి పిల్లవాడిలా ఏడిచేశాడు. సుభద్రమ్మగారు నోట్లో చెంగు కుక్కుకున్నది.

విధి నిర్వర్తించ వచ్చిన మాధవరావుకు కూడా కళ్లు చెమర్చాయి.

రాజారావు తనను తాను కూడ దీసుకుని మాధవరావుతో వీధిలోకి వచ్చాడు. ఇద్దరూ కొంత దూరం మౌనంగా నడిచారు. ఆ తర్వాత మాధవరావు అన్నాడు "మీరు నన్ను చూసి ఆశ్చర్య పోయి నట్టు లేదే ?" అని.

"ఆశ్చర్యం దేనికి ?" అన్నాడు రాజారావు.

మాధవరావు ఒక్కక్షణం వూరుకుని అన్నాడు. "మునసబుగారు చిత్రమైన మనిషి. ఆయనకి ఎవరంటే ప్రేమ ఉన్నదో, ఎవరంటే ద్వేషం ఉన్నదో తెలుసు కోవటం చాలా కష్టం. నన్ను ప్రత్యేకంగా పిలిపించి తీసుకొచ్చిందాయనే. ఆయన సహాయమే లేకపోతే...." ఆ తర్వాత ఏం చెప్పాలో తోచనట్లు ఆగిపోయాడతను.

రాజారావు పేలవంగా నవ్వాడు.

ఇద్దరూ మరికొంత దూరం నడిచారు. దేవాలయం దరిదాపుల్లోకి రాబోతుండగా వాళ్లకి పోలీస్ వేన్ ఎదురైంది. మాధవరావును చూసి వేన్ ఆగింది. రాజారావు చెప్పులు విడిచి దేవాలయం పక్కకి తిరిగి నిమీలిత నేత్రాలతో నమస్కారం చేశాడు. అతనిప్పుడు విచారంగా లేడు. సంతోషంగా ఉన్నాడు. అతనికి ఏమేమో చెప్పాలని ఉంది. కాని ఏదో గొంతులో అడ్డం పడుతున్నది. మనసులోనే అతను భగవంతుడికి క్షమాపణ చెప్పుకున్నాడు.

మాధవరావు అతను తిరిగి వస్తూంటే భారమైన మనసుతో అతన్ని వేన్ ఎక్కించాడు. నేరాలు అందరూ చేస్తారు. కొందరి నేరాలకు సాక్ష్యం ఉంది. కొందరి నేరాలకు సాక్ష్యం లేదు. అంటే శిక్ష లేదు. చచ్చిపోయిన రాఘవయ్యగారెలాంటి వాడో మాధవరావు, మునసబు గారి ద్వారా విని ఉన్నాడు. ఆయన చేసింది ఏమంత మంచిపని? అది ఎవరన్నా ఆలోచిస్తారా ? ఒక మనిషిని నిలువునా ప్రాణం తియ్యటం నేరం. దానికి శిక్ష ఉంది. కాని మనసుని రంపపు కోత పెట్టి జీవి

కాంతం పేల్చి పిప్పి చేసేవాటి సంగతేమిటి? అది ఎవరన్నా ఆలోచిస్తారా ? అందుకు విరుగుడు ఏముంది ?

మాధవరావుకి ఒక సంఘటన గుర్తుకొచ్చింది. తమ వూళ్లో ఒక షావుకారు ఉన్నాడు. అతని 'వ్యాపారం' వల్ల ఎన్ని కుటుంబాలో నాశనమైనాయి. అతను ప్రతి సాయంత్రానా పార్కులన్నీ తిరిగి చీమల పుట్టల దగ్గర బియ్యం పిండి వల్లుతాడు. అది పుణ్యం కోసం !

మాధవరావు "మునసబుగారు రావాలయ్యా!" అన్నాడు డ్రైవరుతోటి. అతను క్రీగంట రాజారావు వంక చూస్తూ నిలుచున్నాడు రోడ్డు మీద. రోడ్ మీద పోతూన్న జనం వాన్ వంక వింతగా చూస్తూ కదిలిపోతున్నారు. రాజారావు కళ్లు మూసుకుని వాన్‌లో కూచుని ఉన్నాడు.


మునసబుగారు మాధవరావు ఎలా హత్యా నేరాన్ని భేదించాడో పాలేరుతో విజృంభించి ఉపన్యసిస్తున్నాడు— ఆ ఇంట్లో. అదెవరు వింటున్నారు ? వరలక్ష్మి వింటున్నదా ? ఆ పిల్ల కట్టుకున్న రంగుల మేడ కాలిపోయింది మరి ! సుభద్రమ్మ వింటున్నదా ! ఆమె ఇంటి మొండి గోడలు శిథిలమై, జీర్ణమై గాలితో కొట్టుకు పోతున్నాయి.

ఎవరూ వినటం లేదు. వినరేమో కూడా.

ఐపోయింది.

రామ చరిత మానస్

తులసీదాసు



తెలుగు ముంగర శంకరరాజు

31

"ఓ శ్రీహరీ! సురాసురులు — నరనాగులు మున్నగు చరాచర భూత ప్రపంచమంతయు నీ విషమ మాయాజాలమునకు లోబడి కాల కర్మ సంజనితమైన తాపత్రయంబుల పాల్పడి క్రుగ్గుచున్నారు. స్వామీ! అట్టివారి త్రివిధ తాపములు మీ కృపా దృష్టి ప్రసరించినంతనే పటాపంచలగుచున్నవి. భవ ఖేద ఛేదన రామా! మమ్ము ననుగ్రహించి రక్షింపుము. మీ కివే మా నమోవాక్కులు." వేద పురుషులివ్విధముగ కోసలేశుని కీర్తించి అదృశ్యులై బ్రహ్మ సదనమునకేగిరి.

ఓ గరుత్మంతా! అనంతరము పార్వతీపతి ప్రభువు ముంగట కేగి ముకుళిత హస్తుడై ప్రగాఢ భక్తితో నిట్లు కీర్తించెను—

1. జయ రామ రమా రమనం సమనం
   భవతాప భయాకుల పాహి జనం,
   అవధేశ సురేశ రమేశ విభో
   సరణాగత మాంగత పాహి ప్రభో.
2. దస సీస వినాసన బీస భుజా
   కృత దూరి మహా మహి భూరి రుజా,
   రజనీ చర బృంద పతంగ రహే
   సర పావక తేజ ప్రచండ దహే.
3. మహి మండల మండన చారు తరం
   ధృత సాయక చాప నిషంగ బరం,
   మద మోహ మహా మమతా రజనీ
   తమ పుంజ దివా కర తేజ అనీ.
4. ముని మానస పంకజ భృంగ భజే
   రఘు బీర మహారణ ధీర అజే,
   తవ నామ జపామి నమామి హరీ
   భవరోగ మహామద మాన అరీ.
5. గున శీల కృపా పర మాయ తనం
   ప్రన మామి నిరంతర శ్రీ రమనం;
   రఘునంద నికందయ ద్వంద ఘనం
   మహి పాల బిలోకయ దీన జనం"

ఓ రామా! రమా రమణా! భవతాపహరా! నేను నీ శరణార్థినై రక్షింప వేడుచున్నాను. ఓ రావణాంతకా! నీవు లోక సంరక్షణార్థమై నీ యమోఘ బాణాగ్నిశిఖలచే నిశాచర పతంగ సమూహమును సమూలముగ నిర్జింప జేసితివి. ఓ శరచాపధారీ! నీవు మహా మదమోహాంధకార పటలము పటాపంచలు చేయు ప్రచండ భానుడవు. భూలోక భూషణా! విషయాశక్తులై భవారణ్యములందు దారి దప్పి భ్రమించుచున్న పామర జనమును రక్షింపుము.

ఓ భక్తవత్సలా! నీ పద సేవ నిచ్చగించని మూర్ఖులు రోగవియోగ బాధలకు లోనై శోక సాగరమున బడి నిత్యము—సతమతమగుచున్నారు. కానీ, భవత్కథా గానము చేయుచున్న సజ్జనాళి మాత్రము అటు స్వామికి ఇటు సాధు పురుషుల ప్రేమకు పాత్రులై నిత్య సుఖములందుచున్నారు. అట్లు అట్లు నీ పద సేవా తత్పరులైన సుకృతాత్ములు సదా నీ నామామృతము పానము చేయుచు రాగ లోభ మద మోహములు లేక శుద్ధాత్ములై సుఖ దుఃఖములను సమానముగా భావించి నిత్యానందమును అనుభవించుచున్నారు.

మునిజన హృదయకమలములందు సర్వదా విహరించుచుండు ఓ రఘువీరా! రణధీరా నేను నిత్యము నీ నామము జపించి నీ గుణ సంకీర్తన చేసి నీ చరణ కమలములకు నమస్కరించుచున్నాను. ఓ పృథ్వీపతీ! శ్రీ రంగా! ఈ దీనుని కరుణించి కృపా మూర్తివై అనపాయనీ భక్తి ప్రసాదించమని ముమ్మాటికి వేడుకొనుచున్నా—." అట్లా సాంబశివుడు మిక్కిలి భక్తితో సాకేతనాథుని అనేక విధముల కొనియాడిన పిమ్మట సంతోషస్వాంతుడై స్వలోకమునకు ప్రస్థానము చేసెను.

అనంతరము దాశరథి వానరులయెడ తన ప్రగాఢానురాగము వ్యక్తము చేసి, వారికి యథాయోగ్యముగా నివాస సుఖములు కల్పింపజేసెను.

శ్రీరాముడు వానర విభీషణ నిషాదులను సంభావించుట

"ఓ ఖగనాథా! పరమ పావనమగు ఈ రామ పట్టాభిషేక మహోత్సవ కథను ఆసక్తితో ఆలకించిన వారికి జ్ఞాన వైరాగ్యములు సంప్రాప్తించుచున్నవి. ఎవరు ఫలాపేక్షతో ఈ పవిత్ర చరిత్ర పఠించి పారాయణము చేయుదురో వారు సకల విధ భౌతిక సంపదలతో సుఖించి తుదకు రామ సాయుజ్యము పొందగలరు. భవసాగరము తరింపజేయు గల ఈ లోకోత్తర గాథ నీకు నా శక్త్యానుసారము వర్ణింప గల్గితిని, శ్రద్ధాళుడవై శేషించిన కథా భాగము కూడ ఆకర్ణింపవలసినది." అని విశదీకరించి కాకభుశుండి గరుత్మంతునికి తిరిగి ఇట్లు చెప్పనారంభించెను—

రఘుపతి రాజ్యాభిషిక్తుడయ్యెను. అనంతరమా నృపాలోత్తముడు భూరి భూరి దానములతో భూసురోత్తములను యాచకులను సంభావించెను. సుగ్రీవాది వానర బృందమును, విభీషణాది మిత్రవర్యులను సకల మర్యాదలతో సమాదరించెను. వనచర ప్రముఖులు స్వగృహములను సైతం విస్మరించి సకల విధ భోగములనుభవించుచూ అయోధ్యలో ఆరు నెలలు గడిపిరి.

ఒకానొక దినము అవధేశుడు నిశాచర, వనచర భల్లూక నిషాద ప్రభృతులను రాజ హజారమునకు రావింపజేసి యథాగ్యరీతి వారిని సుఖాసీనులం జేసి స్నేహ సుహృద్భావముతో తొణికిసలాడ మృదు మధురోక్తుల వారినిట్లు సంబోధించెను. —

"మిత్రులారా! మీరు నా నిమిత్తమై బహువిధ ప్రయాసల శ్రమించి నాకు సహాయ పడితిరి. మీరొనర్చిన సేవా సహకారములను గురించి మీ ఎదుటే ప్రస్తుతించుటకు నేను జంకుచున్నాను. నా హితార్థమై మీరొనరించని సేవ లేదు. కాబట్టి ఈ సామ్రాజ్యము— సోదరులు— పరివారము— సంపత్తి— జానకి వీరందరికంటే మీరు నాకు ఆప్తులు, అత్యంత ప్రియ పాత్రులు. మిత్రులారా నిజమాడుచున్నాను, నా దాసుల పై నాకున్న ప్రేమ అనన్యమైనది అని అని మీరు విశ్వసింపుడు. హితులారా! ఇక మీరు మీ మీ స్వగృహములకుపోయి— నేను సర్వాంతర్యామిని సర్వహితాభిలాషిని అని మనసులందుంచుకొని సదా నన్ను స్మరించుకొనుచు సుఖముగా కాలము గడుపుచుండమని మిమ్ము కోరుచున్నాను."

ప్రభువు సుభాషితమునకు ప్లవంగ ప్రముఖులు ముగ్ధులై పరమానందమొందిరి. సాకేత నాథుని స్నేహ ప్రసంగమునకు సమ్మోహితులై సభాసదులు— తామెవరు! ఎక్కడనుండి వచ్చిరి! ఇప్పుడెచ్చటనున్నారు! అను సంగతి కూడా మరచి పులకిత శరీరులై ఆనంద బాష్పములు రాల్చిరి. సాశ్రులోచనులై చేష్టలుడిగి నోట మాట రాని స్థితిలో తన వైపు గుడ్లప్పగించి నిలబడియున్న కపి పుంగవాదులను అప్పుడు సీతాపతి సకలవిధ భూషణ వసనోపహారాదులచే అపూర్వరీతి సత్కరించెను. భరతుడు లక్ష్మణుడు సుగ్రీవ విభీషణులను చీనిచీనాంబరములు ధరింప జేసి వివిధ మణి భూషణలతో అలంకరించిరి. తదుపరి రామానుజులు నలనీల జాంబవంతాది మిత్ర బృందమును గురు గౌరవ భావముతో యథా యోగ్యముగా సంభావించిరి.

అప్పుడు యువరాజు అంగదుడు కన్నుల నీరు బెట్టుకొని— కేలు మోడ్చి— గద్గదస్వరమున "— ఓ ఆర్తత్రాణ పరాయణా! అవధేశా! ఆశ్రయదాతా! నాదొక విన్నపమాలకించవలసినది. ప్రభూ, నా తండ్రి వాలి మరణించు సందర్భమున నన్ను మీ హస్తములందుంచి కన్ను మూసెను. ఇపుడు నాకు తన్ను

తండ్రి సోదరుడు సర్వస్వము మీరే. నేను ఇపుడు మిమ్ము వదలి ఎచటికి ఎట్లు పోగలను! దేవా! మీ చల్లని ఆశ్రయములోనుండి మీ పాదసేవ చేసికొనుచు కాలము గడపవలెనని నా కోరిక. ఈ పావన పురి అయోధ్యయందే యుండి పోవుటకు నన్ననుగ్రహింప వేడుకొనుచున్నాను—" అని ప్రార్థించెను.

వానర యువరాజు ప్రగాఢ ప్రేమకు దాశరథి హృదయము చలించి పోయెను. భక్తవశుడగు కోసలేశుని కన్నులు నీటితో నిండెను. రఘుపతి తన ఉరమాలతో వాలి తనయుని కంఠసీమ నలంకరింపజేసి గాఢముగ కౌగిలించుకొని ప్రియోక్తుల అనేక విధముల బోధించి అతనిని ప్రయాణమునకు సమ్మతింపజేసెను. ఇట్లు వానరులు స్వామిచే బహు విధముల సత్కరింపబడి నిజనివాసములకు మరలి వెళ్ళుటకు సన్నద్ధులైరి. తదుపరి భరతుడు లక్ష్మణుడు శత్రుఘ్నుడు కపి పుంగవుల వెంట కొంత దవ్వు చని సాదరపూర్వకముగ వారిని సాగనంపి వచ్చిరి.

అట్లు వానరులు సాకేతనాథుని సత్కారము పొంది స్వస్థలములకు మరలి చను సందర్భమున ఆంజనేయుడు వానర పతి సుగ్రీవుని చరణములపై వ్రాలి—"ప్రభూ! మరి కొంత కాలము రామ నగరులో నివసించి స్వామిని సేవించవలెనని నాకు కోరికగా నున్నది. సీతానాథుని సన్నిధిలో నుండుటకు నన్ననుమతింప అర్థించుచున్నాను—" అని పలికెను. అందుకు సుగ్రీవుడు ఆనందమొంది —"పవన పుత్రా! నీవు పుణ్యాత్ముడవు, నీవు దయామయుని భక్తితో సేవించి ధన్యుడవు కమ్ము—" అని దీవించి అంజనీ పుత్రుని అయోధ్యలో నుండుటకు అనుమతించి పంపెను.

ఋక్ష వానరులను యథార్హ సంభావన సత్కారములతో వీడ్కొలిపిన పిమ్మట కోసలేశుడు నిషాద పతిని అనేక వస్త్ర భూషణాదులచే బహూకరించి ప్రేమోత్కంఠతతో నిట్లు పలికెను—

"తుమ్హ మమ సఖా భరత సమ భ్రాతా
సదా రహేహు పుర ఆవత జాతా."

"ఓ నిషాదరాజా! నీవు భరతునివంటి సోదరుడవు, ప్రియసఖుడవు అనుసంగతి విస్మరించకుము. ఇక నీవు స్వస్థానము చేరుకొని ధర్మాచరణ శీలివై సుఖింపుము. సఖా! ఇది నీ ఇల్లుగా భావించి అపుడపుడు అయోధ్యకు వచ్చిపోవుచుండుము.

శ్రీవారి స్నేహ సుహృద్భావ వైఖరికి నిషాద నాథుని నేత్రద్వయమునుండి ఆనందాశ్రువులు జలజల స్రవించెను. ఆ సుకృతాత్ముడంతట ప్రభువుకు ప్రదక్షిణా పూర్వకముగ నతులొనర్చి, స్వామి చరణ చిహ్నములు హృదయము నందిడుకొని, బహు ప్రయత్నముమీద ప్రయాణ పూర్వకముగ ఇంటికి మరలి చనెను—

రామరాజ్యము

రామరాజు సింహాసన మధిష్ఠించి రాజదండము చేపట్టగనే లోకత్రయము భయశోక రహితమై సుఖించెను. గోస్వామి తులసీదాసు రామరాజ్యము నిట్లు దర్శించెను.

బరనాశ్రమ నిజనిజ ధరమ నిరత
వేద పథలోగ
చలహిం సదా పావహిం సుఖహిం నహిం
భయ శోక నరోగ
దైహిక దైవిక భౌతిక తాపా
రామరాజ నహిం కాహుహి వ్యాపా
సబ నర కరహిం పరస్పర ప్రీతి
చలహిం స్వధర్మ నిరత శ్రుతినీతి.
చారిహు చరన ధర్మ జగ మాహీం
పూరి రహా సపనేహు అఘ నాహీం
రామ భగతి రత సబ నరనారీ,
సకల పరమ గతికే అధికారీ.
అల్ప మృత్యు నహిం కవనిఉ పీరా
సబ సుందర సబ బిరుజ సరీరా
నహిం దరిద్ర కోఉ దుఖీ న దీనా
నహిం కోఉ అబుధ న లచ్ఛన హీనా.

రామరాజ్యమందలి సకల ప్రజ వేదమార్గ మవలంబించెను. వర్ణాశ్రమ ధర్మములు పాటింపబడెను. రాగ ద్వేషములు లేకుండెను. భయ శోకము అంతరించెను. దైహికము భౌతికమైన తాపత్రయములు నశించెను. సామాజికులు స్వధర్మ నిరతులై పరస్పర ప్రేమ భావముతో వ్యవహరించిరి. ధర్మము నాల్గు పాదములపై నిలబడెను. స్త్రీ పురుషులందరు స్వప్నమందైనను పాపచింతనలేక రామ భక్తి తత్పరులై మోక్షాధికారులగుచుండిరి. అకాల మరణము జరాభారము అంతరించి ప్రజలు ఆరోగ్యవంతులై ఆనందముగ నుండిరి. దారిద్ర్యము దుఃఖము అజ్ఞానము తొలగి సర్వ జనులు శుభ లక్షణ లక్షితులై శోభించిరి.

రాముని కాలమున సకాలమునకు వర్షములు పడుచుండెను. నదీ తటాకములు నిత్యము జల సమృద్ధమై యుండెను. పంటలతో, ఫలములతో పుష్పములతో పచ్చని వన వాటికలతో సకల విధ ఔషధులతో భూమి కళకళలాడెను. పక్షిజాతులు, మృగ సముదాయము తమ సహజ వైరభావము విస్మరించి ప్రేమతో వ్యవహరించెను. లోకానందకరమగు రామరాజ్యము సకల సుఖదాయకమై శోభించెను. త్రేతాయుగము కృతయుగమును స్మరింపజేసెను.

గరుత్మంతా! చతురంబోధి పరీత భూమండలమున కంతటికీ రాముడు సామ్రాట్టు. అయిననూ ఆ మహామహుడు తనలోని ఒక్కొక్క రోమకూపములో అనేక బ్రహ్మాండములు కలిగియున్నాడు. అనంతశక్తివంతుడగు ఆ విరాట్ స్వరూపునికి ఈ సాంకేతిక సామ్రాజ్య భార మేపాటిది! ఆ భగవంతుని రాజ్య వైభవము సవిస్తరముగ వర్ణింప ఎవరికి శక్యమగును!

అవధేశుడు

అవధేశుడు ధర్మనిష్ఠతో అనేక అశ్వమేధ యాగములుచేసి యశోవిలాసుడై ఇంద్ర సుఖము ననుభవించెను. సీత సాధ్వీమతల్లి. ఆ మహారాణి అహర్నిశము స్వామికి స్వహస్తములతో సకలోపచారములు చేయుచుండెను. అత్తలయెడ పరమ పూజ్య భావముతో మెలగెను. మైథిలి దేవరుల యెడ మైత్రీ వైఖరి నవలంబించి సద్భావము నెరపెను. జానకి సకల గుణ సంపన్న. ఆ జగదంబను లక్ష్మీ పార్వతీ సరస్వతులు సదా ధ్యానించుచుండిరి. భరత లక్ష్మణ శత్రుఘ్నులు భక్తి ప్రేమతో అన్నకు అన్ని విధముల తోడ్పడుచు సాధు భావముతో సేవలు చేయుచుండిరి.

కొంతకాలమునకు సీతాదేవి గర్భమున లవ కుశులను ఇరువురు కుమారులు ఉద్భవించిరి. వీరులు రణధీరులు గుణశీలురగు ఆ కుమారులు అన్ని విధముల తండ్రిని బోలియుండిరి. ఈ సుకుమారుల గుణశీల స్వభావములను గురించి వేదములందు విపులముగ వర్ణింపబడినది. భరత లక్ష్మణ శత్రుఘ్నులకును ఒక్కొక్కరికి ఇద్దరు చొప్పున పుత్రులు పుట్టిరి.

అవధపురి అదృష్టము

నరరూపధారి నారాయణమూర్తి, ఆ సచ్చిదానంద స్వరూపుడు సర్వజన ప్రమోదముగ సకల సుఖదాయకముగ రాజ్యమేలెను. రామరాజ్యము రమణీయమైనది. ఆ ప్రభుడు ఉదయాత్పూర్వమే మేల్కాంచి, సరయూ పుణ్య సలిలములందు స్నాన సంధ్యనిర్వర్తించి, పూజాదికములు పూర్తిగావించుకొన్న పిమ్మట రాజ్యసభకు అరుదెంచి సింహాసన మలంకరించును. అచ్చట పండితులతో మునులతో, జ్ఞానులతో సద్గోష్ఠి జరుపును. సోదరులు పరమాదర భావముతో నిత్యము అన్ననను సరించి మెలగుచుండిరి. భరత శత్రుఘ్నులు సాయం సమయములందు ఉద్యానవనములందు కూర్చొని హనుమంతునియొద్ద రాముని పావన చరిత్ర, ఆరాధ్యుని సుగుణ విశేషములు శ్రద్ధా భక్తితో వినుచూ సత్కాలక్షేపము చేయుచుండిరి. నారద సనకాది మహా మునీశ్వరులు నిత్య ప్రతి అయోధ్యకు వచ్చుచూ పోవుచూ స్వామి దర్శనము చేసుకొని పరితృప్తులగుచుండిరి.

అయోధ్య సిరిసంపదలు ఆ పురి నాగరికుల సుఖజీవనము వారి నిత్య సంతోష సంరంభములు వర్ణింప వేయిపడగల శేషునకే శక్యముగాదు. అంద చందాలు దిద్దుకొనిన ఆ నగర సౌందర్యమేమని వర్ణింపగలము! నానావిధ వర్ణములతో గచ్చు చేయబడిన శుద్ధ స్ఫటిక ప్రాంగణములతోనున్న గృహములు, బంగారు కలశములతో రత్న స్తంభములతో, ముత్యములు తాపిన గవాక్షములతో, మణిదీపములతో నవరత్న ఖచిత ద్వార బంధములతో ఆకాశము చుంబించుచున్న గోపురాగ్రములతో అలరారుచుండెను. అంద చందాలతో అవధపురి అమరపురిని భ్రమింపజేయుచుండెను.

ఆ నగరమందలి ప్రతి గృహము ఒక చక్కని ఉద్యాన వాటికతో శోభించుచుండెను. ఆ రమణీయోద్యానములు సుందరమైన జలాశయములతో నిత్యహరితలతా గృహములతో, వివిధ పుష్ప సౌరభముతో, మంటపములతో, క్రీడామందిరములతో, పక్షుల కలకలారావములతో నయనానందకరముగ కన్పట్టుచుండెను. సాక్షాత్ లక్ష్మీపతికి నివాసమగు ఆ నగరములోని వణిక్ప్రముఖుల విపణి వీధుల సంపద్వైభవము ఊహింపరానిది. అచ్చటి బేహారులు సచ్చరిత్రులు, సద్వ్యాపార పరాయణులై ధనైశ్వర్యములందు కుబేరుని ధిక్కరించి సమర్థులై యుండిరి.

ఆ పురమునకు ఉత్తరభాగమందు పుణ్య సలిల సరయూనది ప్రవహించుచుండెను. ఆ స్రవంతి కిరువైపుల అనేక స్థలములందు స్నానఘట్టములు ఏర్పడియుండెను. ఆ రేవుల కెదురుగ నదీతీరమందు దేవాలయములు కట్టబడియుండెను. ఆ దేవాల

యములచేత సాధువుల కుటీరములు పూలతోటలు అమరియుండెను. నదీతీరమంతటా తులసిమొక్కలు నాటబడియుండెను. ఉదయ సాయం సమయము లందు స్నాన సంధ్య పూజాదికము లొనర్చు వారి రాకపోకలతో సరయూ తీరము బహు సందడిగా నుండి నే్త్రోత్సవము చేయును.

నగర మందచ్చటచ్చట కోనేర్లు, బావులు, తటాకములు, కాసారములు, శీతల నిర్మలోదకముతో నిండియుండెను. హంసలు శారికలు శుకములు పికములు తుమ్మెదలు మున్నగు విహంగావళి కలకూజముతో పద్మ కుముద పుష్ప పరాగ రంజితమైన ఆ జలాశయములు నయనానందకరమై భాసించు చుండెను.

నగరమందెల్లడల యెల్లవేళల రామనామ సంకీర్తనము జరుగుచుండెను. గృహ ప్రాంగణము లందు చావడులందు తిన్నెలమీద దేవాలయము లందు పెద్దలు పిన్నలకు రామ కథా ప్రవచనము చేయుచుందురు. ఈ ప్రకారము అయోధ్యావాసులు సుఖ సంపదలతో సదాచార పరాయణులై రామ సంకీర్తన చేయుచు సుఖ జీవనము గడుపుచుండిరి. రఘురాముని యశశ్చంద్రికలు సర్వత్ర వ్యాపించి లోకములకు శాంతి ప్రసాదించెను. ఓ ఖగేశ్వరా! ఇట్లు రవికులరాముని తేజఃపుంజముచే లోకాంధకారము పటాపంచలై వెలుగేర్పడెను. రాముని రాజ్యములో జారులు చోరులు జూదరులు నిలువ నీడ గానక దుస్సహ దుఃఖముచే మరపిల్లిరి. కానీ జ్ఞానులు ధర్మచింతన గలవారు. భక్త ప్రవరులు. సాధువులు సన్మార్గులు రామరాజ్యములో నిరాపదులై నిర్భయముగ సుఖ జీవనము గడుపుచుండిరి.''

సనకాదులు సాకేతనాథుని దర్శించుట

ఒక దినము రామభూపాలుడు తమ్ములతో ఆంజనేయునితో కలిసి ఒక ఉపవనమును దర్శించుటకు వెళ్లెను. వారావాటికలో విహరించుతరి అచ్చటికి

రామచరిత మానస్

సనకసనందన సనత్కుమార సనత్సుజాదులు దాశరథి దర్శనార్థమై వేంచేసిరి. ఆ నలుగురు దిగంబరులు, దివ్యజ్ఞాన సంపన్నులు. ఆ తపోధనులు చూచుటకు బాలకుల వలె నుండిరి. సాకేతధాముడు సాదరపూర్వకముగ సనకాదులకు స్వాగతము పలికి, అర్ఘ్య పాద్యాదులతో సత్కరించి వారిని ఉచితాసనములపై సుఖాసీనుల జేసి సమాదరించెను. వేదముల వంటి ఆ నల్వురు మహనీయులకు భరతుడు లక్ష్మణుడు శత్రుఘ్నుడు హనుమంతుడు భక్తితో ప్రణమిల్లి పాదపూజ చేసిరి.

అంతట రఘూద్వహుడు వినమ్రుడై వారి నవలోకించి—''ఓ. ఋషిపుంగవులారా ! పూర్వపుణ్య సుకృతమువలనగాని తమబోంటి సాధువుల సాంగత్య ఫలము లభింపదని విజ్ఞులు చెప్పుచుందురు. నేడు మీ దివ్యస్వరూపములు దర్శించుకున్నందున ఈ దీనుని జన్మ సార్థకమై తరించెను.—'' అని పలికెను.

రాముడు జగన్మోహనాకారుడు. మునులు ఆ మోహనమూర్తి మంగళస్వరూపమును రెప్పవాల్చక తనవితీరా చూచిరి. వారు—దాశరథి దివ్యసుందర విగ్రహముగాంచుచు ముగ్ధులై ఆనంద బాష్పములు స్రవించుచుండ— ముకుళిత హస్తులై తన్మయత్వమున స్వామినిట్లు స్తోత్రించిరి.—

''—అద్వితీయుడవు అనంతుడవు, అనామయుడవు, సర్వ వ్యాపకుడవు, సకలగుణ సంపన్నుడవగు ఓ. రామా! నీకు మేము జయము పలుకుచున్నాము. త్రికాల స్వరూపుడవు కల్యాణమూర్తివైన ఓ దశరథ నందనా! నీ యశో గాథలను వేదపురాణములు కీర్తించుచున్నవి. ఓ. దయానిధీ! నీ సంస్మరణచే సకల పాపములు నశించును. నీ నామధ్వని విన్నంత మాత్రమున సకల కోరికలు సిద్ధించును. నిన్ను దర్శించుకొను పుణ్యాత్ములకు ముక్తి ప్రాప్తించుచున్నది. నీవు కామధేనువు వలె దీనజనమును పోషించెదవు. కల్పవృక్షమువలె కోరికలు తీర్చెదవు. భవసాగర జలమును అగస్త్యునివలె శోషింపజేసి భక్తులను తరింపజేసెదవు, నీ భక్తాంజలికి నీవు పరమ సులభుడవు. వారి దుఃఖములు తొలగించి, వారి కామ్యములు సిద్ధింపజేసి, వారికి జ్ఞాన వైరాగ్య సంపత్తిని, ప్రసాదించు భక్తవత్సలుడవు. ఓ రాజాధిరాజా! ఓ లోక రక్షకా! ఓ దేవాది దేవా! నీవు సదయుడవై సదా మా మానస పీఠ మలంకరింపుము. కారుణ్యమూర్తీ! మమ్ము కరుణించి మాకు నీ యఖండ భక్తిని ప్రసాదించి సంతృప్తుల జేయుము. స్వామీ! మా ప్రార్థనలు మన్నింపుము, మా నమస్కారమును స్వీకరింపుము —''

ఇట్లనేక ప్రకారముల సనకాదులు రఘూద్వహుని స్తుతించి అపరిమితానందముతో స్వామి వద్ద సెలవు తీసుకుని బ్రహ్మనివాసమునకు పోయిరి.


రాముడు భరతునికి సత్పురుషుల స్వభావాదులెరింగించుట

సనకాది మహర్షుల చనిన పిమ్మట గుణ భరితుడగు భరతునికి అగ్రజుని ముఖతః సాధు సత్పురుషుల లక్షణములు వినవలెనని అపేక్ష జనించెను. అవధేశుడు సోదరుని మనోగతాభిప్రాయము గుర్తించినవాడై అందుకెంతయు ఆనందించి ప్రేమతో భరతుని కిట్లు సాధు లక్షణముల వివరించి చెప్పెను.

''ఓ భరతా! సత్పురుషులను గురించి వేదములందు పురాణములందు విశదముగా వివరింపబడినది. సుజనులను దుర్జనులను చందన వృక్షమునకు— గొడ్డలికినీ పోల్చుట సమంజసముగా నుండును. తనను ఖండింప వచ్చిన గొడ్డలిని శ్రీఖండము చందన సుగంధాదులతో సత్కరించును. తద్వారా శ్రీఖండము శివుని శిరోభాగమలంకరించి రాజిల్లుచున్నది. గొడ్డలిమాత్రము అగ్నిలోబడి కమ్మరివాని సమ్మెట దెబ్బలు తినుచున్నవి.

అనుజా! ఇంకను సాధు సత్పురుషుల సద్గుణ సమూహమును సవిస్తరముగ వివరించుచున్నాను. ఆకర్ణింతువుగాక. సజ్జనులు సదా శీలగుణసంపన్నులై చరించుచుందురు. వారు విషయాసక్తులు కాక సన్మతితో ఇతరుల సుఖదుఃఖములే తమ సుఖదుఃఖములుగా భావించి తోడ్పడుదురు. వారి స్వభావము బహు కోమలమైనది. వారి హృదయము మిక్కిలి దయార్ద్రమైనది. సోదరా సాధుపురుషులు నిర్మలాంతఃకరణతో సర్వదానన్ను సేవించుచుందురు. స్వార్థరహితులై యెప్పు అమ్మహనీయులను సదా శాంతి శమదమాది సుగుణములు ఆశ్రయించి యుండును. మైత్రీభావము, సరళ ప్రవర్తన, శీతల హృదయము, బ్రాహ్మణ భక్తి, నమ్రత, కటువచనములు పలుకకుండుట, ఇంద్రియ నిగ్రహము, సమత్వము, దూషణ భూషణముల యెడ సమతాభావము, సత్పథమున సంచరించుట ఇత్యాది గుణవతులైన సత్పురుషులను— నేను ప్రాణాధికముగా ప్రేమింతును. వారు సుఖధాములని తెలుసుకొనుము.

ఇక దుర్జన లక్షణము లెట్లుండునో ఒకింత తెలుసుకొని యుండుట మంచిది. సోదరా ! దుఃఖ ప్రదమగు దుర్జన సాంగత్యమెల్లడల వర్జనీయమే. వారు పరనిందా ప్రియులు, కామక్రోధ



'డాక్టరుగారూ! దయచేసి మా ఆవిడతో మరో రెండ్రోజులు ఇక్కడే వుండాలని చెప్పండి! ఇంటికి వెళ్తే... మళ్లీ రావల్సివస్తుంది!...'

మదలోభ పరాయణులు. వారి బుద్ధి వక్రమైనది. వారి స్వభావము సదా నిష్కారణ వైరమును ఆపేక్షించుచుండును. వారు భుజించునది అసత్యమును, వారు త్రాగునది అసత్యమును, వారి జీవనవ్యాపారములన్నియూ అసత్యభూయిష్టములే. వారి మాటలు తేనె బూసిన కత్తులు. విష సర్పములను మ్రింగు నెమలి తియ్యగా కూయునటులనే వారి పలుకులు మాత్రము పైకి తియ తియ్యగా నుండును. ఆ దుష్టులు నిరంతరము పరధన దారాసక్తులై యుండు హింసాపరులు. వారి మనోభావములు వారి దినచర్యలు వారి నడవడిక అన్నియు స్వార్థచింతతో కూడుకొని యుండును. వారు అహర్నిశము శిశ్నోదర చింతారతులై వర్తించుచుందురు. అన్యుల సుఖమును హర్షించ నొల్లని ఈర్ష్యాపరులు. తల్లి, తండ్రి, గురు జనులను గౌరవించుట వారి మతమునకు విరుద్ధమైనవి. మోహావశులై మాత్సర్య భావముతో నిండి యుందురు. సత్సంగము— సత్కథా శ్రవణము లాంటి సద్వ్రతములు వారికి నచ్చవు. ఆ మందమతులను వివిధ దుర్గుణములు ఆశ్రయించి యుండును. సోదరా ! ఇట్టి దుర్జనావాసము కృత త్రేతా యుగములందు కానరాదు. ద్వాపర యుగమందు వీరి సంఖ్య అల్పమై యుండెను. కలియుగ మందు వీరి ప్రాబల్య మధికమై యుండును.

భరతా ! పరపీడన కంటె మిన్నయగు పాపము లేదు, పరోపకారమునకు సాటి రాగల సద్ధర్మము మరొకటి లేదని సకల వేదార్థ సారమై యున్నట్లు విబుధ వరేణ్యుల సమ్మతము. అలభ్యమైన మానవ జన్మమెత్తి యెవరు ఇతరుల హాని తలంచెదరో వారు పరలోక సుఖములను పోగొట్టుకొనుచున్నారు. శుభాశుభ కర్మఫలమును ప్రసాదించువాడనుగా, దుర్జనుల పాలిటి కాలస్వరూపుని భావించి విజ్ఞులు నన్ను భజించుచున్నారు.

ఇవ్విధముగ సుజన దుర్జనుల స్వభావములు వారి గుణావ గుణములు శ్రీ వారి ముఖతః విన గలిగినందుకు భరత హనుమంతాదులు పరమానంద మనుభవించిరి. ఆ పైన రామాదులు ఉపవనము వీడి రాజమందిరమునకు పోయిరి.

ఇట్లు సత్పురుషుల సందర్శనములతో సద్విద్యా గోష్ఠులలో దాశరథి దైనందిన చర్యలు లోకానంద దాయకమై యుండెను. నారద మహర్షి నిత్య ప్రతి రాముని రాజధానికి వచ్చు చుండెను. అతడు స్వామి సందర్శనానంతరము తిరిగి బ్రహ్మ లోకమును చేరుకొనును. అక్కడ బ్రహ్మేంద్రాది స్వర్లోకవాసులకు, సనకాది ఋషీశ్వరులకు రాముని దివ్య చరిత్ర గానము చేసి వినిపించు చుండును. పరమేష్ఠి— సనకసనందులు— మహర్షులు — తదితర దేవలోక వాసులు ఇతోధిక జ్ఞాన ధనులు. అయినప్పటికినీ వారు తమ యోగములకు సమాధి నిష్ఠలకు స్వస్తి చెప్పి మిక్కిలి శ్రద్ధా భక్తితో నారదుల యొద్ద శ్రవణానంద కరమైన రామకథను వినుచూ తృప్తులగుచుండిరి.

ప్రభువు పురజనులకు భక్తి ప్రాశస్త్యమును తెలియచేయుట

ఒక దినము రామచంద్రమూర్తి గురువులను భూసురులను పురవాసులను రాజమందిర ప్రాంగణమున సమావేశ పరచి వారికిట్లు భక్తి ప్రాశస్త్యమునుద్బోధించెను.

“ఓ నాగరికులారా ! నే నిప్పుడు చేయబోవు ప్రసంగమును మీరు సావధాన మనస్కులై ఆలకించి, అందు సద్విషయములని మీకు తోచిన వాటిని యథామతి అనుష్ఠితురని ఆశించుచున్నాను.

“రాజ్యాధి కారముతో లేక స్వార్థ బుద్ధితో నే నిప్పుడు ప్రసంగించుట లేదని నమ్మవలసినది. నా ఉపదేశ మందున్న గుణదోషములను మీ స్వబుద్ధితో విచారించి తదను గుణ్యముగా ప్రవర్తించవలెనని కోరుచున్నాను. పౌరులారా ! మానవ జన్మ సర్వోత్కృష్టమైనదని శాస్త్రములుద్ఘోషించుచున్నవి. ఈ శరీరము పూర్వ పుణ్య సుకృతము వలన గాని లభింపజాలనిది. సకల విధ మోక్షములకు సాధన కరమైన నరజన్మ దేవతలకు సైతం దుర్లభమైనది. ఇట్టి మానవ జీవితమును కేవలము విషయ భోగములనుభవించుట యందే వ్యయము చేయుట వాంఛనీయము గాదు.

డాక్టరు పిచ్చివానితో : “ఆఁ ! బాగుంది......మనుష్యులను గుర్తుపట్టినావు. ఇత డెవరో చెప్పు చూద్దాము” అని కాంపౌండర్‌ను చూపించాడు.

పిచ్చివాడు : అతడో పిచ్చివాడు!

ఎ. కృష్ణయ్య (తిరుపతి)

“మూర్ఖులు మందమతులు నిరంతర భోగ లాలసులై పారమార్థిక చింతన లేక, పిమ్మట పరితాపము బొందుచున్నారు. వారు తమ కోర్కెలు సిద్ధించనపుడు చింతాతురులై విధి వైపరీత్యమిట్లున్నదని వాపోయి దేవునిని సైతం దూషించుటకు ఒడిగట్టుచుందురు. ఈ శరీరము యొక్క ప్రయోజనము విషయ సుఖములనుభవించుట గాదు. వాంఛలు క్షణికములైనవి. స్వర్లోక సౌఖ్యములు కూడా దుఃఖ దాయకములైనవే. దుర్లభమగు మానవ జన్మ ధరించి సుఖాతురుడై పరుగెత్తు పామరుడు అమృతమునకు బదులు విష మాశించుచున్న వాడగును.

“జీవుడు నిరంతర వాంఛారతుడగుటం జేసి ముక్తి గానక ఎనబదినాల్గు లక్షల జీవుల యోనులందు భ్రమించుచుండును. జీవుడు మాయాధీనుడై యున్నందున కాలకర్మ స్వభావ జనితమగు విషయ దోషములు అతనిని సదా వెన్నంటి యుండును. అట్టితరి, పరమేశ్వరుడు నిర్హేతుక జాయమాన కటాక్ష వీక్షణుడు ఒకప్పుడా క్షుద్ర జీవికి అలభ్యమగు మానవ శరీరమును ప్రసాదించుచున్నారు. ఈ మానవ దేహము భవసాగరము తరించుటకు నావ వంటిది. నా యనుగ్రహమును గాలి వాటమున కుదిరి జలధిపై పయనించును. చుక్కాని వంటి సద్గురువు లభించి నపుడు ఆ ఓడ ఒడుదుడుకులు లేక సుఖముగ దరిజేరును. మోక్ష సాధన కరమగు ఇట్టి మానవ శరీరము లభించియు, భవసాగరమును తరించుటకు ప్రయత్నించని వాడు కృతఘ్నుడు, ఆత్మఘాతకుడగుచున్నాడు.

“సోదరులారా ! ఇహ పర సుఖములు రెంటినీ ఆశించువారికి భక్తి కంటే ఉత్తమమైన సుఖ పథము లేదు. భక్తి సత్సాంగత్యముచే సిద్ధించును. భక్తి లేని వాడు నా ప్రేమ చూరగొన జాలడనుట తథ్యము. దుర్గమము కఠినతరము బహుబాధాకరమైన జ్ఞాన మార్గము కంటే భక్తి మార్గము శ్రేయస్కరమైనదిగా విశ్వసించవలసినది. కానీ, ఇందొక చిన్న రహస్యమున్నది. అది యేమన— సదాశివుని సేవించని వాడు మాత్రము నా భక్తిని పొందజాలడను సంగతి యేనాటికి విస్మరింపకుడు.

“ఓ ప్రియ జనులారా ! భక్తి మార్గములో కష్టమేమున్నది. యోగము యజ్ఞము జపము తపము ఉపవాసము ఇత్యాది కఠిన వ్రతములు భక్తికి అనావశ్యకములు. సరళ స్వభావము నిర్మలాంతః కరణము యథాలాభ సంతృప్తి ఇవియే భక్తి ప్రాప్తికి అపేక్ష యమైనవి. వైరము —విగ్రహము— భయము— శోకము— మోహము మమత— అహంకారము ఆది దుర్గుణ స్వభావము లేక ఎవడు నన్నే నమ్ముకొని సదా నన్ను స్మరించుచుండునో ఆ భక్త ప్రవరునికి సర్వదా నేను వశుడై యుందునని వక్కాణించుచున్నాను. ఆ భక్తి వర్యుడు పరమానంద కరమగు బ్రహ్మానంద— ప్రాప్తి సిద్ధించి సుఖించును.”

అమృతోప మానమగు రామోపదేశము సాకేత వాసులను సమ్మోహితులను జేసెను. వారు వినమ్రులై సాకేతనాథుని చరణములకు శిరములు వంచి గద్గద స్వరముతో ఇట్లు పలికిరి—

“ఓ దాశరథీ దయానిధీ ! మాకు తల్లి తండ్రీ, గురువు, దైవము సర్వము మీరే. మీ యపార కృపాదృష్టి ప్రసరించుటం జేసి మేము సకల విధ సౌఖ్యములతో సుఖ జీవనము చున్నాము. హే కోసలేశా ! మా కష్టములను నివారించి, మాకు చక్కని శిక్షణ గరపి మమ్ముద్ధరించిన మహా పురుషులు మీరు. ప్రభూ ! మీరు, మీ సేవకులు లోక హితార్థమై చేయుచున్న నిస్వార్థ సేవ అనన్యమైనది.”

ప్రజల పరమాదర ప్రసంగము విని ప్రభువు ప్రసన్నుడాయెను. తదనంతర మా పౌర సందోహము స్వామికి సద్భక్తి సాష్టాంగ మొనర్చి, అతని గుణగణములను కీర్తించుకొనుచూ నిజ గృహములకు నిష్క్రమించెను.

ఓ యువా ! సాకేతపుర జనులెంత సుకృతి జన్ములు ! సచ్చిదానంద రూపమగు ఆ పరబ్రహ్మ స్వయముగ **రామావతారమున** వేంచేసి వారిని పాలించెను.

(సశేషం)

గదికి వచ్చి నానా మాటలూ అంటే—"

తన అడ్రసు ఎందుకు రాశానా అని బాధ పడ్డాడు. ఒక రకం భయం ఆవహించింది.— గబుక్కున దుప్పటి ముసుగెట్టుకుని కళ్ళు గట్టిగా మూసుకున్నాడు.

*   *   *

మర్నాడు ఆఫీసులో ఈ ఉత్తరం విషయం పూస గుచ్చినట్లు గోపాలంతో చెప్పాడు.

అతడు ముందు తెల్లబోయి తర్వాత బొజ్జంతా ఊగేటట్లు నవ్వాడు.

"ఇంకేం, జానకిని వదిలి సరోజ వెంటపడు." అన్నాడు. ఇద్దరూ కిలకిల నవ్వుకున్నారు.

క్రమేపీ ఆ ఉత్తరం సంగతి మరచిపోయాడు శేఖరం. పట్నాటలో రోజులు దొర్లి పోయినయ్.

*   *   *

పదిహేను రోజుల తర్వాత ఒక రోజు ఆఫీసు నుండి రూమ్‌కు వచ్చేసరికి తనకు రెండు ఉత్తరాలు వచ్చి ఉన్నాయ్. ఒకటి కార్డు. తండ్రి రాశాడు— 'పెళ్ళి ఎప్పుడు పెడుతున్నావు' అంటూ. రెండవది కవరు. పై దస్తూరి గుర్తుపట్టినదిగా లేదు. ఆత్రతతో కవరు చించాడు. నీలం కాగితం మీద ఉత్తరం రాసి ఉంది.

"ప్రియమైన సుధాకరానికి,

నీ ఉత్తరం చదువుతున్నంత సేపూ నిజంగా నువ్వేనా అనిపించింది. ముప్ఫై ఏళ్ల తర్వాత నన్ను నీకు గుర్తుకు వచ్చినందుకు సంతోషం. నీ ఉత్తరం నాలో ఏ తుఫాను రేపిందో కాగితాల మీద రాయలేను. ఇన్నాళ్ళూ ఒక రకం జీవితం అలవాటు చేసుకున్నాను. ఉదయించి అస్తమించే సూర్యుణ్ణి చూస్తుంటే పొద్దుపోయేది. దొడ్లో చిక్కి పిల్లలు పరుగెత్తుతూంటే చూసి ఆనందించే దాన్ని— నాకు మానసికంగా నమ్మకం పోయింది. ఎవర్నీ నమ్మలేను. ఇటువంటి పరిస్థితిలో నీ ఉత్తరం వచ్చి నాలో స్తబ్దమైన ఉన్న ఏవో కోర్కెల్ని ఒక్కమాటు కదిలించింది. కాని తమాయించుకో గలిగాను. నా భర్త గురించి రాశావు కదూ! నేను మరొకర్ని వివాహం ఆడేంత నీచానికి దిగలేదు— నాతో బాటు మరొక హృదయానికి బాధను పంచలేక— నీ గురించి కలగని ముప్ఫై ఏళ్ళయింది— ఇప్పుడు కొత్తగా ఆ పని చేయలేను, క్షమించు.

ఈ ఉత్తరానికి జవాబు రాయవద్దని నాదీ మరీ ప్రార్థన.

ఇట్లు

నీది కాని నీ సరోజ"

శేఖరం మనస్సు ఉద్వేగంతో ఉరకలు వేసింది. పరాలు పట్టుతప్పి పళ్ళంలా కంపించి పోయింది. ఇది కలా, నిజమా ?— వేలు గిల్లుకున్నాడు. గబుక్కున గోపాలం గుర్తుకొచ్చాడు. ఒక వేళ అతని పని కాదు గద !—

కవరు మీద చూస్తే విశాఖపట్నం ముద్ర ఉన్నది—

వణుకుతూన్న చేతుల్తో మళ్ళీ ఆ ఉత్తరాన్ని ఒకమారు చదివి జాగ్రత్తగ మడిచి టేబుల్ మీద పెట్టి కుర్చీలో కూలబడ్డాడు.

ఇంత కన్న చిత్రమైన సంఘటన అతడి జీవితంలో ఊహించుకో లేదు. ఏదో గొప్ప నవల

పోస్టుకాని ఉత్తరం

15 వ పేజీ తరువాయి

లోని నాయకుడిలా ఫీలయ్యాడు ఒక్క క్షణం. అదే క్షణంలో ఏవో దయ్యాల కథలు గుర్తుకొచ్చినై అతడికి.

'నిజంగా ఆమె వివాహం చేసుకోలేదా. అలా అయిన పక్షంలో ప్రేమను నిర్వచించేందుకు సరోజలాంటి స్త్రీ ఒక్కరు చాలేమో !'

ఆ టేబిల్ కేసి మరొక్కమారు చూశాడు.

పాలకన్న తెల్లగా, గాలి కన్న మృదువుగా మబ్బు కన్న నిర్మలంగా, ఉన్న సరోజ— సరిగా ముప్ఫై ఏళ్ళ క్రితం— ఒక వెన్నెల రాత్రి సంపెంగలూ, సన్నజాజులూ గుబాళిస్తూ చల్లటి గాలి సోహన్ని సుతారంగా పెనవేస్తూంటే తన ప్రియుడికి ప్రేమలేఖ రాసే దృశ్యం అతడి కళ్ళ ముందు సజీవంగా కనుపించింది. వెంటనే ఆమె ముఖంలో ఏవో

తల్లినీ, తండ్రినీ చంపాడన్న నేరాన్ని ఒక పెద్దమనిషి మీద ఆరోపించటం జరిగింది. వకీలు ఇంట్లో:

ముద్దాయి : చూడండీ ! ఏలా గయినా మీరే రక్షించాలి ! నన్ను క్షమించమని, కోర్టువారిని కోరండీ !

వకీలు : ఎలా క్షమించమని కోరాలో తెలియటం లేదు.

ముద్దాయి : తల్లి, తండ్రీ లేని వాడనని క్షమించమనండీ.

మాధవరావ్ (మద్రాసు)

విషాద ఛాయలు కనుపించి అశ్రుధార గట్టు తెంచుకున్న నదిలా అగుపించిందతడికి—

ముప్ఫై యేళ్ళు కాలగర్భంలో కలిసి పోయినా కూడ ఆమెను అదే రూపంలో వూహించుకో గలడు గాని మరో విధంగా వూహించుకోలేక పోతున్నాడు. ఎంత ప్రయత్నించినా సరోజకు వార్ధక్యం అంటు గట్టలేదు— నిత్య యవ్వని ఆమె !

మరో ఉత్తరం ఆమెకు రాస్తే— జవాబు రాయ వద్దంది— ఎందుకో మరి— తను బయలు దేరి వస్తున్నానని రాస్తేనో— దానికి జవాబు ఏమని రాస్తుంది ?—

యాంత్రికంగా కలం చేతుల్లోకి తీసుకున్నాడు శేఖరం.

"నేను వారం రోజుల్లో బయలుదేరి వస్తున్నానని— వెంటనే జవాబు రాయమంటూ." రాసేసి వెంటనే పోస్టు చేసేశాడు— ఇదీ తమాషాకే చేసుంటాడేమో— తమాషాకన్నా ఆమె నుంచి మరొక ఉత్తరం రావాలనే కోర్కె ఎక్కువగా ఉండటం చేతనేమో— ఏదీ చెప్పలేడతను.

మర్నాడు గోపాలంతో జరిగిన సంగతంతా చెప్పేశాడు.

అతడు ముందు వెర్రి మొహం వేసి తర్వాత నది వూగిసలాడేట్టు నవ్వాడు— "ఇంకేం పాకంలో పడ్డావ్— కొంపతీసి ఆ వూరు వెళ్ళేవ్— పట్టుకుని వదల్దు— పైగా ముసల్ది" ఈ ప్రేమ కథను తేలికగా కొట్టిపారేశాడతను.

శేఖరం కూడ నవ్వుగా నవ్వాడు.

*   *   *

మునుపటిలా గాక తాను రాసిన ఉత్తరానికి ప్రతిరోజూ జవాబు కోసం ఎదురు చూడటం మొదలెట్టాడు. కాని పదిహేను రోజులయినా జవాబు రాలేదు.

ఈ పదిహేను రోజుల్లోనూ తండ్రి వద్ద నుంచి రెండు కార్డులు వచ్చినయ్ "త్వరగా బయలుదేరి రమ్మంటూ !"

జానకిని చూడాలన్న కోర్కె ఏ రోజు కారోజు ఎక్కువ అవుతూనే ఉన్నది. గీ నాడో పెట్టిన పెళ్ళి దరఖాస్తు మంజూరు అవనే అయింది—

ఇంటికి బయలుదేరే రోజున గోపాలం కూడా స్టేషనుకి వచ్చాడు.

"తొరగా పెళ్ళి చేసుకుని—" అంటూ ఏదో చాడు పైగా "ప్రేమకులం మాట మర్చిపోయి విశాఖపట్నంలో దిగేవ్" నిమిషాన్నాడు శేఖరం. 'ఏడిశావ్' అంటూ— "సరోజ ముసల్ది."

మర్నాడు పన్నెండు గంటలకు విశాఖపట్నం స్టేషను అతి అందంగా కనుపించింది శేఖరానికి.

ఇదే స్టేషను ప్లాటుఫారం మీద ఒకప్పుడు మెల్లగా అడుగులు వేసుకుంటూ వయ్యారంగా నడిచి వెళ్ళిన సరోజ మళ్ళీ ఈ స్టేషన్ మొహం చూసి ఉండదు. పోనవ్వు స్టేషనూ, పరిసరాలూ సరోజనే గుర్తుకు తెస్తున్నయ్.

మరో అయిదు నిముషాల్లో ట్రైను కదులుతుందనంగా బెడ్డింగు సూట్కేసు గబుక్కున దిగి పోయాడు ఆ స్టేషనులో— ట్రైను కదిలి పోయింది.

ఇప్పుడేం చేయాలి ?— ఎందుకు దిగాడు తను ?— పోనీ గంట ప్లాట్‌ఫారము మీదే నిలబడి పోయాడు. తర్వాత.

బెడ్డింగ్ క్లోక్ రూమ్‌లో వేసి, హోటల్లో భోజనం చేసి రిక్షాలో బయలు దేరాడు.

సరోజ ఇల్లు కనుక్కోవడం అంత కష్టం కాలేదు. పెద్ద బంగళా— చుట్టూ దొడ్డి— పూల మొక్కలు— గర్వంగా చూస్తూన్న పోర్టికో— ముందు పెద్ద గేటు.

రోడ్డు మీద నిలబడి ఇంటికేసే చూస్తున్నాడు శేఖరం. ఏ నిముషాన్నన్నా సరోజ పోర్టికోలోకో, పోర్టికో పైకో రాకపోతుందా అని అతడి అభిప్రాయం అయుండచ్చు— ఆమెను చూడా లన్న కోర్కె ఉరకలు వేస్తున్నది.

రెండు—మూడు— నాలుగు గంటలు దొర్లి పోతున్నయ్—కాని ఆమె జాడ కనుపించలేదు.

అప్పటికి అతడు ధైర్యం కూడకట్టుకుని గేటు కేసి నడిచాడు.

గేటు అవతల పూల మొక్కలకు నీళ్ళు పోస్తున్న నౌకర్ని కేకేశాడు.

'సరోజమ్మగారి ఇల్లు ఇదేనా ?'—చాల కష్టం

మీద అనగలిగాడు. గుండెల్లో భయం తాండవిస్తున్నది

'అవు'నన్నాడు నౌకరు సంకోచిస్తున్నట్లు.

'ఆమె లోపల ఉన్నారా? ఆమెతో మాట్లాడాలి'

లేదని నౌకరంటే బాగుండునని వేయి దేవుళ్లకు మొక్కుకున్నాడు చేతులూ కాళ్ళూ వణికిపోతున్నయ్.

నౌకరు తెల్లమొహం వేశాడు.

"ఇంకెక్కడి సరోజమ్మ బాబూ—పదిహేను రోజులాయె కన్నుమూసి—తమకు తెలవదా బాబూ"

శేఖరం ప్రతిమలా బిగుసుకుపోయాడు ఈ వాక్యంతో.

'మా తల్లి ఏ లోకాన్నుందో సుకం అంటు ఎరగదు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తా ఉండేవారు. ఆమె బాదేదో ఎవురికీ అంతుసిక్కలేదు నెలరోజుల క్రితం వోమాటు మూర్ఛవచ్చి పడిపోయిందట మా యమ్మ. తర్వాత బాగుంది కాని పదిహేను రోజుల్నాడు మేడ మెట్లమీంచి జారి పడిపోయింది బాబూ! అంతే మళ్లీ కళ్లు తెరవలేదు మంచోళ్ళకే కట్టాలెందుకు పెడతాడో భగమంతుడు

తలవంచుకుని చెప్పుకుపోతున్న నౌకరు తల ఎత్తేసరికి శేఖరం అక్కడలేడు

దూరంగా అడుగులు వేసుకుంటూ వెడుతున్న వ్యక్తినిచూసి నౌకరు విస్తుపోయాడు

* * *

మూడు రోజుల తర్వాత శ్రీకాకుళంలోని ఒక డాబా ఇంట్లో పెళ్లి చూపులకని వెళ్ళిన శేఖరం రెండవ మారుగ జానకిని చూశాడు

పాలకన్న తెల్లగా, గాలికన్న మృదువుగా, మబ్బుకన్న నిర్మలంగా . . . కనుపించింది జానకి ★

న్యూఢిల్లీ లేఖ

7 వ పేజీ తరువాయి

కాదా ?

పైగా, ఇండియా తన వ్యవహారాన్ని భద్రతా సంఘం వద్దకు తీసుకెళ్లినందుకు ఇటీవలనే శ్రీమతి ఇందిర గాంధి కూడా విచారం వెలిబుచ్చారు ఈ వ్యవహారాన్ని తీసుకెళ్లింది ఇండియా కాదు, ఇందిరాగాంధి నాన్నగారైన నెహ్రూగారే ఆరోజుల్లో మంత్రివర్గ సభ్యులు చాలామంది కాదంటున్నా, శ్రీ నెహ్రూ ఆపని చేశారు నిర్మొహమాటంగా తన అభిప్రాయం చెప్పిన శ్రీమతి ఇందిరాగాంధిని అభినందించక తప్పదు.

వీళ్ల వ్యవహారం ఇలా ఉండగా, కేంద్రంలో కొందరు ప్రముఖ లున్నారు. ఎంతసేపటికీ ప్రజలలో ప్రసిద్ధి పొందాలనీ, నలుగురి దృష్టిలోనూ పడాలనీ వీరి ఆరాటం. అలాంటివారిలో శ్రీ కృష్ణ మీనన్ అగ్రగణ్యుడు తాను రక్షణమంత్రిగా ఉన్నప్పుడే ఇండియా పెద్ద అవమానం పొందినందుకు శ్రీ మీనన్ ఏమాత్రమూ బాధపడుతున్నట్లు లేదు. మూడవ ప్రణాళికలోని మూడవ సంవత్సరంలో ఇండియా తొలిసారిగా దేశరక్షణ కొక ప్రణాళికను ప్రారంభించటం విచారం కదా ! అయినా, అంత కుంభకోణం జరిగినా, తిరిగి మంత్రి కావాలని మీనన్ ఉబలాటపడుతున్నారు. తన ఆశయాన్ని నెరవేర్చుకొనేందుకే కాబోలు, ఆయన అమెరికా, బ్రిటన్ మొదలైన పాశ్చాత్య దేశాలను దుయ్యబడుతూ, కాశ్మీరు విధానాలపై రణగర్జనలు చేస్తున్నారు.

పండిట్ కె. డి మాలవీయ కూడా, తనను మరచిపోతున్న లోకంమీద దాడిని ప్రారంభిస్తున్నారా అనిపిస్తున్నది నెహ్రూ, అబ్దుల్లా చర్చలలో ప్రధాని మనసు కష్టపెట్టవద్దని మాలవీయగారు ఇటీవలనే పత్రికా ప్రకటన నొకదానిని చేశారు తన పార్టీలో ఆయనకే పలికేవాళ్ళు లేరు, అటువంటివాడు ప్రజలకు విజ్ఞప్తి చేయుటమా !

* * *

బీహారు మొదలైన ప్రాంతాలలో మహమ్మదీయులకు భద్రత లేదని శ్రీ జయప్రకాశ్ నారాయణ ఇటీవలనే చెప్పారు

బుజువర్తన గల మనుష్యు లెవరైనా యిది ఆలోచించాల్సిందే అక్కడ హిందువులను హింసిస్తున్నారని లేదా చంపుతున్నారనిగాని, యిక్కడ ఇండియాలో ముసల్మానులను హింసించ బూనుకోడం సబబుకాదు.

జయప్రకాశ్‌నారాయణ్ గారికి దేశమంతా ఒకటిగా ఉండాలనడం కన్నా ముఖ్యంగా 'శాంతి', 'భారత్ — పాక్'ల మైత్రి ప్రాముఖ్యంగా అగుపిస్తాయి. అందుకే ఆయన షేక్ అబ్దుల్లా కోరే స్వయం నిర్ణయాన్ని బలపరుస్తూ పోయిన వారం పత్రం మీద సంతకంపెట్టి, మరి పూరుకున్నారు కాని ఆ స్వయం నిర్ణయం ఎలాంటిది ? అనేదే ప్రశ్న అందుకే సింహావలోకనం అవసరం. అసలు షేక్‌ని ఎందుకు వదిలారు ? ఎందుకంటే సాదిక్‌గారు యీ పదేళ్ల బక్షీ పరిపాలన ప్రజలలో అసంతృప్తిని పెంపొందించిందని భావించారు. పదేళ్ళు జైల్లో ఉన్న షేక్ అబ్దుల్లాను వదిలివేస్తే ఆ కృతజ్ఞతతో తనను బలపరుస్తాడేమోనని సాదిక్ ఆశ. కాని కథ అడ్డం తిరిగింది పైగా నెహ్రూ కాశ్మీర్ సమస్య మరింత జటిలమైందన్నారు. అయితే పార్టీసభ్యుల నెత్తినే అంతా రుద్దుతారాయన ఈసారి, పోతే మత వ్యతిరేకత షేక్ అబ్దుల్లా తన హస్తగతం చేసుకున్నాడన్నది నిజమేగాని హిందువులు లేదా ముస్లిం మతాదులు గుడ్డిగా తప్ప మరోలా అయితే అతన్ని అనుసరించరు ఇప్పటి పరిస్థితిలో చాగ్లాగారు భద్రతాసమితి ఎదుట భారత్ కేసును వాదించడం బహు కష్టంగా వుంటుంది— స్వతంత్ర కాశ్మీర్ అనేది యిప్పటి భారత్‌కు మరింత గాయమే అవుతుంది కాని ఈలాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా మంత్రివర్గం చిన్నతనం, స్వార్థపూరిత వ్యతిరేకము పోలేదు. ఇప్పటికి శ్రీ నెహ్రూ తన సహచరులను స్వార్థం వదిలివేయమని చెప్పడం ద్వారా కాంగ్రెసుని— పరిస్థితుల్ని రక్షించగలరేమో.

పాకిస్తాన్ ఇండియానుంచి విడిపోయిన నాటి నుంచి భారతదేశంలోని కొందరు మహమ్మదీయులు కాంగ్రెసును అంటిపెట్టుకుని ఉంటూ, నెహ్రూ గారు పిలిచినప్పుడు పలుకుతూ తమకు ఇండియా పట్ల భక్తివిశ్వాసాలను ప్రదర్శించుకుంటూ, ప్రతిఫలాన్ని అపేక్షిస్తున్నారు. డాక్టర్ షౌకత్‌వుల్లా అన్సారీకూడా రాయబారి అయేంతవరకు, ఇండియాలోని మహమ్మదీయులు భక్తివిశ్వాసాలను తెలిపే సంతకాల ఉద్యమాలను నడిపారు కల్నల్ జైదీ ఆధ్వర్యాన ప్రతినిధివర్గ మొకటి ఇండియాలోని 'సెక్యులరిజం' వివరించేందుకు ఇతర దేశాలకు వెళ్లింది. కల్నల్ జైదీ ఒకనాటి రాంపూరు సంస్థానానికి అధిపతి అని అందరకీ తెలిసే ఉంటుంది. ఈ ప్రతినిధివర్గం పాకిస్తాన్ పోయివున్నా బాగుండేది. సర్ ఫజలీహుస్సేన్ కుమారుడు అజిత్ హుసేన్‌కుకూడా విదేశాంగమంత్రిత్వ శాఖలో అవకాశం లభించింది ఆయన బంధువులు, వారి భార్య తరపువారు పాకిస్తాన్‌లోనే ఉన్నారు. ఇరాన్‌లోని ఇండియా రాయబారి సోదరుడైన 'వేగ్' పాకిస్తాన్‌లో విదేశాంగశాఖ కార్యదర్శి మహమ్మదీయుడైన ఒక ఉపమంత్రి పిల్లలకు యీనాడు పాకిస్తాన్‌లో విద్యాభ్యాసం చేయిస్తున్నారు. ఇండియాలో ఉంటూ, పాకిస్తాన్‌తోనే సంబంధాలు నిలుపుకోవాలని ఉత్తరభారత దేశంలోని మహమ్మదీయులు చాలామంది అనుకుంటున్నారు. అలీఘర్‌లో ఉండే మహమ్మదీయ విశ్వవిద్యాలయం కోసం భారతప్రభుత్వం ఏటా కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నది. ఈ విశ్వవిద్యాలయంలో చదివే వారిలో నూరింటి 80 మంది పాకిస్తాన్‌కు తరలి పోతున్నవారే

మరో విషయం పాకిస్తాన్‌లో ఉండే అల్పసంఖ్యాకవర్గమైన హిందువులను, క్రైస్తవులను ఆ ప్రభుత్వం హింసిస్తుందన్న తీరును ఇండియాలోని కాంగ్రెసు నాయకులు హుమయూన్ కబీర్‌గాని, షానవాజ్ జంగ్‌గాని ఇంతవరకు ఒక్కసారైనా విమర్శించలేదే! కులతత్వం మీదగాక, వాస్తవాలమీదనే ఆధారపడి ఉన్న, సంఘటనలు ఎన్నో ఉన్నాయి ఇండియాలోని అల్ప సంఖ్యాకులైన మహమ్మదీయులు మన "సెక్యులరిజం" విధానాన్ని వారి స్వార్థంకోసం వినియోగించుకుంటున్నారు కాని 'సెక్యులరిజం' కన్నా, మనదేశానికి "భద్రత అన్నది" చాలా అవసరమని అందరూ గుర్తించాలి

ఒక చిన్న ఉదాహరణ చెపుతాను. ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్‌కమిటి అధ్యక్షుడయిన మీర్‌ముష్తాఖ్ మసీదుల నిర్వహణసమితికికూడా అధ్యక్షులే ప్రాచీన చిహ్నాలను భద్రత చేయించటానికి నిన్న, మొన్నటి వరకు ప్రొఫెసర్ హుమాయూన్ కబీర్‌గారే బాధ్యులు. ఈ చిహ్నాలను ఒకమారు ప్రాచీనంగా పరిగణించిన తరువాత వాటిమీద విధిగా ధనాన్ని వెచ్చించవలసి ఉంటుంది ఆ తరువాత అవి భారత ప్రభుత్వపు ఆధీనంలోకే వస్తాయి

కాని ఢిల్లీలోని జమ్మా మసీదును అసలు ప్రాచీన చిహ్నంగా ప్రకటించడం జరిగలేదు కాని దాని కోసం లక్షలు వెచ్చిస్తున్నారు ఇలాంటివే మరెన్నో సంఘటనలున్నాయి ఇవి దుఃఖితులు బాధితులు అయిన కాందిశీకులు దేశంలోకి విరివిగా వస్తున్న తరుణంలో మత అసహనానికి కారణాలౌతాయి. గనుక, మనం మరోసారి పరిస్థితులను ఆకళింపు చేసుకోవాలి.

శ్రీకృష్ణ ★

సంగమాల

నా పర్యటనలో ఏలూరులో రెండు రోజులు ఉండటం తటస్థించింది. మిత్రులైన కో-ఆపరేటింగ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావుగారు చిన్న నృత్య ప్రదర్శన యేర్పాటు చేశారు. చిన్న అనే విశేషణం ఈ చోట వేసిన అమ్మాయి వయసుకీ, జరిగిన కాల వ్యవధికీ మాత్రమే వర్తిస్తుంది. ప్రదర్శింపబడిన అభినయ చాతురికీ, భంగిమల స్పష్టతకూ, నేర్పిన వారి కళాభిజ్ఞతకూ యే మాత్రం వర్తించదు.

ఆ అమ్మాయి వి. కృష్ణమూర్తి గారి ద్వితీయ పుత్రిక. పేరు నళిని. ఏడెనిమిదేళ్ళ వయసుంటుంది. వయసు మించిన నేర్పు నృత్యంలో, వయసుకి తగ్గ శరీర గాత్రంలో సన్నగా, నాజూగ్గా, చామన చాయగా (మోహన వంశీలోని నర్మద జ్ఞాపకం వచ్చింది) ఉన్న నళిని సాన బట్టిన మెరుపు తీగలా ఆడింది. అభినయం చేసిన రెండు పాటలూ నాకు అభిమాన పాత్రమైనవే. మాండ్ రాగంలోని "నా హృదయ వీణకలో" ఒకటి, చిత్తూర్ సుబ్రహ్మణ్యం పిళ్ళేగారి "మా వల్ల కాదమ్మా" రెండవది.

నళినికి రెండేళ్ళుగా నాట్య శిక్షణ ఇస్తున్నది ఘంటా కనకారావు. చాలా కాలంగా ఏలూరులో ఉంటూ సుమారు వందమందిని నాట్యంలో సుశిక్షితులను చేశారట. వీరికి పాముపాట నృత్యంలో మంచి పేరుందని విన్నాను. ఒక స్నేహితుని ఇంట్లో "మురుకేళి దేలించర" (గోపాలం — కోమల పాట) రికార్డు వేయగ ఆశువుగా అభినయం చేసి చూపించారు. అంతటి సమయస్ఫూర్తి నన్ను చకితుణ్ణి చేసింది.

నాట్యం చేయటం నేర్పే వారందరూ నేర్పగలరని విశ్వసించలేము. నేర్చేవారందరూ నేర్పుగా నాట్యం చేయాలనీ లేదు. కాని కనకారావు అభినయం, వారి శిష్యురాలైన నళిని అభినయం చూస్తే రెండిటి యందూ వారికి సమానమైన ప్రావీణ్యత ఉందని తెలుస్తుంది.

వి. ఎ. కె. రంగారావు.



ఘంటా కనకారావు, కుమారి నళిని.

చిత్రసమీక్ష :

మైరావణ

శిష్టరక్షణ, దుష్టశిక్షణల నిమిత్తం అవతారం దాల్చిన శ్రీరామచంద్రుని కథతో, మహాబల సంపన్నుడు, మాయావి అయిన మైరావణుని గాథను సమపాళ్లలో మేళవించి చిత్రీకరించబడిన పౌరాణిక గాథయే 'మైరావణ' చిత్రం.

శ్రీరామచంద్రుడిని వివాహమాడవలెనన్న భావంతో చంద్రసేన యనే అపురూపసుందరి తపస్సు చేయుచుండగా, మైరావణుడు అక్కడికి వెళ్ళి ఆ తపస్సుకు భంగం కలిగించి, ఆ సుందరిని తన



మైరావణునిగా ధూళిపాళ.

పాతాళగంగకు తీసుకొనివచ్చి బంధిస్తాడు. అంతటితో ఆగక, ఆమె చూపుల్లోనే తనూ బందీ లుడు కావాలని ఆరాటపడి పోతాడు. ఒక కన్యను ఇలా చెరపెట్టి బలాత్కారం చేయుటం వినాశానికే దారితీస్తుందని, పురోహితుల భార్య మాతంగి హెచ్చరిస్తున్నా మైరావణుడు ఆ హెచ్చరికలను పెడచెవినపెట్టి చంద్రసేన సోదరుణ్ణి కూడా బంధిస్తాడు. సీతాన్వేషణ చేస్తూ వనవాసం చేస్తున్న శ్రీరామచంద్రుణ్ణి, అతని సోదరుణ్ణి కూడా మాయోపాయాలతో తన పాతాళ లంకకు కొనివచ్చి కారాగారాన పడవేయిస్తాడు. స్వామిని వెదుకుతూ వచ్చిన అంజనేయుణ్ణి బాధలకు గురి చేస్తాడు. పాపాలన్నీ పండిపోవటంతో చివరకు రాక్షసుడయిన మైరావణుడు హతుడవుతాడు. కాని, అతనుకొన్న విధంగా శ్రీరామచంద్రుని చేతిలోనే మరణించే అవకాశం అతనికి లభించదు. రామచంద్రుడు ఏకపత్నీవ్రతుడగుటచేత చంద్రసేన కోరిక కూడా నెరవేరదు. తరువాత జన్మలో శ్రీకృష్ణావతారం ధరించి ఆమెను స్వీకరిస్తాడు. మాతంగికి తరువాత జన్మలో బాలకృష్ణుని తల్లియైన 'యశోదమ్మ' అయ్యే అదృష్టం లభిస్తుందని శ్రీరామచంద్రుడు చెప్తాడు. స్థూలంగా ఇదీ కథ.

సినిమాలో ప్రవేశపెట్టబడిన ఎన్నివేశాలలో కొంతవరకు అస్వాభావికత ఉన్నా, కథ పౌరాణికం కావటంవల్ల ప్రేక్షకులకు యీ చిత్రం అంతగా దాన్ని గమనించకపోదు. సాంకేతిక ఎన్నికలోనే లోపం జరుగకుండా ఉన్నట్లయితే చిత్రం మరింతగా రాణించేది. మహా మాయావి అయిన మైరావణుని పాత్రను కేవలం రాగి పోతుగా సృష్టించటం మొదలైన లోపాలు ఎక్కువగానే ఉన్నాయి.

అన్నింటిలో రెండుగా కనిపించింది మైరావణుని పాత్ర. మైరావణుడుగా ధూళిపాళ ప్రశంసనీయమైన నటనను ప్రదర్శించారు. శ్రీరామచంద్రుడుగా కాంతారావు నటన బాగుంది. మాతంగి పాత్రకు న్యాయం చేకూర్చటానికి శారద ప్రయత్నించినా, పాత్రలో ఉండవలసిన కారిన్యం శారద నటనలో లేకపోవటంవల్ల, ఆ పాత్ర అంతగా రాణించలేకపోయింది. అంజనేయునిగా రేలంగి నటనకు మరికొంత విస్తృతమైన అవకాశం ఉంది. ఆంజనేయుని జ్ఞాతి భార్య 'జలంధరి'గా గిరిజ అవకాశమున్నంతవరకు బాగానే నటించింది. సినిమాలో కొన్ని పాత్రలు, చివరకు స్వర్గ పాత్రలుగా మిగిలిపోయాయి.

రాజేశ్వరరావుగారి సంగీతం యీ చిత్రానికి ఒక ముఖ్యమైన ఆకర్షణ విశేషంగా ప్రజాదరణ ఎంతవరకు పొందుతాయో చెప్పలేంగాని, కొత్తదనం మీద ఆయన వినిపించిన బాణీలు బాగున్నాయి. ఆరుద్ర, సదాశివబ్రహ్మంగారల పాటలు బాగానే ఉన్నాయి. పద్యాలను కూడా అక్కడక్కడ ప్రవేశపెట్టి, చిత్రానికి నిండుతనం చేకూర్చటం ప్రశంసనీయం. సెట్టింగులలో గాంభీర్యం ఉన్నది.

రెండు మూడు నెలలుగానే ఇలాంటి చక్కని పౌరాణిక చిత్రాన్ని నిర్మించిన నిర్మాత, దర్శకులు శ్రీ బి. ఎ. సుబ్బారావుగారి 'కార్యదక్షత' ప్రశంసనీయము.

వాశిరాజు ప్రకాశం.

మద్రాస్ సినిమా వార్తలు

'శకుంతల'

మహాకవి కాళిదాసు రచించిన మహత్తర ప్రణయగాథ 'అభిజ్ఞాన శాకుంతలము' ఆధారంగా రాజ్యం పిక్చర్సు వారు 'శకుంతల' చిత్రం తీయుచున్నారు. ఈ చిత్రంలో యన్. టి. రామారావు, సావిత్రి, యస్. వి. రంగారావు, రేలంగి, నటిస్తారు. కెమెరా రహిమాన్, రచన సముద్రాల (సీనియర్), దర్శకత్వం కె. కామేశ్వరరావు, నిర్మాతలు శ్రీధరరావు, లక్ష్మీరాజ్యం.

'రాముడు — భీముడు'

సురేష్ ప్రొడక్షన్సు వారు నిర్మిస్తున్న సాంఘిక చిత్రం పూర్తి కావచ్చింది. కొసరాజు రాఘవయ్య

చౌదరి వ్రాసిన ఒక పాటను మాధవపెద్ది, జమునా రాణి పాడగా రికార్డు చేశారు ఈ చిత్రానికి సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు, దర్శకుడు తాపీ చాణుక్య. ఈ పాట రేలంగి — గిరిజలతో చిత్రీకరణ జరుగుతుంది నిర్మాత డి. రామా నాయుడు అసోసియేట్ ప్రొడ్యూసర్ జె సుబ్బా రావు.

డి. వి. యస్. ప్రొడక్షన్సు 'మంగమ్మ శపథం'

డి. వి. యస్ ప్రొడక్షన్సు వారు "మంగమ్మ శపథం" చిత్రాన్ని తీయడానికి చురుకుగా సన్నాహాలు చేస్తున్నారు. యన్ టి రామారావు, రేలంగిని ఇంతవరకు ఎన్నుకున్నారు త్వరలోనే హీరోయిన్‌ను మిగతా నటవర్గం ఎన్నిక జరుగుతుంది.

సి. నారాయణరెడ్డి వ్రాసిన 5 పాటలను కంపోజ్ చేసి రికార్డింగ్‌కు సిద్ధంగా వుంచారు.

ఈ చిత్రానికి రచన సముద్రాల (జూనియర్) సంగీతం టి. వి రాజు., ఛాయ రవికాంత్ నిగాయిజ్., కళ గోఖలే., నృత్యం వెంపటి, ప్రొడక్షన్ యిన్‌ఛార్జి ★ యస్ విట్టిబాబు., దర్శకత్వం బి విఠలాచార్య, నిర్మాత · డి. వి. యస్ రాజు

కోటేష్ ఫిలింస్ "ముళ్ళకిరీటం"

కోటేష్ ఫిలింస్ వారు "ముళ్ళ కిరీటం" పేర ఏసుప్రభువు జీవిత చరిత్రను చిత్రంగా నిర్మిస్తున్నారు తెలుగులో ఏసుప్రభువు జీవిత చరిత్ర ప్రథమంగా యీ చిత్రమనే అనాలి ఈ చిత్రంలో కథానాయికగా కుమారి విజయలక్ష్మి నటిస్తూ చేసిన నృత్యములు, కత్తి యుద్ధములు యీ చిత్రంలో ఒక ప్రత్యేకతగా కనిపిస్తుంది. ఈ చిత్రానికి మాటలు — పాటలు రాజశ్రీ,,నిర్మాత— సంగీత దర్శకుడు దేవదాసు, దర్శకుడు సుబ్రహ్మణ్యం.

కేరళలో డి. బి. ఎన్ ప్రొడక్షన్సు "దాగుడుమూతలు" ఔట్‌డోర్ షూటింగ్

డి బి యన్ ప్రొడక్షన్సు వారు నిర్మిస్తున్న "దాగుడు మూతలు" చిత్రం అవుట్‌డోర్ షూటింగ్ కేరళలో జరిపారు యన్ టి రామారావు, బి సరోజాదేవిలతో కొన్ని దృశ్యాలను చిత్రీకరించారు ఇప్పటి వరకు సుమారు 14రీళ్ళ చిత్రం పూర్తి చేశారు

ఈ చిత్రంలో యన్ టి. రామారావు, గుమ్మడి, రమణారెడ్డి, పద్మనాభం, అల్లు రామలింగయ్య, బి సరోజాదేవి, సూర్యకాంతం, శారద, మొదలగు వారు నటిస్తున్నారు కొత్తగా యింకా బేబి సుమ, అమృద, తార, అనంతి, మొదలగు బాలికలు నటిస్తున్నారు

ఈ చిత్రానికి మాటలు ముళ్ళపూడి వెంకట రమణ., సంగీతం కె వి మహదేవన్, ఛాయ పి యల్ రాయ్, కళ కృష్ణారావు, నృత్యం : కె ఎస్. గోపాలకృష్ణ., కూర్పు . టి. కృష్ణ.




"బభ్రువాహన చిత్రం"లో రాజసులోచన, యస్. వరలక్ష్మి.



డా. చక్రవర్తి లో జగ్గయ్య, సావిత్రి.

సినిమా వార్తలు



డా॥ "చక్రవర్తి" లో ఒక దృశ్యం.

నిర్మాత : డి బి నారాయణ., స్క్రీన్ ప్లే అండ్ దర్శకత్వం ఆదుర్తి సుబ్బారావు.

బి. ఆర్. ప్రొడక్షన్సు 'పీటలమీద పెళ్లి'

బి. ఆర్. ప్రొడక్షన్సు బేనర్ క్రింద కీ॥ శే॥ ఘంటసాల బలరామయ్యగారి కుమారుడు శ్రీ కృష్ణమూర్తి నిర్మించిన " పీటల మీద పెళ్లి " అనే సాంఘిక చిత్రం అతి త్వరలో విడుదల కానున్నది.

ఈ చిత్రానికి రచన బి. శివరాం, సంగీతం : అశ్వద్ధామ, ఛాయ ప్రకాష్, కళ సి హెచ్ యి ప్రసాద్, నిర్మాత — దర్శకుడు : ఘంటసాల కృష్ణమూర్తి.

ఈ చిత్రంలో జగ్గయ్య., గుమ్మడి, రమణమూర్తి., చలం., రమణారెడ్డి, కీ॥ శే॥ సి యస్ ఆర్ డా. శివరామకృష్ణయ్య, సీతారాం., కోటేశ్వరరావు., వంగర., ప్రసాద్, జానకి., కృష్ణకుమారి, సూర్యకళ., హేమలత మొదలగువారు నటించారు,

శ్రీరామా పిక్చర్సు 'దేశద్రోహులు' విడుదల

శ్రీ రామా పిక్చర్సు వారు నిర్మిస్తున్న సాంఘిక చిత్రం " దేశద్రోహులు " పూర్తి అయింది. ఈ మధ్య యీ చిత్రానికి రీరికార్డింగ్ పూర్తి చేశారు. అతి త్వరలో విడుదలయ్యే చిత్రాలలో ఇదొకటి.

ఈ చిత్రంలో యన్ టి. రామారావు, రేలంగి, కాంతారావు, రాజనాల, ధూళిపాళ, సత్యనారాయణ, రామకృష్ణ, మిక్కిలినేని, మల్లాది, రాజబాబు, దేవిక, జానకి, గిరిజ, మాలతి, జమినీచంద్ర, గీతాంజలి, బేబీ ఇంద్రాణి, బాలకృష్ణ మొదలగు వారు నటిస్తున్నారు.

మాటలు ఆరుద్ర అండ్ రామారావు, పాటలు : మల్లాది రామకృష్ణశాస్త్రి., సంగీతం యస్. రాజేశ్వరరావు, ఆపరేటివ్ కెమేరా మేన్ : వరదరాజన్, కళ టి వి యస్ రామారావు, నృత్యం : చిన్ని— సంపత్, కె. యస్. రెడ్డి., కూర్పు : గోపాలకృష్ణ, స్టూడియో : విజయా — వాహినీ., నిర్మాత — దర్శకత్వం బోళ్ళ సుబ్బారావు.

ప్రతాప రుద్రీయం

బాలాజీ ఫిలింస్ బేనర్ క్రింద "ఆదర్శసోదరులు" నిర్మించిన శ్రీ ఏ. పుండరీకాక్షయ్య కాకతీయ సామ్రాజ్యానికి సంబంధించిన చారిత్రాత్మక చిత్రం " ప్రతాపరుద్రీయం " నిర్మించడానికి తగు సన్నాహాలు చురుకుగా చేస్తున్నారు. ఈ చిత్రంలో యన్. టి. రామారావు వేర్వేరు మనస్తత్వాలు గల రెండు పాత్రలను " ప్రతాపరుద్రుడు " —— " చాకలి పేరిగాడు " గాను పోషించనున్నారు ఈ చిత్రానికి రచన : పింగళి నాగేంద్రరావు స్క్రిప్టువర్కు జరుగుతుంది స్క్రిప్టువర్కు పని పూర్తికాగానే మిగతా నటీ నటులను ఎన్నిక చేసుకొని షూటింగ్ ప్రారంభిస్తారు

శ్రీ నేషనల్ ఆర్టు పిక్చర్సు 'బభ్రువాహన'

శ్రీ నేషనల్ ఆర్టు పిక్చర్సువారు " బభ్రువాహన " చిత్రాన్ని ఏప్రిల్ 17వ, తేదీని షూటింగ్ ప్రారంభించారు యీ చిత్రాన్ని జూలై నాటికి పూర్తిచేసి విడుదల చేయనున్నారు. ఇంతవరకు యీ చిత్రం 5 రీళ్ళు పూర్తి అయింది.

ఈ చిత్రంలో యన్. టి రామారావు, రేలంగి, చలం, కీ. శే సి. యస్. ఆర్, ముక్కామల, యన్. వరలక్ష్మి, రాజసులోచన వగైరా నటిస్తున్నారు.

ఈ చిత్రానికి రచన — పాటలు — దర్శకత్వం : సముద్రాల. రాఘవాచార్య, ఛాయ : కమల్ ఘోష్, సంగీతం పామర్తి., నృత్యం : పసుమర్తి., కళ : తోట., నిర్మాత సి. జగన్మోహనరావు.

ఈ చిత్రంలో 5 పాటలను రికార్డు చేసి చిత్రీకరణ కూడా చేయబడింది.

శ్రీ వాణీఫిలింస్ 'నా దీ ఆడ జన్మే'

కళ్యాణి ఇనుపపెట్టె మూసి వెలుపలికి వస్తుంది. దశయ్య ఆమె మీద పడబోయి ఆమె తాళాలు కొట్టేస్తాడు.

"ఏమిటిది ?"

"శివ ! శివ ! కాలుజారింది !"

"కాస్త చూచి నడవండి !" కళ్యాణి వెళ్లిపోతుంది దశయ్య తాళాలను చూస్తూ.

"వీటి కోసం ఎన్నాళ్ల నుంచో వేస్తున్నా ఎత్తు ఈ నాటికి పారింది మంత్రం"

దశయ్య గదిలోకి వెళ్లి, ఇనుపపెట్టె తెరచి, వంద రూపాయల నోట్ల కట్టలు తీస్తాడు. కళ్యాణి అప్పుడే అక్కడికి వస్తుంది.

"ఆఁ ! తాళాలు మీ చేతి కెలా వచ్చినయ్ ?"

కంగారుగా "అవును. ఎలా వచ్చినయ్ ? బహుశా దొరికి ఉంటాయేమో ?"

"ఓహో ! కాలు జారి పడబోయింది ఇందుకా! ఇనుప పెట్టె ఎందుకు తెరిచారు"

"ఎందుకంటే— ఆఁ ! టైము చూద్దామని !"

"గడియారం ఇనుపపెట్టెలో ఉంటుందా ?"

"లేదు ! అందుకే మూసేస్తున్నాను."

అంటూ తొందరలో దశయ్య నోట్లు ఉన్న చేతిని చూపుతాడు.

"ఏమిటిది ?"

"తాళాలు"

"ఆ చేతిలో ! హా ! మీరు పెద్దవారు ! ఇది మీకు తగిన పని కాదు. ఈ పనే బయట ఎక్కడైనా చేసి ఉంటే ఈ పాటికి మీ చేతులకి బేడీలు వేసి జైలుకి పంపేవారు.. ఇంకెప్పుడూ ఇలాంటి పని చెయ్యకండి !

"అలాగే !" అంటూ దశయ్య నోట్ల కట్ట లతో వెళ్ళ బోతాడు.

"ఆ డబ్బు ఇలా ఇచ్చిపొండి."

"ఏదో ఇవాళ మంచి రోజని బోణీ చేశాను. నువ్వు క్షమించావంటే ఇది నా దగ్గరే ఉంటుంది."

"ఈ డబ్బు తీసుకోడానికి మీకెలా హక్కు లేదో— ఇవ్వడానికి నాకూ లేదు. దయచేసి ఇలా ఇచ్చి వెళ్ళండి."

దశయ్య ఆ డబ్బును కళ్యాణికి ఇచ్చి "ఈమాట ఎక్కడా అనబోకు."

"ఊఁ !"

దశయ్య వెళ్ళిపోతాడు.

* * *

"కళ్యాణి కడుపు కాలిపోయింది. నే కట్టు కున్న గాలిమేడలన్నీ కూలిపోయాయి. నా జన్మకి నాకు ఒక మనుమణ్ణి ఎత్తుకునే యోగం కలి గింది కదా అని ఎంతో మురిసిపోయాను. పోరా ! దౌర్భాగ్యుడా ! నీ యోగ్యతకి అంత అదృ ష్టమా అని కళ్యాణి నా మొఖాన కొట్టినట్టు చేసింది. పెద్దలు చెప్పినట్లు జాతకాలూ, మంచీ చెడూ చూసి చేసుకుంటే ఇలా జరిగుండేది కాదేమో' ఆదిలోనే అపశకునం. అడుగడుగునా అవలక్షణాలు! ఛీ ! ఏం బ్రతుకో ! ఏం లోకమో !— ఒరే రంగా ! ఆ బొమ్మలన్నీ తీసుకెళ్ళిపోయి ఎక్కడన్నా బయట పారేసి రారా !" జమిందారు కళ్యాణికి జరిగిన అన్యాయాన్ని తలచుకుంటూ కుమిలి పోతుంటాడు.

"పారెయ్యడం ఎందుకు బాబూ ! ఎంతో ఆశపడి తెప్పించారు. ఉంచుకోండి. దేవుడు చల్లగా చూడక పోతాడా ? మళ్ళీ కళ్యాణమ్మగారి కడు పున ఒక కాయ కాయక పోతుందా ?"

"అంత వరకు నేను బ్రతికి ఉంటానని ఏమిట్రా! నమ్మకం ? లేదు ! ఏమిటో నాకు మతి పోయి అప్పుడే మనుమడు వచ్చి నా ఒళ్ళో కూర్చున్నట్టే ఆనందించి ఆ బోసి నవ్వులు వింటున్నట్టే మురిసి పోయాను. ఛ ! ఛ— ! అసలు— ఏదో జరగబొయ్యే దాన్ని జరిగినట్టే ఊహించుకొని, ఉబ్బిపోయి ముందే దానికిన్ని ఏర్పాట్లు, హంగులు, ఛ ! ఇంత కంటే పిచ్చితనం లేదురా ! ఒరే రంగా ! త్వరగా ఈ బొమ్మలన్నీ తీసుకు పోరా! బయట పారేసిరా !"

బొమ్మల్ని తీసుకొని రంగన్న వెళ్ళ బోతాడు. కళ్యాణి గదిలోకి వస్తుంది.

"అమ్మా ! కళ్యాణీ ! నీ ఒంట్లో ఎలా ఉందమ్మా ?"

"పరవాలేదు మామయ్యా !"

"పెదబాబు దగ్గర నుంచి ఉత్తర మేమైనా వచ్చిందా ?"

"లేదు మామయ్యా !"

"చూశావట్రా ! చూశావా ! పిల్లని ఆ స్థితిలో వదిలి పెట్టి వెళ్ళాడే— పోనీ ఎలా ఉందో ఏమిటో అని ఒక్క ఉత్తరం ముక్క, ఒక్క కార్డు" జమిందారు అంటూండగానే దశయ్య వస్తాడు.

"ఆఁ ! వ్రాస్తేమటుకు— ఏం జేసుకుం టుంది ? నాలుక గీసుకుంటుందా ? అందులో తిరుగుడు మీకు తెలియదులే బావా ?"

"ఏమిట్రాది ?"

"ఈమెకు చదువువస్తే కదూ ఆయన వ్రాయ డానికి !"

కళ్యాణి వెళ్ళి పోతుంది.

"ఏమిటి కళ్యాణికి చదువురాదా ?"

"పొట్ట పొడిస్తే అక్షరం ముక్కరాదు."

"రేయి ? పోరా ! ఉన్న గొడవలు చాలక న్యూసెన్సు కడివి ! పోరాంటే !"

"పోతాలే" దశయ్య వెళ్ళి పోతాడు.

"రంగా కళ్యాణి గురించి నేను అన్న మాట లన్నీ ఆవిడ విని ఉంటుందా ?"

"విన్నారో వినలేదో కడుపులో ఉన్నది అనే శారు. దాని కోసం ఎందుకు బాబూ బాధ పడటం!"

రంగన్న వెళ్ళి పోతాడు.

ఈపై రెండు సన్నివేశాలు శ్రీ వాణీ ఫిలింస్ వారి "నాదీ ఆడజన్మే" చిత్రంలోనివి. జమిందా రుగా యస్. వి. రంగారావు, కళ్యాణిగా సావిత్రి, దశయ్యగా రమణారెడ్డి, రంగన్నగా పెరుమాళ్ళు నటించారు వీరుగాక ఇంకా ఈ చిత్రంలో యన్. టి. రామారావు, హరనాథ్, అల్లు రామలింగయ్య, మాష్టర్ బాలు, జమున, సురభి బాలసరస్వతి, ఛాయాదేవి మొదలగువారు నటిస్తున్నారు.

ఇంతవరకు 10 రీళ్ళకు పైగా చిత్రం పూర్తి అయింది. 5 పాటలను రికార్డు చేశారు ఒక పాటను సావిత్రితో చిత్రీకరించారు. 2 పాటలను జమున, హరనాథ్‌లతో బెంగుళూర్‌లో ఔట్ డోరులో ఈ మధ్య చిత్రీకరించారు

రచన : డి. వి. నరసరాజు, పాటలు దాశరథి సంగీతం : సుదర్శనమ్, ఛాయ ముత్తుస్వామి నాయుడు, కళ : శేఖర్, నృత్యం : హీరాలాల్, కూర్పు, గోపి, స్టూడియో : ఏ. వి. యం దర్శకత్వం : ఏ. సి. త్రిలోక్ చందర్ ఎం. ఏ., నిర్మాత యస్. వి. రంగారావు బి. యస్. సి.,

ఛాయాచిత్ర పాట రికార్డింగ్

ఛాయాచిత్ర వారు నిర్మిస్తున్న చిత్రానికి సి. నారాయణరెడ్డి వ్రాసిన పాటను ఏప్రిల్ 15వ తేదీని ఘంటసాల, సుశీల పాడగా రికార్డు చేశారు. ఈ పాటకు సంగీత బాణీని సమకూర్చింది యస్. రాజేశ్వరరావు. ఈ చిత్రానికి దర్శకుడు : కె. ప్రత్యగాత్మ. నిర్మాతలు : కె. సుబ్బరాజు అండ్ టి. చలపతిరావు.

సి. ధర్మారావు ★



"బభ్రువాహన చిత్రం"లో యన్. టి. రామారావు, యస్. వరలక్ష్మి.

అవీ - ఇవీ - అన్నీ

డాక్యుమెంటరీ చిత్రనిర్మాతలు శ్రీ కళ్యాణ్ రావ్ అండ్ కంపెనీవారు ఇటీవలనే రెండు తాజా చిత్రాలను తీశారని మొదటిది పుట్టపర్తి సాయిబాబా మీదను, రెండవది సూళ్ళూరుపేట వద్దనున్న "పరమేశ్వరి" మీదను తీశారని ఈ రెండు భాగాలను 'శ్రీశైలక్షేత్రమహిమ' చిత్రంతో కలుపుతారని శ్రీ యస్ దుర్గారావు [దీని దర్శకులు] తెలిపారు

ఖరగ్‌పూర్‌లో...

ఖరగ్‌పూర్‌లో ప్రవాసాంధ్ర నాటక కళా పరిషత్తు ఆరవ నాటకోత్సవాలు ఇటీవలనే వైభవంగా జరిగాయి రాజమండ్రి, విశాఖ, ఆగ్రా, షాలిమార్, నాగపూర్, ఖరగ్‌పూర్ మొదలగు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల సమాజాల వారు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

ఉత్సవాలకు శ్రీ వేదాంతం సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. శ్రీ ఆర్ వి చలం ఉత్సవాలను ప్రారంభిస్తూ ఎన్ని అవాంతరాలొస్తున్నా ఆరేళ్లుగా ఖరగ్‌పూర్‌లో ఒక నాటక పోటీని నిర్వహించడం ప్రశంసనీయమని, అభినందించారు.



"సత్యనారాయణమహాత్మ్యం"లో కృష్ణకుమారి.

కార్యదర్శి నివేదికను శ్రీ పి. బి. శంకరం చదివారు.

ఆఖరి రోజున ప్రఖ్యాత రచయిత, నాటకకర్త అయిన శ్రీ ఎన్ ఆర్ నంది గారిని, ఖరగ్‌పూర్ భాస్కర్ ప్రొడక్షన్స్ వారు సన్మానించారు.

* * *

కలకత్తా ఆంధ్ర సంఘము వారి ఏకాదశ వార్షిక సంచిక చక్కని గ్లేజు పేపరుపై ముద్రణతో ఆంగ్ల, వంగ, హిందీ భాషల సారస్వతానుబంధములతో తెలుగు ప్రముఖ రచయితల రచనలతో నున్నది మా కార్యాలయం చేరింది

* * *

శ్రీ వి యస్ అవధాని రచించిన ఇంటిదొంగ అనే సాంఘిక నవల పాకెట్ ఎడిషన్ మా కార్యాలయం చేరింది 160 పుటలు గల దీని వెల రూ 1 25 న.పై 'క్రాంతి పబ్లికేషన్స్' మద్రాస్—1

కళ-పరమార్థము...

11 వ పేజీ తరువాయి

ఏ మంచి జరిగినా పరిశ్రమకు జరిగి, అది అందరి అనుభవానికీ అందుబాటులో ఉండవలసిందే ఆ మంచి కలసి కట్టుగా ఐకమత్యంతో పని చేసినప్పుడే సాధించ గలుగుతాం పంచుకో గల్గుతాం. శాశ్వతంగ నిలావుకో గలుగుతాం.

"దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్".. అన్న సత్యం పరిశ్రమలోని ప్రతివారు గుర్తించాలి పోటీ వారందరూ అభిమానం కలవారేనని, ప్రజాభిమానం సంపాదించుకున్న వారేనని సమాన ప్రతిపత్తితో వారిని గౌరవించడం ధర్మం, బాధ్యత. దీనిని యే మాత్రం నిర్లక్ష్యం చేసినా కళకు కళాకారుని ఆదర్శానికీ అవమానం చేసినట్లవుతుంది

కళాకారుడు తాను కాని భిన్న పాత్రలలో తన్ను తానే మరచి కళాభిమానులకు తన్మయం కలిగించే కళా తపస్వియే గాని, లౌకిక ప్రవృత్తితో మమతను తెంచుకున్న చతురుడు కాడు అందుకే నాదోపాసనతో రాలను సైతం కరిగించి, భక్తి భావంతో దేశాన్ని పునీతం చేసిన త్యాగయ్యకు, తన మేధాశక్తితో, చాతురీ నైపుణిలో రాజనీతికి ఆకారం కల్పించిన చాణక్యునికి సంబంధం లేదు. భిన్న ప్రవృత్తులు— భిన్న మార్గాలు!

కళాకారుని లక్ష్యం రససిద్ధి— ఆశయం మానవ సౌభాగ్యం, సంఘ శ్రేయస్సు. అతనిది యే తాకిడికి తట్టుకోలేని మెత్తని మనస్సు.


ఏ అవమానం భరించలేని అభిమానం అతని ధనం.

మమతే గతన్ని లొంగదీయగల మహత్తర శక్తి సహనమే అతని ఆయుధం.


తారతమ్యాలు లేక, సన్నిహితత్వం పెంచుకొని, సమదృష్టితో సుహృద్భావంతో సంతుష్టిగా మనడమే కళాకారుని ఆశయం ఈ అపేక్షతో అందరూ కృషి చేసిన నాడు కళామతల్లి కలకలలాడుతుంది ఆ పసిడి నవ్వుల వెన్నెల్లో తెలుగు దేశం పునీత మవుతుంది.

[వైవారం రెండో వ్యాసం.] ★

Edited, Printed and Published by S. Radhakrishna at the AndhraPatrika Press; 6 &7 Thambuchetty Street Madras-1. Phone; 22244, [illegible]3. Chief Editor S. Sambhu Prasad.



ఫోటోగ్రాఫర్ చాలా అదృష్టవంతుడంటారు కదూ!



కుమారి సచ్చు

అందమైన ముఖ వర్చస్సునకు
ఎక్కువ కాలం నిలిచే పరిమళమునకు

రెమీ

టాల్కమ్ పౌడరు

CRITERION RP. 308